మొదటి యూనిట్

# 1. ఆకాశంనిండా స్వాతంత్ర్యపు జెండా!

- దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి

**ఆలోచించండి - మాట్లాడండి :**



**ప్రశ్నలు :**

1. పై చిత్రంలో ఏం కనబడుతూంది? అందరూ ఏం చేస్తున్నారు?
2. జెండాకు వందనం ఎప్పుడెప్పుడు చేస్తారు? ఎందుకు చేస్తారు?
3. మన జెండాలో ఎన్ని రంగులు ఉన్నాయి? అవి ఏవి?

**నేపథ్యం :**

కొన్ని వందలఏండ్లు విదేశీయుల పాలనలో బాధలు పడిన భారతదేశానికి 1947 సం॥లో స్వాతంత్ర్యం లభించింది. దేశంలో అందరూ స్వేచ్ఛావాయువులను పీల్చుకొన్నారు. ఆ ఆనంద క్షణాలలో కవులు, రచయితలు పుంఖానుపుంఖాలుగా గేయాలు, కథలు, కావ్యాలు రచించారు.

దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రిగారు ఆ సందర్భంలో ఈ గేయం రచించారు. మన జెండా ఎందరో వీరులు తమనెత్తురు ధారపోసి సంపాదించిన స్వాతంత్ర్యానికి గుర్తు అనీ అంతటా పేదరికం తొలగిపోవాలనీ మొండిపట్టుతో దౌర్జన్యంచేసి మాట నెగ్గించుకొనేవాళ్ళకు అధికారం రాగూడదనీ అందరికీ సమానావకాశాలుండే విధంగా కొత్త పాలన జరగాలనీ కవి ఆశించాడు.

ప్రస్తుత పాఠ్యభాగం "కృష్ణశాస్త్రి గేయసంపుటి" లోనిది.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.



ఎత్తండీ ! ఎత్తరేం ? స్వాతంత్ర్యపు జెండా !
ఎత్తవోయ్ ! ఎత్తు, ఎత్తు ఆకాశంనిండా !

కే లూపుచు, తల ఊపుచు గాలిదారు లంట
మన జెండా, మనదే, వీరుల నెత్తురు పంట !
కొత్తవేడి, కొత్తవాడి భరతావని నిండ
ఎత్తవేం ? ఎత్తు, ఎత్తు, ఆకాశంనిండా !
॥ ఎత్తండీ, ఎత్తరేం ? స్వాతంత్ర్యపు జెండా! ॥

అర్థమత్తు లహంకృతులు, అంధమతులు రాని
నిరుపేదలు, నిర్భాగ్యులు, నిరంకుశులు లేని
కొత్త జగం, కొత్త యుగం భరతావని నిండ
ఎత్తమంటె ! ఎత్తు, ఎత్తు ఆకాశంనిండా !
॥ ఎత్తరేం ? ఎత్తండీ, స్వాతంత్ర్యపు జెండా! ॥

కులం దాటి, మతం దాటి, కొద్ది గొప్ప దాటి
సమభోగం, సమభాగ్యం సమసంస్కృతి నాటి
కొత్త శాంతి, కొత్త కాంతి భరతావని నిండ
ఎత్తండోయ్ ! ఎత్తు, ఎత్తు ఆకాశంనిండా !
॥ ఎత్తండీ, ఎత్తరేం ? స్వాతంత్ర్యపు జెండా! ॥

© SCERT not to be republished



## కవి పరిచయం

**పేరు** : దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి

**కాలం** : 1897-1980

**జన్మస్థలం** : తూర్పు గోదావరి జిల్లాలోని పిఠాపురం దగ్గరి చంద్రంపాలెం.

**రచనలు** : కృష్ణపక్షం, ఊర్వశి, సాహిత్య వ్యాసాలు, సినీగేయాలు

**బిరుదు** : కళాప్రపూర్ణ, పద్మభూషణ్

### సారాంశం :


మన స్వాతంత్ర్యానికి గుర్తు అయిన ఈ జెండాను ఎగరేయండి. ఆకాశమంతటా ఇది రెపరెపలాడాలి. వినువీథులంటేటట్లుగా ఎగరెయ్యాలి. ఇది మనందరి జెండా. ఎందరో వీరులు ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడి సాధించిన స్వాతంత్ర్యానికి ఇది గుర్తు. దీన్ని చూసినప్పుడు మన దేశీయులకు కొత్త ఉద్వేగం, కొత్త ఉత్సాహం పుడుతుంది. అది దేశమంతటా వ్యాపిస్తుంది.

బాగా డబ్బున్నందువల్ల కళ్ళు మూసుకుపోయినవాళ్ళు, పొగరెక్కినవాళ్ళు, తెలివిలేనివాళ్ళు అధికారం పొందగూడదు. చాలా బీదవాళ్ళు, దురదృష్టవంతులు, నియంతలు లేని కొత్త ప్రపంచం, కొత్త కాలం రావాలి. ఇది భారతదేశమంతటా కనిపించాలి.

కులమతాల అడ్డుగోడలు లేని; పేద, ధనిక భేదాలు కనిపించని; శాంతిని, సంపదను సమానంగా పంచే భోగభాగ్యాలతో సర్వసమానత్వం ఏర్పడే, సమాన సంస్కృతి శోభిల్లే నవీనకాంతి భారతదేశం నిండా ప్రసరించేవిధంగా మన స్వాతంత్ర్యపు జెండాను ఎగరెయ్యాలి. ఆకాశంనిండా వ్యాపించేలా ఎగరేయండి.



## ఇవి చేయండి




### I. వినడం-మాట్లాడడం



1. ఈ గేయం దేన్ని గురించి చెబుతున్నది ?
2. ఆకాశంనిండా, స్వాతంత్ర్యపు జెండా! అనే శీర్షికనుబట్టి నీవేమని భావిస్తున్నావు?
3. "జెండా" ను ఎప్పుడెప్పుడు ఎగరవేస్తారు? ఎగరవేసినప్పుడు ఏం చేస్తారు?
4. "జెండా" గొప్పతనం ఏమిటి?
5. జెండా ఎగరవేసినప్పుడు నువ్వు పొందిన అనుభూతులు ఏమిటి?

### II. చదవడం - రాయడం



1) గేయంలో ఎన్ని పంక్తులు ఉన్నాయి? ప్రతి పంక్తిలో ఉన్న చివరిపదం ఏది? రాయండి?

2) కింది వాక్యాలను చదవండి. వీటికి సంబంధించిన పంక్తులు గేయంలో ఎక్కడ ఉన్నాయి? వాటి కింద గీత గీయండి.

   స్వాతంత్ర్యపు జెండా ఎత్తండి. ఆకాశమంతటా వ్యాపించేలాగ మన జెండా ఎత్తండి.

© SCERT not to be republished

3) గేయంలో ద్విత్వాక్షర పదాలు, సంయుక్తాక్షర పదాలు ఏమున్నాయో రాయండి.

4) పాఠం ఆధారంగా జవాబులు రాయండి.

అ) కవి చెప్పిన కొత్త ప్రపంచం ఎలాంటిది?

ఆ) 'కులం దాటి, కొత్త కాంతి భరతావని నిండా' అనే వాక్యాలకు భావం ఏమిటి?

ఇ) కవి జెండాను ఎలా ఎగరవేయమని కోరారు?

## III. స్వీయరచన



### 1. లఘు సమాధాన ప్రశ్నలు

అ) మన జెండా వీరుల నెత్తురుపంట అనడంలో కవి ఉద్దేశమేమిటి?

ఆ) "అహంకారులు, అజ్ఞానులు, ధనదాహం కలవారు లేని దేశం కావాలని" కవి కోరుకున్నాడు కదా! ఇలా ఎందుకు కోరుకొని ఉంటాడు?

ఇ) అహంకారంవల్ల కలిగే అనర్థాలేమిటో రాయండి.

ఈ) ఈ గేయానికి మీరొక పేరు పెట్టండి. ఇలా పేరు పెట్టడానికి కారణాలు రాయండి.

ఉ) "కొత్త శాంతి" "కొత్త కాంతి" తో భరతావని నిండాలని కవి ఎందుకు కోరుకున్నాడు?


### 2. వ్యాసరూప ప్రశ్నలు :

అ) పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ) మీరు పాల్గొన్న పతాకావిష్కరణ కార్యక్రమాన్ని గురించి రెండు పేరాలు రాయండి.

ఇ) ఈ గేయంలో నాటకీయతకోసం కవి ఏ ఏ మాటలను ఏ ఏ అర్థాల్లో వాడారో తెలపండి.

## IV. పదజాలం



1. "జెండా" కు సంబంధించిన పదాలు రాయండి.
2. గేయం చివరి చరణంలో వచ్చిన 'కులం, మతం' అనే రెండు చిన్న పదాలతో 'కులమతాలు' అనే పెద్దమాట ఏర్పడుతుంది. ఇలా వచ్చే మరొక పెద్దమాటను రాయండి.
3. కింది పదాలు, ఒకే వాక్యంలో వచ్చేటట్లు రాయండి.
   ధనికులు – పేదలు; కొద్ది – గొప్ప; శాంతి – కాంతి; వాడి – వేడి.
4. పాఠంలో కింది గుణింతాలతో కూడిన అక్షరాలు ఉన్న పదాలు ఉన్నాయా? ఒక్కొక్క దానికి వేరు వేరు పదాలు రాయండి.

| ా | ి | ీ | ు | ూ | ె | ే | ై | ొ | ో | ౌ |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | | | |

© SCERT not to be republished

## V. సృజనాత్మకత




1. మన జాతీయ జెండా చిత్రాన్ని గీయండి. రంగులు వేయండి. జెండాలోని ఒక్కొక్క రంగు ప్రత్యేకతను వర్ణించండి.
2. " ఆకాశం నిండా స్వాతంత్ర్యపు జెండా" గేయాన్ని అందరు కలిసి అభినయంతో పాడండి.
3. గేయంలో కొత్త వేడి, కొత్త వాడి, కొత్త జగం, కొత్త యుగం, కొత్త శాంతి, కొత్త కాంతి వంటి పదాలు ఉన్నాయి. ఇలాగే మరికొన్ని పదాలు రాయండి. వాటితో కొత్త గేయాన్ని రాయండి.

## VI. ప్రశంస



1. గేయంలో మీకు నచ్చిన పదాలను, పంక్తులను గురించి రాయండి. అవి మీకు ఎందుకు నచ్చాయో తెలపండి.
2. గేయాన్ని మీ తరగతిలో ఎవరు బాగా పాడారు? ఎవరు బాగా అభినయం చేశారు? బాగా ఉందని మీరు ఎందుకు అనుకుంటున్నారో చెప్పండి.

## VII. ప్రాజెక్టు పని



1. వార్తాపత్రికలు చూడండి. వాటిలో వచ్చే దేశనాయకుల చిత్రాలను , దేశభక్తి గేయాలను సేకరించండి. వాటిని చార్టుమీద రాసి ప్రదర్శించండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**ధ్వని అనే మాటకు చప్పుడు, శబ్దం అని అర్థం. భాషా విషయంలో మాత్రం ధ్వని అంటే నోటితో పలికేది అని అర్థం.**

**భాషాధ్వనులకు సంబంధించిన అక్షరపు గుర్తుల పట్టికను 'వర్ణమాల' అంటారు. 'అక్షరమాల' అని కూడా అంటారు.**

ఉదా॥ 'అ' – అనేది ఒక ధ్వనిని తెలిపే గుర్తు. అంటే అక్షరం.

'మ' – అనే దాంట్లో రెండు ధ్వనులున్నాయి. 'మ్ + అ' = 'మ' అవుతుంది.

'అ, ఆ, ఇ, ఈ' వంటి వర్ణాలను "అచ్చులు" అంటారు.

క, ఖ, గ, ఘ వంటి వర్ణాలు "హల్లులు".

అక్షరమాలలో ఎలా ఉన్నా హల్లు అనేది పొల్లుగా పలికే ధ్వని.

'మ్', 'అ' అనే ధ్వనులు కలిసి 'మ' అయింది. మొదటిది హల్లు. రెండోది అచ్చు.

కొన్ని అక్షరాల్లో రెండేసిగాని, మూడేసిగాని హల్లులు కలిసి ఉండవచ్చు.

ఇవి రెండు రకాలు:– ద్విత్వాక్షరం, సంయుక్తాక్షరం.

**ద్విత్వాక్షరం:** ఒక హల్లుకు అదే హల్లు తాలూకు ఒత్తుచేరితే దాన్ని "ద్విత్వాక్షరం" అంటారు.

ఉదా॥ 'క్క' = క్ + ్క(క్) + అ = క్క – ఇందులో కకారం రెండు సార్లు వచ్చింది.

**సంయుక్తాక్షరం :** ఒక హల్లుకు వేరొక హల్లు తాలూకు ఒత్తుచేరితే దాన్ని "సంయుక్తాక్షరం" అంటారు.

© SCERT not to be republished

ఉదా॥ 'న్య' = న్ + య్ + అ – ఇందులో నకార, యకారాలనే రెండు హల్లులు వచ్చాయి.

క్ష్మి = క్ + ష్ + మ్ + ఇ – ఇందులో కకార, షకార, మకారాలనే హల్లులు మూడు కలిశాయి.

**1. కింది అక్షరాల్లో రెండేసి వర్ణాలున్నాయి. వాటిని గుర్తించండి.**

ఉదా॥ గా = గ్ + ఆ = (రెండు ధ్వనులు)

(అ) య : ........ + ........

(ఆ) కా : ........ + ........

**2. కింది పదాల్లోని సంయుక్త, ద్విత్వాక్షరాల్లోని ధ్వనులు రాయండి.**

ఉదా॥ పద్మ = ద్ + మ్ + అ = ద్మ (మూడు ధ్వనులు)

(అ) ఎత్తండి : ....... + ....... + ....... = .......

(ఆ) భాగ్య : ....... + ....... + ....... = .......

(ఇ) సంస్కృతి : ....... + ....... + ....... = .......

**వర్గాక్షరాలు:** 'క' నుండి 'మ' వరకు ఉన్న అక్షరాలను ఐదు వర్గాలుగా విభజించారు. అవి

క – వర్గం : క – ఖ – గ – ఘ – ఙ

చ – వర్గం : చ – ఛ – జ – ఝ – ఞ

ట – వర్గం : ట – ఠ – డ – ఢ – ణ

త – వర్గం : త – థ – ద – ధ – న

ప – వర్గం : ప – ఫ – బ – భ – మ

**3. కింది వాక్యాలలో ఒక వర్గపు అక్షరాలు దాగి ఉన్నాయి. వాటిని గీత గీసి గుర్తించండి.**

"బలరాం మంచి ఫలాలకోసం పల్లెలో తోటకు వెళ్ళాడు. తోటలో పామును చూసి భయపడ్డాడు"



**నేనివి చేయగలనా ?**

| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగంతో, అభినయంతో పాడగలను. | ఔను / కాదు |
| 2. | పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో స్పష్టంగా చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | గేయం సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | ఇందులోని పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించగలను. | ఔను / కాదు |
| 5. | పాఠంలోని పదాలతో కొత్త గేయం రాయగలను. | ఔను / కాదు |

'ప్రపంచాన్ని రక్షించే జ్ఞానాన్ని భారత దేశం సంరక్షిస్తోంది' - శ్రీ అరవిందులు.

© SCERT not to be republished

మొదటి యూనిట్

# 2. జారిన గుండె

- మధురాంతకం రాజారాం

**ఆలోచించండి - మాట్లాడండి :**



**ప్రశ్నలు :**

1. పై చిత్రం చూడండి. చిత్రంలో ఎవరెవరున్నారు?
2. అతను వాళ్ళను ఎందుకు మోస్తున్నాడు?
3. అతణ్ణి చూస్తే మీకు ఏమి తెలుస్తున్నది?
4. తల్లిదండ్రుల సేవలో తరించిన శ్రవణకుమారుని కథను విన్నారా?
5. ప్రస్తుత కాలంలో వృద్ధులైన తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉంది?

**నేపథ్యం :**

పిల్లలకు దూరమైన తల్లిదండ్రుల బాధ ఎలా ఉంటుందో తెలుపుతూ, పిల్లల బాధ్యతను గుర్తు చేయడమే ఈ పాఠం ఉద్దేశం.

ప్రస్తుత పాఠ్యభాగం 'ఇక్కడ మేమంతా క్షేమం' అన్న కథనుండి తీసుకొన్నది.

**విద్యార్థులకు సూచనలు :**

1. ఈ పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీత గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.


అదంతా యిప్పుడెందుకు? అసలు యిసయం గాలికొదిలి, నేను పాత సంగతులన్నీ తవ్వుకుంటూ వుండా. ఏం లేదులే సామి! నువు నా పెద్దకొడుక్కొక జాబు రాసిపెట్టాల. అందుకని పావలా బిళ్ళ పెట్టి పోస్టు ఆఫీసులో ఈ కాకితం కొనుక్కొచ్చినాను. ఏం రాయాల్సింది నేన్చెప్తాన్లే–నువ్వు మొదలుపెట్టు.

ఒరే పెద్దబ్బా! నువ్వు నీ పెళ్ళాం బిడ్డల్తో ఇల్లొదిలి వెళ్లిపోయి ఆరునెల్లాయ. ఇంత కాలంగా అతీ గతీ తెల్పకుండా పోతివి. నువ్వు కాల్దీసి బయటపెట్టేనాటికి నీ పెళ్ళాం కడుపుతో వుంది. ఆ పిల్ల తీర్థమాడిందో లేదో తెలియకపోయ. మగబిడ్డో ఆడబిడ్డో తెలియకపోయ. నీకంటే నాలుగాకు లెగజదివినోడే నీ తమ్ముడు గూడా. మిల్టిరీలో సేరతానని వెళ్ళినోడు వాడు మిలటరీలో సేరినాడో,లేకుంటే బెంగుళూర్లో మూటలే మోస్తా వుండాడో తెలియకపోయ.


మీ అక్కా, బావా రంగంపేటలో గనక వుండుంటే నెలకొక సారయినా వచ్చి మమ్మల్ని సూచిపాతా వుందురు. కూలీలు దొరక్క, జరుగుబాటు కుదరక వాళ్ళు కూడా బిడ్డల్ని చంకనేసుకుని వుత్తరాది వెళ్ళిపోయిరి. మా కా మాతరం దిక్కుకూడా లేకపోయ. ఇక్కడ పరిస్థితి జూడబోతే నానాటికీ దిగజారిపోతా వుంది. తెల్లారిందంటే భయం. ఎండముకం జూడకుండా యింట్లో కూసుంటేనే బతికినాము. మద్యాణ్ణమయ్యేటప్పటికి కాకులు కూడా బయట కనబడవు.

ఒక్క బోరింగు బాయిలో దప్పితే యింకెక్కడా నీళ్ళు లేవు. వరిమళ్ళ ఆశ ఎప్పుడో వదులుకొన్రి. తడి సాలక సెరుకు దోటలు గూడా వాడిపోయ. గరిక పోసయినా నోటికి దొరక్క గొడ్డుగోదలన్నీ ఎముకల గూళ్ళయిపోయ. రైతులు దిగులుతో చిక్కి సగమైపోయిరి. మన వాడలో నాలుగైదు కుటుంబాలు దప్పితే మిగిలినోళ్ళందరూ పొట్ట సేతబట్టుకుని దేశాలపాలై పోయిరి. నువు పోతా పోతా మిగిలించిన నాలుగు మేకల్లో ఆఖరి మేకను నెలరోజుల నాడు అమ్ముకుంటి. ఒళ్ళు జబ్బుచేసి మీ అమ్మ మంచందిగి ఇరవై రోజులాయె. ఆసుపత్తిరి నించీ మాత్తర్లు తెచ్చిచ్చినా గుణం కనిపించలా. బియ్యంనూకతో జావ కాచి తాగిస్తా వుండా. “బిడ్డల్ని సూడాల, బిడ్డల్ని సూడాల” అంటా రెయ్యీ పగలూ ఒకటే ఆరాటం. మనూళ్ళో కరణంగోరి బామరిది లేడూ,ఎంకట నర్సయ్య,ఆయన బస్సులో వస్తావుంటే నువు కనిపించినావంట. ఆయన సెప్పంగా నువ్వెక్కడుండావో తెలిసింది. ఒరే నాయనా, మీరేమో రెక్కలొచ్చిన పచ్చులైపోతిరి. తలా ఒక మూలకు ఎగిరిపోతిరి. మాకేం మీ పెట్టుపోతలక్కర్లేదు. ఒకసారొచ్చి నువ్వు మీ అమ్మను జూచిపోతే సాలు. అదే పదేలు. బతికినంత కాలం బతకదు. ఈ జాబును తంతిగా ఎంచి, యిదందగానే బయల్దేరి రావాల. ఇంతే సంగతులు!–

అంతేలే సామీ! ఇంకద్రస్సు రాయి. “పీలేరు టేషనుకు దచ్చనంగా మూడో మైల్లో బాటపని జేసే చెంగల్రాయుడు” అన్రాయి. ఆ మాత్తరం సాల్దంటావా? అయితే కుడికాలు కొంచెం ఎగరేస్తా నడస్తాడని గూడా రాయి. రాసినావు గదా! సాల్లే, సేరుతుందిలే. సేరకెక్కడ బోతుంది? దండాలు సామీ, ఎల్లొస్తా.



## రచయిత పరిచయం



**పేరు** : **మధురాంతకం రాజారాం**

**కాలం** : 1930–1999

**జన్మస్థలం** : చిత్తూరుజిల్లాలోని మొగరాల గ్రామం

**రచనలు** : కమ్మ తెమ్మెర, వక్రగతులు–ఇతర కథలు, రేపటి ప్రపంచం, త్రిశంకు స్వర్గం, జీవితానికో నిర్వచనం, కూనలమ్మ కోన.

వీరి రచనలు రష్యన్, తమిళ, కన్నడ, ఆంగ్ల, హిందీ భాషల్లోకి అనువాదమయ్యాయి.

**పురస్కారాలు :** బుచ్చిబాబు అవార్డు, రామశాస్త్రి అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయంవారి ప్రతిభాపురస్కారం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్.

## ఇవి చేయండి



### I. వినడం-మాట్లాడడం



1. ఉత్తరం ఎవరు ఎవరికి రాయమన్నారు? ఎందుకు?
2. ప్రజలు గ్రామం వదలి ఎందుకు వెళ్ళారు?
3. మీ పాఠ్యాంశం ద్వారా సమాచారాన్ని ఉత్తరాలు, తంతి ద్వారా తెలిపేవారని తెలుస్తున్నది కదా? ఈనాడు సమాచారం పంపడానికి వేటిని ఉపయోగిస్తున్నాం?
4. ఇంట్లో తమవాళ్ళెవరూ లేకుండా ఉంటే ముసలి తల్లిదండ్రుల బాధ ఎలా ఉంటుంది?
5. అమ్మా, నాన్న, తాత, అవ్వలతో అందరూ కలసి ఉంటే ఎలా ఉంటుంది?

### II. చదవడం - రాయడం



1. పాఠం చదవండి. ఇందులోని జంటపదాలను వెదికి రాయండి.
2. కింది మాటలు ఎవరిని ఉద్దేశించినవి?
   అ) ఆ పిల్ల తీర్థమాడిందో? లేదో?
   ఆ) నాలుగాకు లెగజదివినోడే
   ఇ) నెలకొకసారయినా చూసిపోతూ వుందురు
   ఈ) చిక్కి సగమైపోయింది
   ఉ) పొట్ట సేతబట్టుకొని దేశాలపాలై పోయిరి
   ఊ) అంతేలే సామీ

© SCERT not to be republished

**3. కింది పేరా చదవండి ప్రశ్నలకు సమాధానాలివ్వండి**

ఒరే పెద్దబ్బా! నువ్వు నీ పెళ్ళాం బిడ్డల్తో ఇల్లొదిలి వెళ్లిపోయి ఆరునెల్లాయ. ఇంతకాలంగా అతీ గతీ తెల్పకుండా పోతివి. నువ్వు కాల్దీసి బయటపెట్టే నాటికి నీ పెళ్ళాం కడుపుతో వుంది. ఆ పిల్ల తీర్థమాడిందో లేదో తెలియకపోయ. మగబిడ్డో ఆడబిడ్డో తెలియకపోయ. నీకంటే నాలుగాకులెగజదివినోడే నీతమ్ముడు గూడా. మిల్టరీలో సేరతానని వెళ్ళినోడు వాడు మిలటరీలో సేరినాడో,లేకుంటే బెంగుళూర్లో మూటలే మోస్తా వుండాడో తెలియకపోయ.

**అ. చిన్న కొడుకు ఏం చేస్తున్నాడు ?**

ఎ. మిలటరీలో ఉన్నాడు బి. మూటలు మోస్తున్నాడు సి. తెలియదు.

**ఆ. పెద్ద కొడుకు ఇల్లు వదలి ఎంత కాలమైంది?**

ఎ. ఒక సంవత్సరం బి. ఆరు నెలలు సి. నెల

**ఇ. పెద్దకోడలు**

ఎ. భర్తతో వెళ్ళింది బి. తల్లిగారింట్లో ఉంది సి. అత్తగారింట్లో ఉంది

**4. పాఠం చదవండి. ఇందులో బాధ కలిగించే విషయాలేవో, నవ్వు పుట్టించే విషయాలేవో తెలపండి.**

**5. పాఠం చదవండి. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. ముసలి తండ్రి ఇంకొకరిచేత ఉత్తరం ఎందుకు రాయించాడు?

ఆ. మధ్యాహ్నమయ్యేటప్పటికి కాకులు కూడా కనబడవని ఎందుకన్నాడు?

ఇ. ఎదిగిన పిల్లలు తల్లిదండ్రులను వదలిపోవడం న్యాయమేనా? ఎందుకు?

ఈ. 'పొట్ట సేతబట్టుకొని దేశాలపాలైపోయిరి' అన్న వాక్యంవల్ల మీరేమి గ్రహించారు?

ఉ. ఉత్తరం చేరాల్సినవారి అడ్రస్సేమిటో రాయండి.

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు సమాధానం ఆలోచించి ఒక పేరాలో రాయండి.**

అ. ముసలి తండ్రి తన పెద్దకొడుకు, చిన్నకొడుకు, కూతురు గురించి ఏం తెలియజేశాడు?

ఆ. గ్రామంలో కరువు వచ్చింది. ఇలా కరువు రావడానికి కారణాలేమిటి? దీనినెలా దాటవచ్చు?

ఇ. మీ తల్లిదండ్రులు మీకేమి చేశారో సొంత మాటల్లో రాయండి.

ఈ. మీ తల్లిదండ్రులకు మీరెలా సేవచేయదలచారో రాయండి.

ఉ. పాఠంపేరు "జారిన గుండె" అని ఉంది కదా ! ఈ పాఠానికి ఈ పేరు తగినదేనా? ఎందుకు?

ఊ. వృద్ధాశ్రమాలు నిర్వహించడం ఎందుకు జరుగుతున్నదో ఊహించండి. కారణాలు రాయండి.

ఋ. ముసలివాళ్ళు ఇంట్లో ఉండడంవల్ల ఉండే ఉపయోగాలేమిటి?

© SCERT not to be republished

## 2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు :

కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.


అ. పెద్దవారితో పిల్లలు ఎలా ఉండాలో ఊహించి రాయండి?

ఆ. చిన్నపిల్లలతో పెద్దవారు ఎలా వ్యవహరించాలో ఊహించి రాయండి?

ఇ. పాఠంలోని ముసలితండ్రి కొడుకులు ఎలాంటివారు? వాళ్ళను గురించి మీ అభిప్రాయం తెలపండి.

ఈ. పాఠంలోని ముసలి తండ్రి, ఆయన కొడుకుల్లాంటివాళ్ళు మన సమాజంలో కూడా ఉంటారు! కొందరు కొడుకులు ఇలా ఎందుకు మారతారు? నువ్వే ముసలి తండ్రి స్థానంలో ఉంటే ఏం చేస్తావు?

## IV. పదజాలం



### 1. కిందివాటిని ఉపయోగించి సొంతవాక్యాలలో రాయండి.

అ. విషయం గాలికి వదలి ..........................................

ఆ. పాత సంగతులు తవ్వడం ..........................................

ఇ. మూటలు మోయడం ..........................................

ఈ. జరుగుబాటు ..........................................

ఉ. పరిస్థితి దిగజారడం ..........................................

ఊ. ఎముకల గూళ్ళైపోవడం ..........................................

ఋ. చిక్కి సగం కావడం ..........................................

ౠ. రెక్కలొచ్చిన పక్షులు ..........................................

### 2. కింది పదాలు చూడండి. వీటికి అదే అర్థం వచ్చే పదాలను పాఠం ఆధారంగా రాయండి.



అ. విషయం :------------ ఆ. ఉత్తరం :------------

ఇ. ఇరవై ఐదు పైసలు :----------- ఈ. కాగితం : :-----------

ఉ. పెద్ద కొడుకు :------------ ఊ. చూసిపోవడం :--------

ఋ. ఆసుపత్రి :------------ ౠ. రాత్రీ పగలూ :--------

ఎ. నువ్వు ఎక్కడ ఉన్నావో:--------- ఏ. స్టేషను : ----------

© SCERT not to be republished

## V. సృజనాత్మకత



1. కొడుకు దూరమై బాధపడే తండ్రి ఆత్మకథ రాయండి.
2. తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేయవద్దనే నినాదాలు తయారు చేయండి.
3. ఈ పాఠంలోని తండ్రిగా ఏకపాత్రాభినయం చేయండి.

## VI. ప్రశంస




1. పాఠం చిత్తూరు ప్రాంతపు మాండలికంలో ఉంది. పాఠంలోని మొదటి రెండు పేరాలనూ సొంత మాటల్లో రాయండి.
2. మీ ఇంట్లో లేదా మీ చుట్టుపక్కల ఉండే వృద్ధులకు మీరు ఏలాంటి సేవలు చేస్తారు.? వారికి మీరు ఏవిధంగా సహాయపడతారు?

## VII. ప్రాజెక్టు పని



1. మీ సమీపంలోని వృద్ధాశ్రమాన్ని సందర్శించండి లేదా మీ ఇంటి చుట్టుపక్కల ఉండే వృద్ధుల దగ్గరకు వెళ్ళండి. వాళ్ళతో మాట్లాడండి. వాళ్ళకిష్టమైన పనులు ఏవో తెలుసుకొని చెప్పండి. వారేమనుకుంటున్నారో రాయండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**తెలుగుభాషలోని వర్ణాలను మూడు విధాలుగా విభజించారు.**

అవి 1. అచ్చులు 2. హల్లులు 3. ఉభయాక్షరాలు

1. అచ్చులు : అ – ఆ – ఇ – ఈ – ఉ – ఊ – ఋ – ౠ
ఎ – ఏ –ఐ – ఒ – ఓ – ఔ

**1. అచ్చులు:** హ్రస్వాలు, దీర్ఘాలు అని రెండు విధాలు

**అ) హ్రస్వాలు:** ఒక మాత్రా కాలంలో ఉచ్చరించే అచ్చులను 'హ్రస్వాలు' అంటారు. అవి: అ – ఇ – ఉ – ఋ– ఎ – ఒ

(మాత్ర అంటే కనురెప్పపాటు కాలం.)

**ఆ) దీర్ఘాలు :** రెండు మాత్రల కాలంలో ఉచ్చరించే అచ్చులను 'దీర్ఘాలు' అంటారు.

అవి: ఆ – ఈ – ఊ – ఏ – ఐ – ఓ – ఔ



**2. హల్లులు :**

క ఖ గ ఘ ఙ

చ ౘ ఛ జ ౙ ఝ ఞ

ట ఠ డ ఢ ణ

త థ ద ధ న

ప ఫ బ భ మ

య ర ఱ ల ళ వ శ ష స హ

© SCERT not to be republished

ఉచ్చారణ విధానాన్ని బట్టి హల్లులను ఈ కింది విభాగాలు చేశారు.

అ) క, చ, ట, త, ప - పరుషాలు

ఆ) గ, జ, డ, ద, బ - సరళాలు

ఇవి అల్పప్రాణాలు కూడా.

ఇ) ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ లు మహాప్రాణాలు. వీటిని వర్గయుక్కులు అని కూడా అంటారు.

ఈ) ఙ, ఞ, ణ, న, మ - అనునాసికాలు.

ఉ) య, ర, ఱ, ల, ళ, వ లను అంతస్థాలంటారు.

ఊ) శ, ష, స, హ లను ఊష్మాలంటారు.

**సూచన:** "ఱ" అక్షరాన్ని గ్రాంథిక భాషలో రాసేటప్పుడు మాత్రమే వాడతారు. దీనికి బదులు 'ర'ను వాడుతున్నారు. అట్లే ౘ, ౙ లు వాడుకలో లేవు. వీటికి బదులుగా చ, జ లను వాడుతున్నారు.

3. **ఉభయాక్షరాలు:** మూడు. అవి సున్న 'ం' (పూర్ణబిందువు), అరసున్న 'ఁ', విసర్గ 'ః' ఈ మూడు అక్షరాలు అచ్చులతోనూ, హల్లులతోనూ ఉపయోగించడంవల్ల వీటిని 'ఉభయాక్షరాలు' అని వ్యవహరిస్తారు.

**సూచన:** అరసున్నకు గ్రాంథిక భాషలో ప్రాధాన్యమున్నది. విసర్గ సంస్కృత పదాలకు మాత్రమే చేరుతుంది.

**అ. కింది వాక్యంలో పరుషాలను గీత గీసి గుర్తించండి.**

*కష్టపడి చదివితే ఫలితం తప్పక ఉంటుంది.*

**ఆ. కింది మాటల్లో సరళాలతో మొదలయిన మాటల్ని గుర్తించండి.**

*బలం, కలం, గాలి, జలం, దళం, తళుకు, కాలు, డబ్బు.*

**ఇ. కింది మాటల్లో అంతస్థాలను గుర్తించండి.**

*యమున, కారం, పాలు, వంకర, వేళ*

**ఈ. కింది వాక్యంలో ఊష్మాలను గుర్తించండి.**

*భాషను మాట్లాడే సహజశక్తి మనుషులందరికీ ఉంటుంది.*



**నేనివి చేయగలనా ?**

| | | |
|---|---|---|
| 1. | పాఠంలోని ముసలి తండ్రి ఆవేదనను స్పష్టంగా చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పాఠాన్ని ధారాళంగా చదవగలను. అర్థం చేసుకొని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 3. | పాఠంలోని మాండలిక పదాలను, ఇతర పదాలను వాక్యాలలో ఉయోగించగలను. | ఔను/కాదు |
| 4. | పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో సంక్షిప్తంగా రాయగలను. | ఔను/కాదు |
| 5. | పాఠం ఆధారంగా ఆత్మకథ రాయగలను. ఏకపాత్రాభినయం చేయగలను. | ఔను/కాదు |

**" తల్లిదండ్రులు వృద్ధులై నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు వారిని రక్షించడం పిల్లల బాధ్యత" - జ్యోతీరావు ఫులే.**


© SCERT not to be republished

మొదటి యూనిట్

# 3. మణిపూసలు

- వివిధ కవులు

## ఆలోచించండి - మాట్లాడండి :




## ప్రశ్నలు :

1. పై చిత్రంలో ఎవరున్నారు ?
2. వారు ఏ విషయాల గురించి మాట్లాడుకుంటున్నారు.?
3. వారి సంభాషణనుబట్టి నీకేం తెలిసింది?
4. ఇలాంటి మరికొన్ని నీతులను పద్యాల ద్వారా తెలుసుకుందామా ?

## నేపథ్యం :

విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించి మంచి పౌరులుగా తీర్చి దిద్దడం ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. తెలియని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. తెలియని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.

*క. ఒరులేయవి యొనరించిన
నరవర! యప్రియముఁ దన మనంబున కగుఁ దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్. (1)



*క. తనువున విఱిగిన యలుఁగుల
ననువునఁ బుచ్చంగవచ్చు నతి నిష్ఠురతన్
మనమున నాటిన మాటలు
విను మెన్ని యుపాయములను వెడలునె యధిపా! (2)



*క. తనవారు లేనిచోటను
జన వించుక లేని చోట జగడము చోటన్
అనుమానమైన చోటను
మనుజునకు న్నిలువఁ దగదు మహిలో సుమతీ! (3)

*క. తడవోర్వక ఒడలోర్వక
కడు వేగం బడచి పడిన గార్యంబగునే
తడవోర్చిన నొడలోర్చినఁ
జెడిపోయిన కార్యమెల్లఁ జేకురు సుమతీ! (4)

*క. పాలను కలిసిన జలమును
బాల విధంబుననె యుండుఁ బరికింపంగాఁ
బాలచవిఁ జెఱచు గావునఁ
బాలిశుఁడగువాని పొందు వలదుర సుమతీ! (5)



*క. పరహితము లేని సంపద
ధర నెవ్వఁడు గూర్చెనేని దక్కక పోవున్
మురిపెంబున జుంటీగలు
మరి కుడువక గూర్చు తేనె మార్గము సుమతీ! (6)

* ఆ.వె. కుండ కుంభమన్న కొండ పర్వత మన్న
నుప్పు లవణ మన్న నొకటి కాదె
భాష లిట్టె వేరు పరతత్త్వ మొక్కటి
విశ్వదాభిరామ వినుర వేమ! (7)

* ఆ.వె. అంతరంగమందు నపరాధములు చేసి
మంచివానివలెను మనుజుఁడుండు
ఇతరు లెఱుఁగ కున్న యీశ్వరుఁ డెఱుఁగడా
విశ్వదాభిరామ ! వినుర వేమ! (8)



* ఆ.వె. పూజకన్న నెంచ బుద్ధి నిధానంబు
మాటకన్న నెంచ మనసు దృఢము
కులముకన్న నెంచ గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ! వినుర వేమ. (9)



* ఉ. నీరము తప్తలోహమున నిల్చి యనామకమై నశించు నా
నీరమె ముత్యమట్లు నళినీదళ సంస్థితమై తనర్చు నా
నీరమె శుక్తిలోఁ బడి మణిత్వము గాంచు సమంచిత ప్రభన్
పౌరుష వృత్తు లిట్లధమ మధ్యము నుత్తము గొల్చువారికిన్ (10)

| కవుల పరిచయం | | |
|---|---|---|
| కవి | కాలం | రచనలు, బిరుదులు |
| తిక్కన సోమయాజి | 13వ శతాబ్దం | నిర్వచనోత్తర రామాయణం, ఆంధ్రమహాభారతం (విరాట పర్వంనుంచి స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలు తెనిగించాడు.)<br>బిరుదులు – 'కవిబ్రహ్మ','ఉభయకవిమిత్రుడు'. |
| బద్దెన | 13వ శతాబ్దం | సుమతీ శతకం |
| వేమన | 17వ శతాబ్దం | వేమన పద్యాలు |
| ఏనుగు లక్ష్మణకవి | 18వ శతాబ్దం | సుభాషిత రత్నావళి, విశ్వామిత్ర చరిత్ర, రామేశ్వర మాహాత్మ్యము |

**భావాలు:**

1. ఇతరులు ఏ పని చేస్తే మనకు బాధ కలుగుతుందో ఆ పని మనం ఇతరుల విషయంలో చేయగూడదు. అదే ధర్మం.
2. శరీరంలోకి దిగిన బాణాలను అతి కష్టంమీద బయటకు తీయవచ్చు. బాణం చేసిన గాయాలను మాన్పవచ్చు. కాని ఇతరులకు కష్టాన్ని కలిగించేట్లు మాట్లాడిన మాటలను తొలగించడం ఎన్ని ఉపాయాలచేతకూడా సాధ్యం కాదు.
3. తమకు సంబంధించినవారు లేనిచోట, చనువు లేనిచోట, తగాదా జరుగుతున్న చోట అనుమానంగా ఉన్న చోట ఉండగూడదు.
4. ఆలస్యాన్ని, శరీర కష్టాన్ని భరించలేక చిందులువేస్తే పనులు జరగవు. ఆ రెంటికీ తట్టుకొంటే ఎటువంటి పనిలోనైనా విజయం సాధించవచ్చు.
5. పాలలో నీళ్ళు కలిస్తే పైకి ఎవరికీ ఏమీ తెలియదు. కానీ పాలరుచి మాత్రం తగ్గుతుంది. అలాగే చెడ్డవారితో స్నేహం చేయడంవల్ల పైకి తెలియకుండానే నష్టం జరిగిపోతుంది.
6. సాటివారికి సహాయపడకుండా డబ్బు ఎంత కూడబెట్టినా దక్కదు. తేనెటీగలు తాము తినకుండా తీసిపెట్టుకొన్న తేనెను ఇతరులు తీసుకుపోతున్నారు కదా!
7. కుండ అన్నా, కుంభమన్నా ఒకటే. కొండ అన్నా పర్వతమన్నా ఒకటే. ఉప్పు అన్నా, లవణమన్నా ఒకటే. భాషలు వేరైనా వస్తువును తెలిపే అర్థం ఒకటే. అలాగే రూపాలు వేరైనా పరతత్త్వం ఒకటే.
8. చెయ్యాల్సిన తప్పులన్నీ చేసి మంచివాడిలా నటిస్తే సరిపోతుందా? అలాంటివాడి గుట్టుమట్లు ఎదుటివారికి తెలియకపోవచ్చు. దేవుడికి తెలియకుండా పోతాయా?
9. ఆడంబరంగా పూజలు చేయడం కన్నా మంచిబుద్ధితో ఉండటం మంచిది. పై పై మాటలు చెప్పడం కన్నా మంచిమనసు ఉండటం కావాలి. కులంకన్నా గుణమే ముఖ్యం.
10. కాలిన ఇనుముమీద నీళ్లుపడితే ఆవిరైపోతాయి. ఆ నీళ్లే తామరాకుపైన పడితే ముత్యాల్లా కనిపిస్తాయి. ఆ నీళ్లే ముత్యపు చిప్పలలో పడితే మణుల్లా (ముత్యాల్లా) మారతాయి. మనిషి అధములలో చేరితే అధముడౌతాడు. మధ్యములలోచేరితే మధ్యముడౌతాడు. ఉత్తములలోచేరితే ఉత్తముడౌతాడు.




## I. వినడం-మాట్లాడడం



1. పాఠంలోని పద్యాలు వేటిని గురించి బోధిస్తున్నాయి?
2. పాఠంలోని ఏ ఏ పద్యాలను ఎవరు రాశారు ? ఇలాంటివే ఆయా కవులు రాసిన లేదా కింది తరగతుల్లో చదివిన మరికొన్ని పద్యాలు చదవండి.
3. పాఠంలోని పద్యాలలో ఏ పద్యాలు నీకు బాగా నచ్చాయి? ఎందుకు?
4. పాఠంలోని పద్యాలను మనం ఎందుకు నేర్చుకోవాలి?
5. ఇద్దరిద్దరు జతగా కూర్చోవాలి. ఒకరు పద్యం చదవాలి. ఇంకొకరు భావం చెప్పాలి.

© SCERT not to be republished

## II. చదవడం - రాయడం



**1. పాఠం ఆధారంగా జవాబులు రాయండి.**

అ. ఏది ధర్మం?

ఆ. దేన్ని తొలగించలేం?

ఇ. విజయం సాధించడానికి మూలం ఏది?

ఈ. పిసినారివాడి డబ్బు ఏమవుతుంది?

ఉ. మనుషులు ఎక్కడెక్కడ ఉండడం భావ్యం కాదు?

ఊ. మాటలకున్న శక్తి ఎలాంటిది?

ఎ. నీరు ఎక్కడెక్కడ పడితే ఎలా మారుతుంది?

**2. కింది వాక్యాలలో పదాలు తారుమారయ్యాయి. వాటిని సరిగా రాయండి.**

పాలలో పైకి కలిస్తే నీళ్లు తెలియదు ఎవరికీ ఏమీ.. రుచి మాత్రం కానీ తగ్గుతుంది. అలాగే స్నేహం వల్ల నష్టం తెలియకుండానే పైకి జరిగిపోతుంది చెడ్డవారితో.

**3. కుండ కుంభమన్న......... పద్యం చదవండి. ప్రశ్నలు తయారు చేయండి.**

**4. కింద కొన్ని పదాలున్నాయి.ఏ పదానికి ఏ పద్యం సరిపోతుందో పరిశీలించి కుండలీకరణాలలో (బ్రాకెట్లలో) పద్య సంఖ్యను వేయండి.**

అ. పరోపకారం - ( )

ఆ. కులంకన్నా గుణం ముఖ్యం - ( )

ఇ. ధర్మం - ( )

ఈ. చెడ్డవారితో స్నేహం - ( )

## III. స్వీయరచన



**1. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. ఇతరులకు బాధ కలిగించే పనులు ఏవి?

ఆ. ఇతరులను బాధపెట్టేలా మాట్లాడగూడదు కదా! ఎందుకు?

ఇ. ఏ పనిలోనైనా విజయం సాధించడానికి నువ్వు ఏం చేస్తావు?

ఈ. చెడ్డవాళ్ళతో స్నేహంవల్ల ఎలాంటి కష్టాలు నష్టాలు రావచ్చు?

ఉ. డబ్బు కూడబెట్టడంకన్న సాటివారికి సాయపడడం మేలని తెలుసుకున్నారు కదా! దీన్ని గురించి మీ అభిప్రాయాలు చెప్పండి.

ఊ. ఉండగూడనిచోట మనం ఎందుకు ఉండగూడదు?

ఎ. పాఠంలోని చివరి పద్యానికి భావం రాయండి. ఈ పద్యంలో మనిషిని వేటితో పోల్చారు.

**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు**

కింది ప్రశ్నలకు పదివాక్యాలలో జవాబులు రాయండి.


అ. ఒకవేళ నీ దగ్గర బాగా డబ్బుంటే దానితో ఇతరులకు ఎలా సాయపడతావు.

ఆ. "కులంకన్న గుణం ముఖ్యం" అన్నదాన్ని సమర్థించడానికి కారణాలు రాయండి.



© SCERT not to be republished

## IV. పదజాలం



**1. అర్థాలు (సరైన అర్థాన్ని గుర్తించండి)**

అ. జుంటీగలు ( )

(ఎ) జోరీగలు (బి) కందిరీగలు (సి) తేనెటీగలు (డి) గుడ్డీగలు

ఆ. పర్వతం ( )

(ఎ) బండ (బి) కొండ (సి) గుట్ట (డి) పుట్ట

ఇ. అలుగు ( )

(ఎ) బల్లెం (బి) ముల్లు (సి) ఇల్లు (డి) బాణం

ఈ. జగడం ( )

(ఎ) అగడ్త (బి) పొగడ్త (సి) పోట్లాట (డి) తిట్టడం

ఉ. తనువు ( )

(ఎ) శరీరం (బి) ఆహారం (సి) అనువు (డి) బరువు

**2. కింది వాక్యాలు చదవండి. గీత గీసిన పదం స్థానంలో సమానమయిన అర్థం వచ్చే పదాన్ని రాయండి.**

అ. **దమ్మపదం** బౌద్ధసాహిత్యానికి సంబంధించిన గ్రంథం. (ధర్మపథం, దర్మపదం)

ఆ. దేశ **భాష** లందు తెలుగు లెస్స. (భాస, బాస)

ఇ. నీ దస్తూరి **ముత్తెముల** కోవ (ముత్యాలు, ముత్తాలు)

ఈ. ఓర్పు లేకపోతే **కర్జం** అవుతుందా? (కారం, కార్యం)

**3. జట్టుపని : పాఠంలో పద్యాలలోని పదాలలో ఏ ఏ పదాలు పుస్తకంచివరి అకారాది పట్టికలో ఉన్నాయో చూసి వాటికింద గీత గీయండి, అర్థాలు చెప్పండి.**

## V. సృజనాత్మకత



1. కింది వాక్యాలు చదవండి. ఇలాంటి భావం వచ్చే మరికొన్ని వాక్యాలు చేర్చి గేయం రాయండి.

భాషలు వేరైనా భావమొక్కటే

కులమతాలు వేరైనా ---------------------

మనుషులు వేరైనా -----------------------

పువ్వులు వేరైనా------------------------

పూజలు వేరైనా-------------------------

-----------------------------------

----------------------------------

-----------------------------------

-----------------------------------.

2. మూడో పద్యానికి సరిపోయే ఒక కథ మీరు సొంతంగా రాయండి.
3. పాఠంలోని పద్యాలు ఆధారంగా ఒక్కొక్క పద్యానికి సంబంధించిన ఒక నీతివాక్యాన్ని రాయండి.


© SCERT not to be republished

## VI. ప్రశంస



1. ఈ పాఠంలోని పద్యాలద్వారా నీతిని, మంచి విషయాలను తెలుసుకున్నారు కదా! అట్లాగే ఆంగ్లం, హిందీ లేదా ఇతర భాషల్లో నీతిని, మంచి విషయాలను తెలిపే వాక్యాలను సేకరించండి. అట్టలమీద రాసి ప్రదర్శించండి.
2. ఈ పాఠంలో వేమన, సుమతి శతకం పద్యాలు కొన్ని నేర్చుకున్నారు కదా ! ఇలాంటివే మరికొన్ని పద్యాలను మీ గ్రంథాలయ పుస్తకాలనుంచి సేకరించండి. వాటి భావాలను రాసి ప్రదర్శించండి.
3. పద్యాల తోరణం : తరగతిలోని పిల్లలందరూ రెండు జట్లుగా కూర్చోవాలి. ఒక జట్టువాళ్ళు ఏదైనా పదం చెప్పాలి. రెండో జట్టువాళ్ళు ఆ పదమున్న పద్యం చదవాలి.
4. మీ తరగతిలో పద్యాలు రాగంతో, భావంతో చక్కగా పాడేవారు ఎవరు? మీరు కూడా వాళ్ళలాగే పాడండి.

## VII. ప్రాజెక్టు పని



1. పద్యభావాలకు సరిపోయే సామెతలు / జాతీయాలు సేకరించి పక్కనే రాయండి. గోడపత్రికలో ప్రదర్శించండి.
2. పాఠంలోని విలువలను తెలియజేసే కథలను గ్రంథాలయంనుంచి సేకరించి రాయండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**1. కిందివాటిని జతపరచండి.**

| | | | |
|---|---|---|---|
| అ) నామవాచకం | ( ) | (అ) | చదివాను |
| ఆ) సర్వనామం | ( ) | (ఆ) | కాని |
| ఇ) విశేషణం | ( ) | (ఇ) | ఆమె |
| ఈ) క్రియ | ( ) | (ఈ) | ఎర్రని |
| ఉ) అవ్యయం | ( ) | (ఉ) | హైదరాబాదు |

పైన పేర్కొన్నవి భాషాభాగాలని గుర్తించారుకదా!

**2. కింది ఖాళీలను పూరించండి.**

అ. నామవాచకానికి లేదా సర్వనామానికి ఉన్న గుణాన్ని తెలిపేది ..................

ఆ. పేరుకు బదులుగా వాడేది ..................

ఇ. పనిని తెలిపే మాట ..................

ఈ. లింగ, వచన, విభక్తులవల్ల మారనిది ..................

ఉ. పేరును తెలిపే పదం ..................

**3. ఈ కింది వాక్యాల్లో క్రియలను గుర్తించి పక్కనే రాయండి.**

(అ) సిద్ధార్థ పాఠశాలకు వెళ్ళాడు.............................................

(ఆ) వైష్ణవి పుస్తకం చదివి నిద్రపోయింది....................................

© SCERT not to be republished

(ఇ) గోపాల్ మైదానంలో పరుగెత్తుతున్నాడు.................................

(ఈ) ఉదయ్ భోజనం చేసి సినిమాకి వెళ్ళాడు.................................

(ఉ) మనస్విని శ్రావ్యంగా పాటలు పాడుతుంది ................................

(ఊ) అరుణ్ చిత్రాలు గీసి ప్రదర్శనకు పెట్టాడు. ................................

**పై వాక్యాల్లో రెండు క్రియలున్న వాక్యాలు ఏవి?**

**ఆ రెండు క్రియల్లోని భేదం గమనించారా?**

(ఆ) చదివి, నిద్రపోయింది.

(ఈ) చేసి, వెళ్ళాడు.

(ఉ) గీసి, పెట్టాడు.

ప్రతి వాక్యంలోనూ చివర ఉన్న క్రియలు పని పూర్తయిందని తెలుపుతున్నాయి. వీటిని **"సమాపక క్రియలు"** అంటారు.

వాక్యం మధ్యలో ఉన్న క్రియలు పని పూర్తికాలేదని తెలుపుతున్నాయి. వీటిని **"అసమాపక క్రియలు"** అంటారు.

కింది వాక్యాలను గమనించండి.

1. ఉష పాఠం చదువుతున్నది.
2. మురళి మంచి బాలుడు.

మొదటి వాక్యంలో క్రియ ఉంది. అది సమాపక క్రియ. రెండో వాక్యంలో క్రియ లేదు.

ఈ విధంగా క్రియ ఉన్నా, లేకున్నా ఒకే ఒక భావాన్ని ప్రకటించే వాక్యాలను **"సామాన్యవాక్యాలు"** అంటారు.

**కింది సామాన్య వాక్యాలను కలిపి రాయండి.**

ఉదా: శ్రీకాంత్ అన్నం తిన్నాడు.
శ్రీకాంత్ బడికి వచ్చాడు.

జ॥ శ్రీకాంత్ అన్నం తిని బడికి వచ్చాడు.

1. మాధవి బాగా చదివింది.
మాధవి ఎక్కువ మార్కులు తెచ్చుకున్నది.

జ॥ .......................................................

2. గౌతమి సంగీతం నేర్చుకున్నది.
గౌతమి బాగా పాడింది.
గౌతమి అందరి మన్ననలు పొందింది.

జ॥ .......................................................

పై వాక్యాలను కలిపినప్పుడు ప్రతిసారీ ఒక సమాపక క్రియ, ఒకటిగాని అంతకంటే ఎక్కువగాని అసమాపక క్రియలు ఉంటాయి. ఇటువంటి వాక్యాలను **సంశ్లిష్టవాక్యాలు** అంటారు.

**"జారిన గుండె"** పాఠంనుంచి నాలుగు సంశ్లిష్టవాక్యాలను గుర్తించి రాయండి.

ఈ కింది సామాన్య వాక్యాలను కలిపి రాయండి.

ఉదా: కల్పన పాడుతుంది.
కల్పన నాట్యం చేస్తుంది.

© SCERT not to be republished

జు॥ కల్పన పాడుతుంది, నాట్యం చేస్తుంది.

1. అతడు నటుడు.

   అతడు రచయిత.

   జు॥ ......................................................

2. అశ్విని అక్క.

   జ్యోతి చెల్లెలు.

   జు॥ ......................................................

3. ఆయన ఉద్యోగస్థుడా?

   ఆయన వ్యాపారవేత్తా?

   జు॥ ......................................................

4. అరుణ ఊరికి వెళ్ళింది.

   అనూష ఊరికి వెళ్ళింది.

   జు॥ ......................................................



పై వాక్యాల్లో ఎక్కడా అసమాపక క్రియ రాలేదు కదూ! ఒక వాక్యానికి ఉపవాక్యం చేరిన సందర్భాల్లోనే అసమాపక క్రియ వస్తుంది. అది సంశ్లిష్ట వాక్యమని తెలుసుకున్నారు. పై సందర్భాల్లో ప్రతి రెండు వాక్యాలకూ సమప్రాధాన్యం ఉంది. ఇలా సమప్రాధాన్యం కలిగిన వాక్యాలను కలపడం వల్ల ఏర్పడ్డవి సంయుక్త వాక్యాలు. ఇలాంటి వాక్యాలు మరికొన్ని రాయండి.

© SCERT not to be republished

## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | దుష్టులకు దూరంగా ఉండాలి అని గ్రహించగలిగాను. | ఔను/కాదు |
| 2. | పిసినారితనం పనికి రాదు. సంపాదనకనుగుణంగా దానం చేయాలి అని గ్రహించగలిగాను. | ఔను/కాదు |
| 3. | మాటలు జాగ్రత్తగా వాడాలి అని గ్రహించగలిగాను. | ఔను/కాదు |
| 4. | పద్యభావాలకు సరిపోయే ఆంగ్ల, హిందీ సూక్తులను సేకరించగలిగాను. | ఔను/కాదు |
| 5. | పద్యాలలో నీతులు గ్రహించి ఎవరితో ఎలా మెలగాలో నేర్చుకున్నాను. | ఔను/కాదు |

**"ఉన్నతమైన ఆదర్శం కలిగి, దాన్ని చేరుకునేందుకు ఓపికగా శ్రమించడం జీవన సూత్రంగా చేసుకోవాలి"**

**...డా.బి.ఆర్.అంబేద్కర్.**

# 4. త్యాగం

(ఉపవాచకం)



పూర్వం గంగానదీ తీరంలో 'ధర్మపురం' అనే గ్రామం ఉండేది. ఆ దేశపు రాజైన విక్రమార్కుడు దేశసంచారం చేస్తూ ఒకరోజు ఆ గ్రామం చేరుకొన్నాడు. గంగానదిలో స్నానంచేసి అక్కడి దేవతలను పూజించాడు. ఆ నదీతీరంలో ఒకచోట ఒక పండితుడు పురాణం చెపుతూంటే వింటూ కూర్చున్నాడు. ఇంతలో అక్కడికి ఒక స్త్రీ భోరున ఏడుస్తూ వచ్చింది. "నదిలో స్నానం చేస్తున్న నా భర్తను మొసలి పట్టుకొని నీటిలోకి లాక్కుపోతోంది. ఎవరైనా తొందరగా వచ్చి రక్షించండి, రక్షించండి'! అంటూ కేకలు వేసింది. అప్పుడు సాహసవంతుడైన విక్రమార్కుడు నీటిలోకి దూకి, మొసలిని చంపి, అతన్ని కాపాడాడు.

అతడు విక్రమార్కుడికి నమస్కరించాడు. "అయ్యా! నువ్వు చాలా సాహసవంతుడవు, పరోపకార గుణం గలవాడివి. కనకనే నన్ను రక్షించావు. నేను నిరుపేదను, కృతజ్ఞతలు తెలపడం కంటే, నీకేమి ప్రత్యుపకారం చేయగలను?" అన్నాడు.


అప్పుడు విక్రమార్కుడు, "మీరు చింతించకండి, నేను ఏ ప్రత్యుపకారాన్నీ మీనుంచి కోరటంలేదు," అన్నాడు. అప్పుడతడు ఏదో గుర్తుకు వచ్చినట్లుగా, వెంటనే "అయ్యా! జ్ఞాపకం వచ్చింది. నా దగ్గర ఒక మంత్రముంది. దాన్ని జపిస్తే, చేసిన పాపాలన్నీ తొలగిపోతాయి. అంతేకాదు, జపించినవారు కోరుకున్నప్పుడు దేవలోకంనుంచి విమానం వచ్చి వారిని తీసుకువెళ్తుంది. దాన్ని ఇంకొకరికి ఉపదేశిస్తే మాత్రం, ఆ ఉపదేశించిన మొదటివారికి ఆ మంత్రం, ఆ తరవాత పనిచేయదు. ఆ మంత్రాన్ని మీకు ఉపదేశిస్తాను. ఈపాటి మేలయినా మీకు చేసే అవకాశమియ్యండి" అంటూ ఆ మంత్రం రాజుకు ఉపదేశించి, భార్యతో తన దారిన తాను వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత విక్రమార్కుడు దేశసంచారం చేస్తూ, వింధ్యపర్వత ప్రాంతానికి చేరుకొన్నాడు. అక్కడ పాడుపడిన దేవాలయం ముందున్న చెట్టుమీద ఒక రాక్షసుడు కనిపించాడు.

రాజు ఆ రాక్షసుడితో – "నువ్వు ఎవరివి? ఎందుకిక్కడ ఉన్నావు?" అని అడిగాడు. అప్పుడా రాక్షసుడిలా అన్నాడు. "అయ్యా! నేను ఇంతకుముందు మాళవదేశపురాజు దగ్గర పురోహితుడిగా ఉండేవాణ్ణి. మా రాజుకు పండితులను గౌరవించడమంటే చాలా ఇష్టం. వచ్చిన పండితులను పరీక్షించమని రాజు నన్ను నియమించాడు. నేను చెప్పిన పండితులకే బహుమతులిచ్చేవాడు మా రాజు. నాకు రాజాస్థానంలో లభించిన గౌరవానికి పొంగిపోయేవాణ్ణి.

కొంత కాలానికి, "నేనే గొప్ప పరీక్షకుణ్ణి" అనే గర్వం నాలో పెరిగిపోయింది. ఎంతటి పండితుడినైనా చులకనగా చూసేవాణ్ణి. ఒకరోజున గొప్ప గొప్ప శాస్త్రాలు చదువుకొన్న ఒక మహాపండితుడు రాజుగారి సభకు వచ్చాడు. "తనను పరీక్షించి, తగిన బహుమానమిప్పించ"మని నన్ను కోరాడు. నేను, గర్వంతో, "ఇతడు సామాన్య పండితుడే" అని గేలిచేశాను. అందుకు ఆ పండితుడు కోపగించి "నన్ను పరీక్షించి నా శక్తి గ్రహించక ఇలా నన్నవమానపరిచావు. కనక బ్రహ్మరాక్షసుడివై పుట్టు" అని శపించాడు. నేను భయంతో వణుకుతూ, 'శాపవిమోచనం' అనుగ్రహించమని కోరాను.

అప్పుడు, ఆ పండితుడిట్లా అన్నాడు: "వింధ్యపర్వతం దగ్గర పాడుబడ్డ గుడి ఒకటి ఉంటుంది. దాని కెదురుగా ఉండే రావిచెట్టుమీద నువ్వు రాక్షసుడిగా ఉండు. కొన్నాళ్ళకు దేశసంచారంచేస్తూ, విక్రమార్కుడు అనే రాజు అక్కడికి వస్తాడు. అతని వల్ల నీకు ఈ శాపం తొలగిపోతుంది."



© SCERT not to be republished

"అప్పటి నుండి నీ కోసం ఎదురుచూస్తూ, ఈ చెట్టు మీదనే గడుపుతున్నాను. నేటికి నా అదృష్టం పండింది. నీ దర్శనమైంది. ఒకరోజు నువ్వు గంగానదిలో మొసలిని చంపి, ఒక వ్యక్తిని రక్షించావుకదా! ఆ పుణ్యఫలాన్ని నాకు ధారపోస్తే నాకీ శాపం తప్పుతుంది" అని ప్రార్థించాడు.

విక్రమార్కుడు ఒక్కక్షణమైనా ఆలోచించలేదు. రాక్షసుడు కోరినట్లే చేశాడు. వెంటనే ఆ రాక్షసుడు మునుపటి రూపం పొంది, రాజును ఆశీర్వదించాడు. మంత్రమహిమవల్ల దేవలోకంనుంచి వచ్చిన విమానమెక్కి ఆకాశమార్గాన వెళ్ళిపోయాడు.

అక్కడినుంచి బయలుదేరిన విక్రమార్కుడు దేశమంతటా తిరుగుతూ పోతున్నాడు. అతనికి ఒకచోట నలుగురు సిద్ధులు కనిపించారు. రాజు వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు. వినయంగా నమస్కరించాడు. వాళ్ళ యోగక్షేమాలను విచారించి, "అయ్యా! మీరు ఏయే దేశాలు తిరిగారు? ఏ వింతలు చూశారు?" అని అడిగాడు.

"మేము చాలా దేశాలు తిరిగాం. అనేక క్షేత్రాలను దర్శించుకున్నాం. పుణ్యతీర్థాలలో స్నానాలు చేశాం. కాని, హిమాలయపర్వతాలలో అద్భుతశక్తులు కలిగిన శ్రీదత్తుడు అనే మహర్షిని మాత్రం చూడలేకపోయాము" అని చెప్పారు. వాళ్ళ నిరాశను గమనించాడు రాజు. "ఇన్ని చూసిన మీరు, ఆ మహామునిని ఎందుకు చూడలేకపోయారు?" అని అడిగాడు.

"ఆ ప్రదేశంలో పాములు ఎక్కువగా తిరుగుతూంటాయి. అక్కడకు పోతే ఆ పాములు మనుష్యుల్ని అడుగుతీసి అడుగు ముందుకు వెయ్యనివ్వవు. ఆ మార్గంలో ప్రయాణించటం ఎంతో అపాయకరం. అందుకే, అటు వెళ్ళే ప్రయత్నం మానుకొన్నాం," అని చెప్పారు ఆ సిద్ధులు. విక్రమార్కుడు ఆ నలుగురు సిద్ధులను తీసుకొని హిమాలయాలకు ప్రయాణమయ్యాడు.

దారిలో పెద్దవీ, పొడవైనవీ, విషమున్నవీ, విషంలేనివీ రంగు రంగుల పాములు ఉన్నాయి. ఆ దారిలో పాములమధ్యనే నడుస్తున్నాడు. తనకు, సిద్ధులకూ చుట్టుకొన్న పాములను హింసించకుండా జాగ్రత్తగా పక్కకు తప్పిస్తూ ముందుకు సాగుతున్నాడు. అడ్డువచ్చిన మంచుగడ్డలను తొలగిస్తూ పోతూ చివరికి శ్రీదత్తుని ఆశ్రమం చేరుకున్నాడు. తనతోపాటు సిద్ధులకు కూడా శ్రీదత్తుని దర్శనభాగ్యం కలిగించాడు. సిద్ధులు విక్రమార్కుడి పరాక్రమాన్ని గురించి కష్టసుఖాలను తెలుసుకోడానికి చేస్తున్న దేశసంచారాన్ని గురించి శ్రీదత్తునికి వివరించారు.

సంతోషించిన ఆ మునీంద్రుడు కోరుకొన్నప్పుడు ఎక్కడికైనా తీసుకెళ్ళగలిగే 'మాయా తివాచీ'ని విక్రమార్కునికి ప్రసాదించాడు. తమకు శ్రీదత్తుని దర్శనం కల్పించిన విక్రమార్కుడికి సిద్ధులు నలుగురూ ఒక బలపం, కొరడా, మంత్ర దండం, బొంత కానుకలుగా ఇచ్చారు. ఏ ప్రాణి బొమ్మనైనా ఆ బలపంతో రాసి, కొరడాతో తాకిస్తే దానికి ప్రాణం వస్తుంది. మంత్రాన్ని జపిస్తే శత్రునాశనం జరుగుతుంది. బొంతను విదిలిస్తే కావలసినంత ధనం లభిస్తుందని ఆశీర్వదించారు.

© SCERT not to be republished

రాజు మళ్ళీ దేశాటనం చేస్తూండగా ఒకడు కట్టెలు కొడుతూ కనిపించాడు. "పచ్చని అడవిని ఎందుకు పాడు చేస్తున్నావు" అని అడిగాడు రాజు. అందుకతడు "మహారాజా! నేనొక రాజుకు స్నేహితుణ్ణి. అతడు యుద్ధంలో ఓడిపోయాడు. రాజ్యం శత్రువుల పాలయింది. ఆ రాజు నన్ను తీసుకొని అడవికి వచ్చాడు. జీవించడం వ్యర్థమని అగ్నిప్రవేశం చేయాలనుకొన్నాడు. కట్టెలకోసం నన్ను పంపించాడు" అన్నాడు.

విక్రమార్కుడు అతనితో కలిసి రాజును చేరుకొన్నాడు. "మహారాజా! రాజులు శత్రువులను సాధించాలి, లోకరక్షణకు నడుం బిగించాలి. కానీ వెన్ను చూపకూడదు. ఇవిగో ఈ వస్తువులు తీసుకో అంటూ శ్రీదత్తుడు, సిద్ధులు తనకు ప్రసాదించిన వస్తువులను, అద్భుత శక్తులను అతనికి దానం చేశాడు. రాజకుమారుడు మాయా తివాచీతో తన రాజ్యానికి చేరుకున్నాడు. చేతిలోని బలపంతో చతురంగ బలాలను గీయించాడు. కొరడాతో తాకించగా అతని బలగమంతా బతికింది. బొంత విదిలించగానే ధనరాశులు కురిశాయి. శత్రువినాశిని మంత్రం జపించి యుద్ధానికి వెళ్ళాడు. శత్రువును జయించి మళ్ళీ రాజ్యాన్ని పొందాడు. ప్రజలకు సుఖశాంతులను చేకూర్చాడు.

ఇలా ఇతరులకోసం ఎన్నో త్యాగాలు చేసిన విక్రమార్కుడు త్యాగధనుడుగా కీర్తిప్రతిష్ఠలు పొందాడు.

మూలం : **విక్రమార్కుని కథలు**

© SCERT not to be republished

**ప్రశ్నలు :**

1. ఈ కథలో ఏ విషయాలు మీకు అద్భుతంగా అనిపించాయి? ఎందుకో తెలపండి.
2. ఈ పాఠంలో ఎన్ని పాత్రలున్నాయి? వాటి స్వభావాలను రాయండి.
3. ఈ పాఠానికి మరొక శీర్షికను నిర్ణయించండి. ఆ శీర్షికను ఎందుకు ఎన్నుకొన్నారో చెప్పండి.
4. ఈ పాఠంలో విక్రమార్కుడి త్యాగగుణాన్ని తెలిపే రెండు సంఘటనలున్నాయి. వాటిని రాయండి.
5. విక్రమార్కుడు ధైర్యవంతుడు, సాహసవంతుడు. అతని స్థానంలో మీరుంటే ఏం చేసేవారు?
6. ఈ కథలను గురించి మీ మిత్రులతో చర్చించండి. ఈ పాఠంమీద చిన్నచిన్న ప్రశ్నలు – జవాబులు తయారుచేయండి.
7. కొన్ని "విక్రమార్క కథలు" సేకరించి చదవండి, తరగతి గదిలో గోడలమీద ప్రదర్శించండి. (చందమామ, బాలమిత్ర పత్రికలను పరిశీలించండి)

**"త్యాగం, సేవ - ఇవే భారతీయులకు మహోత్తమ ఆదర్శాలు" - స్వామి వివేకానంద**

మొదటి యూనిట్

# 5. స్నేహ బంధం

## ఆలోచించండి - మాట్లాడండి



## ప్రశ్నలు :

1. చిత్రంలో ఎవరెవరున్నారు?
2. ఆ పిల్లలు ఏం చేస్తున్నారు?
3. పై చిత్రం చూస్తే మీకే భావన కలిగింది?


ఇప్పుడు మనం ఇలాంటి స్నేహాన్ని తెలిపే ఒక కథను గురించి తెలుసుకుందామా ?

## నేపథ్యం :

స్నేహంవల్ల కలిగే లాభాన్ని గురించి తెలిపే ఈ కథ హితోపదేశంలోది.
స్నేహితులు పరస్పరం సహాయం చేసుకోడంవల్ల అపాయంనుంచి ఉపాయంతో బయటపడవచ్చని తెలుస్తుంది. "మంచి స్నేహితులు తమ స్నేహితులకోసం ప్రాణాన్నయినా ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు," అనే సంస్కృతిని తెలియజేస్తుంది ఈ పాఠం.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.



ఒక అడవిలో ఒక కాకి, ఎలుక, తాబేలు స్నేహంగా ఉండేవి. కాకి పేరు లఘుపతనకం, ఎలుక పేరు హిరణ్యకం, తాబేలు పేరు మంథరకం. ఇవి ఎప్పుడూ కలిసిమెలిసి ఉండేవి.

ఒకరోజు ఒక జింక భయంతో పరుగెత్తుతూ ఈ స్నేహితుల దగ్గరికి వచ్చింది. ఈ జింక ఎవరో, ఎందుకు పరుగులెత్తుతూ వస్తూందో ఆ స్నేహితులకు అర్థం కాలేదు. ఎందుకైనా మంచిదని తాబేలు నీటి మడుగులోకి జారుకుంది. ఎలుక కలుగులోకి దూరింది. కాకి చెట్టుమీది కెగిరింది. ఒక కొమ్మమీద వాలి చుట్టూరా చూసింది. భయపడవలసిన పరిస్థితి ఏదీ లేదని నిశ్చయించుకొని, స్నేహితులను బయటకు రమ్మని పిలిచింది కాకి. మడుగులోనుంచి వచ్చిన తాబేలు జింక దగ్గరకు పాకుతూ వెళ్లింది. ఎలుక కలుగులోనుంచి బయటికి వచ్చింది. కాకి నేలపైకి వచ్చి వాలింది. "నువ్వెవరివి? ఎందుకు పరుగెత్తుకుంటూ వచ్చావు? ఎందుకు భయపడుతున్నావు?" అని తాబేలు జింకను అడిగింది. జింక ఇంకా రొప్పుతూనే ఉంది.

మెల్లగా గొంతు సవరించుకొని "నేను చిత్రాంగుణ్ణి," అన్నది జింక. "ఒక వేటగాడు తరుముకుంటూ వచ్చాడు. నేను భయపడి ఇక్కడికి ఉరుక్కుంటూ వచ్చాను. వాడు నా పరుగు అందుకోలేకపోయాడు. నేను ఎటు పారిపోయివచ్చానో తెలుసుకోలేకపోయాడు. మీరిక్కడ దేవుడిలా కనిపించారు. మీరే నన్ను కాపాడాలి. మీతో స్నేహం చేసి, మీతోనే ఉంటాను. మీ స్నేహం నాకు కావాలి. కాదనకండి," అని వేడుకొంది.


అప్పుడు తాబేలు, "చిత్రాంగా ! భయపడకు, ఇప్పటివరకు మేము ముగ్గురం స్నేహితులం. ఇప్పుడు నువ్వు కూడా కలిశావు. నువ్వు కూడా మాతోనే ఉండు. ఒకరికొకరం సహాయపడుతూ కలిసిమెలిసి ఉందాం. ఈ పక్కనున్న పొదే నీ ఇల్లనుకో ! నీకు కావలసినంత పచ్చిక ఈ చుట్టుపక్కల ఉంది. తియ్యటి మడుగు నీళ్లు ఇక్కడే ఉన్నాయి. ఇక్కడ నీకు ఏ లోటూ ఉండదు. అందరం హాయిగా ఉందాం," అన్నది.

ఎలుక, కాకి, "ఔనౌను," అని అన్నాయి.

చిత్రాంగుడెంతో సంతోషించాడు. అప్పటినుంచి అవన్నీ స్నేహంగా ఉన్నాయి.

ఒకనాడు పొద్దు వాలుతున్న వేళకు, తాబేలు, కాకి, ఎలుక ఒక చోటికి చేరాయి. కాని, మేతకు వెళ్లిన జింక ఇంకా రాలేదు. ఎందుకు రాలేదో తెలియక మిత్రుడికోసం కలతపడుతున్నాయి. ఏం చేయాలో తెలియలేదు. త్వరత్వరగా చీకటి ముసురుతూ ఉంది. తాబేలు గబగబా పాకి వెళ్లలేదు. చిత్రాంగుణ్ణి ఎటు పోయి వెదకాలో ఎలుకకు తెలియడం లేదు. కాకి మనసులో తళుక్కున ఒక ఉపాయం మెరిసింది. అప్పుడది రెక్కలు విప్పింది. చటుక్కున లేచింది. గబుక్కున పైకి చూసింది. రివ్వున ఎగిరింది. ఎగురుతూ ఎగురుతూ, కళ్ళు విప్పార్చి


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారి ఉచిత పంపిణీ




ఇటూ, అటూ చూస్తూనే ఉంది. ఒక చోట దాని చూపు నిలిచింది. హఠాత్తుగా కిందికి దిగింది. వలలో చిక్కుకున్న జింకను చూసింది. బయటకు రాలేక అల్లాడిపోతున్న నేస్తాన్ని చూసి దుఃఖించింది. చిత్రాంగుడి దగ్గరకు వెళ్లింది.

"ఎంత ప్రమాదం జరిగింది చిత్రాంగా! నీలాంటి మంచివాడికి రావలసిన అపాయం కాదిది. కానీ, ముందుగా నువ్వు ఈ ఆపదనుంచి బయటపడాలి" అన్నది.

వెంటనే జింక, "ఎలుక ఇక్కడికి వచ్చి ఈ వలను కొరికేస్తే నేను బయటపడతాను," అన్నది.

"ఔను ! వేటగాడు రాకముందే ఎలుకను తీసుకురావాలి. నువ్వు బయటపడాలి. నేనిప్పుడే పోయి ఎలుక నేస్తాన్ని తీసుకొస్తాను" అని వెంటనే ఎగిరిపోయింది. చిత్రాంగుడు ఎక్కువసేపు ఎదురుచూసే అవసరం లేకుండానే లఘుపతనకం తిరిగి వచ్చి వలదగ్గర వాలింది. దాని వీపుమీదినుంచి హిరణ్యకం గబుక్కున ఉరికి వలతాళ్లు కొరికింది. ఒకవైపు తాళ్లు కొరకగానే జింక బయటికి వచ్చింది.


సంతోషంగా స్నేహితులు ముగ్గురూ తిరుగు ప్రయాణం సాగించారు." ఇంత పెద్ద ఆపదలో నువ్వెందుకు చిక్కుకున్నావు? కొంచెం జాగ్రత్తగా ఉండాలి కదా!" అని అన్నది ఎలుక.



ఆ మాటకు జింక, "ఎంత జాగ్రత్తగా ఉన్నా ఒక్కొక్కప్పుడు అపాయం తప్పదు మిత్రమా ! నా జీవితంలో ఇంతవరకు ఎన్నో అపాయాలు వచ్చాయి. నాకు ఆరునెలలు వయస్సున్నప్పుడు ఒక వేటగాడి ఉచ్చులో చిక్కుకున్నాను. వాడు నన్ను ఆ దేశపు రాజకుమారునికి కానుకగా ఇచ్చాడు. రాజుగారి కోటలో నన్నందరూ ముద్దుచేసేవారు. నాకెంతో స్వేచ్ఛనిచ్చారు. నేను నా ఇష్టం వచ్చినచోటికి తిరిగేదాన్ని. నలుగురు కూర్చొని మాట్లాడుకుంటున్నప్పుడు పక్కన కూర్చొని వినేదాన్ని. నేను కూడా వాళ్లలాగే మాట్లాడడానికి ప్రయత్నం చేసేదాన్ని.

"ఒకనాడు నేను రాజభవనంలోనుంచి బయటకు వచ్చి వీధిలో తిరుగుతూ ఉంటే, ఊళ్ళోవాళ్ళ

© SCERT not to be republished



పిల్లలు నా వెంటపడి నన్ను ముందుకు తరిమారు. నేనెంతో భయపడ్డాను. ఒక పూలతోట కంచెమీదినుంచి లోపలికి దూకాను. ఆ తోటలో ఆ సమయంలో అంతఃపుర స్త్రీలు విహరిస్తున్నారు. వాళ్లు నన్ను పట్టుకొని రాజకుమారుని పడకటింటికి దగ్గరగా స్తంభానికి కట్టేశారు. ఆనాటి రాత్రి కళ్లు మిరుమిట్లు గొలిపే మెరుపులతో చెవులు బద్దలయ్యేటంత ఉరుములతో కుండపోత వాన కురిసింది. నామీద కూడా వాన చినుకులు పడ్డాయి. చల్లని గాలి వీస్తూ ఉంది. అప్పుడు నా చిన్నప్పుడు పరుగులు తీసిన అడవి గుర్తుకు వచ్చింది. నన్ను కన్నవాళ్ళు, నా స్నేహితులు గుర్తుకు వచ్చారు. ఇలాంటప్పుడు నేను వాళ్లతో కలసిఉంటే ఎంత బాగుండునో అనుకున్నాను. ఆ మాట నేను నేర్చిన మానవ భాషలో అన్నాను. నన్ను పెంచుకున్న రాజకుమారుడు నా మాటలు విన్నాడు. ఆశ్చర్యపోయాడు. ఈ వింతను కొలువు కూటంలో చెప్పాడు. పెద్దల సూచన ప్రకారంగా నన్ను అడవిలో విడిచిపెట్టమని తన సేవకులకు చెప్పాడు.

ఈ విధంగా మళ్లీ నేను పుట్టిన అడవికి వచ్చాను. స్వేచ్ఛగా బతికాను. ఒక వేటగాడు తరుముతుండగా బెదిరి మీ దగ్గరికి వచ్చాను. తరవాతి సంగతి అంతా మీకు తెలిసిందే".

చిత్రాంగుడు, హిరణ్యకం, లఘుపతనకం మాట్లాడుకుంటూ మెల్లగా తిరిగివస్తూ ఉండగా మంథరకం ఎదురుపడింది. స్నేహితులను చూసి ఊపిరి పీల్చుకుంది. కానీ ఎలుక మాత్రం తాబేలును కోప్పడింది, "ఏం కొంప మునిగిపోయిందని వచ్చావు నువ్వు ? మేం వస్తూనే ఉన్నాం గదా ?" అంది.

వీళ్ల సంభాషణ ఇలా సాగుతుండగానే వేటగాడు అటువైపు రావడం కాకి పైనుంచి గమనించింది. వేటగాడు వస్తున్నాడు, వడివడిగా నడవండని స్నేహితులను కాకి తొందరపెట్టింది. ఇంతలో వేటగాడు రానే వచ్చాడు. ఎలుక కలుగులోకి దూరింది. జింక దాక్కుంది. తాబేలు మాత్రం భయంతో నిలిచిపోయింది. వేటగాడు దగ్గరకు వచ్చాడు. దాన్ని పట్టుకొని వింటినారికి కట్టుకున్నాడు. ఉన్నట్టుండి ఇంకో ఉపద్రవం వచ్చినందుకు స్నేహితులంతా నివ్వెరపోయారు.

మిగిలిన ముగ్గురు స్నేహితులూ వెంటనే చురుగ్గా ఆలోచించారు. ఎలుక ఒక ఉపాయం చెప్పింది. ఆ ఉపాయం ప్రకారం కొంతదూరంలో, వేటగాడు వెళ్లే దారిలో జింక చచ్చినదానిలా పడి ఉంటే కాకి జింకమీద వాలి దాని కళ్ళు పొడుచుకొని తింటున్నట్టు నటిస్తూ ఉంది. వేటగాడది చూసి ఎదురుగా జింక దొరికినందుకు మురిసిపోయాడు. జింకను భుజానికెత్తుకుందామని తాబేటిని కింద పెట్టి జింకవైపు నడిచాడు. అది చూసి ఎలుక వింటినారి కొరికింది. తాబేలు మడుగులోకి జారింది. ఎలుక కలుగులో దూరింది. కాకి కావ్ మంటూ ఎగిరింది. జింక చెంగున ఉరికింది.



(తర్వాత ఏం జరిగిఉంటుంది? వేటగాడు ఏమనుకొని ఉంటాడు? ఆలోచించి చెప్పండి. రాయండి.)

© SCERT not to be republished



## ఇవి చేయండి



### I. వినడం-మాట్లాడడం



1. " స్నేహబంధం" పాఠంపేరు కదా! పాఠంపేరుకు సరిపోయినట్లుగా కథ ఉందా, లేదా? ఎందుకు? మీ అభిప్రాయం చెప్పండి.
2. పాఠంలో ఏ అంశానికి ప్రాధాన్యం ఉన్నదని భావిస్తున్నారు? ఎందుకు?
3. మీరు మీ స్నేహితులకు ఎప్పుడైనా సాయపడ్డారా? ఏ విధంగా సాయం చేశారు?
4. ఈ కథను సొంతమాటల్లో పొడిగించి చెప్పండి?

### II. చదవడం - రాయడం



1. పాఠంలో కొన్ని ప్రశ్నలు ఉన్నాయి. వాటిని రాయండి. ఆ ప్రశ్నలను ఎవరు, ఎవరిని అడిగారు?
2 పరుగెత్తుకుంటూ, ఉరుక్కుంటూ, ఇలాంటి పదాలు పాఠంలో మరికొన్ని ఉన్నాయి. ఆ పదాలు ఏవి? అవి ఉన్న వాక్యాలను చదవండి.
3 కాకి, ఎలుక, తాబేలు స్నేహితులు కదా ! వీటి నివాసాలు ఏవి? వీటిని తెలిపే వాక్యాలు ఉన్న పేరాలు ఏవి? వాటిని చదవండి.
4. పాఠం చదవండి. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.
   అ. కథలోని జంతువులేవి? వాటి పేర్లు రాయండి.
   ఆ చిత్రాంగుడు మొదటిసారి కలిసినప్పుడు ఏమన్నాడు?
   ఇ చిత్రాంగుడితో మొదటగా మాట్లాడింది ఎవరు? ఏమని మాట్లాడింది?
   ఈ. కథలో ఎవరు, ఏ సందర్భంలో త్యాగంచేశారు?
   ఉ. మంథరకాన్ని మిత్రులు ఎలా రక్షించారు?
   ఊ. చిత్రాంగుడు రాజభవనంనుంచి అడవికి చేరుకున్న విధం రాయండి.

### III. స్వీయరచన



1. **కింది ప్రశ్నలకు మూడు లేదా నాలుగు వాక్యాలలో జవాబులు ఆలోచించి రాయండి.**
   అ. ఎలుక, తాబేలు, కాకి మంచి మిత్రులని ఎలా చెప్పగలరు? వివరించండి.
   ఆ. స్నేహానికున్న గొప్పతనాన్ని వివరించే సంఘటనలు మీ పాఠంలో ఏమేమి ఉన్నాయి?
   ఇ. కథవల్ల మీరు గ్రహించిన మంచి విషయాలు ఏవి?
   ఈ. ఎంత జాగ్రత్తగా ఉన్నా ఒక్కొక్కసారి అపాయంలో పడతామని జింక ఎందుకు అన్నది?
   ఉ. సాధారణంగా పిల్లలు ఎలాంటి అపాయాలు/ఆపదలు ఎదుర్కొంటారు? ఇందుకోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

© SCERT not to be republished

ఊ. ఈ కథకు ఇంకేపేరు పెట్టవచ్చు? ఎందుకు?

ఎ. "తిరిగి అడవికి వచ్చాను. స్వేచ్ఛగా బతికాను." అని జింక అన్నది కదా! దీనివల్ల మీరేం తెలుసుకున్నారు?

**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు :**

అ. కథను క్లుప్తంగా సొంతమాటల్లో రాయండి.

ఆ. కథలోని పాత్రలను మీ మాటల్లో పరిచయం చేయండి.

ఇ. చిత్రాంగుడి వృత్తాంతాన్ని 10 వాక్యాల్లో రాయండి.

## IV. పదజాలం

**1. ఈ కింద గీత గీసిన పదాలకు సమానమయిన అర్థాలతో ఉన్న పదాలను పాఠం ఆధారంగా రాయండి.**

అ. కృష్ణకుచేలుర చెలిమి గొప్పది. ---------------------

ఆ. తామరలు కొలనులో పూస్తాయి. ---------------------

ఇ. ఎలుక కన్నంలో నివసిస్తుంది. ---------------------

ఈ. మహావిష్ణువు ఎత్తిన అవతారాలలో కూర్మ అవతారం ఒకటి. --------------

ఉ. నిప్పుతో చెలగాటం అపాయకరం. ---------------------

**2. కింది పట్టికలోని ప్రకృతి - వికృతి పదాలను జతపరచండి. తిరిగి సరిగా ప్రకృతి, వికృతులను పట్టికరూపంలో రాయండి.**

| | | | |
|---|---|---|---|
| అ. | అటవి | 1. | ఆకాశం |
| ఆ. | స్నేహం | 2. | సాయం |
| ఇ. | సహాయం | 3. | రాత్రి |
| ఈ. | రాతిరి | 4. | నెయ్యం |
| ఉ. | ఆకసం | 5. | అడవి |

**3. ఈ కింది వాక్యాలను చదవండి. ప్రతి వాక్యంలోను ఒక పదానికి అదే అర్థం వచ్చే మరొక పదం ఉన్నది. ఆ పదాలకింద గీత గీయండి.**

అ. ఎలుక కన్నంనుంచి బయటకు వచ్చి తొంగిచూసి బిలంలో దూరింది.

ఆ. కొలనులో కమలం వికసించింది. తాబేలు సరస్సునుంచి పైకి వచ్చింది.

ఇ. కాకి చెట్టుపైనుంచి చుట్టూ చూసింది. భయమేమీ లేదని వాయసం మిత్రులకు చెప్పింది.

ఈ. కాకి, తాబేలు, ఎలుకల సఖ్యం గొప్పది. ఇప్పుడు వాటికి జింకతో నెయ్యం కుదిరింది.

**4. కిందిపదాలు చదవండి. ఈ పదాలున్న వాక్యాలను పాఠంలో గుర్తించండి. వీటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

అ. గబుక్కున :-------------------------------------

ఆ. తళుక్కున :-------------------------------------

© SCERT Not to be republished

ఇ. చటుక్కున :-----------------------------------

ఈ. మిరుమిట్లు గొలిపే :--------------------------------

ఉ. ఎగురుతూ ఎగురుతూ :------------------------------

ఊ. వడివడిగా :-------------------------------------

ఎ. నివ్వెరపోయి :-----------------------------------

## V. సృజనాత్మకత



1. మంథరకుడు ఆపదనుంచి బైటపడటం అనే సన్నివేశాన్ని సంభాషణ రూపంలో రాయండి. అభినయం చేయండి.
2. కథలో జింక మానవ భాషలో మాట్లాడింది కదా ! ఇలాగే అడవిలోని జంతువులు మనలాగే మాట్లాడితే మన గురించి అవి ఏం మాట్లాడుకుంటాయో ఊహించి రాయండి.
3. కింది పదాలు చదవండి. వీటిని ఉపయోగించి మరొక కథను రాయండి.

   అడవి – స్నేహం – చుట్టుపక్కల – అల్లాడిపోతున్న – అపాయం – ఆపద – కొంపమునిగింది – ఉపాయం – నివ్వెరపోయింది – ఆనందం.

## VI. ప్రశంస



1. ఎలుక, తాబేలు, కాకి, జింక మంచి మిత్రులు కదా! ఇలాగే కలసి మెలసి ఉండే మంచి మిత్రులు మీకు తెలిసినవాళ్ళు ఎవరు ఉన్నారు. వాళ్ళ గురించి చెప్పండి.
2. ఈ కథను సొంతమాటల్లో మీ తరగతిలో బాగా చెప్పింది ఎవరు? అభినయం చేసింది ఎవరు? మీకు ఎందుకు బాగా అనిపించిందో చెప్పండి.
3. సృష్టిలో తీయనిది స్నేహమని అంటారు. నీకున్న మంచి మిత్రులు ఎవరు? వాళ్ళకున్న మంచి గుణాలు చెప్పండి.

## VII. ప్రాజెక్టు పని



1. స్నేహబంధాన్ని గురించి తెలిపే కథలు, చిత్రాలు కొన్ని సేకరించి ఆల్బమ్ తయారుచేయండి. ప్రదర్శించండి.
2. వార్తాపత్రికల్లో మీకు నచ్చిన నీతికథలను, కథాచిత్రాలను సేకరించి, చర్చించండి, ప్రదర్శించండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



'నా చిన్నప్పుడు పరుగులు తీసిన రోజులు గుర్తుకువచ్చాయి'.

పై వాక్యంలో 'చిన్నప్పుడు' అనే పదం 'చిన్న + అప్పుడు' అనే రెండుపదాల కలయిక వల్ల ఏర్పడింది. దీనినే సంధిపదం అంటారు.

ఉచ్చారణ సౌలభ్యంకోసం రెండు పదాలను వెంటవెంటనే కలిపి మాట్లాడవలసి, రాయవలసి వచ్చినప్పుడు సంధిపదం ఏర్పడుతుంది

రెండు తెలుగుపదాల మధ్య జరిగే సంధులను 'తెలుగు సంధులు' అంటారు.

© SCERT not to be republished

వ్యాకరణ పరిభాషలో రెండు స్వరాల కలయికను **'సంధి'** అని, ఆ రెండు స్వరాల మధ్య జరిగే మార్పును **'సంధికార్యం'** అని అంటారు. మొదటిపదం చివరి అక్షరంలోని స్వరాన్ని **'పూర్వస్వరం'** అని, రెండవ పదం మొదటి అక్షరంలోని స్వరాన్ని **'పరస్వరం'** అనిఅంటారు..

ఉదా॥ రామ + అయ్య 'మ' లోని 'అ' (పూర్వస్వరం) + అయ్యలోని 'అ' (పరస్వరం)

కింది పదాలను విడదీయండి.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఉదా: మేనల్లుడు | = | మేన | + అల్లుడు | = | (న్ +) అ | + అ | = అ |
| 1. ఒకప్పుడు | = | ...... | + ....... | = | ....... | + ... | = .... |
| 2. వచ్చినందుకు | = | ...... | + ....... | = | ....... | + ... | = .... |
| ఉదా: రాకుంటే | = | రాక | + ఉంటే | = | (క్ +) అ | + ఉ | = ఉ |
| 3. చెప్పుకున్న | = | ....... | + ....... | = | ....... | + ... | = ...... |
| 4. చేయకుంటే | = | ....... | + ....... | = | ....... | + ... | = ...... |
| ఉదా: లేకేమి | = | లేక | + ఏమి | = | (క్ +) అ | + ఏ | = ఏ |
| 5. జరగకేమి | = | ..... | + ....... | = | ....... | + ... | = ...... |
| 6. పోవుటెట్లు | = | .... | + ....... | = | ....... | + ... | = ...... |

పై పదాలలో పూర్వస్వరం 'అ' పరస్వరంలోని అచ్చుతో కలిసినప్పుడు 'అ' లోపించింది. పరస్వరం రూపం కనిపిస్తుంది. దీన్ని **'అత్వసంధి'** అంటారు.హ్రస్వ (పొట్టి) 'అ' అనే అక్షరానికి 'అచ్చు' పరమైనపుడు అత్వసంధి ఏర్పడుతుంది.

కింది పదాలను కలిపి రాయండి. అత్వసంధి ఏర్పడ్డ విధానాన్ని గమనించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: | చాలిన | + | అంత | = | (న్ +) అ + అ = అ - చాలినంత |
| 1. | ఉన్న | + | అప్పుడు | = | |
| 2. | లేక | + | ఉంటే | = | |
| 3. | అందక | + | ఉంటే | = | |
| 4. | ఉండుట | + | ఎట్లు | = | |



### నేనివి చేయగలనా?


1. కథను సొంతమాటల్లో స్పష్టంగా చెప్పగలను. ఔను / కాదు
2. పాఠ్యాంశాన్ని ధారాళంగా చదవగలను. ఏ పేరా గురించి అయినా సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు
3. కథను, కథలోని పాత్రలను గురించి సొంతమాటల్లో రాయగలను ఔను / కాదు
4. ఇందులోని పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించగలను. ఔను / కాదు
5. పాఠంలోని పదాలు ఆధారంగా స్నేహబంధం గురించి కొత్త కథ రాయగలను. ఔను / కాదు

**"ఆపదల్లో విడవకుండా ఉండటం, లోపాలను చూపించడం, గుణాలను మెచ్చుకోడం, అవసరానికి ఆదుకోడం, రహస్యాన్ని దాచుకోడం - ఈ ఐదూ మిత్రుని లక్షణాలు" - సంస్కృత సూక్తి**

© SCERT not to be republished

# 6. మ్రోగిన గంటలు (గేయకథ)

- కరుణశ్రీ



## ఆలోచించండి - మాట్లాడండి.

### ప్రశ్నలు :

1. పక్క చిత్రంలో ప్రధానంగా కనిపిస్తున్నదేమిటి?
2. ఇది సాధారణంగా ఎక్కడ ఉంటుంది?
3. దీనికి పై భాగంలో ఏమి కనిపిస్తున్నాయి?
4. వాటి విషయంలో మీరు ఏమి గమనించారు?
5. ఇలా జరగడం మీరు చూశారా? చెప్పండి.

ఇందులోని విశేషమేమిటో కింది గేయకథ ద్వారా తెలుసుకుందామా?

### నేపథ్యం :

కోట్లాదిమంది ప్రజలు తమ ఆరాధన స్థలాలకు రోజూ వెళ్తూ ఉంటారు. ప్రార్థనలూ చేస్తుంటారు. భక్తితో పాడుతూంటారు. తమ కోర్కెలు తీర్చమని మొక్కుతూంటారు. తమ శక్తికొద్దీ కానుకలు సమర్పిస్తూంటారు. కాని భగవంతుడికి, వీటికన్నా దయాదాక్షిణ్యాలు, జాలి, కరుణ కలిగినవాళ్ళు, దానధర్మాలు చేసేవాళ్ళు అంటేనే ఇష్టం అని చెప్పడమే ఈ పాఠ్యభాగ నేపథ్యం.

ప్రస్తుత పాఠ్యభాగం **'ఉదయశ్రీ'** అనే కావ్య సంపుటి లోనిది.

© SCERT not to be republished

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.

1. అనగనగా ఒక దేశం
దేశంలో ఒక నగరం
నగరిప్రక్క నది ఒక్కటి
నదిప్రక్కన గిరి ఒక్కటి

2. కొండమీద గుడి ఉందట!
గుడిముందర గోపురమట!
ఆ గోపురమున గంటలు
మ్రోగునంట తమకు తామె

3. ప్రతి యేటా ఒక్కనాడు
పవిత్ర శివరాత్రినాడు
కంటికి కనిపించని ఆ
గంటలు గణగణ మ్రోగును.

4. ప్రజల సత్ప్రవర్తనమును
భగవంతుడు గని మెచ్చును
కరుణామయ హృదయమ్ముల
గంటలలో వినవచ్చును.

5. ఏనాడే శిల్పి ఎట్టు
లేర్పరచెనో ఆ గంటలు?
గుడిలోపలి స్వామి కృపను
నుడివెడు బంగరు పంటలు


6. ఎప్పటిదో ఈ వాడుక
ఇప్పుడు లేదా వేడుక
గుడిగంటలు మ్రోగవిపుడు
కోర్కెలు కొనసాగవిపుడు

7. దేవుని మనుజులు మరచిరి
దేవుడు మనుజులను మరచె
జనుల భావములు మారెను
స్వార్థపరత మితిమీరెను.

8. మనిషి మనిషి మధ్య దళ్ళు
మనసులలో చీకు ముళ్ళు!
మలినమైన చెడు మెదళ్ళు!
మనిషికి మనిషన్న కుళ్ళు!

9. ప్రజల భావములు మారెను
పరవంచన మితి మీరెను
చైతన్యము చల్లారెను
సమత మమత అణగారెను

© SCERT not to be republished





10. శివరాత్రి పర్వమున
శివుని దర్శింపంగ
తరలివచ్చిరి జనులు
తండోపతండంగ

11. సాహుకార్లు జమీందార్లు
జయజయ నాదములతోడ
సంచులు సంచులు తెచ్చిరి
స్వామికి లంచము లిచ్చిరి
కోర్కెలు కొనసాగలేదు
గుడిగంటలు మ్రోగలేదు.

12. కోటీశ్వరు లెంతమందొ
గుడికి ప్రదక్షిణము చేసి
దోసెడు వరహాలు రాశి
పోసినారు స్వామి ముందు
కోర్కెలు కొనసాగలేదు
గుడిగంటలు మ్రోగలేదు.

13. మంత్రులు ఉపమంత్రులు
సామంతులు మహామహంతులు
గంపలతో నర్పించిరి
కెంపులు వజ్రాలు మణులు
కోర్కెలు కొనసాగలేదు
గుడిగంటలు మ్రోగలేదు.

14. ఆ జన సమ్మర్దములో
అంధ భిక్షు వర్షీయసి
కాలు జారి 'అమ్మో' యని
నేలమీద పడిపోయెను
చేతిలోని గిన్నె ప్రక్క
గోతిలోన పడిపోయెను
నొసటిమీద గాయమాయె
ముదుసలి స్పృహ తప్పిపోయె

15. పెద్దమనుషులెవ్వరు ఆ
వృద్ధురాలి దెస జూడరు
దేవుని దర్శించుటకై
కోవెలలో కేగినారు.

16. ఇద్దరు బాలలు శివు ద
ర్శింపగ వచ్చినారు
రివ్వున జని క్రింద పడిన
అవ్వను పైకెత్తినారు.

17. కాయమునకు ధూళి దులిపి
గాయమునకు కట్టుకట్టి
మాటరాని ముసలి అవ్వ
నోట నీరు పోసినారు.

© SCERT not to be republished




18. శివుని నివేదనకై తె
చ్చిన తీయని అరటి పండ్లు
తొక్క తీసి ఒక్కటొక్కటి
చక్కగ తినిపించినారు.

19. "ఎవరి బిడ్డలమ్మా, బం
గారు తల్లులార మీరు!
నాకు సేవ చేసినారు
నా ప్రాణము నిలిపినారు,"

20. అనిన అవ్వ కన్నుల ప్రే
మాశ్రులు ప్రవహించ సాగె
గంటలు గోపురములోన
"గణగణగణ" మనుచు మ్రోగె





**కవి పరిచయం**

| | | |
|---|---|---|
| కవి పేరు | : | జంధ్యాల పాపయ్యశాస్త్రి |
| కలంపేరు | : | కరుణశ్రీ |
| కాలం | : | 1912 -1992 |
| జన్మస్థలం | : | గుంటూరు జిల్లా, కొమ్మూరు |
| రచనలు | : | ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ, ఉమర్ ఖయ్యామ్, తెలుగుబాల శతకం మొదలైనవి |

© SCERT not to be republished

## గేయ సారాంశం

అనగనగా ఓ దేశం. అందులో ఓ నగరం. ఆ పక్కన ఒక నది. దాని పక్కనున్న కొండపైన ఒక గుడి.. ఆ గుడి ముందర గోపురం. దానికి గంటలు. అవి వాటంతట అవే మోగుతాయి. ఆ గంటలు పవిత్ర శివరాత్రినాడే మోగుతాయి. కాని అవి ఎవరికీ కనపడవు. ఇదీ ఆ గుడిలోని వింత.

ఏ శిల్పి ఆ గంటలను చేశాడో? గుడిలో దేవుని దయను చాటి చెబుతాయి ఆ గంటలు. ప్రజలలోని మంచి నడవడిక, కరుణామృత హృదయం చూసి ఆ గంటలు మోగుతాయి. ఏళ్ళుగా ఈ వింత వేడుక కొనసాగుతోంది. కానీ ఈ మధ్య ఆ గంటలు మోగడం లేదు. మూగబోయాయి.

మనిషికీ మనిషికీ మధ్య ఎన్నో అడ్డుగోడలు. మనసులో అసూయాద్వేషాలనే ముళ్ళు. మలినమైన బుద్ధులు. పక్కమనిషి బాగుపడితే ఓర్వలేనితనం, మోసాలు, నేరాలు పెరిగాయి. మానవత మరుగున పడింది. సమత, మమత అంతరించాయి.

ఒక శివరాత్రినాడు శివుణ్ణి దర్శించడానికి జనం సముద్రంలాగ వచ్చారు. ధనవంతులు, భూస్వాములు డబ్బుసంచులు తెచ్చారు. దేవునికి 'లంచం'గా అర్పించి తమ కోర్కెలు తీర్చమని మొక్కారు. కానీ గుడిగంటలు మోగలేదు.

కోటీశ్వరులు గుడికి ప్రదక్షిణం చేశారు. వరహాలు స్వామిముందు కుమ్మరించారు. అయినా గంటలు మోగలేదు.

మంత్రులు, మహామంత్రులు, అధికారులు వజ్రాలు, వైడూర్యాలు స్వామికి సమర్పించారు. కానీ గంటలలో కదలిక లేదు.

జనసమ్మర్దంలో, కళ్ళులేని ఒక బిచ్చకత్తె కాలుజారి పడిపోయింది. ఆమె చేతిలో గిన్నె గోతిలో పడింది. నుదిటిపైన గాయంతో అవ్వ స్పృహ తప్పింది. పెద్దమనుషులు, ధనవంతులు, మంత్రులు ఎవరూ ఆ ముసలమ్మను పట్టించుకోలేదు. శివుణ్ణి చూడడానికే ఎగబడ్డారు.

ఇద్దరు పిల్లలు అది చూశారు. అవ్వను లేవదీసి కూర్చోబెట్టారు. దుమ్ము, ధూళి దులిపి గాయానికి కట్టుగట్టారు. అవ్వనోట్లో చల్లని నీరు పోశారు. శివపూజకు తెచ్చిన అరటిపళ్ళు తినిపించారు.

"బంగారు తల్లులారా! సేవచేసి నా ప్రాణం కాపాడారు," అని అవ్వ ఆనందబాష్పాలు రాలగా ఆ పిల్లల్ని దీవించింది. అంతే! ఆశ్చర్యం! గుడిగంటలు వాటంతట అవే గణగణ మోగసాగాయి.





## I. వినడం-మాట్లాడడం



1. గేయం విన్నారు కదా! ఈ గేయం దేన్ని గురించి ఉంది? దీన్ని రాగంతో, అభినయంతో పాడండి.
2. అందరూ శివుడి గుడికి వెళ్ళారు కదా! ఎందుకు వెళ్ళారు?
3. హిందువులు గుడికి వెళతారు, మరి మిగతా మతాలవాళ్ళు ఎవరెవరు ఎక్కడికి వెళతారు? ఏం తీసుకొని వెళతారు.
4. ఈ పాఠంలోని గుడి ఎలా ఉంది? మీరు చూసిన గుడి కూడా ఇలానే ఉందా? ఏమేమి తేడాలు ఉన్నాయో చెప్పండి.
5. ఈ గేయం ద్వారా కవి ఏం చెప్పాలనుకున్నారు?
6. ఈ పాఠానికి 'మ్రోగిన గంటలు' అనే పేరు ఎలా సరిపోయిందో చెప్పండి.

## II. చదవడం - రాయడం



1. గుడి-నుడి, వాడుక - వేడుక ఇవి ప్రాసపదాలు. ఇలాంటివి పాఠంలో మరికొన్ని ఉన్నాయి. వాటిని గుర్తించి గీత గీయండి.
2. పాఠంలోని 12, 13 గేయభాగాలను చదవండి. వాటికి ప్రశ్నలు రాయండి.
3. పాఠానికి సంబంధించిన చిత్రాన్ని చూడండి. దానికి సంబంధించిన వాక్యాలు గేయంలో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి. ఆ వాక్యాల కింద గీత గీయండి.

© SCERT not to be republished

4. మనుషులను గురించి వివరించే వాక్యాలు గేయంలో ఎక్కడ ఉన్నాయి? వాటిని రాయండి.

5. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

అ. గుడిలో వింత జరుగుతుంది కదా! అది ఏమిటి? ఎప్పుడు జరుగుతుంది?

ఆ. గుడికి చాలామంది వచ్చారు. ఎవరెవరు వచ్చారు?

ఇ. శివుడికి ఎవరెవరు ఏమేమి సమర్పించారు?

ఈ. గుడిదగ్గర స్పృహతప్పింది ఎవరు? ఎందుకు అలా జరిగింది?

ఉ. అవ్వను ఎవరు కాపాడారు? ఎలా కాపాడారు?

ఊ. గుడిగంటలు ఎందుకు మోగాయి?

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానం రాయండి.**

అ. పాఠంలో కవి ఎవరినిగురించి పెద్దమనుషులని చెబుతున్నారు? వాళ్ళు ఎలాంటివాళ్ళు?

ఆ. పాఠంలోని ముఖ్యభావం ఏమిటి?

ఇ. ఈ పాఠానికి 'మ్రోగిన గంటలు' అనే పేరుకు బదులుగా ఇంకా ఏ పేరు పెట్టవచ్చు? ఎందుకు?

ఈ. గుడిగంటలు ఎందుకు మోగలేదు?

ఉ. ముసలామె ఎలా ఉంది? ఆమె గుడిదగ్గర ఎందుకు ఉంది?

ఊ. గుడిలో గంటలు ఎప్పుడెప్పుడు మోగుతాయని కవి భావించారు?

ఎ. గేయకథ ఏడో భాగంలో కవి, 'జనుల భావములు మారెను – స్వార్థపరత మితిమీరెను' అనడంలో ఉద్దేశమేమిటి?

ఏ. గుడిగంటలు నిరంతరం మోగాలంటే ప్రజలు ఎలా మారాలి? ఏమేం జరగాలి? ఊహించి రాయండి.

**2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.**

అ. "మ్రోగిన గంటలు " గేయంపై మీ అభిప్రాయం ఏమిటి? ఈ గేయంద్వారా మనుషులను గురించి వాళ్ళలో వచ్చిన మార్పు గురించి ఏం చెప్పాలని కవి ప్రయత్నించారు?

ఆ. ఈ గేయకథ రాసిన విధం ఎలా ఉంది. సులభంగానా? కష్టంగానా? మధురంగానా? ఎందుకో వివరించండి.

ఇ. పాఠాన్ని కథలాగా సొంతమాటల్లో రాయండి.

© SCERT not to be republished

## IV. పదజాలం

1. కింది వాక్యాలలో గీత గీసిన పదాల స్థానంలో వాటి అర్థాలను తెలిపే మాటలను రాసి వాక్యాన్ని మళ్ళా రాయండి.

    అ. హిమాలయ గిరులు మంచుతో కప్పి ఉంటాయి.

    ఆ. <u>సత్ప్రవర్తన</u>వల్ల జనానికి మేలు జరుగుతుంది.

    ఇ. ఆహారం మితిమీరి తింటే <u>అనారోగ్యం</u> పాలవుతారు.

    ఈ. పేదలమీద ధనవంతులు <u>కృప</u> చూపాలి.

    ఉ. వెంకటయ్యగారి ఇంటిల్లిపాదీ వారానికొకసారి కోవెలకు వెళతారు.

2. కాయం–గాయం, మాట–నోట, ఇవి ప్రాసపదాలు

    ఇలాంటి ప్రాసపదాలు మరి కొన్ని రాయండి.

    ------ ------ ------ ------ --------

3. గుడికి సంబంధించిన కొన్ని పదాలు రాయండి:

ఉదా : పూజారి ----- ----- ----- -------

4. కింది పదాలతో సొంత వాక్యాలు రాయండి.

    అ) చెడు మెదళ్ళు ఆ) కోరికలు ఇ) చైతన్యం ఈ) స్వార్థపరత

    ఉ) జయజయ నాదాలు

5. గంటలు <u>గణ గణ</u> మోగాయి. గణ గణ అనేది ధ్వన్యనుకరణ పదం. ఇలాంటి ధ్వన్యనుకరణ పదాలు మరికొన్ని రాయండి. వాటితో వాక్యాలు రాయండి.

6. తండోపతండాలు – ఇది ఒక జాతీయం. దీన్ని ఏ ఏ సందర్భాలలో వాడతారో రాయండి.

## V. సృజనాత్మకత



1. గేయంలోని మొదటి రెండు భాగాలు చదవండి. వాటికనుగుణంగా చిత్రం గీయండి. రంగులు వేయండి. చిత్రానికి పేరు పెట్టండి. ప్రదర్శించండి.

2. "మానవసేవే మాధవసేవ" అన్న అంశంమీద మరొక కథ రాయండి. గోడపత్రికలో ప్రదర్శించండి

3. జట్టుపని : – గేయంలో "దేవుని మనుజులు మరిచిరి, జనుల భావములు మారెను, స్వార్థపరత మితిమీరెను, చైతన్యము చల్లారెను. ఇలాంటి వాక్యాలు. ఉన్నాయి కదా! మానవత్వం, సమానత్వం, సోదరభావం, మరచిరి, మారెను, మితిమీరెను, అణగారెను, చైతన్యం, ఇలాంటి పదాలను ఉపయోగించి నేటి పరిస్థితులకు అనుగుణంగా కవితనుగాని లేదా గేయాన్నిగాని రాయండి. ప్రదర్శించండి.

© SCERT not to be republished

## VI. ప్రశంస



1. ఇతర భాషల ఉపాధ్యాయులను / మిత్రులను అడిగి కొన్ని చిన్న గేయాలను తెలుసుకోండి. వాటిని లయబద్ధంగా చదవండి. వాటి సారాంశాన్ని రాయండి.
2. దయ, కరుణ, జాలి, మొదలయిన పదాలకు తగిన ఆంగ్ల, హిందీ పదాలను గుర్తించండి. వాటిని నేర్చుకోండి.
3. "మానవసేవే మాధవసేవ" లాంటి అర్థం వచ్చే ఇతర భాషా సూక్తులను సేకరించండి. గోడపత్రికలో ప్రదర్శించండి.

## VII. ప్రాజెక్టు పని



1. పాఠంలో గుడిగంటలు మోగిన సందర్భం ఒక వింత. అలాంటి వింతలను కొన్నింటిని వార్తాపత్రికలనుంచి సేకరించండి. వాటిలోని విశేషాలను గోడపత్రికలో ప్రదర్శించండి.
2. మానవత, దయ, కరుణ కలిగిన గేయాలను, కథలను సేకరించండి. ఆల్బమ్‌గా తయారుచేయండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**1. ఈ కింది పదాలను విడదీయండి.**

ఉదా॥ (అ) ఏమంటివి = ఏమి + అంటివి = (ఇ + అ = అ)
పాతకాలపు పద్యభాషలో సంధి జరగనప్పుడు యకారం ఆగమంగా వస్తుంది.
(ఆ) ఏమియంటివి = ఏమి + య్ + అంటివి = (ఇ + అ = య)
సంధి జరిగినపుడు

(అ) వచ్చిరిపుడు = ................ + ........ = .................
(ఆ) వచ్చిరియిపుడు = .... + ........ + ........ = .................

పై సంధుల్లో హ్రస్వ 'ఇ' కారానికి 'అచ్చు' కలిసినపుడు సంధి జరిగింది. దీన్ని **'ఇత్వ సంధి'** అంటారు. ఇది తప్పక జరగాలన్న నియమం లేదు. జరగవచ్చు, జరగకపోవచ్చు. వ్యాకరణంలో ఈ పరిస్థితిని 'వైకల్పికం' అంటారు.

**2. ఈ కింది పదాలను విడదీయండి.**

ఉదా: ఏమంటివి = ఏమి + అంటివి = (మ్ +) అ + అ = మ
(అ) కోవెలలోకేగినారు = ..........................
(ఆ) పైకెత్తినారు = ..........................
(ఇ) మనిషన్నవాడు = ..........................

ఈ కింది పదాలను కలపండి. మార్పును గమనించండి.

ఉదా: ఏమి + అన్నారు = (మ్ +) అ + అ = మ

© SCERT not to be republished

1. అది + ఎట్లా = .............. = ..........
2. అతనికి + అందదు = .............. = ..........
3. మరి + ఎలా = .............. = ..........
4. ఎవరి + ఇల్లు = .............. = ..........
5. ఇది + అంతా = .............. = ..........

**3. మీ పాఠంలోని ఇత్వసంధి పదాలను గుర్తించి విడదీయండి.**

**4. కింది పదాలను విడదీయండి.**

ఉదా: రాముడతడు = రాముడు + అతడు = (డ్ +) ఉ + అ = డ

అ. అతడెక్కడ = ................... = ...................
ఆ. మనమున్నాము = ................... = ...................
ఇ. మనసైన = ................... = ...................
ఈ. ఎవరిచ్చారు = ................... = ...................

హ్రస్వ 'ఉ' కారానికి (ఉత్తు' కు) అచ్చు కలిసినప్పుడు, ఉకారం లోపించి, పరస్వరం కనిపిస్తుంది. దీన్నే **"ఉత్వసంధి"** అంటారు.

**'ఉత్తు'** కు 'అచ్చు' పరమైనపుడు సంధి నిత్యం. ('నిత్యం' అంటే తప్పక జరుగుతుంది అని అర్థం).

**5. ఈ కింది పదాలను కలిపి, మార్పును చర్చించండి.**

ఉదా: ఏనాడు + ఏ శిల్పి = (డ్ +) ఉ + ఏ = డే = ఏనాడేశిల్పి

అ. గోపురము + అట = ................. = ....... = ...........
ఆ. మ్రోగును + అంట = ................. = ....... = ...........
ఇ. కొనసాగవు + ఇపుడు = ................. = ....... = ...........
ఈ. మలినము + ఐన = ................. = ....... = ...........
ఉ. లంచములు + ఇచ్చిరి = ................. = ....... = ...........



**నేనివి చేయగలనా ?**

| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగంతో, అభినయంతో పాడగలను. | ఔను / కాదు |
| 2. | గేయకథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | గేయంలోని భావాన్ని అర్థంచేసుకున్నాను. వివరించగలను. | ఔను / కాదు |
| 4. | గేయంలోని పదాలు, ప్రాసపదాలతో వాక్యాలు రాయగలను. | ఔను / కాదు |
| 5. | గేయంలోని భావానికి అనుగుణంగా సొంతంగా కవిత / గేయం రాయగలను. | ఔను / కాదు |

**"ఓర్పును మించిన గొప్ప ప్రార్థన మరొకటి లేదు" - గౌతమ బుద్ధుడు.**

©SCERT not to be republished

రెండో
యూనిట్

# 7. క్రీడావార్త

### ఆలోచించండి - మాట్లాడండి :




### ప్రశ్నలు :

1. పై చిత్రంలో పిల్లలు ఏం చేస్తున్నారు ?
2. పిల్లలు అంత ఆసక్తిగా చదివే / చూసే అంశం ఏమై ఉంటుంది.?
3. 2 ఏప్రిల్ 2011 క్రీడారంగంలో భారతదేశానికి గుర్తుండే రోజు. ఆ రోజు ఏం జరిగిందో ఎవరైనా చెప్పగలరా?

### నేపథ్యం :

కిందటి రోజు జరిగిన విషయాలను ప్రజలందరికీ ఆసక్తికరంగా చెప్పేవి దినపత్రికలు. వీటిలో రాజకీయ, వ్యాపార, క్రీడా, విద్యా వార్తల వంటివి చాలా ఉంటాయి. ఎన్నో అంతర్జాతీయ, జాతీయ, స్థానిక విషయాలు దినపత్రికలను చదివి తెలుసుకోవచ్చు.

భారతదేశం క్రికెట్‌లో 'ప్రపంచ కప్పు' గెల్చిన వార్తను ఏ పత్రిక ఎలా రాసిందో చూద్దాం!

### విద్యార్థులకు సూచనలు :

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.

పాఠశాలలో పిల్లలందరూ జట్లుగా ఏర్పడి వార్తాపత్రికలు చదువుతున్నారు.

ఒక జట్టువారు ఒక వార్తాపత్రికలో కింది వార్తను చదువుతున్నారు.

* ప్రపంచకప్ విజేత టీమిండియా    * ఫైనల్లో ఆరు వికెట్లతో లంకపై జయభేరి

* అదరగొట్టిన గంభీర్, మహీ    * భారత్ ఖాతాలో రెండో ప్రపంచ కప్

## సొంతగడ్డపై కప్ నెగ్గి ధోనీ సేన రికార్డు

ఛేదించాల్సింది 275 పరుగుల లక్ష్యాన్ని... ఇన్నింగ్స్ రెండో బంతికే వీరేంద్రుడు అవుట్... స్టేడియం మూగబోయింది!...మరి కాస్సేపటికే బ్యాటింగ్ మాస్ట్రో సచిన్ కూడా అవుట్....అభిమానులు నిశ్చేష్టులయ్యారు... కప్పు, చేజార్చుకోవాల్సిందేనా... అన్న బాధ నరాలు పిండేస్తుండగా అచేతనులే అయ్యారు. ఆరు ఓవర్లు ముగిసేసరికి ఓపెనర్లు పెవిలియన్‌లో.. బరిలో ఉంది గంభీర్, కోహ్లీ... ఆశలన్నీ వారిపైనే.. వరల్డ్ లాంగెస్ట్ రివర్ నైల్ కూడా ఓ చిరు ప్రవాహంలా మొదలైనట్టే.. లక్ష్యసాధనలో ఒకట్లు, రెండ్లు, ఫోర్లు నెమ్మదిగా జాలువారడం మొదలెట్టాయి.. బిరాబిరా ఉరుకుతూ.. పొంగుతూ, పొర్లుతూ...సెలయేరులా పరవళ్లెత్తాయి.. వరదగోదారల్లే లంక సింహాలను ముంచెత్తాయి. ఇంతలో మళ్లీ ఓ ఉపద్రవం! కోహ్లీ నిష్క్రమణ! ధోనీ జతగా గంభీర్ సాగించిన ప్రస్థానం పెనుతుఫానే! ఈ జోడీని అవుట్ చేసే దారిలేక... గట్టెక్కించే నాథుడు కానరాక సంగక్కర సేన ఉక్కిరిబిక్కిరైంది! స్పిన్ అస్త్రాలు (మురళీధరన్, రణ్‌దివ్) పేస్ శస్త్రాలు (మలింగ, పెరెరా, కులశేఖర)... అన్నీ తుస్! ఓ మూడు వికెట్లు పడగొట్టామన్న చిరు జోష్! భారత బ్యాట్స్‌మెన్ సృష్టించిన పరుగుల హోరు లంకేయుల చెవులు గింగిర్లెత్తిస్తుండగానే, జయహో...భారత్ అంటూ ముందస్తు విజయధ్వానాలు మిన్నంటాయి. మరికాసేపట్లో తప్పని ఓటమి వెక్కిరిస్తుండగా.. లంక సింహాలు దిక్కుతోచక చేసిన ఆర్తరోదనలు దిక్కులేని ఆక్రందనల్లా మిగిలిపోయాయి. ఇక మిగిలింది 60 బంతులు... భారత్ గెలుపుకు కావాల్సింది 54 పరుగులు... సెంచరీ గడప తొక్కకుండానే గంభీర్ అవుట్! అయినా పరిస్థితి భారత్ అదుపులోనే ఉంది! ధోనీ జతగా యువరాజ్! మన ఇన్నింగ్స్‌లో మొదటి సిక్స్ నమోదైంది.....ఈ దశలోనే ...చెప్పాపెట్టకుండా బద్దలయ్యే వెసువియస్ అగ్నిపర్వతంలా ధోనీ ఆడిన ప్రళయ భీకర ఇన్నింగ్స్‌తో... లంక శిబిరంలో ఆందోళన హెచ్చింది! ఇక సీట్లలో కూర్చోవడం మావల్ల కాదంటూ వీక్షకులు మునివేళ్లపై నిలబడిన వేళ... భారత్‌కు 24 బంతుల్లో 27 పరుగులు కావాలి! రెండు బంతుల్లో రెండు ఫోర్లు...'ఫ్యాన్స్ ఇంతకంటే ఇంకేం కావాలి' అని ధోనీ హామీ ఇస్తున్నట్టుగా చితకబాదాడు. చేయాల్సింది 18 బంతుల్లో 16 పరుగులు... మళ్లీ ధోనీయే... వరుస బంతుల్లో బౌండరీలు! కెవ్వు కేక...! లంక ఓడి భారత్ గెలవాలంటే ...12 బంతుల్లో ఐదు పరుగులు. క్రీజులో ఉంది మళ్లీ ధోనీయే... బౌలర్ కులశేఖర... బంతి పడింది... అంతే ధోనీ కొట్టాడూ... సి...క్స్! బ్రహ్మాండం బద్దలైంది! భారత్ కల నెరవేరింది! కప్పు కైవసం అయింది! ఆటగాళ్ల ముఖాల్లో ఆనందబాష్పాలు పెల్లుబికాయి! భారత వినీలాకాశం బాణాసంచా మెరుపులతో దేదీప్యమానమైంది! థ్యాంక్యూ టీమిండియా....థాంక్యూ ధోనీ ..థాంక్యూ గంభీర్.....థాంక్యూ కోహ్లీ, యువీ అని అభిమానుల హృదయాల్లో కృతజ్ఞతాభావం ఉప్పొంగింది!

**ముంబయి:** 28 ఏళ్ల నిరీక్షణ ముగిసింది! ప్రపంచ క్రికెట్లో భారత కీర్తిపతాక సగర్వంగా రెపరెపలాడింది! అభిమానుల హృదయాల్లో శతకోటి వీణలు మీటుతూ ...భారత్ ప్రపంచ కప్ గెలిచింది! పదో ప్రపంచ కప్ చివరాఖరి కదనక్షేత్రంలో లంక సింహాలు తోకముడిచాయి... విషణ్ణ వదనాలతో ఇంటిముఖం పట్టాయి! నిలకడే తారకమంత్రంలా జపిస్తూ ధోనీ సైనికులు జగజ్జేతలయ్యారు. గ్రాండ్‌గా సాగిన ఉత్కంఠభరిత మహాసంగ్రామంలో 6 వికెట్లతో శ్రీలంకను చిత్తుచేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన సంగక్కర సేన మహేల జయవర్ధనే (103) సెంచరీ చలవతో నిర్ణీత ఓవర్లలో ఆరు

©SCERT not to be republished

వికెట్లకు 274 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో టీమిండియా క్రికెటర్లు అదరగొట్టారు. సచిన్ (18), సెహ్వాగ్ (0)లు నిరాశపరిచినా... ఉక్కుసంకల్పంతోడుగా భారత్ విజయగీతం ఆలపించింది. గెలుపు ఆశలకు ఊపిరిలూదిన గంభీర్ (97), సహకరించిన కోహ్లీ (35) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును విజయతీరాలకు చేర్చిన **'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'** ధోనీ (91 నాటౌట్) మరో వికెట్ పడకుండా జాగ్రత్త వహించిన **'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'** యువరాజ్‌సింగ్ (21నాటౌట్)... అండతో భారత్ మరో పది బంతులుండగానే ఆరు వికెట్లతో కప్పు గెలిచింది. ఈ చిరస్మరణీయ ఘట్టంతో 1983లో లార్డ్స్ ప్రదర్శన తర్వాత మళ్లీ ఆసేతు హిమాచలం రాగరంజితమైన వేళ... ధోనీసేన సాధించిన అపూర్వవిజయాన్ని తిలకించి యావద్భారతం పులకించిపోయింది! వాంఖడే సాక్షిగా చరిత్రలో మరో సువర్ణాధ్యాయం మొదలైంది! ఎవరన్నారు, ఆతిథ్య జట్టుకు వరల్డ్‌కప్ దక్కదని? సొంతగడ్డపై వరల్డ్‌కప్ నెగ్గిన తొలిజట్టుగా టీంఇండియా రికార్డు పుటలకెక్కింది. ఇక ఈ విక్టరీతో కపిల్‌దేవ్ సరసన చేరిన జార్ఖండ్ చిన్నోడు మన మహేంద్రుడు ఆరువేల పరుగుల క్లబ్‌లోనూ కాలు పెట్టాడు. గంభీర్ కూడా 4000 పరుగుల క్లబ్‌లో స్థానం దక్కించుకున్నాడు.

**మలింగ షాక్ తట్టుకుని...** పరుగుల వేటలో భారత్‌కు ఆదిలోనే షాక్! ఇన్నింగ్స్ తొలి ఓవర్ రెండో బంతికే మలింగ... సెహ్వాగ్‌ను బలిగొన్నాడు. ఈ దెబ్బనుండి తేరుకొనే లోపే టీంఇండియాకు మరో ఎదురుదెబ్బ! రెండుఫోర్లు కొట్టి ఊపుమీద ఉన్న మాస్టర్ కూడా వెనుదిరిగాడు. ఈ వికెట్ కూడా మలింగ ఖాతాలోకే. ప్రపంచకప్ ఫైనల్‌లో సెంచరీ చేసి సొంతగడ్డపై మధురానుభూతుల్ని సొంతం చేసుకుందామనుకున్న మాస్టర్‌కు నిరాశే! సచిన్ చెలరేగుతుంటే చూసి తరిద్దామనుకున్న ఫ్యాన్స్‌కు తీవ్ర నిరాశ. అయితే గంభీర్, కోహ్లీలు ఆదుకున్నారు.

**గంభీర్ మొనగాడి ఇన్నింగ్స్ :** 31 పరుగులకే రెండు వికెట్లు...! ఇలాంటి స్థితి నుండి భారత్ సురక్షిత స్థితికి చేరిందంటే నిస్సందేహంగా ఢిల్లీ డాషింగ్ లెఫ్ట్ హ్యాండర్ గంభీర్ చలవే! లంక బౌలర్లను చితక్కొడుతూ, మ్యాచ్‌ను వారినుంచి దూరం చేశాడు. ఈ క్రమంలో గంభీర్ బ్యాట్ నుంచి తిరుగులేని కట్‌షాట్లు జాలువారాయి. క్రమం తప్పకుండా ఫోర్లు బాదడంతో సంగక్కర బృందంపై భారత్ ఆధిపత్యం ఏ దశలోనూ తగ్గలేదు. సెన్సేషనల్ ఆటగాడు కోహ్లీ జతగా మూడో వికెట్‌కు 83... సారథి ధోనీ జతగా నాల్గో వికెట్‌కు 109 పరుగులు జోడించడంతోనే భారత్ గెలుపు ఖాయమైంది. ప్రత్యర్థి బౌలర్లకు కొరకరాని కొయ్యగా పరిణమించిన గంభీర్ సెంచరీ ముంగిట బౌల్డయ్యాడు.

**కెప్టెన్ అంటే ఇలా ఉండాలంటూ...!** దూసుకొస్తున్న ట్రక్కుకు రొమ్ము ఎదురొడ్డి నిలిచే వాళ్లే తనకు కావాలంటూ అడిగి మరీ జట్టును ఎంపిక చేసుకున్న కెప్టెన్ ధోనీ... గ్రాండ్ ఫైనల్లో దుమ్మురేపాడు! దమ్ము చూపాడు. సారథి అంటే ఎలా స్ఫూర్తి దాయకంగా నిలవాలో... లంక చేతినుంచి మ్యాచ్ దూరం చేసి సగర్వంగా నిరూపించాడు. మురళీ, మలింగ... వీళ్లా తనను అవుట్ చేసేది అన్నట్టుగా ధోనీ సాగించిన విధ్వంసకాండ... మరికొన్ని బంతులుంటే సెంచరీతో ముగిసేదేమో!

**మహేల సూపర్ శతకం:** లంక భారీ స్కోర్ సాధించడంలో మహేలదే ప్రధానపాత్ర. సెంచరీ సాధించడంతో పాటు విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పి జట్టుకు మూలస్తంభంలా నిలిచాడు. దిల్షాన్ అవుటవడంతో బరిలోకి దిగిన మహేల సింగిల్స్ తీస్తూ చెత్త బంతులను బౌండరీలు దాటిస్తూ 49 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. బ్యాటింగ్ పవర్‌ప్లేలో జహీర్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాదడంతో కెరీర్‌లో 13వ సెంచరీ మహేల ఖాతాలో చేరింది.

**ఆఖర్లో జహీర్ విలవిల... లంక కళ కళ:** 5-3-6-1... ఇవీ తొలి పది ఓవర్లు పూర్తయ్యేసరికి జహీర్ గణాంకాలు. అయితే లంక 45వ ఓవర్లో బ్యాటింగ్ పవర్ ప్లే తీసుకోవడంతో జహీర్‌కు కష్టకాలం మొదలైంది. మూడవ పవర్‌ప్లేలో మొత్తం మూడు ఓవర్లు విసిరిన జహీర్ 44 పరుగులు సమర్పించుకున్నాడంటే అర్థం అవుతుంది. లంక బ్యాట్స్‌మన్ ఎంతలా విజృంభించారో!

© SCERT not to be republished


ఇంకొక జట్టు పిల్లలు మరొక వార్తాపత్రికలో సంపాదకీయం చదువుతున్నారు.

## 28 ఏళ్ల కల సాకారమైన మహోన్నత ఘడియ. జాతి జనులకు ఇది అపురూప కానుక

## టీమ్ ఇండియా... అజేయశక్తి!



నాడు వానరసేన లంకనెలా ముట్టడించిందో ఏమో... రామ పట్టాభిషేకం ఎంత వైభవంగా జరిగిందో ఏమో... అసలు నాడు లంక ఉందో లేదో... గాని శనివారం మాత్రం....ధోనీసేన లంకకు లంఘించింది! వాంఖడే వారధిగా....ప్రపంచ కప్‌ను సాధించింది....28 ఏళ్లుగా యావద్దేశాన్ని ఊరిస్తున్న వన్డే వరల్డ్ కప్‌ను గెల్చుకొచ్చింది! ఫైనల్ అగ్నిపరీక్షను పాసై.... 'క్రికెట్ దేవుడి' కిచ్చిన 'మొక్కు' తీర్చుకుంది! 'కప్పులో' జీవితకాల 'నైవేద్యం' సమర్పించుకుంది! ఇక కొన్నాళ్ళపాటు దేశంలో క్రికెట్ బ్రహ్మోత్సవాలే!





### సంపాదకీయం

జూలు విదిల్చిన సింహానికి, మదకరీంద్రానికి మధ్య మహా భీకర పోరుకు ముంబయి, వాంఖడే మైదానం నిన్న ప్రత్యక్ష సాక్షిగా నిలిచింది. పసికూనలం కాదు, తమది అసలు సిసలు కసిజట్టని సమరనాదం చేసిన సంగక్కర బృందం మెడలు వంచి ధోనీ సేన సాగించిన విక్రమ ప్రదర్శనతో యావత్ భారత క్రీడాజగతీ హసన్మందారమైంది! పరిమిత ఓవర్ల క్రికెట్ ప్రపంచకప్ తుది సమరానికి ఈసారి అర్హత సాధించిన రెండూ ఆసియా జట్లే కావడం పోటీ ఆరంభానికి ముందే అమిత ఉత్కంఠ రగిలించింది.



ఉపఖండానికి చెందిన రెండు హేమాహేమీ జట్లు మొట్టమొదటిసారి ప్రపంచకప్ ఫైనల్ సమరాంగణంలో తలపడితే హోరాహోరీ తథ్యమన్న ముందస్తు అంచనాలు అక్షరాలా నిజమయ్యాయి. తొలుత బ్యాటింగ్ చేసి లంకేయులు నిర్దేశించిన 275 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో మహేంద్రసింగ్ ధోనీ బృందం కలిసికట్టుగా రాణించింది. 28 ఏళ్ల క్రితం లార్డ్స్ మైదానంలో వెస్టిండీస్‌పై చరిత్రాత్మక విజయం దరిమిలా ఇప్పటి ఈ మధుర ఘట్టంకోసం కోట్లాది అభిమానులు కళ్ళు కాయలు కాచేలా నిరీక్షించాల్సి వచ్చింది. సుదీర్ఘ నిరీక్షణకు మేలిమి ఫలశ్రుతిగా నిన్నటి ఉద్విగ్నభరితమయిన పోటీని టీవీల్లో సొంతం ఆస్వాదించిన అభిమానుల సంఖ్య వందకోట్లకు మించిందని అంచనా. వరుసగా ముమ్మార్లు విశ్వవిజేతగా ఆవిర్భవించడంతో పాటు మొత్తం నాలుగు పర్యాయాలు ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియాను ఈ ప్రపంచకప్ పోటీల క్వార్టర్స్ దశలోనే ఇండియా ఇంటిముఖం పట్టించింది. తరవాతి అంచెలో సమ ఉజ్జీ పాక్ జట్టును మట్టికరిపించింది, అదే ఊపుతో లంకపై సత్తా చాటిన భారత జట్టుమీద నేడు అభినందనల పూలవాన కురుస్తోంది. చరిత్రను తిరగరాసిన ధోనీసేన విజృంభణతో, ఇప్పుడిది భారత క్రికెట్ రంగానికే నూతన యుగాది!





©SCERT not to be republished






# కప్ మనదే

మరికొంత మంది పిల్లలు ఇంకొక వార్తాపత్రికలోని శీర్షికలను, వార్తను చదువుతున్నారు.





- **విశ్వవిజేత భారత్**
- **రెండోసారి ప్రపంచకప్ కైవసం**
- **గర్జించిన పులిబిడ్డలు**
- **నెరవేరిన మాస్టర్ చిరకాలవాంఛ**
- **6 వికెట్ల తేడాతో శ్రీలంకపై గెలుపు**
- **28 ఏళ్లకు ఫలించిన కల**
- **ధోనీసేనకే కీర్తి కిరీటం**
- **చరిత్ర తిరగరాసిన యువసేన**



28 సంవత్సరాల భారత్ నిరీక్షణ ఫలించింది. ఎట్టకేలకు ధోనీ సారథ్యంలోని భారత్ క్రికెట్ జట్టు విశ్వకప్‌ను సొంతం చేసుకుని యావత్ జాతి ఆశలను పండించింది. ముంబయిలో శనివారం జరిగిన ఫైనల్స్‌లో భారత్ జట్టు అందరి అంచనాలకు అనుగుణంగా రాణించి సొంతగడ్డమీద కప్‌ను అందుకోగలిగింది. అలాగే వందవ సెంచరీ చేస్తాడని కలలు కన్న మాస్టర్ బ్యాట్స్‌మన్ స్వల్పస్కోరుకే తన సొంత మైదానంలో విఫలమైనప్పటికీ, అతడి చిరకాల స్వప్నాన్ని ధోనీ ఫలించేలా చేశాడు. ఆరంభంలో బంగ్లాదేశ్‌పై బ్రహ్మాండమైన బ్యాటింగ్‌తో చెలరేగి విజయాన్ని సొంతం చేసుకుని ఈ టోర్నమెంట్‌లో శుభారంభం చేసుకున్న భారత్.. మధ్యలో కొన్ని మ్యాచ్‌ల్లో పేలవమైన ప్రదర్శనతో నిరాశపరిచినా.... కీలకమైన క్వార్టర్ ఫైనల్, పాకిస్థాన్‌తో హై ఓల్టేజీ మ్యాచ్‌ను, ఇప్పుడు టైటిల్‌లో పోరులో లంకను చిత్తుచేసి రెండో దఫా ఈ ప్రతిష్ఠాకరమైన ట్రోఫీని దక్కించుకోగలిగింది. సంవత్సరాలుగా యావత్ దేశ క్రికెట్ అభిమానులు ఈ కప్ కోసం ఎంతగానో ఎదురుచూశారు. మరెన్నో కలలు కన్నారు. జట్టు ఆడితే ప్రశంసించారు. వెంట ఉండి నినాదాలతో ప్రోత్సాహించారు. 1983 కప్ గెలుచుకుని వచ్చినప్పుడు ముంబై వీధుల్లో భారీ ర్యాలీని నిర్వహించారు. ఆడకుండా లీగ్ దశలోనే నిష్క్రమించినపుడు ఎండగట్టారు. దాడికికూడా ఏమాత్రం సందేహం లేదు. అందరికీ అన్నీ కలిసిరావు. ఆడితే లక్ ఉండదు. లక్ ఉంటే ఆట ఉండదు. ఈ కప్‌కోసం ఇన్ని సంవత్సరాలుగా ఎందరో కెప్టెన్‌లు ఎదురుచూపులు చూశారు. కానీ వారెవ్వరికీ అందలేదు. అందరి ఆశలను సఫలం చేస్తూ, ఇన్నాళ్ళ ఎదురుచూపుల్లో సంతోషాన్ని నింపుతూ ఈ కప్‌ను తన ఆరేళ్ల కెప్టెన్సీలోనే అందుకోగలిగాడు.












© SCERT not to be republished










## I. వినడం-మాట్లాడడం



1. మీ బడిలో ప్రార్థన సమయంలో వార్తలు చదువుతారా? వాళ్ళు వార్తలు చదివే విధానం ఎలా ఉంది? అవి ఏ రకంగా చదివితే బాగుంటుందని మీరు అనుకుంటున్నారు?
2. వార్తాపత్రికలో మీరు మొదటగా చదివే విషయాలు ఏవి? దేని తర్వాత ఏది చదువుతారు? ఎందుకు?
3. రేడియోలోగాని, దూరదర్శన్‌లోగాని వార్తలు వినండి. అవే వార్తలు వార్తాపత్రికలో కూడా ఉన్నాయా? వాటికోసం వెతకండి. ప్రసార మాధ్యమాలలోని వార్తలకు, వార్తాపత్రికలోని వార్తలకు మధ్య తేడాలు ఏమిటో చెప్పండి.
4. మీరు ఎప్పుడైనా క్రికెట్, హాకీ లేదా ఇంకేదైనా ఆట రేడియోలో ప్రత్యక్ష వాఖ్యానం (కామెంటరీ) విన్నారా? అలాగే దూరదర్శన్‌లో కూడా! ఈ రెండింటి మధ్య జరిగే ప్రత్యక్ష వ్యాఖ్యానంలోని తేడాలను చెప్పండి.
5. ఏదైనా ఒక వార్తాపత్రికను తీసుకొని దానిలోని వార్తలు చదివి మీ మిత్రులకు వినిపించండి. మీరు చదివిన తీరును గురించి మిత్రులు ఏమన్నారు? మీ తరగతిలో ఎవరు వార్తలు బాగా చదువుతారు? ఎందుకు?
6. దూరదర్శన్‌లోని యాంకర్లు తెలుగు మాట్లాడతారు కదా, వీరు మాట్లాడే తెలుగుకు, మీ బడిలోని తెలుగు ఉపాధ్యాయుడు మాట్లాడే తెలుగు భాషకు మధ్య తేడా ఏమిటి? సాధారణంగా యాంకర్లు తెలుగులో మాట్లాడే విధానం గురించి బాగా తెలుగు మాట్లాడేవారు ఏమంటారో తెలుసుకొని చెప్పండి.

## II. చదవడం - రాయడం



**1. కరపత్రం చదివి కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

| ఐ.సి.సి. క్రికెట్ ప్రపంచకప్ 2011 | | |
|---|---|---|
| నిర్వహణ తేది | = | 18 ఫిబ్రవరి నుండి 2 ఏప్రిల్ |
| నిర్వాహకులు | = | అంతర్జాతీయ క్రికెట్ సమాఖ్య |
| క్రికెట్ ఫార్మాట్ | = | ఒకరోజు అంతర్జాతీయస్థాయి క్రికెట్ |
| టోర్నమెంట్ ఫార్మాట్ | = | రౌండ్ రాబిన్ అండ్ నాక్ ఔట్ |
| ఆతిథ్యదేశాలు | = | భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ |
| విజేత | = | ఇండియా ( రెండోసారి) |
| పోటీలో పాల్గొన్న దేశాలు | = | 14 దేశాలు (104 సభ్యదేశాలనుంచి) |
| ఫైనల్ మ్యాచ్ జరిగిన స్థలం | = | వాంఖడే స్టేడియం, ముంబాయి, భారతదేశం. |
| మ్యాన్ ఆఫ్ ద సిరీస్ | = | యువరాజ్ సింగ్ (భారత్) |
| అత్యధిక పరుగులు | = | తిలక్‌రత్నే దిల్షాన్ (500) |
| అత్యధిక వికెట్లు | = | షాహిద్ అఫ్రిది (8 ఆటలలో 21 వికెట్లు) |
| జహీర్‌ఖాన్ (9 ఆటలలో 21 వికెట్లు) | | |
| గతంలో ప్రపంచకప్ జరిగిన సం॥ 2007. తరవాత జరగబోయే సం... 2015 | | |

© SCERT not to be republished





అ. ప్రపంచ కప్ నిర్వాహకులు ఎవరు?

ఆ. ఆతిథ్య దేశాలు ఏవి?

ఇ. పోటీలో ఎన్ని దేశాలవారు పాల్గొన్నారు?

ఈ. ప్రపంచ కప్ ఎన్ని సంవత్సరాల కొకసారి జరుగుతుంది?

ఉ. ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్ ఎక్కడ జరిగింది?

**2. పాఠంలోని సంపాదకీయానికి చెందిన పేరాను చదవండి. దాన్ని మీ సొంత మాటల్లో చెప్పండి.**

**3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. భారత్ ప్రపంచకప్ గెలవడం గురించి పత్రికలు ఏ ఏ శీర్షికలు పెట్టాయి.

ఆ ప్రపంచ క్రికెట్ కప్ తుది పోరులో భారత్ తరఫున బాగా ఆడినవారు ఎవరు?

ఇ. అలాగే శ్రీలంక పక్షాన బాగా ఆడినవారు ఎవరు?

ఈ. క్రికెట్ ఆటలో రన్స్ చేయడాన్ని తెలుగులో పరుగులు అంటారు కదా! ఈ పరుగులను ఏ ఏ పదాలతో వర్ణించారు.

**ఉదా:** పరుగుల హోరు

## III. స్వీయరచన



**సూచన:**

**కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

1. దినపత్రికలలో క్రీడావార్తలతోపాటు ఇంకా ఏ ఏ రకాల వార్తలు ఉంటాయి.
2. పాఠంలోని కొన్ని వార్తాపత్రికల్లో వచ్చిన క్రీడావార్తలను చదివారు కదా! మిమ్మల్ని ఏ వార్త బాగా ఆకట్టుకుంది. ఎందుకు?
3. ప్రపంచ కప్ గెలిచిన రోజున దేశంలో ఆనందం మిన్ను ముట్టింది. ఆ రోజు ఏ విధంగా సంబరాలు జరుపుకొని ఉంటారు?
4. మీరే ఒకవేళ గెలిచిన జట్టును కలుసుకుంటే ఆటగాళ్ళతో ఏం మాట్లాడతారు? ఎలా అభినందిస్తారు?
5. ఏ ఆటలోనైనా గెలుపోటములు సహజం. ఐతే గెలిచినవారు ఓడిన వారితో ఎలా ప్రవర్తించాలి?
6. ఆటల ద్వారా మనకు కలిగే ప్రయోజనాలు ఏమిటి? మనం ఆటలనుంచి నేర్చుకోవలసిన అంశాలు ఏమిటి?
7. ఒక్కోసారి ఆటల్లో గెలుపొందినప్పుడు ఆటగాళ్ళను గురించి ఆకాశానికి ఎత్తేస్తారు. ఓడినప్పుడు అదే ఆటగాళ్ళను గురించి చులకనగా వార్తలు రాస్తారు. దీనిపై మీ అభిప్రాయాలు చెప్పండి.
8. వార్తాపత్రికల్లో వచ్చే క్రీడావార్తలు గురించి మీ అభిప్రాయాలు చెప్పండి. అంటే వార్తా పత్రికల్లో వచ్చే వార్తల అంశాలన్నీ వాస్తవాలేనా? ఎందుకు? కారణాలు రాయండి.



©SCERT not to be republished






### వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

1. వార్తాపత్రికలవల్ల కలిగే ప్రయోజనాలను వివరించండి.
2. వార్తాపత్రికల్లో ఉండే శీర్షికల గురించి వాటిలో వినియోగించే భాష గురించి మీ అభిప్రాయాలను రాయండి.
3. ఏదైనా ఒక ఆట గురించి, దాన్ని ఆడే విధానం గురించి మీ సొంతమాటల్లో రాయండి.
4. మీకు ఏ ఆట అంటే ఇష్టం ? ఎందుకు? ఆ ఆటలో మంచి క్రీడాకారులుగా ఎదగడానికి ఏం చేస్తారో పది వాక్యాలలో రాయండి.

## IV. పదజాలం



1. పాఠంలోని వార్తలు ఆధారంగా వాటిలోని ఆంగ్ల పదాలను, వాటి అర్థాలను రాయండి.
2. పాఠం చదవండి. ఈ కింది పదాలను ఏ సందర్భాలలో వాడారో గుర్తించండి. ఇవే పదాలను ఏ ఏ సందర్భాలలో ఉపయోగిస్తారో రాయండి.

అ. జాలువారడం

ఆ. పరవళ్ళెత్తాయి

ఇ. గట్టెక్కించే నాథుడు

ఈ. హోరు


ఉ. ఆక్రందనలు

ఊ. కృతజ్ఞతాభావం

ఎ. కదనక్షేత్రం

ఏ. ఊపిరులూదిన

ఐ. పులకించి పోయింది



3. వార్తాపత్రికలకు సంబంధించిన పదజాలాన్ని రాయండి.
   ఉదా : వార్తలు, విలేకరి, ప్రెస్సు,
4. క్రికెట్ ఆటకు సంబంధించిన పదజాలాన్ని రాయండి.

## V. సృజనాత్మకత



1. ఏదైనా ఒక వార్తాపత్రికలోని మీకిష్టమైన వార్తను చదవండి. ఆ వార్తను ఎలా ప్రారంభించారు? ఆ వివరాలు రాయడానికి ఏమేమి చేసి ఉంటారు. ఇది ఆధారంగా మీ పాఠశాలలో జరిగిన ఆటల పోటీని గురించి ఒక క్రీడావార్త రాయండి.
2. నీ కిష్టమైన ఏదైనా ఒక ఆటను గురించి, దాన్ని ఆడే క్రీడాకారుల గొప్పదనాన్ని తెలిపేలా వర్ణనతో కూడిన పదాలను వాడుతూ క్రీడావార్తను రాయండి. (పాఠంలోని క్రీడావార్తలోని వర్ణన పదాలను ఉపయోగించుకోండి.)
3. దినపత్రికలో రకరకాల అంశాలపై కార్టూన్‌లు వస్తుంటాయి. అవి నవ్వు తెప్పించేవిగా ఉంటాయి. వాటిని పరిశీలించండి. వీటి ఆధారంగా మీరు కూడా కొన్ని కార్టూన్లు గీసి ప్రదర్శించండి.

© SCERT not to be republished






## VI. ప్రశంస



1. మీ పాఠశాలలో బాగా ఆడేవాళ్ళు ఎవరో గుర్తించండి. వాళ్ళు ఇలా బాగా ఆడడానికి గల కారణాలను తెలుసుకొని రాయండి.
2. ఏదైనా ఆట ఆడేటప్పుడు ఓడిన జట్టులో కూడా బాగా ఆడేవాళ్ళు ఉంటారు. వాళ్ళనుంచి మీరు ఏం గ్రహిస్తారో చెప్పండి.

## VII. ప్రాజెక్టు పని



1. మీ తరగతి పక్షాన ఒక తరగతి పత్రికను రూపొందించడానికి ప్రణాళిక వేయండి. ఇందుకోసం ఏ ఏ అంశాలు దాంట్లో చేర్చాలో మీ మిత్రులతో చర్చించండి. ఆ వివరాలకు అవసరమైన చోట చిత్రాలను గీయండి. ఫొటోలను సేకరించుకోండి. ఈ పత్రికకు మంచి పేరు పెట్టండి. పత్రికను తయారుచేసి ప్రదర్శించండి. మీ పత్రిక గురించి మిగతా తరగతి పిల్లలు ఎలా స్పందించారో తెలుసుకొని చెప్పండి.
2. మీ తరగతిలోని పిల్లలు జట్లుగా విడిపోవాలి. ఒక్కొక్క జట్టువాళ్ళు ఒక వార్తాపత్రికను తీసుకోవాలి. ఆ వార్తాపత్రికలో పిల్లలకోసం కేటాయించిన పేజీలో ఏ ఏ అంశాలు ప్రచురించారో వాటి వివరాలు రాయండి. తరగతిలో మిగతా వాళ్ళకు తెలియచేయండి.
3. **జట్టుపని:** ఏదైనా ఒక దినపత్రికను తీసుకొని దానిలోని ప్రధానమైన వార్తల శీర్షికలు రాయండి. ఇవే శీర్షికలను ఏదైనా ఆంగ్లపత్రికలో ఏ విధంగా రాశారో పరిశీలించండి. వాటిని చదివి వినిపించండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



1. ఈ కింది పదాలను విడదీయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: | మాయమ్మ | = మా | + అమ్మ | = | మాయమ్మ |
| | మీయిల్లు | = ..... | + ...... | = | ............... |
| | హరియితడు | = ...... | + ..... | = | ............... |

పై సందర్భాల్లో సంధి జరగలేదు. కాని, కొత్తగా 'య్' వచ్చి చేరింది. అట్లా చేరడంవల్ల ఈ కింది విధంగా మార్పు జరిగింది.

(అ) మా + య్ + అమ్మ = మా 'య' మ్మ

(ఆ) మీ + య్ + ఇల్లు = మీ 'యి' ల్లు

(ఇ) హరి + య్ + ఇతడు = హరి 'యి' తడు

ఇలా సంధిలేని చోట 'య్' వచ్చి చేరడాన్నే **"యడాగమం"** అంటారు.

కింది పదాలను కలిపి జరిగిన మార్పును సరిచూసుకోండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా: | అని + అడిగిన | = | (య్ + అ = య) | = | అని యడిగిన |
| (అ) | మా + ఊరు | = | ...................... | = | ............... |
| (ఆ) | సరి + ఐన | = | ...................... | = | ............... |

© SCERT not to be republished


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



(ఇ) జరగని + అపుడు = ..................... = ...............

(ఈ) చేసి + ఉంటే = ..................... = ...............

## విభక్తులు

**2. కింది వాక్యాలను గమనించండి.**

(అ) భారత్ ఆరు వికెట్లతో కప్ గెలిచింది.

(ఆ) సమాజంలో అవసరమున్నవాళ్ళకు సేవచేయడమే సమాజసేవ

(ఇ) అనారోగ్యంవల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయి.

(ఈ) లంక సింహాలు తోకముడిచాయి.

(ఉ) సచిన్ గురించి నీకు తెలిసిన విషయాలు ఏమిటి.

పై వాక్యాల్లో గీతగీసిన అక్షరాన్ని లేదా పదాన్ని తొలగించి చదవండి.

**ఉదా: భారత్ ఆరు వికెట్ల కప్ గెలిచింది.**

ఈ వాక్యంలో పదాల మధ్య సంబంధం సరిగా లేనట్లుగా అనిపిస్తుంది. 'ఆరువికెట్ల కప్' అనేది ఉండదు. ఇప్పుడు 'తో' అనే ప్రత్యయం ఉపయోగించి చదవండి. 'భారత్ ఆరువికెట్లతో కప్ గెలిచింది'. ఇలా పదాల మధ్య అర్థ సంబంధాన్ని ఏర్పరచడానికి ఉపయోగించే అక్షరాలను లేదా పదాలను **"విభక్తులు"** అంటారు.

| ప్రత్యయాలు | | విభక్తులు |
|---|---|---|
| అ. డు, ము, వు లు | – | ప్రథమా విభక్తి |
| ఆ. ని(న్), ను(న్), ల(న్), కూర్చి, గురించి | – | ద్వితీయా విభక్తి |
| ఇ. చేత(న్), చే(న్), తోడ(న్), తో(న్) | – | తృతీయా విభక్తి |
| ఈ. కొఱకు(న్), కై | – | చతుర్థీ విభక్తి |
| ఉ. వలన(న్), కంటె(న్), పట్టి | – | పంచమీ విభక్తి |
| ఊ. కి(న్), కు(న్), యొక్క, లో(న్), లోపల(న్) | – | షష్ఠీ విభక్తి |
| ఎ. అందు(న్), న(న్) | – | సప్తమీ విభక్తి |
| ఏ. ఓ, ఓరి, ఓయి, ఓసి | – | సంబోధన ప్రథమా విభక్తి |



**నేనివి చేయగలనా ?**

1. వార్తాపత్రికల గురించి, ప్రసార మాధ్యమాలలోని వార్తల గురించి సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు
2. వార్తాపత్రికలలోని వార్తలను, శీర్షికలను చదివి అర్థంచేసుకోగలను. సొంతమాటల్లో చెప్పగలను. ఔను / కాదు
3. వార్తాపత్రికలోని చక్కటి పదజాలాన్ని అర్థంచేసుకొని అవసరమైన సందర్భాలలో వినియోగించగలను. ఔను / కాదు
4. వార్తాపత్రికలలోని ఆటల గురించి వ్యాసం రాయగలను. ఔను / కాదు
5. క్రీడావార్తలను, వర్ణనలతో కూడిన చిన్న చిన్న వార్తలను రాయగలను. కార్టూన్లు గీయగలను. ఔను / కాదు

**"క్రీడలకు సమయం ఇవ్వలేని వారు రోగాలకు సమయం ఇవ్వాల్సి వస్తుంది" - జన్‌వనమకర్**

©SCERT not to be republished






రెండో యూనిట్

# 8. మేము సైతం

## ఆలోచించండి - మాట్లాడండి :




## ప్రశ్నలు :

1. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు ?
2. వాళ్ళు చేస్తున్న సేవలేమిటి?
3. ఆ సేవలవల్ల ఎవరికి ఉపయోగం కలుగుతుంది?
4. విద్యార్థులు ఇలా సేవలందించిన సందర్భాలు మీరు చూసినవి చెప్పండి.

## నేపథ్యం :


చిన్నతనంనుంచే సేవాభావం అలవడాలని, సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలన్నదే ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ





రణస్థలం,
తేది : 16-11-2011.

**తాతయ్యా,**

బాగున్నావా? నేనే - లింగమ్మను తాతయ్యా! నాయనమ్మ ఎలా ఉంది? నాకు చేగోడీలు ఎప్పుడు పెడుతుంది? మన పెరట్లో తువ్వాయి బాగా గంతులు వేస్తోందా! ఇదిగో, తాతయ్యా! మరేమో నాకూ మా రాధకూ మా బళ్ళో మంచి బహుమతులిచ్చారోచ్! ఎప్పుడో తెలుసా? బాలల దినోత్సవంనాడు! మేము అందరూ మెచ్చే మంచిపని చేసినందుకు! అలాంటి పనిని ప్రజాసేవ అంటారట. అలాగని మా ప్రధానోపాధ్యాయులు ప్రార్థనా సమావేశంలో చెప్పారు. అసలేమైందో తెలుసా?

ఒకనాడు ఏమైందంటే - నేనూ రాధా కలిసి బడికి వెళుతున్నాం. దారి పక్కన ఒక ముసలి తాత పడి ఉన్నాడు. ఏదో బాధతో మూలుగుతున్నాడు. "అయ్యో! ఎంత బాధపడుతున్నాడో పాపం," అనుకున్నాం మేం. నేను గబుక్కున నా మంచినీళ్ళ సీసా మూత తీశాను. నేనూ రాధా అతని మొహమ్మీద నీళ్ళు చల్లాం. అతను తల తిప్పాడు. కాసేపటికి మెల్లగా లేచి కూర్చున్నాడు. రాధ తన మంచినీళ్ళసీసా అతని నోటికందించి తాగించింది. "తాతా! ఏమైంది?" అని నేనడిగాను. అతను ఏమీ చెప్పలేకపోతున్నాడు. "అయ్యో! ఇప్పుడెలాగ?" అనుకున్నాం. ఇటూ అటూ చూశాం. ఒకాయన స్కూటర్‌మీద వెళుతున్నారు. ఆయన్ని ఆపి తాతను చూపించాం. "నాకు పనుందమ్మా! అర్జెంటుగా వెళ్ళాలి" అంటూ వెళ్ళిపోయారు. మరో నిమిషానికి ఒకామె కనిపించింది. ఆవిడ కూడా ఆగలేదు. "108 నెంబరుకి ఫోను చేసి చెప్పండమ్మా! వాళ్ళొచ్చి తీసుకెళతారు. నాకు పనుంది" అంటూ వెళ్ళిపోయింది. అయ్యో! ఈ తాత సంగతెవరూ పట్టించుకోడం లేదే! అని మాకు దిగులు కలిగింది. ఒక పక్క బడికి టైమైపోతోంది. ఏం చెయ్యాలి? నా గౌను జేబులో కాసిని డబ్బులు ఉన్నాయి. రాధ కూడా తన జేబులో ఉన్న డబ్బులు తీసింది. ఒక ఆటో కనిపించింది. చెయ్యెత్తి ఆపాం. తాతను సాయంపట్టి బండిలో కెక్కించాం. ఒక ఆసుపత్రికి తీసుకెళ్ళాం. డాక్టరుగారికి ఆ ముసలితాత సంగతి చెప్పాం. డాక్టరుగారు మమ్మల్ని మెచ్చుకున్నారు. మేం బడికి వెళ్ళిపోయాం.

బడిగేటు సగం మూసి ఉంది. ప్రధానోపాధ్యాయులు గేటు దగ్గర నిలబడి ఉన్నారు. మేమిద్దరం ఆయన దగ్గరకెళ్ళి, "ఆలస్యమైంది. క్షమించండి సార్!" అన్నాం. "ఎందుకు?" అన్నారు. తాత సంగతి చెప్పాం! "అయ్యో పాపం!" అన్నారు. మమ్మల్ని తరగతిలోకి వెళ్ళమన్నారు. దీన్ని గురించి ప్రార్థనా సమావేశంలో చెప్పారు. బాధల్లో ఉన్నవాళ్ళకీ, కష్టాల్లో ఉన్నవాళ్ళకీ, ప్రత్యేక అవసరాలున్నవాళ్ళకు (చూడలేని, వినలేని, నడవలేని, మాట్లాడలేని) అవసరమైనప్పుడు మనం తప్పకుండా సాయంచెయ్యాలన్నారు. మంచి తనంతో సాయంచెయ్యడమే మానవత్వం అన్నారు. కందుకూరి వీరేశలింగంగారూ గురజాడ వేంకట అప్పారావుగారూ వంటి గొప్పవాళ్ళు చెప్పిన మాటలను అందరికీ చెప్పారు.

ఈ విషయం నీకు చెప్పాలనే ఉత్తరం రాస్తున్నాను. తాతయ్యా! నువ్వు గొప్పగొప్పవాళ్ళ పుస్తకాలు చాలా చదువుతూంటావు కదా! వాళ్ళు ఏమేం చెప్పారో అప్పుడప్పుడు నాకు తెలియజేస్తూ ఉంటావు కదూ!

నాయనమ్మకు నమస్కారాలు. నేను అందర్నీ అడిగినట్లు చెప్పు. ఉంటాను.

నీ ప్రియమైన మనుమరాలు,
లింగమ్మ,
6వ తరగతి.

చిరునామా:
**శ్రీ పి.నారాయణ,**
ఇంటి.నెం. 12-76,
మంథని, కరీంనగర్ జిల్లా.

© SCERT not to be republished

# సమాధానం



మంథని,
21.11.2011.

లింగమ్మా ! నా బంగారు తల్లీ!

ఆశీస్సులు. నీ ఉత్తరం చూసి ఎంత మురిసిపోయానో! ఇంతకుముందు నువ్వు రాసిన ఉత్తరాలకంటే ఇది ఎంతో బాగుంది. అమ్మా, నాన్నా, తమ్ముడూ అందరూ బాగున్నారా? దొడ్లో జాజిపూలు బాగా పూస్తున్నాయా? రోజూ చెట్లకు నీళ్ళు పోస్తున్నావా? అన్నట్టు, రాధ బొమ్మలు బాగా వేస్తుంది కదూ! నువ్వు కూడా వేస్తున్నావా? నిజంగా స్నేహితులంటే నువ్వు, రాధా ఉన్నట్టు ఉండాలి. మీరు ఇంతవరకూ ఆటపాటల్లోనూ చదువులోనూ కలిసి ఉంటారని నాకు తెలుసు కానీ సమాజసేవలో కూడా కలిసి ఉంటారని నాకు తెలియదు. ఇప్పుడు ఆ సంగతి నీ ఉత్తరంలో చూసి ఎంతో సంతోషించాను.

సమాజసేవ అన్న మాట నువ్వు వినే ఉంటావు కానీ దాని అర్థం నీకు తెలుసో లేదో నాకు తెలియదు. కుటుంబం అంటే నీకు తెలుసు. అమ్మా నాన్నా అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళూ తాతా నాయనమ్మా అమ్మమ్మా లాంటి వాళ్ళు ఒకే ఇంట్లో కలిసి ఉన్నప్పుడు అందరినీ కలిపి ఒక కుటుంబం అంటాం. మన చుట్టుపక్కల ఉండే ఇలాంటి కుటుంబాలనన్నింటినీ కలిపి సమాజం అంటారు. మన కుటుంబంలో ఎవరికి ఏ అవసరం వచ్చినా ఒకరికొకరం సాయపడతాం. అలాగే సమాజంలో ఎవరికి ఏ అవసరం కలిగినా పరస్పరం సహాయం చేసుకోవాలి. అది మన బాధ్యత. "నేనూ మా కుటుంబమూ కడుపులో చల్ల కదలకుండా ఉంటాం! చుట్టుపక్కలవాళ్ళ గొడవ నాకెందుకు?" అని అనుకోగూడదు. సమాజం బాగుంటేనే మనం బాగుంటాం. ఉదాహరణకు, మన వీధి అంతా చెత్తా చెదారంతో నిండి ఉందనుకో! మన ఇల్లు శుభ్రంగా ఉన్నంత మాత్రాన మనం ఆరోగ్యంగా ఉండగలమా? ఆలోచించు. మన పెద్దలు 'ధర్మో రక్షతి రక్షితః' అని చెప్పారు. అలాగే సమాజాన్ని మనం రక్షిస్తే సమాజం మనల్ని రక్షిస్తుంది.

సమాజంలో రెండు పూటలా కడుపునిండా తినడానికి కావలసిన ఆదాయం లేనివాళ్ళుంటారు. జబ్బులతో బాధపడేవాళ్ళుంటారు. కుంటివాళ్ళూ గుడ్డివాళ్ళూ మూగవాళ్ళూ ఎందరో ఉండవచ్చు. వీరందరికీ సాయం అవసరం. అగ్నిప్రమాదాలూ తుఫాన్లూ వరదలూ భూకంపాలూ సంభవించినప్పుడూ అంటువ్యాధులు ప్రబలినప్పుడూ ఎంతోమందికి సేవలు అవసరమవుతాయి. సమాజంలో అవసరమున్నవాళ్ళకు సేవచేయడమే సమాజసేవ. ఇలా సేవ చెయ్యాలన్న అభిప్రాయం మనం ఎప్పుడూ మనసులో ఉంచుకోవాలి. మన ఇంట్లో వస్తువులను ఎంతో భద్రంగా చూసుకుంటాం కదా! అవి మన ఆస్తి. సమాజానికి కూడా ఆస్తి ఉంటుంది. అంటే రైళ్ళూ బస్సులూ పార్కులూ విహారస్థలాలు మొదలైనవన్నమాట. ఇవి నీతో పాటు అందరివీ! ఇవి పాడవకుండా కాపాడుకోటం కూడా అందరి బాధ్యత. దీన్నే సామాజిక స్పృహ అంటారు.

©SCERT not to be republished

చిన్నారీ! నువ్వూ రాధా దారి పక్క పడి ఉన్న ముసలాయనకు చేసిన సాయం నిజంగా మానవసేవ. సమాజసేవ చెయ్యాలని మీకనిపించడమే మీకు సామాజిక స్పృహ ఉందనడానికి నిదర్శనం. ఇందుకు నిన్నూ రాధనీ నేను కూడా మెచ్చుకుంటున్నాను. విద్యార్థుల మొదటి కర్తవ్యం శ్రద్ధగా చదువుకోడమే ! అందులో సందేహం లేదు. కాని చదువుతోపాటు సాటి మనుషులకు చేయదగినంత సేవచేయడం కూడా ముఖ్యమే! ఉపన్యాసాలు ఇస్తే చాలదు. మహాకవి గురజాడ చెప్పినట్లు, పూనుకొని జనులకు ఏదైనా ఒక మేలు చేసి చూపాలి.

సమాజ సేవ చేయాలనుకునే విద్యార్థులకు ఎన్నో మార్గాలుంటాయి. బడి బైట తిరిగే పిల్లలను పాఠశాలలో చేర్పించడానికి ఉపాధ్యాయులకు సాయంచేయవచ్చు. ఎవరైనా చెట్లను ఇష్టం వచ్చినట్లు నరికేస్తుంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. పల్స్ పోలియో కార్యక్రమంలో వైద్యసిబ్బందికి సహకారం అందించవచ్చు. ప్లాస్టిక్ సంచులూ గ్లాసులూ వాడటం మంచిది కాదని తోటి విద్యార్థులకు చెప్పవచ్చు. వీధులలో తిరిగే ఊరకుక్కల గురించి పురపాలక సంఘంవారికి ఫిర్యాదు చెయ్యవచ్చు. నిరక్షరాస్యులైన పెద్దలకు సాయంత్రం పూట రాయడం, చదవడం నేర్పించవచ్చు. పిల్లలు మీ వీధుల్లో చెత్తను ఎక్కడ బడితే అక్కడ వేస్తుంటే చెత్తకుండీలలో వేయమని చెప్పవచ్చు. ఇంట్లో, వీధిలో, బడిలో, ఎక్కడైనా మొక్కలు నాటవచ్చు. వాటిని కాపాడుతూ పెంచవచ్చు. తోటి పిల్లలకు, ఆపదల్లో ఉన్నవారికి నీలాగా సహాయం చేయవచ్చు. అర్థమైందా తల్లీ!

మన ఊళ్ళో మీ గురించి అందరికీ చెబుతాను. ఇకముందు కూడా ఇలాంటి మంచి మంచి పనులు చెయ్యాలని మరిచిపోకేం! నువ్వు వచ్చినప్పుడు నీకేం బహుమతి ఇస్తానో అప్పుడే తెలుస్తుంది. ఈ ఉత్తరాన్ని నీ స్నేహితులచేత కూడా చదివించు.

ఉంటాను,
**మీ తాతయ్య.**

INLAND LETTER CARD

**చిరునామా:**

**చి॥ లింగమ్మ,**
**తండ్రిపేరు: ఎస్.గణపతి, ఇం.నెం.6-11-58,**
**రణస్థలం,**
**శ్రీకాకుళం జిల్లా.**

© SCERT not to be republished



## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. ఈ పాఠంలో ఉత్తరాన్ని ఎవరు ఎవరికి ఎందుకు రాశారు?
2. ప్రార్థన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు లింగమ్మ గురించి ఏం చెప్పి ఉంటారు?
3. మీ పాఠశాలలో కూడా ప్రార్థనసమావేశంలో మీ ప్రధానోపాధ్యాయులు ఏ మంచి విషయాలను గురించి మాట్లాడతారు? వాటిని విని చెప్పండి.
4. లింగమ్మ లాగా ఆమె స్నేహితురాలిలాగా మీరు కూడా ఎవరికైనా, ఎప్పుడైనా సహాయంచేశారా? ఏం చేశారో చెప్పండి.
5. లింగమ్మ ఆపదలో ఉన్న ముసలితాతకు సహాయం చేసింది కదా అలాగే మనం ఎవరెవరికి ఎలాంటి సహాయం అందించవచ్చు?
6. లింగమ్మ రాసిన ఉత్తరం ఆమె తాతయ్యకు, తాతయ్య రాసిన ఉత్తరం లింగమ్మకు చేరాలి కదా! అట్లాగే ఎవరు ఉత్తరాలు రాసినా ఒక ప్రాంతంనుంచి మరొక ప్రాంతానికి ఎలా చేరుకుంటాయో చెప్పండి.

### II. చదవడం - రాయడం



1) కింది పదాలు చదవండి. ఆ పదాలతో వచ్చే వాక్యాలు పాఠంలో ఎక్కడున్నాయో గుర్తించండి.

అ) 108 నెంబరు　　ఆ) మంచితనం　　ఇ) మన ఇల్లు

ఈ) నిజంగా　　ఉ) అగ్ని ప్రమాదాలు　　ఊ) మహాకవి

2) పాఠంలో '!' '?' గుర్తులతో ఉన్న వాక్యాలు గుర్తించి ఒకచోట రాయండి.

3. కింది పేరాను చదవండి. ఈ పేరాకు ప్రశ్నలు రాయండి. శీర్షిక పెట్టండి.

పూర్వ కాలం సమాచారాన్ని పావురాల వంటి పక్షుల ద్వారా ఒక ప్రాంతంనుంచి ఇంకో ప్రాంతానికి పంపేవారు. తరవాతి కాలంలో దూతలు, వార్తాహరుల ద్వారా సమాచారాన్ని పంపే వారు. వీరు గుర్రాల పైనగాని, కాలినడకనగాని వెళ్ళి సమాచారం అందించేవారు. ఆ తరవాతి కాలంలో తంతి తపాలా శాఖ ద్వారా ఉత్తరాలు, టెలిగ్రాముల ద్వారా సమాచారం ఒక ప్రాంతంనుంచి ఇంకొక ప్రాంతానికి చేరేది. ఆధునిక కాలంలో సమాచార పంపిణీకి టెలిఫోన్‌లను, సెల్‌ఫోన్‌లను వినియోగిస్తున్నారు. కంప్యూటర్‌లలో ఇంటర్‌నెట్ ద్వారా క్షణాల్లో సమాచారాన్ని తెచ్చుకొంటున్నాం, పంపుతున్నాం. ఈ - మెయిల్, ఫ్యాక్స్ వంటివి వాడుతున్నాం. అంతేకాకుండా మన అభిప్రాయాలను, భావాలను ఎవరికయినా తెలపడానికి బ్లాగులు, ట్విట్టర్లు, ఫేస్‌బుక్‌లనే విధానాలు ఇంటర్‌నెట్ ద్వారా ఉపయోగిస్తున్నాం.

© SCERT not to be republished

1. ప్రశ్న: ............................................................................
2. ప్రశ్న: ............................................................................
3. ప్రశ్న: ............................................................................
4. ప్రశ్న: ............................................................................
5. ప్రశ్న: ............................................................................

శీర్షిక :..................................................................................

**4. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి**

అ. లింగమ్మకూ రాధకూ ప్రధానోపాధ్యాయులు బహుమతి ఏ రోజున ఇచ్చారు? ఆ రోజే ఎందుకు ఇచ్చారు ?

ఆ. ముసలి తాతను హాస్పిటల్‌కి తీసుకెళ్లడానికి సీతకూ రాధకూ డబ్బులు ఎలా వచ్చాయి?

ఇ. లింగమ్మ ఎవరికి ఉత్తరం రాసింది ? ఆయన ఎక్కడ ఉంటారు?

ఈ. డాక్టరు లింగమ్మను ఏమని మెచ్చుకున్నాడు? ఎందుకు మెచ్చుకున్నాడు?

ఉ. ప్రధానోపాధ్యాయులు ఏమని సందేశం ఇచ్చారు?

ఊ. సామాజిక స్పృహ అంటే ఏమిటి ? దీన్ని గురించి తాతయ్య లింగమ్మకు ఉత్తరంలో ఏమి తెలియజేశారు?

ఎ. సమాజసేవకు ఏ ఏ మార్గాలుంటాయని తాతయ్య చెప్పారు?

ఏ. లింగమ్మ తాతను ఏమేమి తెలపమని కోరింది?

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

అ. ఎలాంటివాళ్ళకు సాయం అవసరమవుతుంది?

ఆ. లేఖలు ఎవరికి రాస్తున్నామన్నదాన్ని బట్టి సంబోధన ఉంటుంది కదా! ఎవరిని ఎలా సంబోధిస్తారో రాయండి.

ఇ. లింగమ్మకు సామాజికస్పృహ ఉందని ఎలా చెప్పవచ్చు?

ఈ. రోడ్డు పక్కన పడిపోయిన ముసలాయనను లింగమ్మ, ఆమె స్నేహితురాలు మాత్రమే హాస్పిటల్‌కి ఎందుకు తీసుకెళ్ళాల్సి వచ్చింది?

ఉ. గొప్పవాళ్ళు ఏం చెప్పారో తెలుసుకోవాలని లింగమ్మ ఎందుకు అనుకుంది?

ఊ. 108 నెంబరుకు ఎందుకు ఫోన్ చేస్తారు? అలా ఫోను చేస్తే ఏం జరుగుతుంది?

ఎ. లింగమ్మ, రాధ బడికి ఆలస్యంగా వచ్చినా ప్రధానోపాధ్యాయులకు కోపం రాలేదు. ఎందుకు?

**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు :**

కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.

అ. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలాంటి సేవలు అవసరమవుతాయి?

© SCERT not to be republished

ఆ. లింగమ్మ లాగే మీరు కూడా **మీరు చేసిన మంచి పనిని గురించి మీ తాతయ్యకుగాని,మామయ్యకుగాని ఒక లేఖ రాయండి**

ఇ. మురికి నీటి సమస్యను పరిష్కరించమని సర్పంచ్‌గారికిగాని, పురపాలక సంఘ అధికారికిగాని లేఖ రాయండి.

## IV. పదజాలం

**1. కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు అదే అర్థం వచ్చే పదాలను బ్రాకెట్లలో రాయండి.**

ఉదా : నేను <u>క్షేమం</u> (కుశలం)

అ. డాక్టరుగారు మమ్మల్ని అభినందించారు. ( )

ఆ. భూకంపాలు వస్తే ఎక్కువమంది <u>కష్టాలు</u> పడతారు. ( )

ఇ. కొంతమంది బాల్యంలోనే సంగీత సాధన మొదలుపెడతారు. ( )

ఈ. ఆదాయం లేని పేదలకు సహాయం చేయాలి. ( )

**2. కింది వాక్యాలలోని గీత గీసిన పదాలకు వ్యతిరేక పదాలను ఖాళీలలో రాయండి.**

అ. పరీక్షలో పాసైనందుకు సంతోషించాను. ఆటల పోటీలలో ఓడినందుకు ..........

ఆ. <u>శ్రద్ధగా</u> చదివితే ఎలాంటి పరీక్షైనా పాసవవచ్చు. పాఠాలు వినడంలో ................ పనికి రాదు.

ఇ. కష్టపడితే దేనినైనా సాధించవచ్చు. ........................దేనినైనా సాధించలేము.

ఈ. మంచివాళ్ళు మేలు చేస్తారు. చెడ్డవాళ్ళు................... చేయాలని చూస్తారు.

**3. కింది పదాలలో మానవుల పేర్లూ ప్రకృతి వైపరీత్యాల పేర్లూ కలిసిపోయి ఉన్నాయి. వాటిని వేరుచేయండి.** ఒక్కొక్క పదంతో సొంతవాక్యం రాయండి.

పేదవాళ్ళు, తుఫానులు, వరదలు, వినలేనివాళ్ళు, భూకంపాలు, చూడలేనివాళ్ళు.

**4. కింది పదాల వరసను చూడండి. ప్రతి వరసలో సంబంధంలేని పదాన్ని గుర్తించి సున్నా ( ○ ) చుట్టండి.**

అ. టెలిఫోన్, సెల్‌ఫోన్, కంప్యూటర్, క్యాలెండర్

ఆ. పోస్ట్‌కార్డు, ఇన్‌లాండ్ లెటర్, సెల్‌ఫోన్, కవర్

ఇ. పోస్టాఫీస్, పాఠశాల, కొరియర్ ఆఫీస్, టెలిఫోన్ కేంద్రం

ఈ. ఆకాశవాణి, దూరదర్శన్, వార్తాపత్రికలు, బ్యాంకు

© SCERT not to be republished

## V. సృజనాత్మకత



1. లింగమ్మ వాళ్ళ తాతయ్యకు ఉత్తరం రాసింది కదా! తాతయ్య స్థానంలో నువ్వే ఉంటే, ఒక మిత్రుడిగా / మిత్రురాలిగా ఏమని తిరిగి ఉత్తరం రాస్తావు? అలా రాసి చూపించు?
2. లింగమ్మ, తాతయ్యలు రాసిన ఉత్తరాలు ఆధారంగా జట్లలో కూర్చొని సంభాషణలు రాయండి.

   లింగమ్మ : తాతయ్యా! ఈ రోజు ఏం జరిగిందో తెలుసా ?

   తాతయ్య : ఏం జరిగింది?

   లింగమ్మ : ఈ రోజు నేను, రాధ బడికి వెళుతూ ఉంటే ----------------

   -------------------------------------------

## VI. ప్రశంస



1. వివిధ వ్యక్తులకు లేఖ రాసేటప్పుడు సంబోధన ఇంగ్లీష్‌లో ఎలా రాస్తాం ? తెలుగులో ఎలా రాస్తాం ?

   లేఖ రాసేటప్పుడు వివిధ వ్యక్తులకు ముగింపు వాక్యం ఇంగ్లీష్‌లో ఎలా రాస్తాం ? తెలుగులో ఎలా రాస్తాం ?
2. లింగమ్మలాగా మీ పాఠశాలలో / మీ గ్రామంలో సేవచేసినవాళ్ళను గురించి వివరాలు తెలుసుకోండి.
3. కంప్యూటర్ ద్వారా ఇంటర్‌నెట్‌ను ఉపయోగించి ఈ - మెయిల్ ఎలా పంపుతారో తెలుసుకోండి. అట్లాగే మనకు కావలసిన సమాచారాన్ని ఇంటర్‌నెట్ ద్వారా ఎలా పొందవచ్చో తెలపండి.

## VII. ప్రాజెక్టు పని




అ) కొంతమంది ప్రముఖులు రాసిన లేఖలు పుస్తకాలుగా వచ్చాయి. గ్రంథాలయం నుంచి వాటి పేర్లను సేకరించండి.

ఆ) వివిధ దినపత్రికలలో వచ్చే లేఖలను సేకరించి ప్రదర్శించండి.

ఇ) ఏదైనా ఒక అంశం తీసుకొని దాన్ని చదవండి. అది దేన్ని గురించి ఎవరు ఎవరికి రాశారో చెప్పండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



ఈ కింది పదాలను విడదీయండి.

1. ఉదా:రామానుజుడు = రామ + అనుజుడు = (అ + అ = ఆ)

   (అ) రామాలయం = ...... + .......... = (            )

2. ఉదా:కవీంద్రుడు = కవి + ఇంద్రుడు = (ఇ + ఇ = ఈ)

   (ఇ) కవీశ్వరుడు = ...... + .......... = (            )

© SCERT not to be republished

| | | | | |
|---|---|---|---|---|
| 3. ఉదా:భానూదయం= | భాను + ఉదయం | = | (ఉ + ఉ = ఊ) |
| వధూపేతుడు | = ...... + ......... | = | ( ) |
| 4. ఉదా:పితౄణం | = పితృ + ఋణం | = | (ఋ+ఋ=ౠ) |
| మాతౄణం | = ...... + ......... | = | ( ) |

అ - ఇ - ఉ - ఋ అనే వర్ణాలకు అవే వర్ణాలు (సవర్ణాలు) కలిసినప్పుడు దీర్ఘం తప్పనిసరిగా రావడాన్ని **'సవర్ణదీర్ఘ సంధి'** అంటారు.

ఈ విధంగా సంస్కృత పదాల మధ్య జరిగే సంధులను సంస్కృత సంధులు అంటారు.

| | |
|---|---|
| 'అ' వర్ణానికి | 'అ - ఆ' లు సవర్ణాలు |
| 'ఇ' వర్ణానికి | 'ఇ - ఈ' లు సవర్ణాలు |
| 'ఉ' వర్ణానికి | 'ఉ - ఊ' లు సవర్ణాలు |
| 'ఋ' వర్ణానికి | 'ఋ - ౠ' లు సవర్ణాలు |

2. ఈ కింది పదాలను విడదీయండి.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా:విద్యార్థి | = | విద్యా + అర్థి | = | (ఆ + అ = ఆ) |
| 1. మహానందము | = | ....... + ........... | = | ( ) |
| 2. మహేంద్రుడు | = | ....... + ........... | = | ( ) |
| 3. కోటీశ్వరులు | = | ....... + ........... | = | ( ) |
| 4. సువర్ణాధ్యాయం | = | ....... + ........... | = | ( ) |
| 5. కరీంద్రం | = | ....... + ........... | = | ( ) |
| 6. సమరాంగణం | = | ....... + ........... | = | ( ) |
| 7. శుభారంభం | = | ....... + ........... | = | ( ) |
| 8. కపీంద్రులు | = | ....... + ........... | = | ( ) |



**నేనివి చేయగలనా?**

| | |
|---|---|
| 1. చేసిన మంచి పనులు చెప్పగలను. | ఔను / కాదు |
| 2. వివిధ లేఖలను చదవగలను, అర్థం చేసుకొనగలను.అందులో ఏముందో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. నేనూ చేసిన మంచి పనులు లేదా సమస్యల గురించి లేఖ రాయగలను. | ఔను / కాదు |
| 4. ఈ పాఠంలోని పదజాలాన్ని అవసరమైన సందర్భాలలో వినియోగించగలను. | ఔను / కాదు |

**"అనుభవాల దొంతరలను భావితరాలకందించే అందమైన మార్గం - లేఖ"**

© SCERT not to be republished

రెండో యూనిట్

# 9. సోమనాద్రి

(చారిత్రక వీరగాథ) (ఉపవాచకం)



గద్వాల కోట ప్రవేశ ద్వారం (ప్రస్తుతం)

అనేక శతాబ్దాలకు పూర్వం రెడ్డి, వెలమ వీరులు తమ భుజబలంతో రాజ్యాలు సంపాదించుకొన్నారు. ఆ స్వతంత్ర రాజ్యాలు కొంత కాలానికి ఓరుగల్లు, విజయనగర సామ్రాజ్యాలకు వశమైపోయాయి. ఆ రాజుల పతనం తరవాత అవి నిజాం నవాబుకు సామంత సంస్థానాలుగా మారిపోయాయి. అటువంటి సంస్థానాల్లో ప్రసిద్ధికెక్కినది గద్వాల సంస్థానం.

సుమారు 800 సం॥ల చరిత్ర గల ఈ సంస్థానపు రాజులలో మొదటివాడు, ప్రసిద్ధి వహించినవాడు సోమనాద్రి. సోమనాద్రికి 'పెద్ద సోమభూపాలుడు' అనే ప్రసిద్ధ నామం కూడా ఉంది. ఇతడు క్రీ.శ.1750 ప్రాంతంవాడు. పెద్దారెడ్డి, బక్కమ్మలు ఈయన తల్లిదండ్రులు. భార్య లింగమ్మ. గద్వాల కోటను నిర్మించినది ఇతడే. అనేక యుద్ధాలలో నిత్యం జయలక్ష్మిని చేపట్టినవాడు. దైవసహాయంచేత ఈయనకు గొప్ప నిక్షేపం దొరికింది. ఆ ధనంతో నగరాన్ని, దేవాలయాలను అభివృద్ధి చేసి కంచి, శ్రీరంగం, తిరుపతి వంటిచోట్లనుంచి వచ్చిన వివిధ కళాకారులకు బహుమానాలను ఇచ్చిన కళాభిమాని. ఈ గద్వాల సంస్థానంలోని కాణాదపు పెద్దన మొదలైన కవులు రామాయణాది గ్రంథాలు రచించారు. ఈ విధంగా గద్వాల సంస్థానం తెలుగు సాహిత్యాభివృద్ధికి చేయూతనిచ్చింది. సోమనాద్రి ఆరడుగుల ఎత్తుగల గంభీర విగ్రహం, దృఢమైన నల్లని శరీరమూ, సాముచేత కండలు తిరిగిన పొడవైన చేతులూ కలిగినవాడు. మిత్రులకు గంభీరంగా, శత్రువులకు ప్రళయకాల రుద్రునిలాగా కనిపించేవాడు. అతడు తెల్లని గొప్ప జాతి గుర్రంమీద స్వారిచేస్తూ, యుద్ధరంగంలో కలయతిరుగుతూ అజేయుడై ఉండేవాడు.

సోమనాద్రి 'పూడూరు' ను రాజధానిగా చేసుకొని ఆ ప్రాంతాన్ని కొంత కాలం పాలించాడు. నేడు గద్వాల పట్టణంగా ప్రసిద్ధికెక్కిన ఆ ప్రదేశమంతా ఆ రోజుల్లో దట్టమైన అరణ్య ప్రాంతంగా ఉండేది. ఒకసారి వేటాడడానికి అటుకేసి వెళ్ళిన సోమనాద్రి ఆ ప్రాంతాన్ని చూసి, అది తన రాజధానికి అన్ని విధాలా అనుకూలమైనదిగా ఉంటుందని భావించాడు. వెంటనే అక్కడ కోట నిర్మాణం చేపట్టాడు. అయితే ఆ ప్రదేశానికి సమీపంలోనే ఉన్న 'ఉప్పేడు' కోటను సయ్యద్ దావూద్ మియా పాలిస్తున్నాడు. అతడు గోల్కొండ కోట పాలకుడు నిజాం నవాబు నాసిరుద్దౌలాకు ఆప్తుడు. దావూద్ మియా, సోమనాద్రి కోట నిర్మిస్తున్న స్థలం తన ఏలుబడిలో ఉన్నదని అందువల్ల కోట కట్టడానికి వీలులేదని అడ్డు చెప్పాడు.

సోమనాద్రి బాగా ఆలోచించాడు. కార్యసాధకుడైన సోమనాద్రి కోట నిర్మాణం అడ్డుకోవద్దని, నిర్మాణం పూర్తికాగానే తగినంత కప్పం చెల్లిస్తానని చెప్పి, సయ్యద్ మియాను అంగీకరింపజేశాడు. త్వరగా కోట నిర్మాణం పూర్తి చేశాడు. అనుకున్నట్లుగా సోమనాద్రి కప్పం చెల్లించలేదు. పైగా గొప్ప సైన్యాన్ని సిద్ధపరచుకొని, దావూద్‌పై దండయాత్రకు సిద్ధపడ్డాడు.



విషయం తెలుసుకొన్న దావూద్ మియా; మండిపడ్డాడు. ముందువెనకలు ఆలోచించకుండా సోమనాద్రిమీద యుద్ధం ప్రకటించాడు. రాయచూరు నవాబయిన బసరు జంగు, ప్రాగటూరు కోటకు అధిపతి అయిన ఇదురుసాబు తమ తమ సేనలతో వచ్చి యుద్ధరంగంలో సయ్యద్‌కు బాసటగా నిలిచారు. ఇరుపక్షాల సైన్యాలు గద్వాలకు, రాయచూరుకు మధ్య ప్రాంతమైన 'ఆరగిద్ద' దగ్గర మోహరించాయి. సంకుల సమరం జరిగింది. కొంత సైన్యాన్ని వెంటపెట్టుకొని, సోమనాద్రి స్వయంగా రాయచూరు నవాబును ఢీ కొన్నాడు. సోమనాద్రి ధాటికి తట్టుకోలేని బసరుజంగు యుద్ధంనుంచి తప్పుకొని, తన సైన్యంతో ఇంటిముఖం పట్టాడు. సోమనాద్రి పరాక్రమాన్ని గమనించిన ప్రాగటూరు నవాబు కూడా బుద్ధితెచ్చుకొని మెల్లగా జారుకున్నాడు. ఇక ఉప్పేడు నవాబు సయ్యద్ దావూద్ మియా మాత్రం మిగిలి, ఏకాకి అయిపోయాడు. ఇక చేసేదిలేక, తాను కూడా ఉప్పేడు మార్గాన్ని పట్టి ఏనుగుపై పారిపోతున్నాడు. సోమనాద్రి తన గుర్రాన్ని

ఏనుగుమీదికి ఉసికొల్పాడు. దావూద్ మియా భయపడి ప్రాణాలు దక్కించుకోడం తప్ప వేరే మార్గం లేదని భావించాడు. వెంటనే తన అపజయాన్ని అంగీకరిస్తూ సోమనాద్రిని శరణుకోరుకున్నాడు. ఇక ముందెన్నడూ సోమనాద్రి జోలికి రానని మాట ఇచ్చాడు. యుద్ధపరిహారంగా తన యుద్ధచిహ్నాలైన నగారా, పచ్చజెండా, ఏనుగులను సోమనాద్రికి సమర్పించుకొని దిగాలుగా ఉప్పేడు చేరుకున్నాడు.



ఎట్లాగో ఆ రాత్రి గడిపాడు, సయ్యద్ దావూద్ మియా. మర్నాడు ఉదయాన్నే తన కోటమీదభాగానికి ఎక్కి, గద్వాల కోటకేసి చూశాడు. గద్వాల కోటపై రెపరెపలాడుతున్న తన పచ్చజెండా కనిపించేసరికి కడుపులో మండింది. ఎలాగైనా తాను కోల్పోయిన యుద్ధచిహ్నాలను వెనక్కి తెచ్చుకోవాలనుకున్నాడు. వెంటనే పల్లకిలో హైదరాబాద్ పయనమై వెళ్ళి గోల్కొండ నవాబుతో తన దీన స్థితిని వెల్లడించుకున్నాడు. సోమనాద్రిని దండించి తనకు మనశ్శాంతి చేకూర్చమని కోరాడు. నిజాం నవాబు నాసిరుద్దౌలా, సోమనాద్రి మీదకు దండయాత్ర మంచిది కాదని ఆ ఆలోచన మానుకోమని రకరకాలుగా నచ్చజెప్పాడు. కాని సయ్యద్ మియా తాను పట్టిన పట్టు విడవలేదు. చేసేది లేక, నిజాం నవాబు గొప్ప సైన్యంతో సోమనాద్రిమీద యుద్ధానికి బయలుదేరాడు.



పూర్వం సోమనాద్రి చేతిలో ఓడిపోయి, పరాభవంతో కుంగిపోతున్న రాయచూరు, ప్రాగటూరు నవాబులు తమ కక్ష తీర్చుకోవాలనే కోరికతో నిజాం సైన్యంలోకి వచ్చి చేరారు. ఈలోగా గుత్తి దుర్గాధిపతి టీకు సుల్తాను, కర్నూలు నవాబు దావూద్ ఖాన్, బళ్ళారి నవాబు తమ పరాక్రమాన్ని ప్రదర్శించడానికి మంచి ఉత్సాహంతో వచ్చి కొత్తగా నిజాం సైన్యంలో చేరారు.

తుంగభద్రానదికి దక్షిణాన ఉన్న 'నిడుదూరు'కు చేరుకుంది నిజాం సైన్యం. తుంగభద్రకు ఉత్తర తీరంలో ఉన్న 'కలుగోట్ల' గ్రామంలో సోమనాద్రి సైన్యం విడిది చేసింది. ఈ రెండు గ్రామాల్లో ఇప్పటికీ ఆ నాటి యుద్ధ చిహ్నాలైన తాత్కాలిక బురుజులు, మిట్టలు దర్శనమిస్తాయి. ఆలస్యం చేయడం ఇష్టంలేని సోమనాద్రే మొదట తన సైన్యంతో తుంగభద్రానదిని దాటి తెల్లవారకముందే నిజాం సైన్యాన్ని ముట్టడించాడు. సాయంకాలం వరకు భయంకరంగా యుద్ధంచేస్తూ నిజాంసైన్యాన్ని చీల్చి చెండాడాడు సోమనాద్రి. చీకటి పడడంతో తన సైన్యాన్ని మరల్చి, నదిని దాటి 'కలుగోట్ల' ను చేరి విశ్రమించాడు.

సోమనాద్రి పరాక్రమాన్ని చూసిన నిజాం నవాబు కలవరపడ్డాడు. వెంటనే దర్బారు చేసి సోమనాద్రిని లొంగదీసుకొనే ఉపాయం చెప్పమన్నాడు. అప్పుడొక సర్దారు, "సోమనాద్రి శక్తి అంతా అతని గుర్రంలోనే ఉంది, దాన్ని వశం చేసుకొంటే గాని అతడు వశం కాడు,' అని వివరించాడు. వెంటనే నిజాం ఎలాగైనా సోమనాద్రి గుర్రాన్ని దొంగిలించి, అతణ్ణి వంచాలని ఆలోచించాడు. "తెల్లవారేసరికి సోమనాద్రి గుర్రాన్ని



© SCERT not to be republished

తేగలవారికి జాగీరు ఇస్తాను" అని ప్రకటించాడు. చూస్తూ చూస్తూ మృత్యుముఖంలోకి ఎవరు ప్రవేశిస్తారు?. చివరకు ఒక సైసు సిద్ధమయ్యాడు. ప్రాణాలకు తెగించి నడుముకు కళ్ళెం బిగించి, ఒంటరిగా కలుగోట్లకు ప్రయాణమయ్యాడు. ఎలాగో కష్టపడి సైసు మెల్లగా చప్పుడు కాకుండా గుర్రాన్ని సమీపించాడు. కళ్ళెం తగిలించి పాగానుంచి తప్పించాడు. గుర్రంపైకి ఎక్కి వేగంగా తిరుగుముఖం పట్టాడు. గుర్రాన్ని చూడగానే నిజాము ఆనందానికి అంతులేకుండాపోయింది. వెంటనే ఆ సైసుకు జాగీరుతో పాటు ఒక బంగారు కడియాన్ని కూడా బహుమానంగా ఇచ్చాడు.



గద్వాల కోట (ప్రస్తుతం)

తెల్లవారింది. గుర్రంలేకపోవడాన్ని గమనించిన సోమనాద్రి సైన్యంలో కలకలం బయలుదేరింది. తన కుడిచెయ్యి పడిపోయిందని భావించాడు సోమనాద్రి. అయినా ధైర్యాన్ని విడవలేదు. నిజాం సైన్యంతో తలపడ్డాడు. ఆ రోజు ఎలాగో యుద్ధం సాగించాడు. సాయంకాలం ఉభయ సైన్యాలూ యుద్ధాన్ని విరమించాయి. కలుగోట్ల చేరుకున్న సోమనాద్రి ఆ రాత్రి తనవారితో సమాలోచన చేశాడు. "తెల్లవారేసరికి నా గుర్రాన్ని ఎవరు తెస్తారో, వారికి నా గుర్రం ఒక రోజంతా ఎంత భూమిలో తిరుగుతుందో అంత భూమిని ఇనాముగా ఇస్తాను," అని ప్రకటించాడు.

గద్వాలకు పదిమైళ్ళ దూరంలో 'బొచ్చెంగన్నపల్లి' అనే గ్రామం ఉంది. అక్కడినుంచి వచ్చిన బోయసర్దారు హనుమప్పనాయుడు ఈ విషయం తెలుసుకొన్నాడు. వెంటనే గుర్రాన్ని తేవడానికి సిద్ధపడ్డాడు. అతడు జొన్నచొప్పను ఒక మోపుగా కట్టి నెత్తిన కట్టుకొని నిజాం దేరాలను సమీపించాడు. ఆ మోపును అయిదు రూపాయలు ఇస్తేకానీ ఇవ్వను అంటూ బేరం కుదరనివ్వకుండా సోమనాద్రి గుర్రంకోసం ముందు దేరాలకు వెళ్తున్నాడు హనుమప్ప. ఒక ప్రత్యేక స్థలంలో గుర్రం కనపడింది. గుర్రంకూడా హనుమప్పను చూసి సకిలించింది. గుర్రం కళ్ళల్లో కాంతి, నిక్కించిన చెవులు, తలను ఆడించడం వంటి చేష్టలను చూసిన సిపాయిలు



హనుమప్పనాయుణ్ణి అనుమానంగా చూశారు. అయినా గుర్రం దంటుపుల్లలకోసం ఇలా చేసిందనుకొని సమాధానపడ్డారు.

గుర్రాన్ని చూసిన హనుమప్పనాయుడు చొప్పను అతి తక్కువ ధరకు విక్రయించాడు. కొంతసేపటికి ఒకడు వచ్చి క్రయధనం ఇచ్చి వెళ్ళిపోయాడు. ఇదే తగిన సమయమని భావించిన హనుమప్ప వెంటనే గుర్రపు పాగాలో ఉన్న గడ్డికుప్ప కిందికి దూరాడు. వెల్లకిలా పడుకున్నాడు. గుర్రం కూడా హనుమప్ప కనిపించకపోవడంతో తన్నుకుంటూ కాళ్ళకు కట్టిన గూటాన్ని ఊడబెరికింది. వెంటనే ఒక సిపాయి వచ్చి గూటాన్ని గడ్డిపై మోపి భూమిలోకి పాతాడు. హనుమప్పనాయుడి అరచేతిని చీల్చుకుని ఆ గూటం భూమిలోకి పాతుకుపోయింది.

నొప్పితో ప్రాణాలు పోయే స్థితి వచ్చినా, స్వామికార్యం తలుచుకుంటూ, కదలక మెదలక ఆ బాధను ఓర్చుకున్నాడు హనుమప్ప. అర్ధరాత్రి అయింది. సైనికులు అంతా నిద్రిస్తున్నారు. హనుమప్ప తనమీద ఉన్న గడ్డిని పక్కకు నెట్టి కూర్చున్నాడు. కుడి చేయి కదలడం లేదు. గూటం కూడా కదలడం లేదు. ఆలస్యం చేయకుండా ఎడమచేత్తో తన నడుముకు ఉన్న కత్తిని లాగాడు. కుడిచేతిని నరుక్కొన్నాడు. రక్తపు మడుగులో ఉన్న మొండి చేతిని తలపాగాలో చుట్టి గుర్రాన్ని తీసుకొని డేరాలు దాటించాడు.

అర్ధగంటలో, ఆనందంతో సోమనాద్రి ఎదుట గుర్రంతో నిలబడ్డాడు హనుమప్ప. ఎడమచేత్తో సలాం చేశాడు. రాజు కోపంతో కన్నెర్ర చేశాడు. హనుమప్ప తన మొండిచేతిని చూపించి, జరిగినదంతా వివరించాడు. రాజు ఆశ్చర్యపోయాడు. నాయుణ్ణి కౌగిలించుకొని సన్మానించాడు. అన్న మాట ప్రకారం అప్పటికప్పుడే ఒక దానశాసనాన్ని రాయించి ఇచ్చాడు. గుర్రాన్ని చూడగానే సోమనాద్రి ఉత్సాహం ఉరకలు వేసింది. ఉదయాన్నే తన సైన్యాన్ని వెంటపెట్టుకొని నిజాం సైన్యంమీద విరుచుకుపడ్డాడు. సోమనాద్రి జయభేరి ధ్వనులు నిజాంసైన్యం గుండెల్ని బద్దలుచేశాయి. సోమనాద్రిసైన్యం నిజాంసైన్యాన్ని దావానలంలా చుట్టుముట్టింది. భయంకరంగా యుద్ధం సాగింది.

ఆనాటి యుద్ధంలో ప్రాగటూరు, బళ్ళారి నవాబులు హతులయ్యారు. సాయంకాలానికి నిజాంసైన్యాన్ని కర్నూలు కోట వరకు తరమడం జరిగింది. సోమనాద్రి కూడా కొద్దిమంది సైన్యంతో నిజాం సైన్యాన్ని తరుముకుంటూ కర్నూలు కోటలోకి ప్రవేశించాడు. అంతలో అకస్మాత్తుగా కోట తలుపులు మూతపడ్డాయి. కొద్దిమందితో సోమనాద్రి కోటలోపల ఉన్నాడు; మిగిలిన సైన్యం కోట బయట ఉండిపోయింది.

గద్వాల సర్దారులకు భయం హెచ్చయింది. దిక్కు తోచడం లేదు. కోట తలుపులను చీల్చడానికి ముమ్మరంగా ప్రయత్నించారు. కాని ఫలితం లేకుండా పోయింది. కోట లోపల ఏం జరుగుతోందో, బయట ఉన్న గద్వాల సైన్యానికి తెలియడం లేదు. కొద్ది మందితోనే కోట లోపల ఉన్న తమ నాయకుడు మరణించి ఉంటాడని భావించారు. గద్వాలలో ఉన్న లింగమ్మరాణికి పరిస్థితిని తెలియజేస్తూ, తాము తిరిగి వస్తామని కబురు పంపారు. ఆ వీరనారి సమాధానంగా కొన్ని గాజులు, చీరలు, పసుపు, కుంకుమ పంపింది. గద్వాల



© SCERT not to be republished

సర్దారులకు సిగ్గు, క్రోధం కలిగాయి. వెంటనే రెట్టింపు పట్టుదలతో, ధైర్యంతో రంగంలోకి దిగారు. ఎట్టకేలకు కోట తలుపులను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు.

కోటలోపల కొద్దిమంది సైన్యంతోనే ఉన్న సోమనాద్రి ప్రాణాలపై ఆశ వదులుకొని వీరోచితంగా పోరాడుతున్నాడు. తన సైన్యం చాలావరకు హతమైంది. ఈలోగా బయట ఉన్న తన సైన్యం లోపలికి ప్రవేశించి తనకు బాసటగా నిలిచింది. నిజాం సైన్యంలో అలజడి హెచ్చింది. పిడికెడుమందితోనే సోమనాద్రి కోటలోపల అల్లకల్లోలం సృష్టించి, తప్పించుకున్నాడు. తెల్లవారితే ఇంకేం చేస్తాడో అని భయపడ్డారు. చావగా మిగిలిన గుత్తి, రాయచూరు నవాబులు యుద్ధవిముఖులయ్యారు. ఈ స్థితిలో సోమనాద్రితో సంధి చేసుకోవడమే అన్ని విధాలా మంచిదని మంత్రులు నిజాం నవాబుకు ముక్తకంఠంతో నచ్చజెప్పారు. ఈ యుద్ధానికి అసలు కారకుడయిన సయ్యద్ దావూద్ మియా ఏం చేయాలో తెలియక ఊరుకున్నాడు.

నిజాం నవాబు మరునాడు ఉదయమే సంధి కోరుతూ సోమనాద్రి దగ్గరకు ఒక రాయబారిని పంపాడు, సమయస్ఫూర్తి గల సోమనాద్రి కూడా సంధికి అంగీకరించాడు. యుద్ధపరిహారంగా కర్నూలులోని కొండారెడ్డి బురుజులో ఉన్న "ఎల్లమ్మ" ఫిరంగిని, రాయచూరు నవాబు అధీనంలో ఉన్న 'రామ, లక్ష్మణ' అనే పేర్లుగల రెండు ఫిరంగులను సోమనాద్రి స్వీకరించాడు. కర్నూలు ఏలుబడిలోని కొంతభాగాన్ని సోమనాద్రికి ఇచ్చారు. ఈ ప్రకారం సోమభూపాలుడు సంధి చేసుకొని, యుద్ధపరిహారం పొంది, విజయోత్సాహంతో గద్వాల కోటకు చేరుకున్నాడు.

యుద్ధం ముగిసిన తరువాత సోమనాద్రి తాను అన్నమాట ప్రకారం గుర్రం ఒక దినం తిరిగినంత భూమిని హనుమప్పనాయుడికి ఇనాముగా ఇచ్చాడు. ఈ నాటికీ బొచ్చెంగన్నపల్లిలో హనుమప్ప సంతతివారు ఆ భూములను అనుభవిస్తూ, తమకు ఆ భూమి ఎక్కువ కావటంవల్ల అందులో కొంత భూమిని ఇతరులకు ఇనాముగా ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకొన్నారు.

(కీ॥శే॥ సురవరం ప్రతాపరెడ్డిగారి "హైందవ ధర్మవీరులు" అనే గ్రంథం ఈ కథకు ఆధారం)

## ప్రశ్నలు :

1. పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో సంక్షిప్తంగా రాయండి.
2. సోమనాద్రిలో మీరు గమనించిన గొప్పదనాన్ని వివరించండి.
3. హనుమప్ప నాయుణ్ణి గురించి సొంతమాటల్లో రాయండి.
4. సోమనాద్రి వీరత్వాన్ని ప్రదర్శించిన సంఘటనలు ఏవి?
5. సోమనాద్రి గొప్ప వీరుడే కాకుండా, సమయస్ఫూర్తి కలిగినవాడని ఎలా చెప్పగలరు?
6. యుద్ధాలవల్ల కలిగే నష్టాలు ఏమిటి ?

**"మాతృదేశాన్ని ప్రేమించడంతో పాటు తోటి మనిషికి సేవ చేయడం నిజమైన దేశభక్తి" - స్వామి వివేకానంద.**




© SCERT not to be republished

మూడో యూనిట్

# 10. ఓ కూనలమ్మ !

-ఆరుద్ర

## ఆలోచించండి - మాట్లాడండి




## ప్రశ్నలు :

1. పై చిత్రంలో చెట్టు కింద ఎవరు కూర్చున్నారు?
2. అతను ఏమి చేస్తున్నాడు?
3. అతను దేన్ని గురించి చెపుతున్నాడు?
4. అతను చెప్పేదాన్ని బట్టి మీరేమి గ్రహించారు?

## నేపథ్యం :

జీవిత వైవిధ్యాన్ని అంత్యప్రాసలతో, సూక్తిప్రాయంగా, వ్యంగ్యంగా పాఠకుల కళ్లముందు ఉంచటం ఈ పాఠం ఉద్దేశం. ఇలాంటి విషయాలనే మరికొన్నింటిని "కూనలమ్మ పదాల" ద్వారా తెలుసుకుందామా? ప్రస్తుత పాఠ్యభాగం ఆరుద్ర రాసిన **'కూనలమ్మ పదాలు'** అనే పుస్తకం నుంచి తీసుకొన్నది.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.



మనసు తెలుపని భాష
మంచి పెంచని భాష
ఉత్త సంద్రపు ఘోష
ఓ కూనలమ్మ!

ఆశ పెరిగినవాడు
అహము పెరిగినవాడు
తనకు తానే కీడు
ఓ కూనలమ్మ!

భాగవతమున భక్తి
భారతములో యుక్తి
రామకథయే రక్తి
ఓ కూనలమ్మ!

పరుల తెగడుటవల్ల
బలిమి పొగడుటవల్ల
కీర్తి వచ్చుటకల్ల
ఓ కూనలమ్మ!

అణువు గుండెను చీల్చి
అమిత శక్తిని పేల్చి
నరుడు తన్నున బాల్చి?
ఓ కూనలమ్మ!

గుండెలో శూలమ్ము
గొంతులో శల్యమ్ము
కూళతో స్నేహమ్ము
ఓ కూనలమ్మ!

జనులు నమ్మెడివరకు
కనులు తెరవనివరకు
వెలుగు నకిలీసరుకు
ఓ కూనలమ్మ!

తీర్చినట్టి బకాయి
తెచ్చిపెట్టును హాయి
అప్పు మెడలో రాయి
ఓ కూనలమ్మ!

కూరుచుండిన కొమ్మ
కొట్టుకొను వాజమ్మ
హితము వినదు కదమ్మ
ఓ కూనలమ్మ!

సర్వజనులకు శాంతి
స్వస్తి, సంపద, క్రాంతి
నే కోరు విక్రాంతి
ఓ కూనలమ్మ!



© SCERT not to be republished

## కవి పరిచయం



| | | |
|---|---|---|
| పేరు | : | భాగవతుల సదాశివశంకరశాస్త్రి |
| కలంపేరు | : | ఆరుద్ర |
| కాలం | : | 1925–1998 |
| జన్మస్థలం | : | విశాఖపట్టణం. |
| రచనలు | : | త్వమేవాహం, సినీవాలి, కూనలమ్మ పదాలు, ఇంటింటి పజ్యాలు, శుద్ధమధ్యాక్కరలు, గాయాలు – గేయాలు, సమగ్రాంధ్ర సాహిత్యం మొ॥ |
| పురస్కారాలు | : | 1985లో ఆంధ్ర విశ్వవిద్యాలయం"కళాప్రపూర్ణ" (గౌరవ "డాక్టరేట్") పట్టాన్ని వీరికి ప్రదానం చేసింది. |

**భావం :**

1. భాష అనేది మనసులోని భావాన్ని తెలియజేయాలి. మంచిని పెంచాలి. అలా చేయలేకపోతే అది వట్టి సముద్రపు హోరు లాగా అర్థంలేనిది అవుతుంది.
2. ఆశలు ఎక్కువైనవాడు, అహంకారం పెరిగినవాడు, తనకు తానే చెడిపోతాడు.
3. భాగవతంలో భక్తి, భారతంలో యుక్తి (ఉపాయం), రామాయణంలో రక్తి (అనురాగం) ఉంటాయి.
4. ఇతరులను విమర్శించడంవల్ల, తన బలాన్ని పొగడుకోడంవల్ల మంచిపేరు రాదు.
5. మానవుడు తన మేధతో అణుపరిశోధన చేశాడు. అందులోని గొప్ప శక్తిని కనిపెట్టాడు. కాని దాన్ని సక్రమంగా వినియోగించుకోకపోతే అతనికే ముప్పు వస్తుంది.
6. చెడ్డవాడితో స్నేహం గుండెలో గుచ్చుకున్న ఈటె వంటిది; గొంతులో అడ్డుపడ్డ ఎముకవంటిది. ఎప్పుడూ ఇబ్బంది పెడుతుంది. కనుక చెడ్డవాడితో స్నేహం తగదు.
7. ప్రజలు నమ్మేవరకు, ఆ స్పృహ రానంతవరకు జ్ఞానం నకిలీ సరుకులా చెలామణి అవుతుంది.
8. అప్పు మెడకు తగిలించుకున్న బండరాయివంటిది. అప్పు తీర్చివేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది.
9. మంచి చెబితే మూర్ఖుడు వినడు. తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటాడు.
10. ప్రజలందరికీ శాంతి, సంపద, ఊరట, ప్రగతి కలగాలని నేను కోరుకుంటాను.



**ఇవి చేయండి :**



### I. వినడం-మాట్లాడడం



1. కూనలమ్మ గేయం ద్వారా "ఆరుద్ర" మనకు ఏం తెలుపుతున్నారు?
2. ఈ గేయంలో నీకు నచ్చిన భాగం ఏది? ఎందుకు?
3. కూనలమ్మ గేయాన్ని రాగంతో అభినయిస్తూ పాడండి.
4. కూనలమ్మ గేయంమీద మీ అభిప్రాయాన్ని చెప్పండి.
5. ఆరుద్ర "కూనలమ్మ" పదాలు రాయడంలో ఉద్దేశ్యం ఏమై ఉంటుంది?

© SCERT not to be republished

## II. చదవడం - రాయడం



1. కింది పేరాను చదవండి. ఒక్కొక్క వాక్యానికి రెండేసి ప్రశ్నలను తయారుచేయండి.

చెడ్డవాళ్ళతో స్నేహం గుండెలో గుచ్చుకున్న ఈటె వంటిది. అప్పు మెడకు తగిలించుకున్న బండరాయి వంటిది. అప్పును తీర్చివేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుంది. మూర్ఖుడు, మంచి చెబితే వినడు; తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కుంటాడు.

ఉదా : వాక్యం : చెడ్డవాళ్ళతో స్నేహం గుండెలో గుచ్చుకున్న ఈటెవంటిది.

1. ప్రశ్న : ఎవరితో స్నేహం గుండెలో గుచ్చుకున్న ఈటెవంటిది?
2. ప్రశ్న : చెడ్డవాళ్ళతో స్నేహం ఎటువంటిది?

అ. వాక్యం : ..............................................................

3. ప్రశ్న : ..............................................................
4. ప్రశ్న : ..............................................................

ఆ. వాక్యం : ..............................................................

5. ప్రశ్నలు : ..............................................................
6. ప్రశ్న : ..............................................................

ఇ. వాక్యం : ..............................................................

7. ప్రశ్నలు : ..............................................................
8. ప్రశ్న : ..............................................................

2. కూనలమ్మ పదాలలో భాష-ఘోష ; వాడు – కీడు ఇలాంటి ప్రాసపదాలు ఉన్నాయి. పాఠం చదవండి.ఇలాంటి ప్రాస పదాలు రాయండి.

3. కింది పదాలు చదవండి. వీటిని సరిగా రాస్తే పాఠంలోని ఒక భాగం అవుతుంది. సరిచేసి రాయండి.

తనకు ఓ కూనలమ్మ అహం వాడు తానే ఆశ పెరిగిన వాడు పెరిగిన కీడు ........................ ..................................



4. చిత్రం చూడండి దీనికి చెందిన వాక్యాలు పాఠంలో ఎక్కడ ఉన్నాయి? వాటిని రాయండి.

..............................................................

..............................................................



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

© SCERT not to be republished

....................................................................

....................................................................

....................................................................

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు ఆలోచించి జవాబులు రాయండి**

అ. కీర్తి గడించాలంటే ఏం చేయాలి? చరిత్రలో కీర్తి నార్జించినవారెవరు?

ఆ. అప్పు ఎందుకు చేస్తారు? అప్పు చేయటంవల్ల ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కొంటారు?

ఇ. మంచివారితోనే ఎందుకు స్నేహం చేయాలి?

ఈ. మూర్ఖులు అని ఎవరిని అంటారు? వాళ్ళ స్వభావం ఎలా ఉంటుంది?

ఉ. ప్రజలందరూ ఎలా ఉండాలని కవి కోరుకొన్నారు? ఎందుకు?

ఊ. కింది వాక్యాలు / సామెతలు చదవండి. పాఠంలో వీటికి సంబంధించిన పాదాలు ఏవో రాయండి. రెండింటికీ మధ్య ఉండే తేడాను పోల్చండి.

* భాషకు భావం ప్రాణం లాంటిది.
* దురాశ దుఃఖానికి చేటు !
* దుష్టులకు దూరంగా ఉండాలి.


**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు :**

**కింది అంశాన్ని సరైన కారణాలతో వివరించండి.**

అ. ఆశలు ఉండడం మానవులకు సహజం. ఐతే అదుపు తప్పిన ఆశలవల్ల అశాంతి కలుగుతుంది. ఎందుకంటే ...................................

ఆ. ఇతరులను విమర్శించడం, మనను మనం పొగడుకోవడం మంచివి కావు. ఎందుకంటే .......................................

## IV. పదజాలం



**1. కింది పదాలను జతపరచండి. వాక్యాలుగా రాయండి.**

| | | | |
|---|---|---|---|
| అ. భారతం | (   ) | 1. భక్తి | 1__________________ |
| ఆ. భాగవతం | (   ) | 2. శాంతి | 2. __________________ |
| ఇ. రామాయణం | (   ) | 3. యుక్తి | 3. __________________ |
| ఈ. సముద్రం | (   ) | 4. రక్తి | 4. __________________ |
| ఉ. ప్రజలు | (   ) | 5. ఘోష | 5. __________________ |

© SCERT not to be republished

**2. కింది వాక్యాలలోని గీతగీసిన పదాల అర్థాలతో వాక్యాలను తిరిగి రాయండి.**

అ. భారతంలో <u>యుక్తి</u> ఉన్నది.

ఆ. గొంతులో <u>శల్యం</u> అడ్డు తగిలింది.

ఇ. చెడ్డవాళ్ళకు కీర్తి రావడం <u>కల్ల</u>.

ఈ. మంచివాళ్ళు శత్రువులకు కూడా కీడు చేయరు.

ఉ. సింహం అహంకారంతో విచక్షణను కోల్పోయి కుందేలు మాటలను నమ్మింది.

**3. కింది పదాలను చూడండి. వాటికి ఒకటి రెండు అక్షరాలను చేరిస్తే వ్యతిరేక భావం వచ్చే పదాలుగా మారతాయి. వాటిని రాయండి.**

**ఉదా : ధర్మం .........అధర్మం**

అ. కీర్తి × ________________

ఆ. శాంతి × ________________

ఇ. హితం × ________________

ఈ. నమ్మకం × ________________

ఉ. ఆధారం × ________________

ఊ. శక్తి × ________________

పైన తెలిపిన పదం, దాని వ్యతిరేక పదం రెండింటినీ ఒకే వాక్యంలో ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.

**4. కింది పదాలకు అదే అర్థం వచ్చే పదాలను పట్టికనుంచి రాయండి.**

అ. కల్ల ______ _____

ఆ. కీర్తి ______ _____

ఇ. నరుడు ______ _____

ఈ. సంపద ______ _____

ఉ. స్నేహం ______ _____

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| అ | స | త్యం | గొ | ప్ప | పే | రు |
| బ్ధ | ల | ల | నె | మై | త్రి | నే |
| ము | క్ష్మి | చ్చి | య్యు | ప్రే | మ | స్త |
| మ | ని | షి | ము | సి | రి | ము |
| మా | న | వు | డు | యు | శ | ము |

**5. కింది ప్రకృతి పదాలకు వికృతి పదాలను జతచేయండి.**

అ. కీర్తి ( ) ఎ. బాస

ఆ. స్నేహం ( ) బి. సత్తి

ఇ. భాష ( ) సి. నెయ్యం

ఈ. శక్తి ( ) డి. సంద్రం

ఉ. సముద్రం ( ) ఇ. కీరితి

© SCERT not to be republished

## V. సృజనాత్మకత



1. జట్టుపని : భాషకు భావం ముఖ్యం కదా! అట్లాగే దేనికి ఏది ముఖ్యమో ఆలోచించండి. వీటితో ప్రాస ఉండేలా గేయం / కవిత రాయండి.

   ఉదా: మనిషికి మనసు ముఖ్యం.

2. కూనలమ్మ పదాలతో జనులందరికీ శాంతి, సంపద కావాలని కవి కోరారు కదా! దీన్నే ' 'సర్వేజనాః సుఖినో భవంతు'అంటారు. ఇది జరగడానికి మీరైతే ఏం చేస్తారు? ఊహించి రాయండి.

3. కూనలమ్మ పదాలకు అనుగుణంగా మంచి వాక్యాలు / సూక్తులు / నినాదాలు రాయండి.

## VI. ప్రశంస



1. మీ తరగతిలో ఈ పాఠాన్ని ఎవరు బాగా పాడగలరు?
2. మీరు చదివిన ఓ మంచి కవిత / గేయం ఎవరు రాశారు? అది మీకు ఎలా అనిపించింది?
3. భారతం, భాగవతం, రామాయణం కథలను తెలుసుకోండి. మీ మిత్రులకు చెప్పండి.

## VII. ప్రాజెక్టు పని



1. గేయభావాలకు సరిపోయే కథలను సేకరించి రాయండి. వాటిని గోడపత్రికలో ప్రదర్శించండి.
2. ఆరుద్ర రాసిన ఇతర కవితలను, పాటలను సేకరించండి. వాటిమీద మీ అభిప్రాయాలను రాయండి.
3. కూనలమ్మ పదాలకు అనుగుణంగా ఉండే సామెతలు సేకరించండి. చదివి వినిపించండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**1. ఈ కింది పదాలను విడదీయండి. మార్పును గమనించండి.**

(అ) ఉదా: అత్యానందం = అతి + ఆనందం = (త్ +) ఇ + ఆ = యా

(1) అత్యంతం = ........ + .......... = .................

(ఆ) ఉదా: అణ్వస్త్రం = అణు + అస్త్రం = (ణ్ +) ఉ + అ = వ

(2) గుర్వాజ్ఞ = ........ + ........... = .................

© SCERT not to be republished

(ఇ) ఉదా: పిత్రాజ్ఞ = పితృ + ఆజ్ఞ = (ఋ + ఆ = ర్)

(3) మాత్రంశ = ............+ ............ = .................

'ఇ – ఉ – ఋ'లకు అసవర్ణాలు (వేరే వర్ణాలు) వచ్చినప్పుడు క్రమంగా వాటికి 'య – వ – ర' లు వచ్చాయి. వీటిని 'యణ్ణులు' అంటారు. ఇవి చేరినపుడు ఏర్పడే సంధిని 'యణాదేశసంధి' అంటారు.

'ఇ' కి బదులుగా = య్

'ఉ' కి బదులుగా = వ్

'ఋ' కి బదులుగా = ర్ వచ్చాయి.

**2. ఈ కింది పదాలను విడదీయండి.**

ఉదా: ప్రత్యహం = ప్రతి + అహం = ( ఇ + అ = య )

(అ) ప్రత్యుత్తరం = .............+ .............= (........ +....... = .......)

(ఆ) మధ్వరి = .............+ .............= (........ +....... = .......)

(ఇ) పిత్రార్జితం = .............+ .............= (........ +....... = .......)



**నేనివి చేయగలనా ?**

| | |
|---|---|
| 1. కూనలమ్మ పదాలు రాగంతో పాడగలను. | ఔను / కాదు |
| 2. కూనలమ్మ పదాలలోని భావాన్ని సొంత మాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. కూనలమ్మ పదాలలోని ప్రాస పదాలను, చమత్కార పదాలను ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 4. కూనలమ్మ పదాల భావాన్ని సొంత మాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 5. కూనలమ్మ పదాల లాగా చిన్న కవితను రాయగలను. | ఔను / కాదు |


" మర్రివిత్తనమంత చిన్న పద్యంలో మహావృక్షమంత అనుభవాన్నివ్వగలవాడే మహాకవి" ......... బైరన్

© SCERT not to be republished

**మూడవ యూనిట్**

# 11. మన భాషలు

## ఆలోచించండి - మాట్లాడండి :




## ప్రశ్నలు :

1. పై చిత్రంలో ఉపాధ్యాయిని ఏం అడుగుతోంది?
2. పిల్లలు ఎన్ని భాషల్లో జవాబులు చెప్పారు?
3. అందులో మీకు తెలిసిన భాషలు ఎన్ని?

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.

**భారతి** : (సౌధమంటే భవనం, సౌధమంటే భవనం. ఇలా చదువుతూ) అమ్మా... చెల్లెల్ని చూడు, నేను చదువుకుంటూంటే ఏవేవో శబ్దాలు చేస్తూ ఆటంకం కలిగిస్తోంది.

**అమ్మ** : ఏయ్ ... సుధాత్రీ ఇక్కడికిరా! ఎందుకలా గోల చేస్తున్నావ్? అక్కయ్యను చదువుకోనియ్యి.

**మామయ్య**: భారతీ! ఓసారి ఇలా రామ్మా! ఈ పుస్తకం నీదేనా? ఏమిటి చదువుతున్నావు?

**భారతి** : "ఆడినమాట" పాఠం 'ఆవు పులి' కథ మామయ్యా!

**మామయ్య**: ఈ పాఠంలో "పూరియు మేయ నేర..." ఈ పంక్తిలో పూరి అనే శబ్దానికి అర్థమేమిటో తెలుసా?

**భారతి** : పూరి అంటే పూరీ. మనం తినేది.

**మామయ్య**: (నవ్వుతూ...) కాదు కాదు. పశువులు మేసే పూరి – అంటే గడ్డి.

**భారతి** : ఓహో! అయితే ఈ పూరి వేరన్నమాట. ఔను మామయ్యా! ఇందాక నువ్వు శబ్దం అని అన్నావు. మరీ, ఓ గ్లాసు కింద పడినప్పుడూ, టపాసులు కాల్చినప్పుడూ అయ్యే చప్పుడును కూడా శబ్దం అని అంటాం కదా! అదీ ఇదీ ఒక్కటేనా?

**మామయ్య**: కాదు. మనం గుర్తుపట్టడానికి వీలయ్యే ధ్వని ఒకటి, మనం భావం గ్రహించడానికి వాడే పదం ఒకటి. ఇలా శబ్దాన్ని రెండు అర్థాల్లో వాడవచ్చు. నువ్వన్నట్లుగా ప్రతి ధ్వనికీ లేదా ప్రతి శబ్దానికీ అర్థాలుండవు.
ఉదా: పిల్లలు, బుడతలు అనే పదాలు అర్థవంతమైన ధ్వనులు / శబ్దాలు.
ల్లలుపి, దలుతబు ఇవి ధ్వనులే కాని అర్థవంతమైన శబ్దాలు కావు. అంటే మాటలు కావన్నమాట.

**భారతి** : మామయ్యా! చేతులతో సైగలు కూడా చేస్తాం కదా!

**మామయ్య**: అదీ నిజమే. సైగలు కూడా మన భావాల్ని ఇంకొకళ్ళకి చెప్పడానికే ఉపయోగపడతాయి.

**భారతి** : మన భావాల్ని చెప్పడానికి మాట్లాడతాం, రాస్తాం కదా!

**మామయ్య**: అలా మాట్లాడినదాన్ని మనం ఏమంటామో తెలుసా?

**భారతి** : "భాష" అంటాం కదా! మరి రాసేదాన్ని ఏమంటాం?

**మామయ్య**: అదీ భాషే. అంటే, నోటి భాషకు రాత రూపమన్నమాట. ఇందాకా నువ్వు సైగలు అన్నావు కదా! అది కూడా ఒకరకంగా భాషే.

**భారతి** : అయితే భాష ఇన్ని విధాలుగా ఉంటుందన్నమాట!

**మామయ్య** : ఔను. మాట్లాడే భాషను "వాగ్రూపభాష" అని, రాసే భాషను "లిఖితరూప భాష" అని, సైగల భాషను "సంకేతభాష" అని అంటాం. అంటే భాష వాగ్రూపంగానూ, లిఖితరూపంగాను, సంకేతరూపంగాను ఉండవచ్చు.

**భారతి** : మూగ, చెవిటివాళ్ళు సంకేత భాషను వాడతారు కదా!

**మామయ్య** : వాళ్ళే కాదు మనమందరం వాడతాం. కళ్ళతో, చేతులతో మనం చేసే సైగలు, మనం జ్ఞాపకం పెట్టుకోడానికి వాడే గుర్తులు మొదలైనవన్నీ సంకేతాలే. దేశ రక్షణ సమాచారాన్ని చేరవేయడానికి, వైజ్ఞానిక అంశాల్ని గుర్తుంచుకోడానికి లిఖిత సంకేతాలను ఉపయోగిస్తారు. మన ఆలోచనలు కూడా భాషలోనే సాగుతాయి తెలుసా?

**భారతి** : అదెలా?





©SCERT not to be republished

**మామయ్య:** ఇప్పుడు, నువ్వు ఓ విషయం గురించి చెప్పాలనుకున్నప్పుడు ముందు ఆలోచిస్తావు కదా! అంటే ఆ ఆలోచన నువ్వు మాట్లాడే భాషలోనే ఉంటుందా, లేదా?

**భారతి** : ఔను. నిజమే. మనకు వచ్చే కలల్లో కూడా భాష ఉంటుంది కదా మామయ్యా!


**అమ్మ** : మనం మెలుకువగా ఉన్నప్పుడు మాట్లాడే భాషే కలలో కూడా వినిపిస్తుంది. భాషవల్ల మనకు చాలా ఆనందం కలుగుతుంది. ఆనందమే కాదు, మన పూర్వికుల గాథలు, కథలు, సంస్కృతి సంప్రదాయాలు, చరిత్ర... ఇలా ఒకటేమిటి అనేకమైనవాటిని, భాషవల్లనే మనం పొందుతున్నాం.



**మామయ్య:** భారతీ! మీ అమ్మ చెప్పింది అక్షరాలా నిజం.


**భారతి** : ఆటలు, పాటలు, నాటికలు, ఉపన్యాసాలు, మిమిక్రి, ప్రకటనలు ..... ఇలా అన్నింటిలోనూ మనం భాషను ఉపయోగిస్తూనే ఉంటాం కదా అమ్మా!

**అమ్మ** : రోజూ మనం చదివే పత్రికల్లో, మనం పాడుకునే గేయాల్లో, కవుల రచనల్లో, నిత్యం రాసుకునే డైరీల్లో, కరపత్రాల్లో ... ఇలా అనేక వ్యవహార రూపాల్లో భాష మనకు కనిపిస్తుంది.




**మామయ్య:** శిలాశాసనాల్లోని భాష ఆధారంగానే మనం కొంత చరిత్ర తెలుసుకోగలుగుతున్నాం భారతీ!

**భారతి** : మామయ్యా! మా తరగతిలో కొంతమంది పిల్లలు మాట్లాడుతుంటే నాకస్సలు అర్థంకాదు. వాళ్ళదేదో వేరే భాష అని అంటారు.



**మామయ్య:** మనం తెలుగు ఎలా మాట్లాడుకుంటున్నామో, వాళ్ళు వాళ్ళ భాషలో అలానే మాట్లాడుకుంటారు.



**భారతి** : వాళ్ళ భాష అంటే ... ఒక్కొక్కరికి ఒక్కో భాష ఉంటుందా?

**మామయ్య:** అలా కాదు. ఒక్కొక్కరికి ఒక్కో భాష అని కాదు. ప్రాంతాలు, పరిసరాలు, మొదలైన అంశాలను బట్టి ఆయా వ్యక్తులు ఆయా భాషలు మాట్లాడుతూంటారు.


**భారతి** : ఒక్కరే ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చా?



**అమ్మ** : ఔను. నేర్చుకోవచ్చు. మీ మామయ్య తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు, తమిళం, బెంగాలీ భాషల్లో మాట్లాడగలడు తెలుసా!

**భారతి** : అమ్మబాబోయ్! మామయ్యకు ఆరు భాషలు వచ్చా!

**మామయ్య:** మన రాష్ట్రంలో ఏ యే భాషలు మాట్లాడేవాళ్ళున్నారో తెలుసా?



© SCERT not to be republished

**భారతి** : తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు మాట్లాడేవాళ్ళున్నారు.

**మామయ్య:** అంతేకాదు. మన రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో కొండ, కోయ, కువి, గదబ, కొలామి, బంజారా, గోండి, ఆదివాసి ఒరియా, సవర వంటి భాషలతోపాటు ఎరుకల, చెంచువంటి భాషలు మాట్లాడేవాళ్ళున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మరాఠీ, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కన్నడం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో తమిళం, శ్రీకాకుళం జిల్లాలో ఒరియా భాషలను కొందరు మాట్లాడుతారు. వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, హైదరాబాదు, కడప మొదలయిన జిల్లాల్లో ఉర్దూ మాట్లాడే ప్రజలుచాలా మంది ఉన్నారు. ముస్లింల మాతృభాష ఉర్దూ అయినప్పటికీ ఉర్దూతో పాటు తెలుగు కూడా మాట్లాడతారు. అలాగే తెలుగు మాట్లాడేవాళ్ళలో కొంతమంది ఉర్దూ కూడా మాట్లాడతారు.

**భారతి** : అసలింతకూ మన దేశంలో ఎన్ని భాషలున్నాయి మామయ్యా?

**మామయ్య:** ఇది కూడా మంచి ప్రశ్న. మన దేశంలో 1652 భాషలు ఉన్నాయట. ప్రపంచంలో ఏడు వేల పైచిలుకు భాషలున్నాయని ఒక అంచనా.

**భారతి** : అమ్మో! ఇన్ని భాషలా?

**అమ్మ** : భారతీ! పది రూపాయల నోటుమీద "పది రూపాయలు" అని అనేక భాషల్లో రాసి ఉంటుంది. గమనించావా?

**భారతి** : లేదమ్మా!

**మామయ్య:** ఇదుగో చూడు. ఒక్క పది రూపాయలనోటుమీదే కాదు, ప్రతి నోటుమీదా ఉంటాయి.

**భారతి** : ఔను, నిజమే. మామయ్యా! ప్రాచీన కాలంలో పుట్టిన భాషలు ఇప్పటికీ ఉన్నాయికదా మరి!

**మామయ్య:** కొన్ని వేల ఏళ్ళనుండి వాడుకలో ఉన్న భాషను ప్రాచీన భాష అంటాం. మన కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యనే తమిళం, సంస్కృతం, కన్నడం, తెలుగు భాషలను ప్రాచీన భాషలుగా కూడా గుర్తించింది.

**భారతి** : ఓహో? అలానా!

**అమ్మ** : ఒరియా, కాశ్మీరీ, అస్సామి, బెంగాలి, మణిపురి మొదలైన భాషలన్నీ మన దేశంలో మాట్లాడే భాషలే తెలుసా?

**భారతి** : తెలియదు. అబ్బబ్బా, అన్ని భాషలా? అసలు ఇన్ని భాషలు ఎందుకు తయారుచేశారో?

**మామయ్య:** ఇది ఎవరో ఒకరు, ఎప్పుడో కూర్చుని చేసే పని కాదమ్మా. మనిషి మాట్లాడడం మొదలు పెట్టినప్పటినుండే భాషలు ఆవిర్భవించాయి. ఇది సహజంగా జరిగిన ప్రక్రియ.

**భారతి** : మామయ్యా! పాత సినిమాల్లోని భాష, కొన్ని పుస్తకాల్లోని భాష, తొందరగా అర్థం కాదెందుకూ? అదీ తెలుగేగా?

**మామయ్య:** ఆయా కాలాల్లో భాష అలానే వాడేవారు. తరవాత మారింది.

**భారతి** : ఓ అలాగా! భాష మారుతూంటుందా?

© SCERT not to be republished

**అమ్మ** : ఔను. భాష అనేది గంగాప్రవాహంలాంటిది. ఎప్పుడూ ఒకే రకంగా ఉండదు. భాషా వ్యవహారం నిరంతరం మారుతూ ఉంటుంది. ఇతర భాషల్లోని పదాల్ని కొన్నిటిని తాను తీసుకుంటుంది. కొన్నిటిని వదిలేస్తుంది. ఒక భాష ప్రభావం చుట్టుపక్కల భాషలమీద పడుతూ ఉంటుంది. అది సహజం.

**భారతి** : మామయ్యా! నువ్వు ఇంతకు ముందు లిపి ఉన్న భాషలు అని అన్నావు కదా! లిపిలేని భాషలూ ఉంటాయా?

**మామయ్య** : కొన్ని భాషల వాళ్ళు వాళ్ళ భావాలను తెలపడానికి కొన్ని గుర్తులు పెట్టుకున్నారు. ఆ గుర్తులను వాడగా వాడగా రాతలో అక్షరాలు ఏర్పడ్డాయి. ఆ అక్షరాల గుర్తులతో రాసే విధానాన్ని లిపి అంటారు. మిగిలిన భాషల వాళ్ళు కొందరు రాసుకోడానికి ఆ విధంగా లిపిని తయారుచేసుకోలేదు. ఇతరుల లిపిని వాడుకోనూ లేదు. కాబట్టి కొన్ని భాషలకు లిపి లేదు. ఈ లిపి కూడా మారుతూ వచ్చింది. ఇప్పుడు అనేక భాషల లిపుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి.

**భారతి** : నువ్వు మొదట్లో లిఖితరూప భాష అన్నావుకదా! అది ఇదేనా?

**మామయ్య** : ఔను. భాషకు లిఖిత రూపం రావటం వల్లనే వైజ్ఞానికాభివృద్ధి సాధ్యమైంది.

**భారతి** : తాళపత్రగ్రంథాలు అంటారు కదా! అంటే ఏమిటి?

**మామయ్య** : లిపిని మొదట బంకమట్టి బిళ్ళల మీద, ఇటుకలమీద, చెట్లమీద, బండలమీద, భూర్జపత్రాల మీద ఆ తర్వాత తాటాకులమీద రాయటం అలవాటు చేసుకున్నారు. తాటాకులమీద ఘంటంతో రాసిన పుస్తకాల్ని తాళపత్రగ్రంథాలని అంటాం. తాళపత్రం అంటే తాటాకు అన్నమాట.

**భారతి** : మనమిప్పుడు అచ్చుపుస్తకాలు చదువుతున్నాం కదా!

**మామయ్య** : ఔను. ముద్రణకంటే ముందు రాగిరేకులమీద చెక్కేవారు. అన్నమాచార్యులవారు పాడిన ఎన్నో పాటలను రాగిరేకుల మీద చెక్కించారు.

**భారతి** : ముద్రణయంత్రం రావటం లిఖిత భాషకు మంచిదైంది కదా మామయ్యా!

**మామయ్య** : బాగా చెప్పావు. పుస్తక ముద్రణ అనేది అనేక భాషల సాహిత్యాలను బతికిస్తూ ఉంది. అనేక వైజ్ఞానిక, సాంస్కృతిక, చారిత్రక, సాంఘిక విషయాల సంపదను తరతరాలవాళ్ళు అందుకొని కాపాడుకోడానికి వీలు కల్పించింది.

**భారతి** : మామయ్యా! భాషలను గురించి తెలుసుకొంటున్న కొద్దీ ఇంకా తెలుసుకోవాలనిపిస్తూంది.

**అమ్మ** : భారతీ! నేటికి ఇక చాలమ్మా! తెలుసుకొన్న విషయాల్ని చక్కగా గుర్తుంచుకొని నీ స్నేహితురాళ్ళతో చర్చించు. ఇక భోజనం చేద్దాం పదండి.

© SCERT not to be republished

**అమ్మ** : ఔను. భాష అనేది గంగాప్రవాహంలాంటిది. ఎప్పుడూ ఒకే రకంగా ఉండదు. భాషా వ్యవహారం నిరంతరం మారుతూ ఉంటుంది. ఇతర భాషల్లోని పదాల్ని కొన్నిటిని తాను తీసుకుంటుంది. కొన్నిటిని వదిలేస్తుంది. ఒక భాష ప్రభావం చుట్టుపక్కల భాషలమీద పడుతూ ఉంటుంది. అది సహజం.

**భారతి** : మామయ్యా! నువ్వు ఇంతకు ముందు లిపి ఉన్న భాషలు అని అన్నావు కదా! లిపిలేని భాషలూ ఉంటాయా?

**మామయ్య** : కొన్ని భాషల వాళ్ళు వాళ్ళ భావాలను తెలపడానికి కొన్ని గుర్తులు పెట్టుకున్నారు. ఆ గుర్తులను వాడగా వాడగా రాతలో అక్షరాలు ఏర్పడ్డాయి. ఆ అక్షరాల గుర్తులతో రాసే విధానాన్ని లిపి అంటారు. మిగిలిన భాషల వాళ్ళు కొందరు రాసుకోడానికి ఆ విధంగా లిపిని తయారుచేసుకోలేదు. ఇతరుల లిపిని వాడుకోనూ లేదు. కాబట్టి కొన్ని భాషలకు లిపి లేదు. ఈ లిపి కూడా మారుతూ వచ్చింది. ఇప్పుడు అనేక భాషల లిపుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి.

**భారతి** : నువ్వు మొదట్లో లిఖితరూప భాష అన్నావుకదా! అది ఇదేనా?

**మామయ్య** : ఔను. భాషకు లిఖిత రూపం రావటం వల్లనే వైజ్ఞానికాభివృద్ధి సాధ్యమైంది.

**భారతి** : తాళపత్రగ్రంథాలు అంటారు కదా! అంటే ఏమిటి?

**మామయ్య** : లిపిని మొదట బంకమట్టి బిళ్ళల మీద, ఇటుకలమీద, చెట్లమీద, బండలమీద, భూర్జపత్రాల మీద ఆ తర్వాత తాటాకులమీద రాయటం అలవాటు చేసుకున్నారు. తాటాకులమీద ఘంటంతో రాసిన పుస్తకాల్ని తాళపత్రగ్రంథాలని అంటాం. తాళపత్రం అంటే తాటాకు అన్నమాట.

**భారతి** : మనమిప్పుడు అచ్చుపుస్తకాలు చదువుతున్నాం కదా!

**మామయ్య** : ఔను. ముద్రణకంటే ముందు రాగిరేకులమీద చెక్కేవారు. అన్నమాచార్యులవారు పాడిన ఎన్నో పాటలను రాగిరేకుల మీద చెక్కించారు.

**భారతి** : ముద్రణయంత్రం రావటం లిఖిత భాషకు మంచిదైంది కదా మామయ్యా!

**మామయ్య** : బాగా చెప్పావు. పుస్తక ముద్రణ అనేది అనేక భాషల సాహిత్యాలను బతికిస్తూ ఉంది. అనేక వైజ్ఞానిక, సాంస్కృతిక, చారిత్రక, సాంఘిక విషయాల సంపదను తరతరాలవాళ్ళు అందుకొని కాపాడుకోడానికి వీలు కల్పించింది.

**భారతి** : మామయ్యా! భాషలను గురించి తెలుసుకొంటున్న కొద్దీ ఇంకా తెలుసుకోవాలనిపిస్తుంది.

**అమ్మ** : భారతీ! నేటికి ఇక చాలమ్మా! తెలుసుకొన్న విషయాల్ని చక్కగా గుర్తుంచుకొని నీ స్నేహితురాళ్ళతో చర్చించు. ఇక భోజనం చేద్దాం పదండి.

© SCERT not to be republished





## I. వినడం-మాట్లాడడం



1. భాషలు లేకుంటే ఏమి జరిగేది?
2. మీ గ్రామంలో లేదా నగరంలో ఏ ఏ భాషలు మాట్లాడేవాళ్ళున్నారు?
3. హైదరాబాదులోని పోలీస్ బాయిస్ పాఠశాలలో ఉర్దూ, తెలుగు, హిందీ, కన్నడం, మళయాళం భాషలు మాట్లాడే పిల్లలున్నారు. ఇలా వివిధ భాషలు మాట్లాడే పిల్లలు ఒకే పాఠశాలలో ఉండడంవల్ల కలిగే ప్రయోజనమేమిటి?
4. భాష విషయంలో మనుషులకు, జంతువులకు గల తేడా ఏమిటి?

## II. చదవడం - రాయడం



**1. కింది పదాలలో ఈ పాఠంలో మొట్టమొదట వాడింది ఏది?**

(అ) వాగ్రూప భాష (ఆ) లిఖితరూప భాష (ఇ) సంకేత భాష

**2. భాషకు, ఆలోచనకు మధ్యగల సంబంధాన్ని గురించి పాఠంలో ఎవరు చెప్పారు? ఆ వాక్యాలను గుర్తించండి.**

**3. పద్యం చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

కోకిలమ్మ చేసుకున్న పుణ్యంబేమి
కాకి చేసుకున్న కర్మమేమి?
మధుర భాషణమున మర్యాద ప్రాప్తించు
లలితసుగుణ జాల తెలుగు బాల!



**ప్రశ్నలు:**

అ. మర్యాద ఎలా లభిస్తుంది?

ఆ. కాకి - కోకిల: వీటిని గురించి ఏమర్థమైంది?

ఇ. మధుర భాషణమంటే ఏమిటి?

**4. కింద ప్రశ్నలకు పాఠం చదివి జవాబులు రాయండి.**

(అ) మన భావాలను ఇతరులకు ఎలా తెలియజేస్తాం?

(ఆ) వాగ్రూప, లిఖిత రూప, సంకేత భాషలంటే ఏమిటి?

(ఇ) మన రాష్ట్రంలో ఏయే భాషలు మాట్లాడేవాళ్ళున్నారు?

(ఈ) ప్రాచీన భాష అంటే ఏమిటి? మీకు తెలిసిన ప్రాచీన భాషల పేర్లు తెలపండి.

(ఉ) భాషకు లిపి ఎలా ఏర్పడింది?

(ఊ) ముద్రణ యంత్రాల వల్ల భాషకు కలిగిన మేలేమిటి?

(ఋ) ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ భాషను వాడుతుంటాం?

© SCERT not to be republished

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు మూడు నాలుగు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

(అ) నీకు భాష ఎలా వచ్చిందని అనుకుంటున్నావు?

(ఆ) సంకేత భాషను మాటలు వచ్చినవాళ్ళు కూడా వాడతారు. దీనిమీద మీ అభిప్రాయమేమిటి? కారణాలు వివరించండి.

(ఇ) ఎక్కువ భాషలు నేర్చుకోడంవల్ల వ్యక్తికి కలిగే లాభమేమిటి?

(ఈ) "భాష మార్పుకు లోనవుతూ ఉంటుంది." అనే విషయాన్ని గురించి వివరించండి.

(ఉ) "ధ్వనులన్నీ మాటలు కావు. మాటలన్నీ ధ్వనులే" ఎందువల్ల?

(ఊ) ఈ పాఠానికి "మన భాషలు" అనే శీర్షిక కాకుండా ఏ శీర్షిక పెడితే బాగుంటుందనుకుంటున్నారు?

**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు.**


(అ) మన భాషలు – ప్రయోజనాలు గురించి పది పంక్తుల్లో వ్యాసాన్ని రాయండి.

(ఆ) "పుస్తక ముద్రణ అనేక భాషల సాహిత్యాలను బతికిస్తూంది." ఈ అభిప్రాయాన్ని సమర్థిస్తూ పది వాక్యాలు రాయండి.

(ఇ) మనం భాషను వాడకుండా ఉండలేము. దీనికి కారణాలు తెలపండి.

© SCERT not to be republished

## IV. పదజాలం



**1. కింది వాక్యాలను చదవండి. వాటిలో ఎక్కువ సార్లు వాడిన పదాన్ని గుర్తించి ఆ పదానికి వివిధ సందర్భాల్లో వచ్చిన అర్థాల్ని రాయండి.**

(అ) ప్రధానోపాధ్యాయులను వేదికపైకి దయచేయవలసిందిగా కోరుతున్నాం.

- చెప్పింది చాలు. ఇక మీరు దయచేయవచ్చు.
- దయచేసి మీరు మరోలా అనుకోవద్దు.

1. .................... 2. ................... 3. .....................

(ఆ) నా మాట వింటున్నావా?

- అన్న మాటమీద అతను నిలబడ్డాడు.
- ఆమె మాటపడే మనిషి కాదు.
- నా మాటంటే లెక్కలేదా?
- వాడు మాటలు నేర్చాడు.

1. .......................... 2. ..........................

3. .......................... 4. ..........................

(ఇ) సోముకు మాటే బంగారం.

- నేడు బంగారం ధర పెరిగింది.
- పట్టిందల్లా బంగారం అవుతోంది.
- ఎవరి బిడ్డ వారికి బంగారం.
- నువ్వు నా బంగారం కదూ!

1. ........................ 2. ........................

3. ........................ 4. ........................

**2. పై అభ్యాసం ద్వారా నువ్వు గ్రహించినదేమిటి?**

**3. కింది వాక్యాలలో గీత గీసిన పదాల అర్థాలను పక్కన రాయండి.**

(అ) భారత నేలపై వీరు లెందరో! ............................

- ధరిత్రీ గోళాన్ని కాపాడుకోవాలి............................
- ధరపై ప్రవహించే నదులెన్నో?............................
- ఈ వసుంధరను పాలించిన వారెందరో!............................
- ధాత్రిపై పుట్టిన మహనీయులెందరో!............................

(ఆ) దేవునికి పుష్పాలను అర్పిస్తాను. ..........................

- గులాబీ సుమాలు ప్రేమకు సంకేతాలు............................
- మల్లె కుసుమాలకు చక్కని వాసన ఉంటుంది. ........................
- జాజివిరులు కంఠమాలకు ఉపయోగిస్తారు..................

**4. కింది మాటలను చదవండి. వాటితో వాక్యాలు రాయండి.**

ఉదా: ఓహో! : ఓహో! అలా అన్నారా, ఆయన?

(అ) అమ్మో! : ..................................................

(ఆ) అయ్యో! : ..................................................

(ఇ) అమ్మబాబోయ్! : ............................

(ఈ) వారెవ్వా! : ..........................................

(ఉ) అలానా! : ..........................................

**5. కింది పదాలను చదవండి. వీటిలో ఏవి భాషకు సంబంధించినవి? ఏవి కావు? పట్టికలో రాయండి.**

పులి గాండ్రింపు, తబలా శబ్దం, పాటపాడడం,
వీణా వాద్యం, బల్లను కొట్టడం, భజన చేయడం,
కుక్క మొరగటం, పత్రిక చదవడం, రైలు కూయడం,

© SCERT not to be republished

ఒగ్గుకథ, వార్తలు చదవడం, హరికథ,

గ్లాసు పగిలిన శబ్దం, పోస్టరు చదవడం, బుర్రకథ

| భాషకు సంబంధించినవి | భాషకు సంబంధించనివి |
|---|---|
| హరికథ | కుక్క అరుపు |

## V. సృజనాత్మకత



1. మీ తరగతిలోనివాళ్ళు రెండు జట్లుగా కూర్చోండి. ఒక జట్టువాళ్ళు ఏదైనా ఒక పదం/పేరును మూగగా అభినయం చేసి చూపండి. రెండో జట్టువాళ్ళు దాన్ని గుర్తించి భాషలో చెప్పండి.
2. మీకు తెలిసిన ఏదైనా ఒక కథను ఎంపిక చేసుకోండి. దాన్ని మాటలు లేకుండా సైగలు /సంకేతాల ద్వారా అభినయంచేసి చూపండి.

## VI. ప్రశంస



**1. "దేశమును ప్రేమించుమన్నా**
**మంచియన్నది పెంచుమన్నా"**

పై రెండు వాక్యాలే ఇతర భాషలలో ఈ కింది విధాలుగా ఉంటాయి. ఇవి ఏ భాషలలో ఉన్నాయో చెప్పగలరా? ఇవి ఏ భాష లిపిలో ఉన్నాయో రాయండి.

(అ) దేశమిహ ప్రీణాతు మిత్ర
సుజనతాం పోషయతు మిత్ర! ......................................

(ఆ) దేశ్ ప్రేమ్ తుమ్ కర్‌లో భాయీ
ఫైలే జిస్‌కో కహే భలాయీ! ......................................

(ఇ) వతన్‌సే సదా ప్యార్ కర్‌తే రహో
భలాయీకో హర్‌పల్ బఢాతే చలో ......................................

(ఈ) దేశవన్ను ప్రీతి సణ్ణా
ఒళిత నెంబుదు బెళెసి రణ్ణా! ......................................

(ఉ) నాట్టైనేశిప్పాయ్ తోళా
నల్లదై వళర్త్తిడు తోళా! ......................................

**2. కింది పదాలను ఏయే భాషలలో ఏమంటారో రాయండి.**

| పదం | హిందీ | ఉర్దూ | సంస్కృతం | ఆంగ్లం | కన్నడం | తమిళం |
|---|---|---|---|---|---|---|
| దేశం | ........ | ......... | .......... | ......... | .......... | ........ |
| మంచి | ........ | ......... | .......... | ......... | .......... | ........ |
| ప్రేమించు | ........ | ......... | .......... | ......... | .......... | ........ |

©SCERT not to be republished

**3\. పదిరూపాయల నోటుమీదున్న మాటలు ఏ ఏ భాషలలో ఉన్నాయో చెప్పగలరా? ప్రయత్నించండి.**

## VII. ప్రాజెక్టు పని



1. రెండు రోజులపాటు ఏ ఇతర భాషాపదాలూ వాడకుండా తెలుగులోనే మాట్లాడండి. ఇలా మాట్లాడేటప్పుడు ఏ ఏ పదాలు, మాట్లాడడంలో ఇబ్బంది కలిగించాయి? ఏ ఏ పదాలను సులభంగా చెప్పారు. ఇలా తెలుగులోనే మాట్లాడేటప్పుడు మీకు ఎలా అనిపించింది? మీ అనుభవాలను చెప్పండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**1. ఈ కింది పదాలను విడదీయండి.**

(అ) దేవాలయం = ......... + ..........= (..... + ..... = .....)

(ఆ) శైలాగ్రం = ......... + ......... = (..... + ..... = .....)

(ఇ) మధూదయం = .......... + ......... = (..... + ..... = .....)

(ఈ) దేశాభిమానం = ......... + ..........= (..... + ..... = .....)

**2. ఈ కింది మాటలను కలపండి.**

(అ) కర + అగ్రం = .........+ ......... = (..... + ..... = .....)

(ఆ) గిరి + ఈశుడు = .........+ ......... = (..... + ..... = .....)

(ఇ) మహా + ఆత్ముడు = .........+ ......... = (..... + ..... = .....)

(ఈ) చారు + ఊహ = .........+ ......... = (..... + ..... = .....)

**3. ఈ కింది పదాలను విడదీయండి.**

(అ) ఆద్యంత = ......... + .........= (..... + ..... = .....)

(ఆ) ప్రత్యహం = ......... + .........= (..... + ..... = .....)

(ఇ) ప్రత్యక్షం = ......... + .........= (..... + ..... = .....)



### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | భాష అంటే ఏంటో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | భాష గొప్పతనం గురించి రాయగలను. | ఔను / కాదు |
| 3. | మన రాష్ట్రంలో వాడే భాషల గురించి చెప్పగలను / రాయగలను. | ఔను / కాదు |
| 4. | భాషా రూపాల గురించి రాయగలను. | ఔను / కాదు |
| 5. | భాషా లిపి గురించి చెప్పగలను / రాయగలను. | ఔను / కాదు |

**“ జ్ఞానార్జనకు పునాది భాష”**

©SCERT not to be republished

మూడో యూనిట్

# 12. కళ్ళుండీ చూడలేక...

## ఆలోచించండి - మాట్లాడండి



## ప్రశ్నలు:

1. పై చిత్రాలలోని వాళ్ళు ఏమి చేస్తున్నారు ?
2. వాళ్ళలో ఏమి విశేషాన్ని మీరు గమనించారు?
3. వాళ్ళనుచూసి మీరేమి గ్రహించారు?
4. ఇలాంటి సంఘటనలను మీరెప్పుడైనా చూశారా?

## నేపథ్యం:

ఆత్మవిశ్వాసం అవయవ లోపాన్ని జయిస్తుందని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. తెలియని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.

'నా నేస్తాలు ఏమేం చూస్తారో తెలుసుకోడానికి అప్పుడప్పుడు పరీక్షించడం నాకు అలవాటయింది. ఈమధ్య ఒక నేస్తం అడవిలో ప్రయాణం చేసి వచ్చిందని తెలిసి "నువ్వు ఏమేం చూశావు?" అని అడిగాను ఎంతో ఉత్సుకతతో.

"ఏమీ లేదు!" అనేసింది ఆమె వెంటనే, చాలా మామూలుగా.

ఆ మాటలకు నాకు పెద్దగా ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటే ఇటువంటి జవాబులు వినడం నాకు అలవాటైపోయింది. నిజంగా కళ్ళున్నవాళ్ళు చాలా తక్కువగా చూస్తుంటారన్న నమ్మకం నానాటికీ బలపడుతున్నదే గాని తగ్గడం లేదు.

ఎవరైనా ఒక గంటసేపు అడవిలో తిరిగినా ఏ విశేషమూ చూడలేకపోవడం సంభవమేనా? అసలేమాత్రం చూడలేని నేను, గగుర్పాటు కలిగించే కోట్లకొద్ది విషయాలను నా స్పర్శద్వారా గ్రహిస్తుంటాను.


పువ్వును వాసనచూస్తున్న హెలెన్ కెలర్

పోకచెట్ల నున్నదనాన్ని, దేవదారు వృక్షాల కరకుదనాన్ని నా స్పర్శతో గుర్తిస్తాను. వసంత కాలంలో కొత్త పరిమళాల పూలమొగ్గలకోసం అన్వేషిస్తాను. పట్టువంటి ఆ పూల రెక్కల మృదుత్వాన్ని తాకినప్పుడు, వాటి పరిమళాన్ని ఆఘ్రాణించినప్పుడు, ఆ వర్తులాకార నిర్మాణాలు గమనించినప్పుడు చెప్పలేనంత ఆనందం కలుగుతుంది. అప్పుడు ప్రకృతి ఇంద్రజాలం కొంత బోధపడుతుంది. నా అదృష్టం పండినప్పుడు... ఒక చెట్టుకొమ్మకు చేతిని ఆనించగానే ఏదో ఒక పక్షి కుహు కుహు ధ్వని చెవుల్లో మార్మోగుతుంది. సెలయేటి ప్రవాహంలో చేతిని ఉంచినపుడు వేళ్ళసందులనుంచి నీళ్ళు ప్రవహించడం నాకు పట్టరాని ఆనందాన్నిస్తుంది. విప్పారిన దేవదారు పత్రాలుగాని, గడ్డిమైదానాలుగానీ, ఖరీదైన తివాచీలకంటే ఎంతో ఇష్టం నాకు. మారుతున్న ఋతువులు నా జీవితంలో కొత్త రంగును, సంతోషాన్ని నింపుతాయి.

అప్పుడప్పుడు ఈ సమస్త వస్తువులనూ చూడాలని మనస్సు తహతహలాడుతుంది. వీటిని కేవలం తాకడంతోనే ఇంత సంతోషం కలుగుతూంటే, నిజంగా వీటి సౌందర్యాన్ని కళ్ళారా చూస్తే మనస్సు ముగ్ధమైపోతుంది కదా! కాని కళ్ళున్నవాళ్ళు నిజానికి చాలా తక్కువగా చూస్తారు. ప్రపంచంలోని ఎంతో అందమైన అనేకానేక వర్ణాలు వాళ్ళ మనసుని తాకనే తాకవు. మనిషి తన సామర్థ్యాలకు ఎప్పుడూ విలువనివ్వడు. అతడు ఎల్లప్పుడూ తనకు అందనివాటికోసమే 'ఆశ'పడుతూంటాడు.


శిల్పాన్ని తాకి గమనిస్తున్న హెలెన్ కెలర్

***

© SCERT not to be republished



హెలెన్ కెలర్

బాధాకరమైన విషయమేమంటే, దృష్టి అనే వరాన్ని మనుషులు ఒక సాధారణమైన అంశంగా భావించడం. కాని ఈ వరంతో జీవితాన్ని సంతోషాల ఇంద్రధనుస్సుగా మార్చుకొని రాగరంజితం చేసుకోవచ్చు'.

ఈ సున్నితమైన అందమైన భావాలు ఎవరివో తెలుసా? ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అంధ బధిర మహిళ హెలెన్ కెలర్‌వి. ఆమె మాటలే కాదు, ఆమె జీవితం కూడా ఎంతో స్ఫూర్తిదాయకమయినది. సాధారణంగా 'ప్రత్యేకావసరాలున్న' పిల్లలు నిరాశానిస్పృహలకు లోనై, స్తబ్ధమైన జీవితాన్ని వెళ్ళదీయడానికి అలవాటుపడతారు. వాళ్ళలో కొందరు మామూలు పిల్లల తరహాలో జీవితం గడపటమే గాక వాళ్ళకంటే ప్రతిభాశాలురుగా గుర్తింపుపొందుతారు. అలా గుర్తింపు పొందినవాళ్ళలో ముందు వరసలో నిలుస్తుంది ఈ హెలెన్ కెలర్.

1880లో అమెరికాలో జన్మించిన హెలెన్ పుట్టుకతో అందరు పిల్లలలాగే చూడగలిగేది; వినగలిగేది; మాట్లాడగలిగేది. హెలెన్ అప్పుడప్పుడే మాట్లాడటం మొదలుపెట్టింది. ఇంతలో భయంకరమైన వ్యాధి ఒకటి వచ్చింది. ఆ వ్యాధి తీవ్రత ముందుగా ఆమె చూపును కబళించింది. ఆపైన నెమ్మదిగా శ్రవణ శక్తినీ, భాషణ శక్తినీ మింగేసింది.

హెలెన్, మిగతా పిల్లలకంటే తెలివైందిగా గుర్తింపు పొందింది. ఈ తన నిస్సహాయతవల్ల తమ్ముళ్ళనూ, చెల్లాయిలనూ తిట్టేది, కొట్టేది. తరవాత తాను చేసినది తప్పు అని గ్రహించి తనను తానే శిక్షించుకునేది. ఈ పరిస్థితిని గమనించి, తల్లిదండ్రులు హెలెన్‌ను అంధ – బధిర విద్యార్థుల పాఠశాలలో చేర్పించారు. అది ఆమె జీవితానికి మేలుమలుపు అవుతుందని వాళ్ళు అప్పుడు ఊహించలేదు.

ఆ పాఠశాలలో సలీవన్ అనే ఉపాధ్యాయిని ఉంది. ఆమెకు పిల్లలంటే వల్లమాలిన అభిమానం. అయితే ఈ 'చూడలేని, వినలేని, మాట్లాడలేని హెలెన్‌ను విద్యావంతురాలిగా చేయడం ఎట్లా?' అనే ప్రశ్న ఆమెను నిరంతరం వేధించసాగింది. సలీవన్ స్వయంగా అంధ – బధిర జీవితాన్ని అనుభవించింది. కాబట్టి వాళ్ళ సమస్యలను, ఆవేదనలను సహానుభూతితో అర్థం చేసుకొంటుంది. వాళ్ళ అవసరాలను తీరుస్తుంది. కాని హెలెన్ విషయంలో ఏ రకంగా ఆమెకు అక్షరజ్ఞానం కలిగించాలో ఆమెకు ఓ పట్టాన తట్టలేదు. ఎంత విపత్కర పరిస్థితికైనా ఏదో ఒక పరిష్కారం ఉంటుంది. హెలెన్ సమస్యకు ఒక చక్కని పరిష్కారం ఆమె ఆడుకునే బొమ్మరూపంలోనే దొరికింది సలీవన్‌కు.



తన ఉపాధ్యాయిని సలీవన్ తో హెలెన్ కెలర్

హెలెన్ ఒక్క క్షణం కూడా తన ఆటబొమ్మను విడిచి ఉండేదికాదు. ఆ బొమ్మంటే ఆమెకు ప్రాణం. ఒక రోజు సలీవన్ ఆ బొమ్మపేరును హెలెన్ అరచేతి మీద వేళ్ళతో రాసింది. ఆ పదం ఏదో స్పష్టంగా తెలియకపోయినా సంజ్ఞను గుర్తించింది హెలెన్. తరవాత హెలెన్ పేరును, హెలెన్‌కు ఇష్టమైనవాటినీ వేళ్ళతో ఆమె అరచేతి మీద రాసింది సలీవన్. ఆ తమాషా ఆట హెలెన్‌కు ఎంతో నచ్చింది. చాలావేగంగా, ఎంతో ఇష్టంగా ఎన్నో మాటలను నేర్చుకున్నది హెలెన్. అవి నేర్చుకోడం

© SCERT not to be republished



హెలెన్ కెలర్ జంతుప్రేమ

హెలెన్‌కు, ఈ ప్రపంచంపట్ల ప్రేమను, అభిమానాన్ని, ఆరాధననూ పెంచింది. సలీవన్ ఈ వరవడిని బ్రెయిలీ లిపివైపు మళ్ళించి, అక్షరాలను, పదాలనూ హెలెన్‌కు పరిచయంచేసింది.

ఇదిలా ఉండగా హఠాత్తుగా ఒకరోజు హెలెన్ నోటినుండి ఏవో కొన్ని శబ్దాలు వెలువడ్డాయి. వాటిని కొంచెం అటూ-ఇటుగా సవరిస్తే, 'ఈరోజు చాలా వేడిగా ఉంది' అని వాటి అర్థం. ఈ సంఘటనను హెలెన్ తన జీవితంలో మరచిపోలేని అత్యంత మధురమైనదిగా వర్ణించింది. అక్షరాలు నేర్చుకొని, చదవడం ప్రారంభించిన తరవాత హెలెన్‌కు పుస్తకాలే లోకంగా మారిపోయాయి. సలీవన్ ప్రోత్సాహంతో కేంబ్రిడ్జి పాఠశాలలో చేరింది హెలెన్.

పాఠశాలలో, కళాశాలలో ఎప్పుడూ ప్రథమ స్థానంలో నిలిచేది హెలెన్. 1904లో బి.ఏ. పూర్తి చేసిన హెలెన్, బ్రెయిలీ లిపిలో 'నా ఆత్మకథ' అనే పేరుతో తన జీవిత విశేషాలను రాసింది. ఆ తరవాత అనేక గ్రంథాలు ఆమె లేఖినినుంచి వెలువడ్డాయి. ఈమె ఆత్మకథ ప్రపంచ భాషలన్నిటిలోకీ అనువాదమయింది.

హెలెన్ హృదయం కరుణరస భరితమయినది. దీనులను, దుఃఖితులను తలచుకొంటేనే ఆమె మనసు కరిగిపోయేది. ప్రకృతిలోని ప్రతి అణువూ ఆమెను పరవశింపజేసేది. మామూలు మనుషులకు కళ్ళు రెండే కాని ఆమె శరీరమంతటా స్పర్శరూప నేత్రాలున్నాయి. ప్రతి స్పర్శకూ ఆమె మనసారా అనుభూతిపొంది, తన భావాల్ని అనర్గళంగా ప్రకటించేది. తనలాంటివాళ్ళ జీవితాల్లో వెలుగులు నింపేందుకే జీవితాన్ని అంకితం చేసిన ఉన్నత వ్యక్తిత్వం హెలెన్ కెలర్‌ది.

ప్రపంచమంతా తిరిగి 'ప్రత్యేకావసరాలున్న' పిల్లలను కలిసి, వాళ్ళలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఈ నేపథ్యంలో ఇంగ్లండు, అమెరికా, ఆఫ్రికా దేశాలు పర్యటిస్తూ భారతదేశానికి కూడా వచ్చింది. ఆమె జీవితం, సాహిత్యం అందరికీ ఆదర్శప్రాయమైనాయి.

© SCERT not to be republished




## I. వినడం-మాట్లాడడం



1. " కళ్ళుండీ చూడలేక ..." అనే పాఠంపేరు విన్నప్పుడు మీకేమనిపించింది?
2. హెలెన్ చూడలేదు. కొంతమంది వినలేరు. ఇంకొంతమంది మాట్లాడలేరు. ఆ శక్తులు ఉన్నవాళ్ళకంటే కూడా వీరు గొప్పవారు. ఎందుకు? ఆలోచించండి.
3. హెలెన్ కెలర్‌లో మీకు నచ్చిన గుణాలేవి?
4. హెలెన్‌కు చదువు నేర్పిన టీచర్‌ను గురించి చెప్పండి.
5. హెలెన్‌లాంటివాళ్ళను మీరు చూశారా? వాళ్ళను గురించి చెప్పండి.
6. సలీవన్‌కు వంటి ఉపాధ్యాయులు మీ పాఠశాలలో కూడా ఉన్నారు. వారి గురించి చెప్పండి.

## II. చదవడం - రాయడం



1. కింది పేరా చదవండి. నాలుగు ప్రశ్నలను రాయండి.

   1880లో అమెరికాలో జన్మించిన హెలెన్ పుట్టుకతో అందరు పిల్లలలాగే చూడగలిగేది; వినగలిగేది; మాట్లాడగలిగేది. హెలెన్ అప్పుడప్పుడే మాట్లాడటం మొదలుపెట్టింది. ఇంతలో భయంకరమైన వ్యాధి ఒకటి వచ్చింది. ఆ వ్యాధి తీవ్రత ముందుగా ఆమె చూపును కబళించింది. ఆపైన నెమ్మదిగా శ్రవణశక్తినీ, భాషణశక్తినీ మింగేసింది.

2. పాఠంలోని మొదటి ఏడు పేరాలూ చదవండి. వాటికి శీర్షిక పెట్టండి. అట్లాగే మిగిలిన పేరాలు చదివి తగిన శీర్షిక పెట్టండి.

3. పాఠం చదవండి. జవాబులు రాయండి.

   అ. ప్రకృతిని గురించి హెలెన్ వ్యక్తపరచిన భావాలేవి?

   ఆ. కళ్ళున్నవాళ్ళు ఏం గుర్తించలేకపోతున్నారని హెలెన్ బాధపడింది?

   ఇ. హెలెన్‌ను తల్లిదండ్రులు బడిలో ఎందుకు చేర్పించారు?

   ఈ. హెలెన్ సమస్యను గురించి సలీవన్ ఎందుకు బాధపడింది? ఆమె సమస్యకు పరిష్కారం ఏ రూపంలో లభించింది?

   ఉ. హెలెన్ ఎందుకు ఆదర్శప్రాయురాలు? ఇందుకోసం ఆమె ఏం చేసింది?

4. పాఠంలో వర్ణన ఉన్న వాక్యాలు కొన్ని ఉన్నాయి. వర్ణన అంటే ఒక విషయాన్ని కళ్ళకు కట్టే విధంగా మనసును అలరించే విధంగా చక్కటి పదాలతో వివరించడం. ఉదా: జీవితాన్ని సంతోషాల ఇంద్రధనుస్సుగా మార్చుకొని రాగరంజితం చేసుకోవచ్చు. ఇలాంటి వాక్యాలు ఇంకా ఏమున్నాయి?

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

   అ. 'కళ్ళున్నా సరిగ్గా చూడలేకపోతున్నా'రన్న హెలెన్ మాటలతో మీరు ఏకీభవిస్తున్నారా? ఎందుకు?

   ఆ. హెలెన్ వస్తువులను చూడాలని తహతహలాడేది? మీరు వేటిని గురించి తహతహలాడుతారు.

   ఇ. అందనివాటికోసం ఆశపడడం అంటే ఏమిటి? వివరించండి?

   ఈ. శరీరమంతటా స్పర్శరూప నేత్రాలున్నాయి! అనే వాక్యం ఉంది కదా! దీని అర్థం ఏమిటి?

**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు**

కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

   అ. హెలెన్ వ్యక్తిత్వాన్ని గురించి 10 వాక్యాలు రాయండి.

   ఆ. పాఠంలోని ముఖ్యాంశాలను 10 వాక్యాల్లో రాయండి.

   ఇ. 'ప్రత్యేక అవసరాలుగల పిల్లల్లో' ప్రత్యేక సామర్థ్యాలు ఉంటాయి. దీన్ని సమర్థిస్తూ 10 వాక్యాలు రాయండి.

   ఈ. మనిషి దేనికోసం ఆరాటపడుతూంటాడు?

© SCERT not to be republished

ఉ. "దృష్టి అనేది గొప్పవరం" అని రచయిత్రి ఎందుకు భావించింది?

ఊ. సహానుభూతితో అర్థంచేసుకోడం అంటే ఏమిటి?

## IV. పదజాలం

**1. ప్రత్యేకావసరాలు గలవాళ్ళలో ఎవరికి ఏ ఏ వస్తువులు అవసరమవుతాయో పట్టికలో రాయండి.**

| లోపం | అవసరం |
|---|---|
| చూడలేకపోవడం | చేతికర్ర, బెల్, బ్రెయిలీ లిపి, తడిమి చూసుకొనే గడియారం |
| వినలేకపోవడం | |
| కాళ్ళు లేకపోవడం | |
| చేతులు లేకపోవడం | |
| మాట్లాడలేకపోవడం | |

**2. కింది పదాలకు సమానమైన అర్థాన్నిచ్చే పదాలు వాక్యాల్లో ఎక్కడున్నాయో గుర్తించండి,రాయండి.**

అ. సంభవం – కష్టపడి పనిచేస్తేనే విజయం సాధ్యం.

ఆ. బోధపడు – మనసుపెట్టి విన్నవాళ్ళకు పాఠం బాగా అర్థమవుతుంది.

ఇ. ఆఘ్రాణించు – ముక్కు ద్వారా మనం వాసనలు పీలుస్తాం.

ఈ. తహతహ– శాస్త్రజ్ఞులు కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఆరాటపడతారు.

ఉ. విప్పారు – అమ్మను చూడగానే పాపముఖం విప్పారింది.

**3. కింది మాటలను సొంతవాక్యాల్లో వాడండి.**

అ. సంభవం ఉ. పరిమళం

ఆ. ఆఘ్రాణించు ఊ. తహతహ

ఇ. మార్మోగు ఎ. బాధాకరం

ఈ. పట్టరాని ఏ. బోధపడు

**4. కింది పదాలను విడదీయండి.**

అ. ఏమేమి =

ఆ. అప్పుడప్పుడు =

ఇ. వచ్చిందని =

ఈ. ఎవరైనా =

ఉ. తాకినప్పుడు =

ఊ. చెప్పలేనంత =

ఎ. ఉంచినప్పుడు =

ఏ. ఖరీదైన =

**5. ఇచ్చిన పదాలను ఆధారంగా చేసుకొని, సామాన్య వాక్యాలు రాయండి.**

ఉదా॥ సెలయేరు – గలగల – ప్రవహించడం.

**జ.** సెలయేరు గలగలా ప్రవహిస్తుంది.

© SCERT not to be republished

అ. జయ - ఇల్లు - రావడం.

ఆ. ఆకాశం-నక్షత్రాలు-మెరవడం.

ఇ. ప్రకృతి - మనస్సు - తహతహ.

ఈ. బడి - జీవితం - రాగరంజితం.

## V. సృజనాత్మకత



1. పోకచెట్ల నున్నదనం...... పేరా చదివి బొమ్మ గీయండి.
2. హెలెన్ కెలర్ ఏకపాత్రను రచించి, ప్రదర్శించండి.
3. పాఠంలోని ఐదో పేరా, ఆరో పేరా, ఏడో పేరా చదవండి. ఇవి ఆధారంగా మీరు కూడా మీచుట్టూ ఉన్న ప్రకృతిని - అంటే చెట్లు, పక్షులు, చెరువులు, కొండలు వంటివాటిని - వర్ణిస్తూ రాయండి. దానికి పేరు పెట్టండి.

## VI. ప్రశంస



1. బస్సులో వెళ్తున్నప్పుడు నువ్వు కూర్చొని ఉండి, వృద్ధులెవరైనా నిలబడి ఉంటే-

   (అ) పక్కనే స్థలం ఇస్తాను (ఆ) లేచి నా స్థలంలో కూర్చోబెడ్తాను (ఇ)పట్టించుకోను.

2. నువ్వు పాల్గొన్న పాటల పోటీలో ఎవరైనా నీకంటె బాగా పాడితే-

   (అ) అసూయ కలుగుతుంది (ఆ) మెచ్చుకుంటాను. (ఇ) మౌనం వహిస్తాను

3. మీ తరగతికి కొత్త విద్యార్థి(ని) వస్తే-

   (అ) నేనే ముందు పలకరిస్తాను (ఆ) దూరంగా ఉంటాను

   (ఇ) అవసరమైన సాయం చేస్తాను.

4. అంగవైకల్యంగలవారిపట్ల -

   (అ) జాలి చూపిస్తాను (ఆ) దూరంగా ఉంటాను

   (ఇ) సహానుభూతితో వ్యవహరిస్తాను.

5. ఇతర భాషలంటే -

   (అ) భయం (ఆ) అనిష్టం (ఇ) ఆసక్తి


©SCERT not to be republished

## VII. ప్రాజెక్టు పని



1. హెలెన్ కెలర్ వంటి స్ఫూర్తిదాతలను గురించిన బొమ్మలు, వివరాలు సేకరించండి. వాటిని గోడపత్రికమీద ప్రదర్శించండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**1. కింది వాక్యాలు చదవండి.**

అ. పాండవులు గురుదక్షిణ ఇచ్చారు.

ఆ. ప్రతి మనిషికీ దేశభక్తి ఉండాలి.

ఇ. రాజాజ్ఞవల్ల అధికారులు జాగ్రత్తపడ్డారు.

ఈ. సీతాపతి చాలా గుణవంతుడు.

ఉ. ఆ నల్లరాయి మెరుస్తున్నది.

ఊ. సీతారాములు అడవికి వెళ్ళారు.

పై వాక్యాల్లో గీతగీసిన పదాల అర్థాలను గమనించండి.

గురుదక్షిణ - గురువుకొఱకు దక్షిణ
దేశభక్తి - దేశమునందు భక్తి
రాజాజ్ఞ - రాజుయొక్క ఆజ్ఞ
నల్లరాయి - నల్లనిదైన రాయి
సీతారాములు - సీతా రాముడూ

పై పదాల అర్థాలను బట్టి వేరువేరు అర్థాలు గల రెండు పదాలు కలిసి ఒకే పదంగా ఏర్పడినట్లు తెలుస్తున్నది కదా! ఈ విధంగా అర్థవంతమైన రెండు పదాలు కలిసి, కొత్తపదం ఏర్పడటాన్నే సమాసం అంటారు.

కొన్ని అక్షరాలనుగాని, పదాలనుగాని తగ్గిస్తూ ఉచ్చారణ సౌలభ్యాన్ని కలిగించడానికి 'సమాసం' ఉపయోగపడుతుంది. సమాసంలో మొదటిపదాన్ని పూర్వపదమని, రెండవపదాన్ని ఉత్తరపదమని అంటారు.

'రామలక్ష్మణులు చాలా గొప్పవారు'

పై వాక్యంలో నామవాచక పదాలను సులభంగా గుర్తించవచ్చు అవి 'రామలక్ష్మణులు'. ఇందులో పూర్వపదము రాముడు, ఉత్తరపదము లక్ష్మణుడు. వీటిని రాముడూ, లక్ష్మణుడూ అని విడిగా చెప్పుకొంటాం. ఈ విధంగా రెండుగాని, అంతకంటె ఎక్కువగాని నామవాచకాలతో ఏర్పడే ఈ సమాసాన్ని 'ద్వంద్వ సమాసం' అంటారు.

**2. ఈ కింది వాక్యాల్లోని ద్వంద్వసమాస పదాలను గుర్తించి రాయండి.**

(అ) ఆ అన్నదమ్ములు ఇద్దరూ ఎంతో మంచివాళ్ళు. (.......... .........)

(ఆ) నేను మార్కెట్‌కు వెళ్ళి కూరగాయలు తెచ్చాను. (.......... .........)

(ఇ) ప్రమాదంలో నా కాలుచేతులకు గాయాలయాయి. (.......... .........)

(ఈ) మనిషికి ఈర్ష్యాసూయలు ఉండగూడదు. (.......... .........)

(ఉ) భారతంలో కృష్ణార్జునులు ప్రధానపాత్రలు పోషించారు. (.......... .........)

(ఊ) మనం నిరాశానిస్పృహలకు లోనుకాగూడదు. (.......... .........)



**నేనివి చేయగలనా ?**

| | | |
|---|---|---|
| 1. | ప్రకృతిని ప్రేమించడం ఆరాధించడం అలవరుచుకుంటాను. | ఔను / కాదు |
| 2. | ప్రత్యేకావసరాలు కలిగిన వారి ఎడ సహానుభూతితో వ్యవహరిస్తాను. | ఔను / కాదు |
| 3. | హెలెన్ కెలర్‌లా గొప్పపేరు తెచ్చుకోగలను. | ఔను / కాదు |
| 4. | ఈ పాఠం ఆధారంగా నేను ఏకపాత్రను రచించి ప్రదర్శించగలను. | ఔను / కాదు |
| 5. | ప్రత్యేకావసరాలు గల వారి ప్రతిభను గుర్తిస్తాను. | ఔను / కాదు |

"సగటు తెలివితేటలున్న వ్యక్తి మెదడుకు, మేధావుల మెదడుకు తేడా ఉండదు.ఆలోచన, ఆచరణలోని తేడాల వల్లనే మాన్యులు, సామాన్యులు ఏర్పడతారు"

© SCERT not to be republished

మూడో యూనిట్

# 13. కుసుమోపదేశము

.. డా॥వానమామలై వరదాచార్యులు

## ఆలోచించండి - మాట్లాడండి :



## ప్రశ్నలు :

1. పై చిత్రం చూడండి. ఎవరెవరు ఏమేం చేస్తున్నారో చెప్పండి.
2. మీకు ఇష్టమైన పువ్వుమీద పాటగాని, కథగాని, కవితగాని చెప్పండి.
3. మీకు ఏ పూలంటే ఇష్టం? ఎందుకో చెప్పండి.
4. పూలు మనుషులతో మాట్లాడితే ఎలా ఉంటుందో కుసుమోపదేశం పాఠం ద్వారా తెలుసుకొందాం.


## నేపథ్యం :

ఎంత కాలం బతికామన్నది కాదు, ఎలా బతికామన్నదే ముఖ్యమని, పరోపకారబుద్ధితో జీవించడంలోనే సంతృప్తి, గొప్పదనం ఉన్నాయని చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.

ప్రస్తుత పాఠ్యభాగం వరదాచార్యులవారి "మణిమాల" నుండి తీసుకొన్నది.

### విద్యార్థులకు సూచనలు :

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలు వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. మీకు తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టికలో చూడవచ్చు.



* పుష్పమా! నీదు చరితమ్ము పూర్ణమగును
ఒక్క రెన్నాళ్ళలో నేమి దక్కె నీకు?
మంచివాసనల నెడంద నుంచికొనియు
చిత్రవర్ణాల పోషాకుఁ జేసికొనియు


కడుపునిండారఁ దేనెపాల్గుడుచుచుండి
తీగెటుయ్యల న్ముదముతో నూగుచుంటి
వగ్రిమస్థానమున క్షణ మ్మాగవైతి
కూర్చు తేనెను తుమ్మెదల్ గుడిచిపోయె

అందమెల్లను మట్టిలో నడఁగిపోయె
కోమలత నెల్ల యెండలు కుములఁజేసె
ఆ సువాసన న్వాయువు లపహరించె
నొక్క రెన్నాళ్ళలో నేమి దక్కె నీకు?

* రాలిపడి మాతృభూపూజఁ దేలుమనుటె
ఉన్న రెన్నాళ్ళ నవ్వుచు నుండుమనుటె
యునికి కగ్రిమస్థానమే యొప్పుననుటొ
వని సువాసనవలె కీర్తివైభవములు

© SCERT Not to be republished





వ్యాప్తి గావింపుమనుటొ యీ వసుధపైని
విత్తమదియొ మధూకర వృత్తిసేయు
బీదలకె తేనెవలె పంచివేయు మనుటొ
యిట్టి లోకసేవారతు కెవనికేని

పెత్తనము దేవతల తలన్బీఠ మిడదె
అందమున సుందరుల తల్రకిందుఁ గాదె!
మా యంతరంగాల మాధురిమ సొంపు
మా యెదల నుదయించు మంచివాసన పెంపు
మీ మనమ్ములఁ గలదె యో మానవుల్లార
అనుచు మము పరిహాసమాడు గతి నిత్యమ్ము

నవ్వుదువె యో చిన్నిపువ్వు కోమలిరో!
మావలెనె మీరు తలమానికా లగుదురే
మా తీరు ముక్కుముత్యాలగుదురే మీరు
మా దండలకు గళము మరలుకొన దెట్లు
అత్యంత ప్రేమతో నలముకొన దెట్లు
అనుచు మము ప్రతిదిన మ్మపహసించెడి ననఁగ
నవ్వుటే యీ రీతి పువ్వుకోమలిరో!



© SCERT not to be republished

## కవి పరిచయం



**పేరు** : డా॥ వానమామలై వరదాచార్యులు

**కాలం** : 1912 – 1984

**జన్మస్థలం** : మడికొండ, వరంగల్ జిల్లా

**నివాసస్థలం** : చెన్నూరు, ఆదిలాబాదు జిల్లా

**రచనలు** : పోతన చరిత్రము, మణిమాల, సూక్తి వైజయంతి, జయధ్వజం భోగినీలాస్యం, వ్యాసవాణి, కూలిపోయే కొమ్మ, రైతుబిడ్డ (బుర్రకథల సంపుటి). మొదలయినవి.

**బిరుదులు** : అభినవ పోతన, అభినవ కాళిదాసు, మధురకవి, కవిచక్రవర్తి.

**పురస్కారాలు** : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి పురస్కారం, వారణాసివారి విద్యావాచస్పతి (డి.లిట్,) గౌరవ డాక్టరేట్ ప్రదానం.

© SCERT not to be republished

**భావం:**

అనేక రకాల అందమైన రంగుల నద్దుకొని మంచి వాసనలను గుండెలో నింపుకొన్న ఓ పుష్పమా! నీ జీవితం ధన్యమైంది. కాని ఒకటి రెండు రోజుల నీ జీవిత కాలంలో నీకు మిగులుతున్నదేమిటి?

కడుపునిండా పాలు, తేనెలను నింపుకొని తీగల ఉయ్యాలమీద సంతోషంతో ఊగుతుంటావు. చిటారుకొమ్మన నువ్వు పూయగానే నీలోని తేనెలను తుమ్మెదలు తాగిపోతాయి.

పుష్పమా! నీ అందమంతా మట్టికింద అణగిపోతుంది. నీ సౌకుమార్యమంతా ఎండలకు కమిలిపోతుంది. నీ సువాసనలను గాలి దొంగిలిస్తుంది. ఒకటి రెండు రోజుల నీ జీవితకాలంలో నీకు మిగులుతున్నదేమిటి?

భూమిమీద రాలిపడిన పువ్వు మాతృభూమికి పూజచేయమని సందేశమిస్తూంది. తనలాగే జీవించి ఉన్న రెండు రోజులు నవ్వుతూ బతకమని చెపుతూంది. కొమ్మ పైనే పూస్తూ ఉంటే ఉన్నత స్థానంలోనే ఉండాలని నిరూపిస్తూంది. లోకంలో మన కీర్తిప్రతిష్ఠలు పూలసువాసనలాగా వ్యాప్తిచెందాలని కోరుకుంటూంది.

తుమ్మెదలకు తాను తేనెను పంచినట్టు, మన వద్దనున్న ధనాన్ని బీదసాదలకు పంచిపెట్టాలని చెపుతున్నది. ఇలా లోకానికి సేవచేసేవారికి ఉన్నత స్థానం తప్పక దొరుకుతుంది. పువ్వు దేవతల తలమీదే కదా స్థానం సంపాదించేది. పూల అందాలకు సుందరీమణులు కూడా తల దించుతారు.

'ఓ మానవుల్లారా! మా హృదయాల్లోని మాధుర్యం, అందం, మా మనసులో ఉండే సువాసనలు మీలో ఉన్నాయా?' అని మమ్మల్ని ఎప్పుడూ వేళాకోళం చేస్తున్నట్లుగా నవ్వుతూంటారెందుకు? మాలాగా మనుషులు ఉన్నత స్థాయిని అందుకోగలరా? మమ్మల్ని ముత్యాల ముక్కుపుడకగా అలంకరించుకుంటారు. మీలో అలాంటి ముత్యాల్లాంటి మనుషులున్నారా? మేము పూలదండలుగా మారి మీ మెడలో వేలాడుతూ హృదయాలకు హత్తుకునిపోతాం. అలా మీరు సాటి మనుషులను హృదయాలకు హత్తుకొని సహృదయతతో ఉంటారా? అని పూలు మనుషులను సున్నితంగా ప్రశ్నిస్తున్నాయి.



## ఇవి చేయండి :



### I. వినడం-మాట్లాడడం

1. పాఠంలోని పద్యాలను రాగయుక్తంగా పాడండి.
2. ఈ పద్యాలు వేటిగురించి చెపుతున్నాయి?
3. పద్యభావాలను సొంతమాటల్లో చెప్పండి.
4. పూల గొప్పతనం గురించి మాట్లాడండి.



### II. చదవడం - రాయడం

**1. ఈ కింది పదాలతో అంతమయ్యే పద్యపాదాలను పాఠంలో గుర్తించండి.**

(అ) అణగిపోయింది: .................................................

(ఆ) కమిలిపోయింది: .................................................

(ఇ) దొంగిలించింది: .................................................

(ఈ) ఏమి దక్కింది:.................................................

**2. కింది పదాలు తారుమారుగా ఉన్నాయి. వాటిని సరిగా రాస్తే పద్యభావం వస్తుంది. వాటిని క్రమపద్ధతిలో రాసి అది ఏ పద్యమో గుర్తించండి.**

"దొంగిలించాయి గాలులు సువాసననను. ఏమి దక్కింది నీకు ఒకటి రెండు రోజులలో. సుకుమారత్వాన్ని కమిలిపోయేలా చేశాయి ఎండలు. కలిసి పోయింది అందం మట్టిలో".

**3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

అ. పూల జీవితం ఎందుకు ధన్యమైంది?

ఆ. గాలి, ఎండలు పూలను ఏం చేశాయి?

ఇ. పూవు మనిషిని ఏ విధంగా పరిహాసం చేస్తోందని కవి భావిస్తున్నాడో వివరించండి?

ఈ. పూలు మనుషులను ఏమని ప్రశ్నించాయి?



### III. స్వీయరచన

**కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

అ. ఈ పాఠానికి కుసుమోపదేశం అనే పేరు సమంజసమేనా? ఎందుకు?

ఆ. పూలను ఏ అవసరాలకు, ఏయే సందర్భాలలో ఉపయోగిస్తారు?

ఇ. కవి పూలజీవితం ధన్యమైందని అన్నారు. దీనిమీద మీ అభిప్రాయం ఏమిటి?

ఈ. పూలను గురించి కవి, మీ జీవితకాలంలో మీకు మిగులుతున్నదేమిటని ఆవేదన చెందారు. కవి భావన సరైనదేనా?

© SCERT not to be republished

## 2. వ్యాసరూప ప్రశ్నలు


అ. పూవు మనిషికి ఎలాంటి సందేశమిస్తోంది? పాఠ్యభాగం ఆధారంగా రాయండి.

ఆ. మనుషులకన్నా పూలు గొప్పవా? ఎందుకు? చర్చించండి.

ఇ. పూలను గురించి మీ అభిప్రాయాలు, అనుభూతులు రాయండి.

ఈ. పూలు మానవులను ఉద్దేశించి ఒక సందేశాన్ని ఇస్తున్నట్లుగా వ్యాసం రాయండి.

## IV. పదజాలం



**1. పాఠం ఆధారంగా కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు అర్థాలు రాయండి.**

అ. ప్రమాద దృశ్యాలను చూసినప్పుడు నా ఎడంద తల్లడిల్లిపోతుంది.

ఆ. రకరకాల రంగులతో సీతాకోకచిలుక ఎంతో అందంగా ఉంటుంది.

ఇ. పండుగ సెలవులలో పిల్లలు ముదముతో ఉంటారు.

ఈ. విద్యార్థులు అగ్రిమస్థానము చేరుకోడానికి ప్రయత్నించాలి.

ఉ. ఎవ్వరినీ కూడా చిన్నచూపు చూస్తూ పరిహాసం చేయగూడదు.

ఊ. కబడ్డీ ఆటలో గెలిచి మా విద్యార్థులు జిల్లాకే తలమానికంగా నిలిచారు.

**2. గీతగీసిన కింది పదాలకు సరైన ప్రకృతి / వికృతి పదాలను పాఠంలో గుర్తించండి.**

అ. గొప్పవారి చరిత్రలు తప్పక చదవాలి.

ఆ. నగల దుకాణంలో ముత్తెముల దండలు వేలాడుతున్నాయి.

ఇ. సుందరదృశ్యాలకు ఈ భువి నిలయం.

ఈ. సమాజానికి మేలు చేసేవారికి కీరితి లభిస్తుంది.

ఉ. విద్యార్థి నిత్తెము పాఠశాలకు హాజరుకావాలి.

**3. కింది పదాలకు సమానార్థక పదాలను పాఠంలో గుర్తించండి.**

అ. హృదయం: ..................... .....................

ఆ. కుసుమం: ..................... .....................

ఇ. వసుధ: ..................... .....................

## V. సృజనాత్మకత



1. పాఠం ఆధారంగా కవికీ పూలకూ మధ్య ఒక సంభాషణ జరిగినట్లుగా ఊహించి రాయండి.
2. వేరువేరు రంగురంగుల పూలమొక్కలు గల అందమైన పూలతోట చిత్రాన్ని గీయండి. ఆ పూలతోటమీద ఒక కవిత రాయండి; లేదా పద్యాలు, కవితలు సేకరించండి.
3. 'కొన్నాళ్ళే బతికినా నవ్వుతూ బతకాలని, ఎదుటివారికి సహాయపడాలని పూవు తెలియజెప్పింది.' నువ్వే పువ్వువయితే ఈ లోకానికి ఏమి సందేశమిస్తావు.


© SCERT not to be republished

## VI. ప్రశంస



1. పూలను గురించిన కవితలను ఇతర భాషల్లోంచి సేకరించండి.
2. అందమైన పూలు ఉంటే ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది కదా! మరి మీ పరిసరాలలో అందమైన పూల చెట్లు ఉండటానికి మీరేం చేస్తారో రాయండి.

## VII. ప్రాజెక్టు పని



1. కరుణశ్రీ అనే కవి పూలను గురించి కవిత్వం రాశారు. దాన్ని సేకరించి ఈ పాఠానికీ ఆ కవితకూ గల తేడాలను చర్చించండి.
2. మీ పరిసరాలలో లభించే రకరకాల పూలను సేకరించి పుష్పగుచ్ఛం తయారుచేయండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**1. కింది పదాలను గమనించండి.**

(అ) రెండువిధాలు (ఆ) మూడుకన్నులు (ఇ) నాలుగుదిక్కులు

(ఈ) పంచపాండవులు (ఉ) షడ్రుచులు (ఊ) సప్తర్షులు

(ఋ) అష్టవసువులు

పై పదాలన్నీ సమాసపదాలే కదా! వాటిలో పూర్వపదం సంఖ్యను సూచిస్తోంది. ఉత్తరపదం నామవాచకాన్ని సూచిస్తోంది. ఇలాంటి సమాసాలను **"ద్విగు సమాసాలు"** అని అంటారు.

**2. ఈ కింది వాక్యాల్లో ద్విగుసమాస పదాలున్నాయి. వాటిని గుర్తించండి. రాయండి.**

ఉదా: ఈ రెన్నాళ్ళు గుర్తుండిపోవాలి. ( రెండునాళ్ళు )

1. త్రినేత్రాలు కలవాడు శివుడు. (            )
2. ఆ పండితులు చతుర్వేదాలు చదివారు. (            )
3. తెలుగులో పంచకావ్యాలు ఉన్నాయి. (            )
4. పురాణాల్లోని షట్చక్రవర్తులు ఎంతో గొప్పవారు. (            )
5. ఇంద్రధనుస్సులో సప్తవర్ణాలు ఉంటాయి. (            )
6. ఇంద్రుడికి వేయి కన్నులు ఉన్నాయి. (            )
7. సగర చక్రవర్తి నూరు అశ్వమేధాలు చేశాడు. (            )
8. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలనే కవులున్నారు. (            )
9. మా పొలంలో నవధాన్యాలు పండించాము. (            )
10. విష్ణుమూర్తి దశావతారాలు ధరించాడు. (            )

- ఇటువంటి ద్విగు సమాసపదాలు మనం మాట్లాడుతున్నప్పుడు, చదువుతున్నప్పుడు చాలా వస్తాయి. గమనించండి.

© SCERT not to be republished

**మీకు తెలుసా .......**

పద్యాలు, గేయాలు,పాటల ద్వారా రసానుభూతి పొందాలి.మనస్సును కదిలించి, కరిగించి, రకరకాల అనుభూతులకు లోను చేసే భావ శక్తినే రసం అంటారు. రసాలు తొమ్మిది. వీటిని నవ రసాలు అంటారు.

1. **హాస్యం** :- నవ్వును తెప్పించేది.
2. **కరుణం** :- బాధ కలిగించేది, ఏడుపు తెప్పించేది.
3. **వీరం** :- ఉత్సాహాన్ని కలిగించి మంచిపనులకు పురిగొల్పేది.
4. **భయానకం** :- భయాన్ని కలగజేసేది.
5. **బీభత్సం** :- జుగుప్స (అసహ్యం) కలిగించేది.
6. **శృంగారం** :- ప్రేమ భావాన్ని మనసులో కలిగించేది..
7. **రౌద్రం** :- తీవ్రమైన కోపాన్ని తెలిపేది.
8. **అద్భుతం** :- ఆశ్చర్యకరమైన, నమ్మశక్యం గాని విషయాన్ని చూపేది.
9. **శాంతం** :- అన్ని వికారాలనూ అధిగమించి, ఏ చంచలత్వమూ లేక నెమ్మదితో వ్యవహరించేట్లు చేసేది.

పదం, పాట, గేయం గీతం .. ఇవన్నీ వివిధ రకాలైన పాటలే; పాడుకోడానికి అనువైన కవితలే. పాట ఇలా రాయాలన్న ప్రత్యేక నియమం ఏమీ లేదు.తాళ (లయ) బద్ధంగా ఉండటం ఒక్కటే దానికుండే లక్షణం. మీరు వింటున్న రకరకాల పాటల ననుసరించి మీకు నచ్చిన విధంగా రాసి పెద్దవాళ్ళకు చూపండి. పాడగలిగేవాళ్లు పాడతారు.ఈనాడు పాటలు రాస్తున్నవాళ్ళలో చాలామంది కవులు ఈ పద్ధతిలో చిన్నప్పుడు కవితలల్లినవాళ్ళే. ప్రయత్నం చేసి చూడండి.



**నేనివి చేయగలనా ?**

| | |
|---|---|
| 1. పద్యాలను రాగయుక్తంగా పాడగలను. | ఔను / కాదు. |
| 2. పూల సౌకుమార్యాన్ని గుర్తించగలను. | ఔను / కాదు. |
| 3. వాసన ఆధారంగా అది ఏ పువ్వో గ్రహించగలను. | ఔను / కాదు. |
| 4. ఏ ఋతువులో ఏ పూలు, ఏ పండ్లు దొరుకుతాయో తెలుసుకోగలను. | ఔను / కాదు. |

**మొక్కలకూ భావాలుంటాయి. అవి ప్రకటిస్తాయి. - సర్ జగదీశ్ చంద్ర బోస్**

© SCERT not to be republished

మూడో యూనిట్

# 14. ఎలుకమ్మ పెళ్ళి

(ఉపవాచకం)



తుంగభద్రానది ఒడ్డున ఒక ఊరుండేది. ఆ ఊరికి దూరంగా చిన్న కుటీరంలో బ్రహ్మయ్య, అతని భార్య నివసిస్తూ ఉండేవాళ్ళు. వాళ్ళకు పిల్లలు లేకపోవడంతో ఎవరినైనా తెచ్చి పెంచుకోవాలని భార్యకు కోరిక కలిగింది. భార్యమాట కాదనలేక చుట్టుపక్కల గ్రామాలకు వెళ్ళి అడిగినా పెంచుకోడానికి పాపనిచ్చేందుకు ఎవ్వరూ ఇష్టపడలేదు.

ధనం లేకపోయినా బ్రహ్మయ్యకు కొన్ని అపూర్వశక్తులున్నాయి. ఒకరోజున బ్రహ్మయ్య కుటీరం ముందర కూర్చొని ఉన్నాడు. కాకి ఒకటి ఎలుక పిల్లను ముక్కున కరుచుకొని వెళ్ళుతుండగా జారి బ్రహ్మయ్య ఇంటిముందర పడింది. వెంటనే బ్రహ్మయ్య అతని భార్య దాన్ని పైకి తీసి ఒళ్ళంతా తుడిచి చక్కగా నిమిరారు. భార్య భర్తను చూసి, "మనకు పిల్లలు లేరు కదా! మీ మంత్రశక్తిని ఉపయోగించి ఈ ఎలుకను పాపగా మార్చండి" అన్నది.



భార్య మాట కాదనలేక, 'సరే, నీ ఇష్టం!' అన్నాడు బ్రహ్మయ్య. ఏదో మంత్రం జపించి కమండలంలోని నీటిని ఆ చిట్టెలుకమీద చల్లాడు. వెంటనే ఆ ఎలుక చిన్న పాపగా మారిపోయింది. బ్రహ్మయ్య భార్య ఆనందించింది. ఆ పాపను అల్లారుముద్దుగా పెంచుతూ దొరికిన ఆహారం పెడుతూండేది. వాళ్ళిద్దరూ ఆ పాపకు 'మూషిక బాల' అని పేరుపెట్టారు.

కొంత కాలం గడిచింది. పాప పెరిగి పెద్దదయింది. ఎప్పుడూ ఒక చోట స్థిరంగా ఉండకుండా తిరగడం అలవాటయింది. కనిపించిన వస్తువులన్నీ కొరకడం, చిరుతిండ్లకోసం వెతకడం, పచ్చికూరగాయలు తినడం, పప్పుడబ్బాలు వెతకడం, వడ్లబస్తాల దగ్గర, బియ్యంబస్తాల దగ్గర తిరగడం, రంధ్రాలున్న చోటే ఆటాడుకోడం, పిల్లులు కనిపిస్తే భయంతో పరుగెత్తడం, మూషిక బాలకు సహజలక్షణాలుగా మారిపోయాయి.

ఇదిలా ఉండగా హఠాత్తుగా ఒకరోజున మూషికబాల కనబడకుండాపోయింది. రాత్రి పొద్దుపోయేవరకు కూడా అమ్మాయి కనిపించకపోవడంతో బ్రహ్మయ్య దంపతులకు ఆందోళన అధికమయింది. ఉదయం లేవగానే పరిసరాలన్నీ వెతికారు. ఎక్కడా కనబడలేదు. కనిపించినవాళ్ళందరినీ అడుగుతూ ఊళ్ళోకి వెళ్ళారు. ఆనవాళ్ళనుబట్టి అటువంటి అమ్మాయి శివాలయంలో కనిపించిందని ఒకాయన చెప్పాడు .

“మీరు చెప్పిన గుర్తులన్నీ ఉన్న అమ్మాయిని నేను శివాలయంలోనే చూశానయ్యా. అయితే ఆలయ ప్రాంగణంలో వినాయక నవరాత్రుల సందర్భంగా పెద్ద వినాయక విగ్రహం ఒకటి ఏర్పాటు చేశారు. నిన్న ఉదయంనుంచి ఆ అమ్మాయి అక్కడే ఉన్నది.” అని అసలు సంగతి చెప్పాడా మనిషి.



వెంటనే బ్రహ్మయ్య, అతని భార్య శివాలయానికి వెళ్ళారు. అక్కడ మూషిక బాల పూజారి దగ్గరే కూర్చొని, పూజలో అతనికి సాయం చేస్తున్నది. భక్తులకు ప్రసాదాలు ఇస్తున్నది. తదేకంగా వినాయకుణ్ణే చూస్తూ తన్మయమైపోతున్నది. తల్లిదండ్రులను చూసి, తననక్కడినుంచి తీసుకొనిపోతారేమోనని భయంతో దేవుడి విగ్రహం వెనకకు వెళ్ళి దాక్కున్నది.

విషయం గ్రహించిన బ్రహ్మయ్య, వినాయకుడిపట్ల మూషికబాల కున్న భక్తి నెరిగి, దగ్గరికి పిలిచాడు. భయం భయంగానే తండ్రి వద్దకు వచ్చిన మూషికబాల “నాన్నగారూ! నన్ను ఇక్కడి నుంచి తీసుకెళ్ళకండి. నవరాత్రులైపోయే దాకా నేను ఇక్కడే ఉంటాను.“ అని బతిమాలుతూ కన్నీళ్ళు పెట్టుకుంది.

తల్లి వద్దని మందలించబోయింది. కాని తండ్రి కూతురు జన్మవిశేషాన్ని గ్రహించి, “సరేనమ్మా! ఉత్సవాలు పూర్తయ్యేదాకా ఇక్కడే ఉండు, కాని నిన్ను చూడకుండా మేం ఉండలేము గదా! రోజూ ఉదయమే ఇంటికి వచ్చి స్నానం చేసి, మళ్ళీ పూజ సమయానికి ఇక్కడికి వచ్చేసెయ్యి, సరేనా?” అన్నాడు.

ఇష్టంలేకపోయినా తండ్రి మాట కాదనలేక సరేనంది మూషిక బాల.

అయితే నవరాత్రుల తరవాత కూడా మూషిక బాలలో మార్పు రాలేదు. వినాయక నిమజ్జనం తరవాత కూడా ఆ అమ్మాయి తెల్లవారుజామునుంచి, రాత్రి గుడిమూసే దాకా గుడిలోనే ఉండేది. శివాలయంలో వినాయకుడి విగ్రహం దగ్గరే సమయమంతా గడిపేది. శివుడి కంటే గొప్పగా వినాయకుడికే పూజాదికాలు చేసేది. అతనికి సమర్పించిన నైవేద్యమే తినేది.

కూతురులోని ఈ విపరీత ధోరణి బ్రహ్మయ్యకు నచ్చలేదు. బడిలో వేస్తే మార్పు వస్తుందని ఆశించి, స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పించాడు. అయినా రోజూ గుడికి వెళ్ళి, బడివేళ దాకా వినాయకుడి సేవలో గడిపేది. సెలవు రోజుల్లో అయితే ఇంటిముఖం కూడా చూసేది కాదు. బడిలో కూడా బాగా అల్లరి చేసేది. ఎక్కడా స్థిరంగా ఉండేది కాదు. పుస్తకాలన్నీ కొరికేసేది.

మూషిక బాల నాలుగో తరగతిలో ఉండగా ఒక సంఘటన జరిగింది. బడిపిల్లలను తీసుకొని వాళ్ళ టీచర్ అడవిలోని చెరువు దగ్గరికి పిక్నిక్‌కు వెళ్ళారు. దారిలో గీత అనే ఒక అమ్మాయి ప్రమాదవశాత్తూ, ఆ అడవిలో వేటగాడు పన్నిన వలలో ఇరుక్కున్నది. ఎంతమంది ప్రయత్నించినా ఆ వలనుంచి గీతను తప్పించలేకపోయారు. అప్పుడు మూషికబాల తన పదునైన పండ్లతో ఆ వల తాళ్ళను క్షణాల్లో కొరికి, గీతను

© SCERT not to be republished

కాపాడింది. దాంతో పిల్లలందరికీ మూషికబాలపట్ల ప్రత్యేక అభిమానం ఏర్పడింది. పరుగుపందెంలో కూడా ప్రతిసారీ మూషిక బాలదే మొదటి బహుమతి. క్రమేణా మూషిక బాలకు చదువుపట్ల ఆసక్తి పెరిగి కళాశాల విద్యకూడా నిరాఘాటంగా పూర్తిచేసింది.

పెళ్ళీడు రాగానే అమ్మాయికి పెళ్ళి చేయాలనుకున్నారు బ్రహ్మయ్య దంపతులు. మీ మంత్రశక్తిని మరోసారి ఉపయోగించి అమ్మాయికి యోగ్యుడైన భర్తను తీసుకురండి, అంది అతని భార్య.

"నా కూతురు పెళ్ళి చేసుకుంటానంటే సూర్యుడినైనా తెచ్చి చేస్తాను' అన్నాడు బ్రహ్మయ్య. 'మీకు అంతశక్తి ఉందని నాకు తెలుసు. సూర్యుడే మన అల్లుడౌతాడంటే ఇంకేం కావాలి! నిజం చేయండి," అంది.

బ్రహ్మయ్య సరేనని కళ్ళు మూసుకొని ధ్యానం చేయగా వెంటనే సూర్యుడు ప్రత్యక్ష మైనాడు. తన కూతుర్ని పెళ్ళాడమని సూర్యుణ్ణి అడిగాడు.

"మీ అమ్మాయిని పెళ్ళిచేసుకోవడం నాకిష్టమే ! కాని ఆమెకు నేను నచ్చానో లేదో అడగండి," అన్నాడు సూర్యుడు.

వెంటనే బ్రహ్మయ్య కూతుర్ని పిలిచి అడిగాడు.

"నాన్నగారూ, మీరు తెచ్చిన వరుడు బాగానే ఉన్నాడు. కాని మరీ వెలుగులు చిమ్ముతున్నాడు. ఇంతటి మిరుమిట్లు గొలిపే కాంతిని భరించలేను, అంటూ కళ్ళు మూసుకొని ఇంతకంటే మంచి వరుడు ఎవరూ లేరా?" అందామె.

సూర్యుడికంటె గొప్ప వాడెవరా? అని ఆలోచించాడు బ్రహ్మయ్య. వెంటనే సూర్యుడు బ్రహ్మయ్యను చూసి "నా కంటే మేఘుడు గొప్పవాడు," అన్నాడు.

"ఒక్కొక్కసారి దట్టమైన మేఘాలు, నేను పూర్తిగా భూమిపైకి కనపడకుండా మూసేస్తాయి," అంటూ సూర్యుడు వెళ్ళిపోయాడు. ఇంతలో మేఘుడొచ్చాడు. "మా మూషికబాలను పెళ్ళిచేసుకుంటావా?" అన్నాడు బ్రహ్మయ్య. కుమార్తెను కూడా అడిగాడు వెంటనే.

మూషికబాల ఒక్కనిమిషం ఆ మేఘుడి వంకచూసి "నాన్న గారూ ! వరుడు అందగాడే కాని నల్లగా ఉన్నాడు. ఇంత కంటే గొప్ప వరుణ్ణి ఎవర్నైనా చూడండి," అంది.

బ్రహ్మయ్య మేఘుడివంక చూశాడు. వెంటనే మేఘుడు "వాయుదేవుడు నాకంటే గొప్పవాడు. తన వేగంతో ఆకాశంలో దట్టంగా అలుముకున్న నన్ను నెట్టేస్తూంటాడు," అంటూ మేఘుడు వెళ్ళిపోయాడు.

మేఘుడు వెళ్ళగానే వాయుదేవుణ్ణి రప్పించగా, అతన్ని చూసిన మూషికబాల "అందగాడే కాని, ఇతనికి బొత్తిగా నిలకడలేదు. ఈయనకంటే మంచివాడూ గొప్పవాడూ లేడా?" అని తండ్రిని ప్రశ్నించింది.


బ్రహ్మయ్య అన్ని వైపులా చూశాడు. వెంటనే వాయుదేవుడు" మీరేం బాధపడకండి. నాకంటే అన్ని విధాలా బలవంతుడైన "మేరుపర్వతుడు" ఉన్నాడు. నేను నా బలంతో పెద్దవృక్షాలను, ఇండ్లనుకూడా ధ్వంసంచేయగలను. కాని నాకెంత బలమున్నా ఆ పర్వతాన్నిమాత్రం కదిలించలేకపోతున్నాను. నీ కూతుర్ని ఆయనకిచ్చి పెళ్ళిచేస్తే సంతోషిస్తుందన్న నమ్మకం ఉంది," అని వాయుదేవుడు వెళ్ళిపోయాడు. ఆయన వెళ్ళిపోగానే మేరుపర్వతుడు ప్రత్యక్షమైనాడు.

వెంటనే మూషికబాల అతణ్ణి చూసి, "ఈయనేమంత బాగోలేదు; మృదుత్వంలేదు; బండబారినట్లున్నాడు. ఇంతకంటే గొప్పవరుడు లేడా?" అని ప్రశ్నించింది. వెంటనే మేరుపర్వతుడు, మూషికరావు ఉన్నాడు, బలమైన,

© SCERT not to be republished

కఠినమైన బండలా ఉన్న నా పర్వత శరీరాన్ని కూడా కొరికి రంధ్రాలు చేస్తాడు. ఆ శక్తి అతనికొక్కడికే ఉంది. నీ కూతురికి అతనే సరియైన వరుడు," అని చెప్పి వెళ్ళిపోయాడు.

అతడు వెళ్ళాక 'మూషికరావు' అక్కడికి వచ్చాడు. అతణ్ణి చూసీ చూడగానే మూషికబాల సిగ్గుతో తలవంచుకొని వినయంగా నమస్కరించింది "ఈ వరుడు ఎంత బాగున్నాడో! ఇంత మంచివాడిని దగ్గర్లోనే ఉంచుకొని సూర్యుడనీ, వాయువనీ, మేఘుడనీ ఎవరెవర్నో ఎందుకు చూపించారు? ఏమైతేనేమి ఆలస్యం చేయకుండా ఈ అందగాణ్ణి పెండ్లాడడానికి అనుమతించండి," అన్నది.



వెంటనే తల్లిదండ్రులు మూషికరావుకు మూషిక బాలకు పెళ్ళిచేసి వాళ్ళను తమ దగ్గరే ఉంచుకుందామనుకున్నారు. కాని మూషికబాల, పెళ్ళికాగానే వాళ్ళను వదిలి భర్తతో వెళ్ళిపోయింది.

బ్రహ్మయ్య, అతని భార్య ఆశ్చర్యపోయి "అందరి కంటే ధనవంతుడు, యోగ్యుడూ, చక్కటి అందగాడూ, చదువుకున్నవాడయిన వరుణ్ణి తేవాలనుకున్నా, విధిని ఎవరు తప్పించగలరు? దీని బుద్ధిపోనిచ్చుకోలేదు. ఎలుకగా పుట్టింది, ఎలుకనే పెళ్ళాడింది. "ఏమిటో ఈ మాయ?" అనుకుంటూ బాధను దిగమింగుకొని ఉండిపోయారు.

మూలం : **సరస వినోద కథలు**, నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా.

## ప్రశ్నలు:

1. ఈ కథ మీకు నచ్చిందా? ఎందుకో రాయండి.
2. "ఎవరి బుద్ధి వారిది – అది మారనే మారదు " అనే విషయం ఎలుక విషయంలో నిజమైందా? లేదా? మనుషులు కూడా అలాగే ఉంటారా? మారతారా? మీ అభిప్రాయం రాయండి.
3. బ్రహ్మయ్యకున్నట్లు, మీకే అలాంటి మంత్రశక్తి ఉంటే ఏమేం చేస్తారు?
4. బ్రహ్మయ్య తన మంత్రశక్తితో ఎలుకకు బదులు చిలుకను "చిలుకబాల" గా మార్చేస్తే ఏం జరిగి ఉండేది. కథ రాయండి.

**"జంతువుల గొప్పతనాన్ని వేల సంవత్సరాలనాడు భారత దేశం గ్రహించింది. వాటికి పూజాగృహంలో స్థానం కల్పించింది."**


© SCERT not to be republished

నాలుగో
యూనిట్

# 15. మధువనం

- ఆతుకూరి మొల్ల

**ఆలోచించండి - మాట్లాడండి:**



**ప్రశ్నలు:**

1. పై చిత్రంలో ఏమి కనిపిస్తున్నాయి?
2. అవి ఏమి చేస్తున్నాయి?
3. ఇలా చెయ్యడాన్ని ఏమంటుంటాం?
4. ఇలాంటి ఒక ఘట్టం మీకు తెలుసా?

**నేపథ్యం:**

లంకలో ఉన్న సీతమ్మ జాడను తెలుసుకొని వచ్చాడు హనుమంతుడు. జాంబవంతునికి, అంగదాదులకు తాను చూసి వచ్చిన విషయాలను తెలిపాడు. ఆ మరునాడు ఉదయాన, ఆకలితో ఉన్న కపివీరులందరూ, సుగ్రీవుడి మధువనంలోకి ప్రవేశించారు. పిల్లలూ! ఆ మధువనంలో కోతులు చేసిన వింత చేష్టలను, ఆ తరవాత జరిగిన పరిస్థితులను, ఈ పాఠం చదివి మనం తెలుసుకొందామా ? ప్రాచీన పద్యసాహిత్యాన్ని పిల్లలకు పరిచయం చేయడం, మొల్ల కవిత్వాన్ని రుచి చూపించడం, ఈ పాఠం ప్రధాన ఉద్దేశం.

ప్రస్తుత పాఠ్యాంశం మొల్ల రామాయణంలోని సుందరకాండనుంచి తీసుకొన్నది.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. తెలియని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.



వ॥ "సుగ్రీవుని మధువనంబున నుండెడు, ఫలంబులం బరితృప్తులమై, రాముని సన్నిధానంబున కేగుట లెస్స"యని, యంగద హనూమంతులు పల్క, జాంబవంతుండును నత్యుత్సాహంబున నంగీకరించి, కపులం బురస్కరించు కొని, మధువనంబులో బ్రవేశించి నంత 1


సీ॥ ఒక్కఁడాఁకొనిఁ కొమ్మ నూఁచినఁ బండ్లెల్లఁ
జేకొని తేర భక్షించు నొకఁడు
ఒక్కఁడాఁకొని రేఁపుచున్నట్టి తేనియల్
తడయక కొల్లాడి త్రాగు నొకఁడు
ఒక్కఁడాఁకొని కోయుచున్నట్టి కాయలు
మిన్నక యూటాడి మ్రింగు నొకఁడు
ఒక్కఁడాఁకొని గోళ్ళ నొలిచినట్టి చివుళ్ళఁ
బుక్కిళ్ళకొలఁదిగా బొక్కునొకఁడు

తే॥గీ॥ తరువుపైనుండి తరువుకు దాఁటు నొకఁడు
పండ్ల కెటువంటి మ్రాఁకైన బ్రాకు నొకఁడు
దిగువఁ గూర్చుండి తరువున కెగురు నొకఁడు
పెద్ద పొడవుననుండి కుప్పించు నొకఁడు 2

* ఉ॥ కాయల వ్రేటులాడుచును, గంతులు వైచుచుఁ, బూవుదీవలం
దూయల లూగుచున్, దరువు లూఁపుచుఁ బండ్లను బొట్టనిండుగా
మేయుచు, వెక్కిరింపుచును, మిన్నక దాఁటుచు, దోఁక లెత్తుచుం
గూయుచు నేల దూఁకుచును, గుంపులు గూడి కపీంద్రు లెంతయున్. 3


కం॥ వన మెల్ల గాసి చేయఁగ
వనపాలకు లేఁగుదెంచి, వడిఁగోపముతో
డను నదలించిన వారల
హనుమంతుఁడు మొదలుగాఁగ నగచరులెల్లన్ 4

© SCERT not to be republished



కం॥ మెడఁబట్టి వనము లోపల
వెడలఁగ నటు పాఱద్రొబ్బి, వెడలుండన్నన్
దడయక దధిముఖుఁడను తమ
యొడయని కడ కేఁగి వార లుగ్రముగాఁగన్ 5

వ॥ విన్నవించిన యంతనే 6





* చం॥ దధిముఖుఁ, డల్గి మండిపడి, తాఁ దనవారలఁ గూడి వచ్చి, బల్
విధముల సంచరించు కపివీరులఁ గోపముతోడఁ జూచి,యీ
మధువన మెల్లఁ గొల్లగొన, మర్కటవల్లభు నాజ్ఞఁ ద్రోయ,మ
మ్మధములఁ జేయ, నెంత ఘనులంచును బాఱఁగ వారి నుద్ధతిన్. 7

వ॥ ఇట్లు దండింపుచున్న దధిముఖునిపై నంగదాది వనచరులు గదిసి
యాగ్రహంబున 8

క॥ కొందఱఁ గఱచియుఁ బొడిచియుఁ,
గొందఱఁ దలపట్టి యీడ్చి కొట్టియు, గోళ్ళన్
గొందఱ వ్రచ్చియు, దన్నియు,
నందఱ నొప్పింప వార లాగ్రహ వృత్తిన్. 9

కం॥ వ్రయ్యలు వాఱగ వ్రచ్చినఁ
గ్రయ్యగ రక్తములు గ్రమ్మఁగా వడితోడన్
'గుయ్యో! మొఱ్ఱో యని', వా
రయ్యెడ సుగ్రీవుకడకు నరిగిరి భీతిన్. 10

© SCERT not to be republished

## కవయిత్రి పరిచయం



(ఊహాచిత్రం)

కవయిత్రి : **ఆతుకూరి మొల్ల**

కాలం : 1440-1530

జన్మస్థలం : నెల్లూరు జిల్లా గోపవరం అనే గ్రామం.

రచన : రామాయణం. దీనికే మొల్ల రామాయణం అని పేరు.


**భావాలు :**

1. సుగ్రీవుని 'మధువనం'లోకి ప్రవేశించి అక్కడి పండ్లను తిని, ఆకలి తీర్చుకొని రాముని దగ్గరకు వెళ్ళటం మంచిదని అంగదుడు, హనుమంతుడు పలికారు. జాంబవంతుడు ఆ మాటలను విని, అంగీకరించి కపులందరితో మధువనంలోకి ప్రవేశించాడు.
2. ఆకలితో ఉన్న ఒక మర్కటం కొమ్మను ఊపి, పండ్లను చేతితో పట్టుకొని తింటున్నది. మరొక కోతి ఆలస్యం కాకుండా తేనెలను తాగుతున్నది. ఇంకొక కపి కాయలను హడావిడిగా మింగుతున్నది. మరొక వనచరం గోళ్ళతో చీల్చిన చివుళ్ళను బుగ్గలు నిండేటట్లు బొక్కుతున్నది. ఒక నగచరం చెట్టు పైనుంచి మరొక చెట్టుపైకి దాటుతున్నది. కోతి ఒకటి పండ్లకోసం ఎటువంటి చెట్టుపైకైనా పాకుతున్నది. ఒక వానరం కింద కూర్చొని చెట్టుపైకి ఎగురుతున్నది. మరొక వనచరం చాలా దూరంనుంచి కుప్పించి దూకుతున్నది.
3. కాయలతో దెబ్బలాడుతూ, గంతులు వేస్తూ, పూలతీగలతో ఊయలలూగుతూ, చెట్లను ఊపుతూ, పండ్లను పొట్టనిండుగా తింటూ, మూతి తిప్పుతూ వెక్కిరిస్తూ, ఊరకనే అటు, ఇటు దాటుతూ తోకలు ఎత్తుకొంటూ, కేకలు వేస్తూ, నేలపైకి దూకుతూ శ్రేష్ఠమైన ఆ కోతులు గుంపులుగా కలుస్తూ...
4. ఆ మధువనమంతా పాడుచేయగా వనాన్ని కాపాడేవాళ్ళువచ్చి కోపంతో వాటిని అదిలించగా హనుమంతుడు మొదలైన వానరులందరూ...
5. మెడబట్టి వనం లోపలినుంచి ఆ వనపాలకులను బయటకు తోసి 'పొండి' అన్నారు. అప్పుడు వాళ్ళు ఆలస్యం చేయకుండా తమ నాయకుడైన దధిముఖుడనేవాని దగ్గరికి వెళ్ళారు.
6. మధువనంలో జరిగిన విషయమంతా విన్నవించారు.
7. దధిముఖుడు కోపంతో మండిపడి తనవాళ్ళందరితో కలిసి మధువనానికి వచ్చి, అనేక విధాలుగా అల్లరిచేస్తూ తిరుగుతున్న కపివీరులను చూసి, "ఈ మధువనమంతా పాడుచేయడానికి, సుగ్రీవుని ఆజ్ఞను ధిక్కరించడానికీ, మమ్మల్ని చేతగానివాళ్ళుగా చేయడానికి పూనుకున్నారా" అని మర్కటాలను ఎదిరించి బాధించసాగాడు.
8. ఈ విధంగా దండిస్తున్న దధిముఖునిపైకి, అంగదుడు మొదలైనవాళ్ళు కోపంతో విజృంభించారు.
9. కొందరిని నోటితో కొరికారు. కొందరిని పొడిచారు. కొందరిని జుట్టుపట్టి యీడ్చికొట్టారు. మరి కొందరిని గోళ్ళతో రక్కారు. కొందరిని తన్నారు. ఈ విధంగా వానరులు వనపాలకులను బాధించారు.
10. శరీరం చీలికలై రక్తాలు కారుతుండగా, 'కుయ్యో మొర్రో' అంటూ, వాళ్ళు భయంతో వేగంగా సుగ్రీవుని దగ్గరకు పారిపోయారు.

© SCERT not to be republished



## ఇవి చేయండి :



### I. వినడం-మాట్లాడడం



1. పాఠంలోని పద్యాలను రాగంతో, భావంతో చదవండి.
2. పాఠంలో కోతిచేష్టలు తెలుసుకున్నారు కదా! కోతులు ఇంకేమేమి చేస్తాయో చెప్పండి.
3. పండ్లతోటలోకి వెళితే, మీరేం పనులు చేస్తారో చెప్పండి?
4. అల్లరి పనులను కోతిచేష్టలతో పోలుస్తారు కదా ! ఎందుకో చెప్పండి.
5. ఒక్కఁ డాకొని -------- కుప్పించు నొకడు. పద్యభావాన్ని సొంతమాటల్లో చెప్పండి.

### II. చదవడం - రాయడం



**1. కింది పద్య పాదాలు, మీ పాఠంలోని ఏ పద్యంలో ఉన్నాయో గుర్తించండి. ఆ పద్యాన్ని చదవండి.**

అ. హనుమంతుడు మొదలుగాఁగ నగచరులెల్లన్

ఆ. వడితోడన్ గుయ్యో మొఱ్ఱో యని

**2. కింది పదాలు చూడండి. వీటిని సరైన క్రమంలో ఉంచి వాక్యాలు రాయండి.**

అ. ప్రవేశించారు వానరులందరూ మధువనంలోకి

ఆ. వనపాలకులు విన్నవించారు దధిముఖునికి మధువనంలో జరిగినదంతా

ఇ. దధిముఖుని అంగదుడు పైకి వారు మొదలైన విజృంభించారు.

ఈ. కుయ్యోమొర్రో వనపాలకులు వద్దకు సుగ్రీవుని అంటూ పారిపోయారు.

**3. కింది పట్టికలోని పదాలను కలుపుతూ వాక్యాలు రాయండి.**

ఉదా: ఒక కోతి ఆలస్యం చేయక తేనెలను తాగుతున్నది

| | |
|---|---|
| అ. పండ్లను చేతితో తీసుకొని హాయిగా | దాటుతున్నది |
| ఆ. కోస్తున్న కాయలను హడావిడిగా | ఎగురుతున్నది |
| ఇ. ఆలస్యం చేయక తేనెలను | బొక్కుతున్నది |
| ఈ. ఒక కోతి గోళ్లతో బలిసిన చివుళ్ళను పుక్కిళ్ళనిండ నింపుకొని | తాగుతున్నది |
| ఉ. ఒక చెట్టుపైనుంచి మరొక చెట్టుపైకి | భక్షిస్తున్నది |
| ఊ. పండ్లకోసం ఎంతటి పెద్ద చెట్టుపైకైనా | మింగుతున్నది |
| ఎ. కింద కూర్చొని చెట్టుపైకి | దూకుతున్నది |
| ఏ. చాలాదూరంనుంచి | పాకుతున్నది |

© SCERT not to be republished



..............................................................................

..............................................................................

..............................................................................

..............................................................................

**4. కింది చదరంలో రామాయణంలోని కొన్ని పాత్రల పేర్లు ఉన్నాయి. వాటిని ఖాళీలలో రాయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| అం | గ | దు | డు | వా | లి | మ |
| సీ | జాం | హ | రా | ము | డు | ధు |
| త | బ | ను | ల | రా | వా | వ |
| సు | వం | మం | క్ష్మ | వ | న | న |
| గ్రీ | తు | తు | ణు | ణు | రు | ము |
| వు | డు | డు | డు | డు | డు | కో |
| డు | ద | ధి | ము | ఖు | డు | తి |

1. ............................
2. ............................
3. ............................
4. ............................
5. ............................
6. ............................
7. ............................

©SCERT not to be republished

**5. కింది పేరా చదవండి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

హనుమంతుడు శ్రీరాముని సేవకుడైన వానరుడు. ఇతని తల్లి అంజన, తండ్రి కేసరి. ఇతడు మహాబుద్ధిమంతుడు, బలవంతుడు, గొప్ప పండితుడు. శ్రీరామునితో సుగ్రీవునికి స్నేహం కూర్చినవాడు ఇతడే. సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించి సీత జాడ తెలుసుకొన్నవాడు ఇతడే. యుద్ధంలో రావణ సైన్యంలోని వీరులను సంహరించాడు. లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు సంజీవని పర్వతాన్ని తెచ్చి అతని ప్రాణాన్ని కాపాడాడు. యుద్ధంలో శ్రీరాముడు విజయం పొంది, తిరిగి వస్తున్న విషయాన్ని ముందుగా భరతుడికి తెలిపినవాడు ఇతడే. శ్రీరామపట్టాభిషేక సమయంలో సీతారాముల అనుగ్రహాన్ని పొందిన ధన్యుడితడు. నిరంతరం రామనామాన్ని జపించే హనుమంతుడు చిరంజీవులలో ఒకడు.

అ. పై పేరా ఎవరిని గురించి చెప్తుంది? ( )

(ఎ) రాముడు (బి) లక్ష్మణుడు (సి) హనుమంతుడు

ఆ. హనుమంతుడు .......................... ( )

(ఎ) మానవుడు (బి) వానరుడు (సి) రాక్షసుడు

ఇ. హనుమంతుడు దేన్ని దాటాడు? ( )

(ఎ) నదిని (బి) సరస్సును (సి) సముద్రాన్ని

ఈ. సీతజాడను తెలుసుకున్నది ఎవరు? ( )

(ఎ) హనుమంతుడు (బి) లక్ష్మణుడు (సి) భరతుడు

**6. కింది ప్రశ్నలకు మీ పాఠం ఆధారంగా జవాబులు రాయండి.**

అ. మధువనంలో ఆకలితో ఉన్న కోతులు ఏ విధంగా అల్లరి చేశాయి?

ఆ. మధువనంలోని వనపాలకులను కపివరులు ఏం చేశారు?

ఇ. మొల్లను గురించి మీకేం తెలుసో వివరించండి?

ఈ. వనపాలకులు దధిముఖునికి ఏం చెప్పారు?

ఉ. వానరాలు మధువనాన్ని ఎలా పాడుచేశాయి?



## III. స్వీయరచన



**1. కింది పద్య భావాన్ని మీ సొంత మాటల్లో రాయండి.**

తే॥గీ॥ తరువుపై నుండి తరువుకు దాఁటు నొకఁడు
పండ్ల కెటువంటి ప్రాఁకైనఁ బ్రాకు నొకఁడు
దిగువఁ గూర్చుండి తరువున కెగురు నొకఁడు
పెద్ద పొదవుననుండి కుప్పించు నొకఁడు

**2. కింది ప్రశ్నలకు మీ జవాబులు రాయండి**

అ. ఈ పాఠంలోని పద్యాలవల్ల మీరు తెలుసుకొన్న విషయాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

ఆ. మధువనంలో ప్రవేశించిన కోతుల చేష్టలను మీ సొంతమాటల్లో రాయండి.

ఇ. "కోతి – మేకు" "కోతి –పిల్లలు" వంటి కథలను సొంతమాటల్లో రాయండి.

ఈ. అంజనేయస్వామిని గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.

ఉ. 'తాఁజెడ్డ కోతి – వనమెల్లా చెరిచింది' అనే సామెతకు అర్థం వచ్చేవిధంగా ఒక కథ రాయండి.

ఊ. మధువనం పాఠ్య సారాంశాన్ని మీ సొంతమాటల్లో కథలాగ రాయండి.

**3. కింది పద్యాన్ని చూడకుండా రాయండి.**

వ్రయ్యలు ..................................

.............................................


.............................................

........................................ భీతిన్.

© SCERT not to be republished

4. **ఈ పాఠానికి మధువనం అనే పేరుకు బదులు ఏ పేరు పెడితే బాగుంటుంది? ఎందుకు ?**

## IV. పదజాలం




1. **కింది గీత గీసిన మాటలకు అర్థాలను రాయండి.**

అ. పర్యావరణ పరిరక్షణకు తరువులను విరివిగా పెంచాలి.

ఆ. చెట్టుకొమ్మలపైన కొన్ని కపులు గంతులు వేస్తున్నాయి.

ఇ. చిన్ని కృష్ణుడు వెన్న భక్షించాడు.

ఈ. పామును చూసి పిల్లలంతా భీతితో పరుగెత్తారు.

ఉ. కత్తి వ్రేటువల్ల గాయమై రక్తం కారింది.

2. **పద్యభావాలున్న పేరాలను చదవండి. " కోతి " అర్థం వచ్చే పదాలు ఏమేం ఉన్నాయో రాయండి.**

ఉదా : మర్కటం ............... ........ . ........ . .........

............... ................... ................. ..................

3. **కింది పదాలకు అదే అర్థం వచ్చే రెండు పదాలు రాయండి.**

ఉదా : అ. తరువు చెట్టు వృక్షం

ఆ. వనం ........... ..........

ఇ. కపి ........... ...........

ఈ. నేల ........... ............

ఉ. కోపం ........... ............

4. **పాఠంలోని తెలియని పదాలకు జట్లుగా కూర్చొని అర్థాలు రాయండి.**
(నిఘంటువును / అకారాది పట్టికను చూడండి)

## V. సృజనాత్మకత



1. కోతిచేష్టలను మూగవాడిగా అభినయం చేసి చూపించండి.
2. మధువనంలోని కోతిచేష్టలు చిత్రంగా గీయండి. వాటికి తగిన రంగులు వేయండి.
3. "అల్లరి కోతులు చదువుకోడానికి అడవికి దగ్గరగా ఉన్న ఒక బడిలో చేరాయి. ఇంతకంటే ఎక్కువ అల్లరి చేసే అల్లరి పిల్లలు ఆ బడిలో ఉన్నారు. వీళ్ళందరికీ చక్కగా చదువు చెప్పారు ఆ గురువులు".
ఈ భావం వచ్చేలా నవ్వు కలిగించే సన్నివేశాలతో కథ రాయండి.

## VI. ప్రశంస



1. బాలల బొమ్మల రామాయణాన్ని చదవండి.
2. రామాయణానికి సంబంధించిన పాటలు, పద్యాలు, గేయాలను తెలుసుకొని పాడండి.
3. పాఠంలోని పద్యాలను కంఠస్థం చేయండి. రాగంతో పాడండి.

©SCERT not to be republished

## VII. ప్రాజెక్టు పని



1. ఇతర కవులు రాసిన రామాయణాలు, వారి కాలాలు, బిరుదులు, వారి ఇతర రచనలను సేకరించి ఆల్బమ్ తయారుచేయండి.
2. కోతుల కథలు సేకరించండి. రాయండి. ప్రదర్శించండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**1. ఈ కింది పదాలను విడదీయండి. అవి ఏ సంధులో గుర్తించండి.**

(అ) చింతాకు = ............ + .............

(ఆ) ఇంకొకరు = ............ + .............

(ఇ) వంటాముదం = ............ + .............

(ఈ) ఈయనెవరు = ............ + .............

**2. ఈ కింది మాటలను కలపండి. అవి అత్వసంధి పదాలేనా? చర్చించండి.**

(అ) నాయన + అమ్మ = ............ + .............

(ఆ) పట్టిన + అంత = ............ + .............

(ఇ) చేసిన + అంత = ............ + .............

(ఈ) లేక + ఉన్న = ............ + .............

**3. ఈ కింది పదాలను విడదీయండి. సంధి పేరు రాయండి.**

(అ) చేతికందిన = ............ + ............. (        )

(ఆ) అదెట్లు = ............ + ............. (        )

(ఇ) లేనిదంటూ = ............ + ............. (        )

(ఈ) పదింతలు = ............ + ............. (        )

**4. ఈ కింది మాటలను కలపండి. అవి ఇత్వసంధి పదాలు అవునో కాదో ఆలోచించండి.**

(అ) మరి + ఒక = ............................

(ఆ) ఏది + ఐనా = ............................

(ఇ) ఏమి + అంటివి = ............................

(ఈ) లేని + అప్పుడు = ............................

**5. ఈ కింది పదాలను విడదీయండి. సంధి ఏదో గుర్తించండి.**

(అ) లెమ్మని = ............ + ............. (        )

(ఆ) అందొకటి = ............ + ............. (        )

© SCERT not to be republished

(ఇ) నెపమెన్నక = ............ + ............. (          )

(ఈ) వేరొకడు = ............ + ............. (          )

**6. ఈ కింది మాటలను కలపండి. అవి ఉత్వసంధి పదాలేనా? నిర్ణయించండి.**

(అ) అప్పుడు + అట్లు = ..........................

(ఆ) వనము + ఎల్ల = ..........................

(ఇ) మనము + ఇప్పుడు = ..........................

(ఈ) మేలు + అవి = ..........................

**7. ఈ కింది పదాలను విడదీయండి. యడాగమం వచ్చిందని గ్రహించండి.**

(అ) ఏలియున్న = ............ + .............

(ఆ) భార్యయేల = ............ + .............

(ఇ) కోసియిచ్చి = ............ + .............

(ఈ) పాడియావు = ............ + .............

**8. ఈ కింది మాటలను కలపండి. యడాగమం వచ్చిన తీరును చర్చించండి.**

(అ) గూని + అవ్వ = ..........................

(ఆ) మంచి + అదను = ..........................

(ఇ) మరి + ఒక్కడు = ..........................

(ఈ) పది + ఆరువేల = ..........................

©SCERT not to be republished



**నేనివి చేయగలనా ?**

**కింద ఇచ్చిన ప్రశ్నలను చదివి మీరు నేర్చుకొన్న విషయాలను మూల్యాంకనం చేసుకోండి.**


| | | |
|---|---|---|
| 1 | ఈ పాఠ్యభాగంలోని పద్యాలను రాగయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. | పద్యాలకు భావాలను సొంతమాటలలో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | పద్యభావాలను సొంతమాటలలో రాయగలను. | ఔను / కాదు |
| 4. | కోతిచేష్టలను మూగవాడిలా అభినయించగలను. | ఔను / కాదు |
| 5. | పద్యాలలోని పదాలకు అర్థాలను నిఘంటువులో / అకారాది పట్టికలోచూసి తెలుసుకున్నాను. | ఔను / కాదు |

**" మానవ సంబంధాలలోని గొప్పతనాన్ని చూపే కమనీయ కావ్యం రామాయణం"**

నాలుగో యూనిట్

# 16. నేనైతే...

**ఆలోచించండి - మాట్లాడండి :**



**ప్రశ్నలు :**

1. ఈ చిత్రం చూస్తే మీకేం అనిపిస్తుంది?
2. పడుకొని ఉన్నాయన గురించి మీరేమనుకుంటున్నారు?
3. ఇందులో మీకు నచ్చినవారెవరు?
4. ఇందులో ఎవరు గొప్ప అని మీరనుకుంటున్నారు?

**నేపథ్యం :**

శ్రమైకజీవన సౌందర్యాన్ని, పిల్లల మనస్తత్వాన్ని, సమాజంపట్ల బాధ్యతను, సంస్కారాలను తెలియజేయడమే దీని ముఖ్య ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.

“బంగారూ, నీలో చాలా శక్తి ఉందమ్మా,” అని తాతయ్య అన్నాడు. ఆ మాట వింటుంటే నాకు ఎంతో సంతోషమైంది. ఎందుకో చెప్పుకోండి? సరే మీరు చెప్పేదాకా నేనాగను గాని నేనే చేప్పేస్తా. ఎప్పటినుంచో నాకు ఎన్నెన్నో ఊహలు ఏమేమో కావాలనీ, ఎన్నెన్నో కోరికలు ఏవేవో చేయాలనీ. కానీ ఏం చేస్తా? నేను పిల్లను. అంత శక్తి నాకు లేదు కదా! అనుకునేదాన్ని. కానీ ఇవాళ తాతయ్య మాటలు విన్నాక కొత్త ఆలోచన వచ్చింది. నాలో చాలా శక్తి ఉంది. నేను ఏం కావాలనుకుంటే అది చెయ్యగలను. నా మాటలు వింటూంటే మీకు నవ్వు వస్తూందా? మీ ఇష్టం! నవ్వితే నవ్వండి ! నా ఆలోచనలు నాకున్నాయి. మీరేమనుకుంటే నా కేమిటి? నా ఇష్టం నాది. ఇష్టమంటే గుర్తొచ్చింది.... నా కేమి ఇష్టాలున్నాయో మీకు తెలుసా?





తేనెటీగగా మారిపోవాలని ఉంది నాకు. హాయిగా గాలిలో తేలిపోవచ్చు. ఎప్పుడూ నేలమీద నడవడమంటే నాకు మహా చిరాకు.అందుకే తేనెటీగనై రెక్కలూపుకొంటూ అందమైన తోటలోకి వెళతా. అబ్బా! అక్కడ ఎన్నెన్ని రంగుల పూలు? అవి గాలికి కదలుతూంటే రమ్మని నన్నే పిలుస్తున్నట్లుంటుంది. తోటంతా కలయదిరుగుతూ ఒక్కొక్క పువ్వు దగ్గరికి వెళుతూ అందులోని తేనెను తీసుకుంటా. నా తెట్టె దగ్గరికి వెళ్లి అందులో జాగ్రత్తగా దాచిపెడతా. ఇదంతా చాలా శ్రమతో కూడిన పనే. కాదంటే తేనె ఎట్లా దొరుకుతుంది? నాకు బాగా కోపం వచ్చేదిక్కడే. నేనెంతో కష్టపడి పువ్వు పువ్వు తిరిగి తెచ్చి దాచుకున్న తేనెను ఈ మనుషులు అమాంతంగా తీసుకొని తాగేస్తున్నారు. ఎంత దుర్మార్గం? ఇలా దోచుకోడం తప్పుగదా? ఒక్క క్షణం ఆలోచించాను. నాకు కోపం పోయి సంతృప్తి కలిగింది. ఎందుకో తెలుసా? నాకు బాగా కష్టమైతే అయి ఉండవచ్చు గాని నా శ్రమవల్ల కొందరికన్నా లాభం కలుగుతుందిగదా! అదే నాకు తృప్తి. మన జీవితం ఇతరులకుపయోగపడటంకన్నా మించిందేముంటుంది?

అప్పుడప్పుడు నాకు నదినై పరుగెత్తాలనిపిస్తుంది. కెరింతలు కొడుతూ ఉరకడమంటే నాకెంతో ఇష్టం. ఆ ఆనందమే వేరు. మీరూ ఒకప్పుడు అలా పరుగెత్తినవాళ్ళే కదా? కాని ఇప్పుడు మాత్రం నన్ను పరుగెత్తవద్దంటారు. కూర్చోమంటారు. అందుకే నదినైతే నన్నాపలేరు. గలగలమంటూ సొంపుగా వంపులు తిరుగుతూ దూసుకుపోతా. చెట్లను, గుట్టలను పలకరిస్తూ పోతా. అడవిలో పరవశిస్తూ పోతా. ఆకాశానికి అద్దాన్ని నేను. కదలని ఆకాశం తాను కదిలితే ఎలా ఉంటుందో నాలో చూసుకుంటుంది. చెట్లు, గుట్టలు తమ అందాన్ని నాలో చూసుకుని మురిసిపోతాయి. జంతువులు, పక్షులు, మనుషులు నా దగ్గరికే వచ్చి దప్పిక తీర్చుకుంటారు. వీళ్ళంతా రావడం చూసి గర్వంతో ఉప్పొంగుతా. ఆ క్షణానికలా అనిపిస్తుంది కానీ

© SCERT not to be republished

నేను అహంకారిని కాదు, ఉపకారిని. నా నీళ్లవల్ల వాళ్ళ అవసరాలు తీరుతున్నాయన్న సంతృప్తి కూడా కలుగుతుంది నాకు. చూశారా, నేను నదిగా మారినా నా పరుగును ఆపాలని చూస్తున్నారు. అందుకే నాకు అడ్డంగా పెద్ద ఆనకట్ట కట్టారు. నాకు చాలా కోపం వస్తుంది. అమాంతంగా కట్టను తెంచుకొని ముందుకుపోవాలనిపిస్తుంది. కాని కొద్దిగా ఓపిక పట్టి ఆలోచించా. ఇది తప్పనిపించింది. అలా వెళితే నా కోపానికి ఎందరో బలౌతారు. ఎంతో నష్టం జరుగుతుంది. నావల్ల ఇతరులకు నష్టం జరగడం, కష్టం కలగడం నేనస్సలు ఒప్పుకోను. చేయగలిగితే ఇతరులకు మేలుచేయాలి, కాని కీడు చేయగూడదు. ఇంకొద్దిగా ఆలోచించాను.

ఆనకట్టకూడా మంచిదేనేమో అనిపించింది. అతివేగం ప్రమాదకరం కదా? జీవితంలో కాస్త నెమ్మదితనం కూడా మంచిది. ఇలా ఆలోచిస్తుంటే ఇంకో మంచి విషయం తట్టింది. నాకు అడ్డంగా ఆనకట్ట కడితే కట్టారుగాని దీనివల్ల ఎన్నివేల మందికి పని దొరికింది? నావల్ల పంటలు ఎక్కువగా పండుతాయి. ఎంతో మందికి అన్నం పెట్టిన పుణ్యం నాక్కూడా దక్కుతుందిగా! వాళ్ళంతా ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే నాకెంత సంతోషమో! నిజంగా శ్రమలోనే ఆనందమున్నదనిపించింది. వాళ్ళు తమకొరకే కాదు, సమాజంకొరకు కష్టపడుతున్నారు. ఇదే నిజమైన జీవితం.

ఆనకట్ట కట్టి నన్ను ఇబ్బందిపెట్టడం వాళ్ళ ఉద్దేశం కాదనితెలిసింది. కాలువల ద్వారా నా నీటిని పంటపొలాలకు మళ్ళించుకుంటారు. పొలాల్లో రైతులు అరకగట్టి దున్నుతారు. ఆ మడికట్లలో తిరగడం ఎంత బాగుంటుంది! శరీరంమీద బురద పడుతూంటే దాని కమ్మటి వాసన పీలుస్తూ తిరగడం బలేగా ఉంటుంది. కాళ్ళు దిగబడుతూంటాయి. ఒక్కోసారి నడవడమే కష్టంగా ఉంటుంది. కాని ఇష్టమైతే కష్టమనిపించదు కదా! అమ్మలక్కలు నాట్లువేస్తూ మంచి మంచి పాటలు పాడతారు. పనీ పాటా కలిసిపోతాయి. వరిమొక్కలను ఒక పద్ధతిగా నాటుతున్న వాళ్ళను చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఇంత చక్కగా ఎలా వేయగలుగుతున్నారో? ఇంత నైపుణ్యం వీళ్ళకు ఎలా వచ్చిందో? ఒకరు పాట చెపుతుంటే మిగతావాళ్ళంతా అందుకొని కలసి పాడతారు. ఎక్కడా భేదం ఉండదు. ఇలా అందరం ఒకే మాటగా, పాటగా ఉంటే ఎంత బాగుంటుందో! ఎర్రటి ఎండలో కూడా నడుము వంచి కష్టపడతారు. సోమరితనం వాళ్ళ దగ్గరకు రావాలంటేనే భయపడుతుంది.

శిల్పిని కావాలని నాకు బలమైన కోరిక ఉంది. మూలన పడిఉన్న రాళ్ళతో ముచ్చటైన శిల్పాలను చెక్కవచ్చు. రాయి నామాట వింటుంది. ఏది కమ్మంటే అది అవుతుంది. నా శిల్పాలు చరిత్రసాక్షిగా నిలిచిపోతాయి. ఎందరికో కనువిందు చేస్తాయి. వాటిని చూసినవారు మెచ్చుకుంటూంటే నా శ్రమ



ఫలించినందుకు మనసు నిండిపోతుంది. అవ్వ చెప్పేది బ్రహ్మదేవుడు, ఎలా అనుకుంటే అలా పుట్టిస్తాడని. నేను కూడా ఏదనుకుంటే అది తయారుచేస్తాను. మరి నేనూ బ్రహ్మనేగా! దానికేం గాని బండను చూస్తే బాధ కలుగుతుంది. పాపం నా సుత్తిదెబ్బలకు తట్టుకోలేక అరుస్తుంది. కాని ఎదురుతిరగదు. ఈ ఓర్పువల్ల దానికి లాభమే కలిగింది. బండగా ఉన్నప్పుడు అందరూ దాన్ని తొక్కిపోయేవారు. ఇప్పుడు దేవతామూర్తిగా మారేసరికి మొక్కిపోతున్నారు. ఇదంతా చూస్తుంటే మీకేమనిపిస్తుంది? ఓర్పుతో కూడిన మంచితనంవల్ల గౌరవం కలుగుతుందని తెలియడం లేదూ? శిల్పాన్ని చూసినప్పుడల్లా నాకొక ప్రేరణ కలుగుతుంది. శ్రమించకపోతే ఫలితం రాదనిపిస్తుంది. రోజుల తరబడి చెక్కితేనే కదా శిల శిల్పంగా మారేది! శిలగా చిరకాలం బతకడం కన్నా శిల్పంగా కొద్దికాలం జీవించినా చాలు!


నాకు ఎన్నో ఆలోచనలున్నాయి. వాటిలో కొన్నింటిని అప్పుడప్పుడు అమలు చేస్తాను. అందుబాటులో ఉన్నవాటితో అద్భుతాలు చేస్తా. జోరుగా వానకురుస్తూంటే అందులో తడవాలన్న తహతహ నాకు. వర్షపు నీళ్ళు పారుతుంటే కాగితంతో కత్తిపడవో, ఉత్తిపడవో చేసి అందులో వదలాలంటే మరీ మరీ ఇష్టం. అది నీళ్ళలో పోతూంటే దాన్ని చూస్తూ పక్కగా పోతుంటే చాలా సరదాగా ఉంటుంది. ఎవరూ లేని ఆ పడవ ఎంత వేగంగా పోతుందో? పారే నీళ్ళకు ఆనకట్ట కడతా. అది తెగుతుంటే సరిచేస్తా. అప్పటికీ నిలవకుంటే కాలు అడ్డం పెడతా.

నా శ్రమ వృథా కాగూడదుగా! తడి ఇసుకతో పిట్టగూళ్ళు కడతా. మా ఇంటి ముందర బండిని చూసి నాకు బండి చేయాలనిపించింది. చొప్పబెండ్లతోనే బండిచేశా. చూడముచ్చటగా ఉంటుంది. మట్టితో ఎద్దులను కూడా చేశా., మట్టి అంటే జ్ఞాపకం వచ్చింది. మొన్న వినాయక చవితికి వినాయక విగ్రహాన్ని మట్టితో నేనే చేశా. దానికే మా ఇంట్లో పూజలు చేశారు. నా కెంత సంతోషమో! పక్కింటివాళ్ళు కూడా చూసి మెచ్చుకున్నారు చాలా బాగా చేశానని. శ్రద్ధతో చేసే శ్రమ మంచి ఫలితాన్నిస్తుందని తెలిసింది.

© SCERT not to be republished

నాకు బొమ్మలు వేయడమంటే మహా సరదా. తెల్లకాగితం కనిపిస్తే చాలు, ఏదో గీయాలనిపిస్తుంది. నేను చూసిన సీతాకోక చిలుకలను పట్టి కాగితంమీద పెట్టగలను. మా ఊరి పక్కన గుట్టమీదున్న గుడిని కాగితంలోకి రప్పించి కదలకుండా చేయగలను. పత్రికల్లో వచ్చే బొమ్మలను నా కాగితాల్లోకి పిలిచి మురిసిపోతా. మనుషులను చూసి





అచ్చంగా అలాగే వేయగలను. ఇదంతా తలచుకుంటే నేనేమైనా చేయగలననిపిస్తుంది.

ఒకసారి ఏమయిందంటే నా మిత్రుడు ఆంజనేయుని బొమ్మ వేశాడు. తలమాత్రం వేయాల్సి ఉంది. ఇంతలో ఇంటర్వెల్ గంట కొట్టారు. బయటికి వచ్చేసరికి ఎదురుగా వేపచెట్టుమీద కోతి కనిపించింది. వెంటనే నాకు కొంటె ఆలోచన వచ్చింది. సగం వేసిన బొమ్మకు కోతిముఖాన్ని, తోకను పెట్టేశా. కింద పేరు రాసి ఆంజనేయులుకు చూపించా. ఇంకేముంది! వాడు చెంగున నామీదకు దూకాడు. నేను ఒక్కటే పరుగు.

మా పాఠశాలలో చిత్రలేఖనం పోటీపెట్టారు. చాలా కష్టపడి మా ఊరి బొమ్మవేశా. ఎంత బాగా వచ్చిందనుకున్నారు! నా చిత్రానికే మొదటి బహుమతి. నాతోటి విద్యార్థులు చప్పట్లు కొడుతూ ఉండగా నేను బహుమతి తీసుకోడానికి వెళుతూంటే మహారాణినయినట్టు మురిసిపోయాను. మా ప్రధానోపాధ్యాయులు బహుమతినిచ్చారు. నా చిత్రాన్ని మెచ్చుకుంటూ 'ఉన్న ఊరు కన్నతల్లిమీద గౌరవం ఉండాల్సిందే'నని భుజం తట్టారు. అమ్మ అక్కడే ఉంది. దగ్గరికి వెళ్లి బహుమతి చూపించా. ఆమె కళ్ళలో నీళ్ళు. కాళ్ళకు దండంపెట్టాను. అమ్మ కన్నీళ్ళు ఆశీస్సులుగా నా తలపైబడ్డాయి. ఇన్నాళ్ళుగా నేను చేస్తున్న సాధన ఫలించింది. శ్రమ ఎప్పుడూ వృథా కాదన్న మా ఉపాధ్యాయుల మాట అనుభవంలోకి వచ్చింది. మరుసటి రోజున నేను గీసిన చిత్రాన్ని పాఠశాల గోడపత్రికమీద పెట్టారు. అది చూసుకుంటున్నప్పుడు నా మనస్సు గాలిలో తేలిపోయింది. బాగా శ్రమిస్తే చిత్రలేఖనంలోనే కాదు, చదువులోకూడా మొదటిస్థానంలో నిలవవచ్చని తేలిపోయింది.

**'శ్రమయేవ జయతే'**



©SCERT not to be republished



## ఇవి చేయండి



### I. వినడం-మాట్లాడడం



1. నేనైతే .. పాఠం విన్నారు కదా! ఆమె పేరు ఏమై ఉంటుందో ఊహించి రాయండి. ఆమె గురించి చెప్పండి.
2. పక్షులను, నదులను, జంతువులను చూస్తే మీకు ఏమనిపిస్తుంది?
3. శిల్పం, చిత్రలేఖనం గురించి మీ పాఠ్యాంశంలో చదివారు కదా! ఇతర కళలను గురించి చెప్పండి. వాటిద్వారా మీరేమి గ్రహిస్తారో తెలపండి.
4. పాఠ్యాంశంలోని బాలిక ఇష్టాలను తెలుసుకున్నారు కదా! మీ ఇష్టాలేమిటో చెప్పండి.
5. "శ్రమయేవ జయతే !" అంటే ఏమిటి? దీనివల్ల పిల్లలు తెలుసుకోవలసింది ఏమిటి?

### II. చదవడం - రాయడం



**1. పాఠం చదవండి. కింది పదాలు ఎవరికి / వేటికి సంబంధించినవో చెప్పండి.**

అ. ఇలా దోచుకోడం తప్పు కదా?

ఆ. నా ఇష్టం నాది.

ఇ. ఆకాశానికి అద్దాన్ని నేను.

ఈ. నేనూ బ్రహ్మనేగా!

ఉ. మహారాణినయినట్లు మురిసిపోయా.

ఊ. భుజం తట్టారు.

**2. "నాకు బొమ్మలు వేయడమంటే మహా సరదా !.................... నేనేమైనా చేయగలనని అనిపిస్తుంది."**

(అ) పాఠంలోని ఈ పేరాను మార్చి కింది విధంగా మళ్ళీ రాయండి.

"ఆమెకు బొమ్మలు వేయడం అంటే మహా సరదా ............భావించింది."



**3. పాఠ్యాంశం ఆధారంగా జవాబులను రాయండి.**

అ. బాలిక తను శక్తిగలదాన్నని ఎలా గుర్తించింది?

ఆ. బాలిక నదిగా మారి ఏమేం చేయాలనుకున్నది?

ఇ. బాలిక వానలో ఏం చేయాలనుకున్నది?

ఈ. శ్రమ ఎప్పుడూ వృథా కాదని బాలిక ఎప్పుడు గుర్తించింది?

ఉ. కష్టపడేవాళ్ళను చూసి సోమరితనం భయపడుతుందని పాఠంలో ఏ సందర్భంలో ఉంది?

© SCERT not to be republished

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. 'నేనే సముద్రమయితే' ......... ఊహించి రాయండి.

ఆ. 'నేనే చీమనయితే' ........ ఊహించి రాయండి.

ఇ. 'నేనే ఉపాధ్యాయుడినైతే' ...... ఊహించి రాయండి.

ఈ. మీ కిష్టమైన పనిని గురించి సొంతమాటల్లో రాయండి.

ఉ. బొమ్మలు గీయడం, వస్తువులు తయారుచేయడం, కవితలు, కథలు రాయడం, నాట్యం చేయడం - వీటిలో మీకేది ఇష్టం? ఎందుకు?

ఊ. పాఠ్యాంశంలో బాలిక తాను ఏమేమి చేయగలదో చెప్పింది కదా! అలా మీరు ఏమేమి చేయగలరో చెప్పండి.

ఎ. "మనసు గాలిలో తేలిపోతుంది" అనే వాక్యాన్ని ఏ ఏ సందర్భాలలో వాడతారు?

**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు :**


అ. పాఠంలోని విషయాన్ని సొంతమాటల్లో రాయండి.

ఆ. నదులవల్ల కలిగే ప్రయోజనాలను సొంతమాటల్లో రాయండి.

ఇ. "సోమరితనం పనికిరాదు" అనే అంశాన్ని సమర్థిస్తూ ఉదాహరణలతో వ్యాసం రాయండి.

©SCERT not to be republished

## IV. పదజాలం



**1. పాఠ్యాంశంలో కొన్ని ఊహలను తెలిపే వాక్యాలున్నాయి. ఆ వాక్యాలను రాయండి. వాటి ఆధారంగా మీరు మీ ఊహల ప్రకారం ఆ వాక్యాలను తిరిగి రాయండి. కారణం కూడా రాయండి.**

**ఉదా:** నాకు తేనెటీగగా మారిపోవాలని ఉంది.నాకు రామచిలుకగా మారిపోవాలని ఉంది. ఎందుకంటే....

**2. కింది పదాలను చూడండి. ఒకే వాక్యంలో రెండు పదాలు వచ్చేటట్లు రాయండి.**

ఊహలు, తేలిపోవచ్చు, మహాచిరాకు, పరుగెత్తాలని, పరవశిస్తూ, చరిత్రసాక్షి, ప్రేరణ, వృథా

**ఉదా:** మన ఊహలు మనకు ప్రేరణలు.

3. కింది గళ్ళలోని అక్షరాలను చూడండి. వాటిలో కొన్ని శ్రమసాధనాలను తెలిపే పదాలున్నాయి.వాటిని గుర్తించి రాయండి. దేన్ని ఎవరు వాడతారో రాయండి.

**ఉదా:** పగ్గం – పగ్గాన్ని రైతులు ఉపయోగిస్తారు.

| | | | | |
|---|---|---|---|---|
| అ | క | లి | ప | క |
| డ్డ | గ | మ | లు | గు |
| తా | నా | ట్ట | త | ప |
| గ్గం | పా | గొ | ర | డు |

4. కింది సూచనల ప్రకారం వాటి పక్కన ఉన్న గళ్ళను సరైన అక్షరాలతో పూరించండి.

అ. తాగేవాటిని ఏమంటారు? పా ☐ ☐ లు

ఆ. భూమిలో పాతిపెట్టినవాటిని ఏమంటారు? పా ☐ ☐ లు

ఈ. రూపాయిలో నాలుగోవంతు పైసలకు బహువచనం పా ☐ ☐ లు

ఉ. పుణ్యాత్ములకు వ్యతిరేక పదం పా ☐ ☐ లు

ఊ. పండితులు కానివారు పా ☐ ☐ లు

ఎ. ధర్మరాజుకు వీటి ఆట ఇష్టం పా ☐ ☐ లు

ఏ. ప్రజలను పాలించేవారు పా ☐ ☐ లు

ఐ. భరతుడు నెత్తిన పెట్టుకున్నవి పా ☐ ☐ లు

ఒ.పాలించబడేవారిని ఇలా పిలుస్తారు. పా ☐ ☐ లు

ఓ. మీ పుస్తకాల్లో మీరు చదివే అంశాలు పా ☐ ☐ లు

5. కింది వాక్యాలను వివరిస్తూ రాయండి.

అ. ఇతరులకు చేతనైనంత మేలు చేయాలి. కానీ కీడు చేయగూడదు. ఎందుకంటే...

ఆ. ఋత్విక్ చదరంగం బాగా ఆడతాడు. అతనికి గొప్ప క్రీడాకారుడిగా ఎదగాలని బలమైన కోరిక. కాబట్టి.............

ఇ. ఏ పనైనా ఇష్టమైతే కష్టమనిపించదు. అందువల్ల ..............

©SCERT Not to be republished

## V. సృజనాత్మకత



1. రెక్కలతో ఎగిరే బాలిక చిత్రం ఆధారంగా కవిత రాయండి.



నాకే రెక్కలు వస్తే ...................................

.........................................................

.........................................................

2. బాలిక, నది, తేనెటీగ, చెట్టు మంచి మిత్రులు. ఇవి కలిసి మాట్లాడితే ఎలా ఉంటుందో సంభాషణ రాయండి.సంభాషణలు వర్ణనాత్మకంగా ఉండాలి.మధ్య మధ్యలో సామెతలు, జాతీయాలను ఉపయోగించండి.

## VI. ప్రశంస



1. పాఠ్యాంశం ద్వారా తేనెటీగ, నది, శిల్పి, చిత్రకారుడిలో ఉండే గొప్పదనాన్ని తెలుసుకున్నారు కదా. అలాగే కిందివాటిలో ఉండే గొప్పదనాన్ని చెప్పండి.
రైతు, వడ్రంగి, దర్జీ, ఊడ్చేవారు / శుభ్రంచేసేవారు, మురికి కాలువ, కూలీ, పనిమనిషి.

2 కింది పేరా చదవండి.

నాకు బొమ్మలు గీయడమంటే మహాసరదా. తెల్లకాగితం కనిపిస్తే చాలు, ఏదో గీయాలనిపిస్తుంది. నేను చూసిన సీతాకోక చిలుకలను పట్టి కాగితంపై పెట్టగలను. మా ఊరి పక్కన గుట్టపైనున్న గుడిని కాగితంలోకి రప్పించి కదలకుండా చేయగలను. పత్రికల్లో వచ్చే బొమ్మలను నా కాగితాల్లోకి పిలిచి మురిసిపోతా.

పై వాక్యాలు చదివారు కదా! ఇందులో నాకు బొమ్మలు వేయడమంటే మహా సరదా. అని ఉంది కదా! ఇలా "నాకు" అంటూ చెప్పడాన్ని 'ఉత్తమ పురుష'లో చెప్పడం అంటారు. దీన్ని ఆమెకు బొమ్మలు వేయడమంటే మహా సరదా అని మార్చి చెబితే 'ప్రథమ పురుష' లో చెప్పినట్లవుతుంది. పై పేరాలోని ఇతర వాక్యాలను ప్రథమ పురుషలోకి మార్చి రాయండి.

## VII. ప్రాజెక్టు పని



1. వార్తాపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు చూడండి. పక్షులు, జంతువులు, నదులు, కళాకారులకు సంబంధించిన కవితలను చూడండి-వాటిని రాసి ప్రదర్శించండి.

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



1. "అదిగదిగో మేడ
మేడకున్నది గోడ
గోడపక్కన నీడ
నీడలో కోడెదూడ
దూడ వేసింది పేడ"

పై కవితలో ప్రతి వాక్యం చివరా 'డ' అనే అక్షరం మళ్ళా మళ్ళా వచ్చింది. (పునరావృత్తం అయింది)

©SCERT not to be republished

కవితకు అందం తెచ్చింది. వినసొంపుగా తయారయింది. ఈ అందం, వినసొంపుదనం 'డ' అనే శబ్దప్రయోగం వల్ల వచ్చింది కాబట్టి దీనిని శబ్దాలంకారం అంటారు. ఈ విధంగా ఒక అక్షరం లేదా రెండు, మూడు అక్షరాలు వాక్యం చివర మాటిమాటికి వస్తే దాన్ని అంత్యానుప్రాస అలంకారం అంటారు.

**2. ఈ కింది వాక్యం గమనించండి.**

ఉదా: 'నాయనా! నేను నిన్నేమన్నా అన్నానా? నీవు నన్నేమన్నా అన్నావా?'

పై వాక్యంలో 'న' అనే అక్షరం అనేకసార్లు వచ్చింది. ఇలా ఒకే అక్షరం అనేకసార్లు రావడాన్ని **'వృత్త్యనుప్రాస'** అలంకారం అంటారు. (వృత్తి అంటే ఆవృత్తి అని అర్థం. ఆవృత్తి అంటే మళ్ళీ మళ్ళీ రావడం.)

మనుషులు అందంగా కనిపించడానికి ఎన్నోరకాలుగా అలంకరించుకుంటారు. అలాగే కవి తన కవిత అందంగా, ఆకర్షణీయంగా ఉండటం కోసం కొన్ని అలంకారాలు చేస్తాడు. అలాంటి అలంకారాలే ఇవి.

**3. ఈ కింది కవితల్లో ఏ అలంకారాలున్నాయో గుర్తించండి. కారణాలు చర్చించండి.**

1. "భాగవతమున భక్తి
   భారతములో యుక్తి
   రామకథయే రక్తి
   ఓ కూనలమ్మ" జ..............................
2. "గుండెలో శూలమ్ము గొంతులో శల్యమ్ము" జ..............................
3. కాకి కోకిల కాదుకదా! జ..............................
4. లచ్చి పుచ్చకాయ తెచ్చి ఇచ్చింది. జ..............................



**నేనివి చేయగలనా ?**

| | | |
|---|---|---|
| 1. | పాఠ్యాంశంలోని తేనెటీగ, నది, శిల్పిని గురించి స్పష్టంగా చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పాఠ్యాంశాన్ని ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. | పాఠ్యాంశంలోని పదాలను సొంతంగా ప్రయోగించగలను. | ఔను / కాదు |
| 4. | పాఠ్యాంశ సారాంశాన్ని సొంతమాటల్లో సంక్షిప్తంగా రాయగలను. | ఔను / కాదు |
| 5. | పాఠం ఆధారంగా సృజనాత్మకంగా సంభాషణగా రాయగలను. | ఔను / కాదు |

"నీకు కావలసిన బలము, శక్తి నీలోనే ఉన్నాయి. మార్గాన్ని ఏర్పరచుకొని పయనించు" - స్వామి వివేకానంద.


© SCERT not to be republished

నాలుగో యూనిట్

# 17. సరదా పద్యాలు

(చమత్కార పద్యాలు, ఆటవిడుపు పద్యాలు, చాటువులు)

**ఆలోచించండి - మాట్లాడండి :**




**ప్రశ్నలు :**

1. పై చిత్రంలో ఏం జరుగుతూంది?
2. హాస్యం అంటే ఏమిటి అది ఎలా పుడుతుంది?
3 హాస్య సన్నివేశాలు మీకెపుడైనా ఎదురయ్యాయా? ఎలాంటివో చెప్పండి.
4. మీరెప్పుడైనా హాస్య సంభాషణ చేశారా? విన్నారా? చెప్పండి.

తెలుగు భాషలో ఎన్నో అందమైన పద్యాలున్నాయి. వాటిలో మనస్సుకు కితకితలు పెట్టేవి, మనల్ని ఆశ్చర్యం లోకి నెట్టేవి, 'అబ్బా ! ఎంత గొప్పగా ఉంది' అన్న అద్భుతమైన అనుభూతిని ఇచ్చేవి చాలా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఇప్పుడు చదివి ఆనందిద్దామా.

**నేపథ్యం :**

తెలుగు పద్యాలలోని సున్నితమైన హాస్యం, చమత్కారాన్ని చూపెట్టడమే ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. తెలియని పదాల అర్థాలను పుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక చూసి తెలుసుకోండి.

© SCERT not to be republished



1. **ఆకుంటే – ఈకుంటే – మీకుంటే – మాకుంటే** అనే పదాలతో సరదాగా ఒక కవి చెప్పిన పద్యం.

* కం. ఆకుంటే వృక్షంబగు
ఈకుంటే లోభియౌను హీనాత్ముండౌ
మీకుంటే మాకిమ్మా
మాకుంటే మేము రాము మల్కిభరామా !

2. **"మీసానకు కాళ్ళు మూడు మేదిని గల్గెన్"** (మీసానికి మూడు కాళ్ళు వచ్చాయి) అనే సమస్యను కవి కింది విధంగా పూరణచేశాడు.



* కం. మీసానకు కాళ్లెక్కడ
వాసిగ విన్నదియు లేదు వసుధాస్థలిలో
వాసన గంధము రాచెడు
మీ సానకు కాళ్ళు మూడు మేదినిc గల్గెన్.



3. **ఈ కింది పద్యంలో పైకి ఇన్ని చోట్ల ఉండే వస్తువేదో చెప్పమన్నట్లనిపిస్తుంది. కాని ఇందులోనే జవాబు ఉన్నది. వంగ (వంకాయ) తోటలో ఉంటుంది...... ఇలా ప్రతిదాన్నీ చదువుకోండి.**

* ఆ. వంగ తోట నుండు వరి మళ్ళలో నుండు
జొన్న చేల నుండు చోద్యముగను
తలుపు మూల నుండు తల పైన నుండును
దీని భావమేమి తెలిసికొనుడు.

© SCERT not to be republished



4. **కింది పద్యంలో మూడు పాదాలలోని మూడు ప్రశ్నలకు ఒకే సమాధానం – 'కాయనే' (కాయడానికి)**

* ఆ. మామిడేల పూచు మండు వేసంగిని !
బాలుఁడేల పోవు పసుల వెంట
రాజుసేన నేల రహి జేర్చుచుండును !
మూట నొక్కమాట ముద్దుకృష్ణ !

5. **" కాల్చుడం " గురించి చమత్కారంగా చెప్పిన పద్యమిది.**

* చ. నరుఁడనువాఁడు ఖాండవ వనంబు వృథా దహనంబు చేసె వా
నరవరుఁడైన యా పవన నందనుఁ దూరక లంకఁ గాల్చె నా
హరుఁడు పురంబు లార్చె నన నంతియె గాని మహోదరిద్ర వి
స్ఫురణను కాల్చువాఁడొకఁడు భూమిఁజనింపకబోయె నక్కటా!

6. **పరమలోభి అయిన రాజు తనను దాతగా పొగిడించుకోవాలనుకున్నాడు. ఆ విధంగా పద్యం చెప్పమని ఒక కవిని ఆజ్ఞాపించాడు. రాజాజ్ఞ తప్పదు. రాజు 'ఇచ్చినాడని' చెప్పాడు. ఆ ఇవ్వడమేమిటో కవి చమత్కారంగా చెప్పాడు.**



* సీ. ఇచ్చె యిచ్చెను రాజు ఏమిచ్చినాఁడన
ఇంటిలోపల నుండ నిచ్చినాఁడు
పొరుగూళ్ల వెంబడి పోయి ముష్టెత్తుక
యింటికి మళ్లి రానిచ్చినాఁడు
చలివణంకుకు ప్రక్క శయనంబు లేకుంటె
చేతులు ముడుచుకో నిచ్చినాఁడు
గాసాని కొకవేళ కలిగి యుండకపోతె
నింటింట పస్తుండ నిచ్చినాఁడు

తే. వీథులందున తిరుగబోనిచ్చినాఁడు
భిక్షుకుండని బ్రతుక పోనిచ్చినాఁడు
చేసికున్నంత భోంచేయ నిచ్చినాఁడు
ఇట్టి పనులెల్ల రక్షించు నీశ్వరుండు.

© SCERT not to be republished

**భావాలు :**

1. ఓ మల్కిభరామా! ఈ లోకంలో ఆకులు సమృద్ధిగా ఉంటే దాన్ని వృక్షం అంటారు. దానం చేయకుంటే అతన్ని లోభి అని పిలుస్తుంది లోకం. అది చెడుగుణం అవుతుంది. మీకు సంపదలున్నాయి. వాటిని మాకు ఇవ్వండి. మాకే గనక సంపద ఉంటే మీ దగ్గరకు వచ్చి కోరం కదా !
2. మీసానికి కాళ్లు ఎక్కడ ఉంటాయి? ఈ భూమిమీద ఇలాంటి వింత గురించి వినలేదు. సువాసనను వెదజల్లే గంధాన్ని తీసే మీ సాన పీటకు మూడు కాళ్లు ఉంటాయి. ఇందులో "మీసానకు" అనే పదం చమత్కారంకోసం చెప్పినది. 'మీసానకు' అంటే మీసానికి అని అర్థం వస్తుంది. మీ "సానకు" అని విడదీస్తే మీకున్న సానపీటకు అన్న అర్థం వచ్చి సమస్య పరిష్కారం అవుతుంది.
3. వంగతోటలో ఏముంది? వరిమళ్ళలో ఏముంది? అనే పొడుపు వస్తువు కొరకు వెదకడం సహజం. కాని ఇక్కడ వెదకనక్కరలేదు. వంగ – తోటలో ఉంటుంది కదా! వరి ఎక్కడ ఉంటుంది? మళ్ళలోనే కదా! అని వంగతోట వరిమడి, జొన్నచేను, తలుపుమూల, తలమీద అన్నవి సమాసపదాలు గాకుండా వాటిలో మధ్య ఒక అడ్డుగీత గీస్తే భావం సరిపోతుంది.
4. ఓ ముద్దుకృష్ణా ! మామిడి చెట్టు వేసవిలోనే ఎందుకు పూత పూస్తుంది. బాలుడు పశువుల వెంట ఎందుకు పోతాడు ? రాజు సేనను ఎందుకు పెంచుతాడు? పై మూడింటికీ ఒకే సమాధానం కాయనే. మామిడి పూసేది కాయడానికే. బాలుడు పశువుల వెంట పోవడం వాటిని కాయడానికే. సేన కూడా ప్రజలను కాయడానికే – అంటే కాపాడడానికే అని భావం.
5. ఒక పేద కవి చంకలో చిన్న కట్టెల మోపు పెట్టుకుని రాజువద్దకు వెళ్ళాడట. కట్టెల మోపుతో రావడంలోని ఆంతర్యమేమిటో కవిని చెప్పమన్నాడు రాజు. అప్పుడు కవి ఈ పద్యాన్ని చెప్పాడు.
   అర్జునుడు ఖాండవ వనాన్ని కాల్చాడు. హనుమంతుడు లంకను కాల్చాడు. శివుడు త్రిపురాలను కాల్చేశాడు. కాని భయంకరమైన నా దారిద్ర్యాన్ని కాల్చేవాడు ఇంతవరకు పుట్టలేదు కదా!
   (కవి దృష్టిలో అర్జునుడు, హనుమంతుడు, శివుడు చేసిన పనులు వృథా అయినవే. ఎందుకంటే ఖాండవ వనం దివ్యఓషధులతో ఒప్పినది. లంక బంగారపుది, స్వర్గతుల్యమైనది. త్రిపురాలు బంగారు, వెండి, ఇనుముతో కూడినది. ఇవన్నీ గొప్పవే ఇటువంటి వాటిని కాల్చడం వృథాయే కదా! వీటి బదులు భయంకరమైన తన దారిద్ర్యాన్ని కాలిస్తే ఎంతో బాగుంటుంది కదా అని భావించాడు కవి).
6. మారాజు మాకు చాలా ఇచ్చినాడు. ఏమిచ్చినాడంటే మా ఇంట్లో మాఇంట్లో మమ్ములను ఉండనిచ్చాడు. పక్క ఊరెళ్ళి బిచ్చమెత్తుకుని మళ్ళీ మా ఇంటికి రానిచ్చాడు. బాగా చలిపెడుతుంటే పడుకోవడానికి ఏమీ లేకపోయినా చేతులు ముడుచుకోనిచ్చాడు. తినడానికి ఏమీ లేనపుడు పస్తులుండనిచ్చాడు. వీథులలో తిరగనిచ్చాడు. బిచ్చగాడిలా బతకనిచ్చాడు. చేసుకున్నది తిననిచ్చాడు. ఇటువంటి పనులను భగవంతుడు రక్షించుగాక. (ఇది ఎత్తిపొడుపు. రాజు ఇచ్చినవన్నీ ఖర్చులేనివే. ఇందులో ఆయన చేతినుండి ఇచ్చిందేమీ లేదు. దీనివల్ల కవికి ఒరిగినది ఏమీలేదు. ఈ పద్యంలో 'ఇచ్చి' అన్న పదంతో చమత్కారాన్ని చేశాడు కవి.)

© SCERT not to be republished



## ఇవి చేయండి



### I. వినడం-మాట్లాడడం



1. పాఠంలోని బొమ్మను చూడండి. ఏం జరుగుతుందో చెప్పండి.
2. మీకు తెలిసిన సరదా గేయాలు చెప్పండి.
3. మీరు విన్న పద్యాలలో మీకు నచ్చిన పద్యం ఏది? ఎందుకు?
4. పాఠంలోని పద్యాలను రాగంతో, భావంతో చదవండి.
5. ఒక్కొక్క పద్యం భావాన్ని సొంతమాటల్లో చెప్పండి.

### II. చదవడం - రాయడం



**1. కింది పద్యాన్ని చదవండి. ప్రశ్నలు తయారుచేయండి.**

వంగ తోట నుండు వరి మళ్ళలో నుండు
జొన్న చేల నుండు చోద్యము గను
తలుపు మూల నుండు తలపైన నుండును
దీని భావ మేమి తెలిసికొనుడు

అ. ..................................................................
ఆ. ..................................................................
ఇ. ..................................................................
ఈ. ..................................................................

**2. మామిడేల పూచు........ పద్యానికి భావాన్ని రాయండి.**

**3. కింది పదాలను జతపరచండి. వాక్యాలుగా రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| అ. | మామిడి | (   ) | ఎ. చెడుగుణం | .......... |
| ఆ. | లోభి | (   ) | బి. ఆకులు | .......... |
| ఇ. | వృక్షం | (   ) | సి. వేసవికాలం | .......... |
| ఈ. | రాజు | (   ) | డి. చేలు | .......... |
| ఉ. | జొన్న | (   ) | ఇ. సైన్యం | .......... |

**4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు తగిన జవాబులు రాయండి.**

అ. చమత్కార పద్యాలమీద మీ అభిప్రాయం ఏమిటి?

ఆ. వంగతోట, వరిమడి మొ॥న పంట పొలాలను గురించి మీ సొంతమాటల్లో రాయండి.

ఇ. కవి మూడు ప్రశ్నలకు ఒకే సమాధానం ఎలా చెప్పాడో వివరించండి.

© SCERT not to be republished

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. పొడుపు కథ అంటే ఏమిటి? వివరించండి.

ఆ. సమస్యాపూరణం అంటే ఏమిటి? సోదాహరణంగా వివరించండి.

ఇ. ఆకుంటే, ఈకుంటే, మీకుంటే, మాకుంటే అనే పదాలతో ఎలా పద్యం చెప్పాడో రాయండి.

ఈ. ప్రజల పేదరికాన్ని గురించి కవి ఏ విధంగా ఆవేదన చెందాడు?

ఉ. ఇంటి యజమాని లోభి అయితే ఆ ఇల్లు ఎలా ఉంటుందో రాయండి.

ఊ. కింది పద్యాన్ని పాదభంగం లేకుండా పూరించండి.

మీసానకు ................................ మేదినిఁగల్గెన్.


**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు**

కింది ప్రశ్నలకు పది వాక్యాలలో జవాబులు రాయండి.

అ. పాఠంలోని పద్యాలలో ఉన్న విశేషాలు ఏమిటి?

ఆ. పరమలోభి అయిన రాజును గురించి కవి తన బాధను ఏవిధంగా తెలిపాడు?

## IV. పదజాలం



**1. గీత గీసిన పదాలకు అర్థాలను రాయండి.**

అ. చెట్టుకొమ్మను పట్టుకొని వానరం ఊగుతున్నది.

ఆ. జొన్న చేల నుండు చోద్యము గను.

ఇ. అతడు పరమ లోభి.

ఈ. రాజు సేన ప్రజలను రక్షించింది.

ఉ. మా ఊరిలో పెద్ద మర్రివృక్షం ఉంది.



**2. కింది పదాలకు అదే అర్థం వచ్చే మరి రెండు పదాలు రాయండి.**

అ. నరుడు .................. ..................

ఆ. హరుడు .................. ..................

ఇ. వానరుడు .................. ..................

ఈ. పురం .................. ..................

ఉ. వసుధ .................. ..................

**3. కింది పదాలకు వ్యతిరేకపదం రాయండి. పదం, వ్యతిరేకపదం రెండూ ఉండేలా వాక్యాలు రాయండి.**

అ. హీనం × ................ ................

ఆ. చెడు × ................ ................

ఇ. అందం × ................ ................

ఈ. సువాసన × ................ ................

© SCERT not to be republished

**4. కింది ఖాళీలను మీ పాఠం ఆధారంగా పూరించండి.**

అ. ఈకుంటే ............................... యౌను

ఆ. వాసన .............................. రాచెడు

ఇ. తలుపు ............................. నుండు

ఈ. బాలుడేల పోవు .................................... వెంట

ఉ. చేసికున్నంత ................................. నిచ్చినాడు

**5. కింది గడులలోని అక్షరాలతో వీలైనన్ని పదాలు రాయండి.**

| | | | | |
|---|---|---|---|---|
| వా | న | రు | డు | హ |
| వృ | మీ | మా | బా | రు |
| క్ష | సా | మి | లు | డు |
| ము | లు | డి | డు | వా |
| న | రు | డు | తో | ట |

..................................

..................................

..................................

..................................

..................................

## V. సృజనాత్మకత



1. పాఠంలో మీకు నచ్చిన పద్యాన్ని చదవండి. దాని భావం ఆధారంగా కథను రాయండి.
2. "ఇచ్చె యిచ్చెను రాజు ....." అనే పద్యం ఆధారంగా లోభి అయిన రాజుకూ, కవికీ మధ్య సంభాషణను నవ్వు వచ్చేలా రాయండి.

## VI. ప్రశంస



అ. భాషలో చమత్కారాలు ఉంటాయి. చమత్కారం కలిగించే వాక్యాలూ, కవితలూ ఉంటాయి. ఇలాంటివి ఆంగ్లం,ఉర్దూ,హిందీ మొదలయిన ఇతర భాషల్లో కూడా ఉంటాయి.వాటిని ఎవరినయినా అడిగి తెలుసుకొని రాయండి.

ఆ. మ్రోగిన గంటలు ...... గేయపాఠం, సరదా పద్యాలు......పద్యపాఠం, నేనైతే ......... అనేది వ్యాసం,మన భాషలు సంభాషణ పాఠం కదా...... ఇలా పుస్తకంలోని పాఠాలు వివిధ రూపాలలో ఉన్నాయి. పాఠాల పేర్లు, కవుల పేర్లు రాయండి. ఏ పాఠం ఏ రూపంలో ఉందో రాయండి. మిగతా భాషల పాఠ్యపుస్తకాలలోని పాఠాలు కూడా ఇలానే ఉన్నాయా? తెలుసుకొని చెప్పండి.

## VII. ప్రాజెక్టు పని



ఇతర చాటుకవులు, కాలం, బిరుదులు, వారి చాటుపద్యాలను సేకరించి ఆల్బమ్‌గా తయారుచేయండి.ప్రదర్శించండి.

© SCERT not to be republished

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



1. **"ఆమె ముఖం అందంగా ఉంది."**

   **'ఆమె ముఖం చంద్రబింబంలా(గ) అందంగా ఉన్నది.'**

   పై వాకాల్లోని తేడాను గమనించారా! 'ఆమె ముఖం అందంగా ఉంది.' అనేదానికి బదులుగా 'ఆమె ముఖం చంద్రబింబంలాగ అందంగా ఉన్నది.' అనే వాక్యం మనలను బాగా ఆకట్టుకుంది. ఇలా ఆకట్టుకునేలా చెప్పడానికి 'చంద్రబింబం' అనే పోలికను తీసుకున్నాం. ఈ విధంగా ఒక విషయాన్ని ఆకట్టుకునేలా చెప్పడానికి 'అందమైన పోలికను' పేర్కొనడాన్ని **'ఉపమాలంకారం'** అంటారు.

2. **"అతని ఇంటిముందున్న పెద్దకుక్కను చూసి సింహమేమోనని భయపడ్డాను."**

   పై వాక్యంలో ఒకదాన్ని చూసి మరొకటి అనుకోడం లేదా ఊహించుకోడం జరిగింది. ఇలా అనుకోడం, ఊహించుకోడం కూడా ఒక అలంకారమే. ఈ విధంగా ఉన్నదాన్ని లేనట్లుగా, లేనిదాన్ని ఉన్నట్లుగా ఊహించి చెప్పడాన్ని ఉత్ప్రేక్షాలంకారం అంటారు. మాటలకుండే అర్థాలను బట్టి ఏర్పడుతున్న ఈ అలంకారాలను అర్థాలంకారాలు అని పిలుస్తారు.

3. ఇలాంటి పోలిక, ఊహ గల వాక్యాలను మీ పెద్దవారిని అడిగి తెలుసుకోండి. రాయండి.

   1. ............................................................ (పోలిక)
   2. ............................................................ (పోలిక)
   3. ............................................................ (ఊహ)
   4. ............................................................ (ఊహ)



### నేనివి చేయగలనా ?

| | | |
|---|---|---|
| 1. | పాఠ్యాంశంలోని పద్యాలను రాగయుక్తంగా చదవగలను. | ఔను / కాదు |
| 2. | పద్యభావాలను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | ఈ పాఠంలోని పద్యాల భావాలను నా సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | ఆ పాఠ్యాంశంలోని అర్థాలను, పర్యాయపదాలను ఉపయోగించి నీతికథలను రాయగలను. | ఔను / కాదు |
| 5. | ఇచ్చిన అంశం ఆధారంగా హాస్యసంభాషణ రాయగలను. | ఔను / కాదు |

**" ప్రాణికోటిలో నవ్వగలిగేది మానవుడొక్కడే. నవ్వాలి, నవ్వించాలి.నవ్వులపాలు మాత్రం కాకూడదు"**

©SCERT not to be republished

నాలుగో యూనిట్

# 18. ఎత్తుకు పై ఎత్తు

(ఉపవాచకం)



చాలా కాలం కిందట మగధ దేశంలో విధాత్తుడు అనే వ్యక్తి ఉండేవాడు. వ్యాపారం అతని వృత్తి. ఆయన కొడుకు పేరు భూపతివర్మ. ఒకరోజు తండ్రి కొడుకును పిలిచి "నాయనా! నా దగ్గర రెండు మేలు జాతి గుర్రాలున్నాయి. వాటిని చాలా జాగ్రత్తగా పెంచాను. వాటిని వేరే దేశాల్లో అమ్మితే చాలా డబ్బు వస్తుంది. దక్షిణ దిక్కున చాలా దూరంలో వైశాలి అనే దేశం ఉంది. అక్కడ ఇలాంటి గుర్రాలు దొరకవు. నేను ముసలివాణ్ణి అయిపోయాను. అంతదూరం వెళ్ళి వ్యాపారం చేసే స్థితిలో లేను. ఈ గుర్రాల్ని నువ్వు అక్కడికి తీసుకు వెళ్ళి అమ్మితే మనకు బాగా లాభం వస్తుంది," అన్నాడు.

దూర దేశాలకు పోయే అవకాశం వచ్చినందుకు భూపతివర్మ సంబరపడ్డాడు. ప్రయాణానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడు. తండ్రి మళ్ళీ పిలిచి "నాయనా! ఒక విషయం గుర్తుంచుకో! దక్షిణంవైపే వెళ్ళు. పొరబాటున కూడా పడమటి దిక్కుకు వెళ్లకు. అలా వెళ్లి నేను మీ అన్నను పోగొట్టుకున్నాను," అన్నాడు. తన తండ్రికి ఏం కష్టం వచ్చిందో ఎందుకు అన్నను పోగొట్టుకున్నాడో భూపతివర్మకు అర్థం కాలేదు. పడమటి దిక్కుకు వెళ్ళవద్దని తండ్రి చెప్పిన మాటలు ఆలోచిస్తూ గుర్రాలతో ప్రయాణమయాడు.

అతడు ప్రయాణం చేయగా చేయగా దారిలో ఒక నది అడ్డు వచ్చింది. నది వేగంగా పారుతూ ఉంది. పడవలో గుర్రాలను ఎక్కించుకోడానికి పడవవాడు ఒప్పుకోలేదు. కాస్త పడమటి దిక్కుకు వెళితే ఇంకో పడవవాడు కనిపిస్తాడనీ వాడి దగ్గర పెద్ద పడవ ఉందనీ చెప్పాడు. భూపతి వర్మ అనాలోచితంగా పడమటి దిక్కుకు వెళ్లాడు. ఇంతలో హఠాత్తుగా గాలిదుమారం రేగింది. నది దాటటం మాని అప్పటికి ఎక్కడో తలదాచుకున్నాడు. చీకటి పడుతూంది. దగ్గరలో ఉన్న కొండకు అవతలివైపునుంచి పొగరావడం చూశాడు. ఎంతో కష్టంగా గుర్రాలను తీసుకుని కొండపైకి ఎక్కాడు.

కొండకింద ఒక ఊరు కనిపించింది. నాన్న చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. వెనక్కి పోదామనుకున్నాడు. కానీ కుతూహలం ఎక్కువైంది. నాన్న ఎందుకు వెళ్ళవద్దన్నాడో చూడాలనుకొని ముందుకు సాగాడు. గుర్రాలతోపాటు ఆ ఊరు చేరాడు. ఆ రాత్రి అక్కడే సత్రంలో బసచేశాడు.

తెల్లారింది. అప్పుడే అటుగా పోతున్న వ్యక్తి భూపతివర్మను, అతని దగ్గర ఉన్న గుర్రాలను చూశాడు. భూపతివర్మ దగ్గరికి వచ్చి ఏడవడం మొదలుపెట్టాడు. గుర్రం కాళ్ళకిందపడి ఒక కప్ప చితికిపోవడం చూశాడాయన. "ఓ బంగారు కప్పా! నా ముద్దుల పంటా! నీకెలాంటి గతి పట్టిందీ! నాకు ఇక దిక్కెవరు?" అంటూ బిగ్గరగా ఏడుస్తున్నాడు. ఆ ఏడుపు విని జనం పోగయారు. ఏదో భాషలో ముసలాయనతో మాట్లాడారు. భూపతివర్మ వైపు తిరిగి, "పిల్లల్లేని ఈ ముసలివాడు ఆ కప్పను పెంచుకున్నాడు. అది పోవడంతో ముసలివాడికి గుండె ఆగినంత పనైంది," అన్నారు. అది విని ఆశ్చర్యపోయాడు భూపతివర్మ.



దీనికి నేనేం చేయాలి అని భూపతివర్మ అడిగాడు. ముసలాయన, వెంటనే నీ గుఱ్ఱాలల్లో ఒకటి నాకిచ్చేసేయ్ అన్నాడు. అక్కడ గుమిగూడిన అందరూ కూడా ఏవో కల్లబొల్లి కబుర్లు చెప్పారు.

"ఏమిటీ! కప్పకు బదులు గుఱ్ఱాన్నివ్వాలా?" కోపంగా అన్నాడు భూపతివర్మ.

"చూడు నాయనా! నీ విషయం మాకు అంతుబట్టడం లేదు. కొడుక్కన్నా గుఱ్ఱం ఎక్కువవుతుందా?" అన్నారు అక్కడున్నవారంతా!

ఏమైతేనేం! భూపతివర్మ గుఱ్ఱాన్ని ఇచ్చుకోక తప్పలేదు. పుట్టెడు దిగులుతో ఆ ఊరినుండి బయలుదేరాడు. మళ్లీ కొండ ఎక్కడం కష్టం కాబట్టి చేసేది లేక పడమటి దిక్కుగానే బయలుదేరాడు. అప్పటికి బాగా అలసిపోయాడు. ఆకలేస్తూంది కూడా! చాలాదూరం వెళ్లాక దగ్గర్లో ఉన్న ఒక ఇంటి తలుపు తట్టాడు. ఒంటికన్ను మనిషొకడు తలుపు తీశాడు. "అయ్యా ఆకలేస్తూంది. భోజనం పెట్టండి!" అనడిగాడు, భూపతివర్మ. "అన్నం పెట్టలేను కాని కడుపునిండా తాగడానికి నీళ్ళివ్వగలను," అన్నాడు, ఒంటికన్ను మనిషి. దప్పిక తీర్చుకొని బయలుదేరబోతూండగా ఒంటికన్ను మనిషి భూపతివర్మ ఊరిపేరూ, తండ్రి పేరూ అడిగాడు. సమాధానం చెప్పగానే, 'వెంటనే చెయ్యి పట్టుకుని,"ఎన్నాళ్ళకు దొరికావు! ఈ రోజున నా పగ తీరబోతూంది. ఇరవై ఏళ్ళ కిందట వ్యాపారంకోసం నేను మీ దేశం వెళ్లాను. నా సొమ్మంతా దొంగలు దోచుకున్నారు. మీ తండ్రి నాకు తెలుసు. అప్పుగా కొంత డబ్బు ఇమ్మన్నాను. ఏదన్నా తాకట్టు పెట్టాలన్నాడు. 'నా దగ్గరేముంది,' అన్నాను. నా కన్నొకటి పీకి ఇమ్మన్నాడు. డబ్బు అవసరం కాబట్టి సరేనన్నాను. ఒక ఏడాది తరవాత ఇటువైపు వచ్చినప్పుడు నా కన్ను నాకు ఇస్తానన్నాడు. ఇరవై ఏళ్ళయిపోయింది. ఇప్పటి దాకా ఇవ్వలేదు. ఇదుగో ఇప్పుడు నువ్వు దొరికావు. తండ్రి అప్పును కొడుకే గదా తీర్చాల్సింది! నాకన్ను నాకివ్వు. కావాలంటే మీ నాన్న దగ్గర తీసుకున్న డబ్బు వడ్డీతో సహా తీరుస్తాను. నా కన్ను మాత్రం నాకివ్వాల్సిందే " అన్నాడు. జనం గుంపులు గుంపులుగా చేరారు. మళ్ళీ అదే తంతు. 'ఇదుగో పులి అంటే అదుగో తోక' అని. అందరూ ఒంటికన్నువాణ్నే బలపరిచారు. భూపతివర్మకు గోరుచుట్టుపై రోకటిపోటు అన్నట్లు ఏడుపొచ్చినంత పనైంది. మీ కంటిసంగతి నాకేం తెలీదు. ఏంచేస్తే నన్ను పోనిస్తారో చెప్పండి, అన్నాడు దీనంగా. గుఱ్ఱాన్నిక్కడే వదిలేస్తే వెళ్ళిపోవచ్చు అన్నారు అందరూ, ఒక్కసారిగా!

భూపతివర్మకు గుఱ్ఱాన్ని విడిచిపెట్టక తప్పలేదు. మళ్ళా నడక మొదలుపెట్టాడు. తండ్రి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. గుఱ్ఱాలు పోయినందుకు గుండె బరువెక్కింది. ఆకలి మండిపోతోంది. ఎక్కువ దూరం నడవలేక ఓ చెట్టునీడన కూర్చున్నాడు. దు:ఖం పెల్లుబికింది. తాను తన నగరానికి వెళ్లడం కత్తిమీద సామే అనుకున్నాడు.

ఇంతలో ఆ దారిన పోతున్న సందీపుడు అనే వ్యక్తి ఏడుస్తున్న భూపతివర్మను చూశాడు. దగ్గరికి వచ్చి "ఎవరు బాబూ నువ్వు? ఎందుకేడుస్తున్నావు?" అన్నాడు. భూపతివర్మ జవాబివ్వలేదు. "అతనికేం మాట్లాడాలన్నా భయంగా ఉంది, కాని సందీపుడు వదలలేదు. గుచ్చి గుచ్చి ప్రశ్నించాడు. చూడ్డానికి మంచివాడిలాగే కనిపించాడు. భూపతివర్మ తన గోడంతా వెళ్ళబోసుకున్నాడు. కాసేపాగి "మనిద్దరం రాజుగారి దగ్గరకు పోదాం పద, నీ గుఱ్ఱాలను నీ కిప్పిస్తాను" అన్నాడు సందీపుడు. భూపతివర్మ మనస్సులో సందేహంగానే ఉంది. ఇతడు ఏ మోసంచేస్తాడేమోనని ఎటు తిరిగీ పోగొట్టుకునే దేమీ లేదని గుండె రాయిచేసుకొని అతనితో కలిసి రాజభవనానికి బయలుదేరాడు. దారిలో రాజుగారి దగ్గర ఎలా మాట్లాడాలో చెప్పాడు సందీపుడు.

ఇలాంటి సమస్యలు తీర్చడంలో రాజు అందెవేసిన చేయి. అంతా విన్న రాజుగారు ముసలివాణ్ణి, ఒంటికంటివాణ్ణి పిలిపించాడు. విచారణ మొదలైంది. చచ్చిపోయిన కప్ప తన పెంపుడు కొడుకని ముసలివాడు చెప్పగానే భూపతివర్మ తన తలపాగాలోంచి బతికి ఉన్న కప్పను బైటికి తీశాడు. రాజువైపు తిరిగి "రాజా! దీన్ని నేను పెంచుకుంటున్నాను. దీన్ని కొండకింద వదులుతాను. ముసలివాణ్ణి కూడా కొండ మీదినుంచి కిందకి దొర్లి నా పెంపుడుకొడుకు మీదపడి చంపమనండి" అన్నాడు.

రాజు కూడా దాన్నే సమర్థించాడు. అలా చేయమని ముసలాణ్ణి ఆదేశించాడు. ముసలివాడి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు మారు మాట్లాడకుండా గుర్రాన్ని అప్పగించి వెళ్ళిపోయాడు.

ఇదంతా చూస్తున్న ఒంటికన్నువాడు తన కథంతా రాజుగారికి తానే ముందు వినిపించాడు. అప్పుడు భూపతివర్మ "రాజా! మా ఇంట్లో సామాన్ల గదిలో కొన్ని వందలమంది కళ్ళు ఉన్నాయి. ఈ పెద్దమనిషి కంటిని తిరిగి ఇవ్వడానికి నేను సిద్ధమే! అయితే ఈయన రెండో కంటిని వెంట తీసుకొని పోకపోతే సరైన కంటిని తేవడం కష్టం. అందుకని రెండో కంటిని కూడా ఇమ్మనండి రెండూ కలిపి తెచ్చి ఇస్తాను అన్నాడు.

"ఈ ఆలోచన చాలా బాగుంది," అన్నాడు రాజుగారు.

ఇది విన్న వెంటనే ఒంటికన్నువాడు గుర్రాన్ని ఇచ్చి తిరిగి చూడకుండా కాలికి బుద్ధిచెప్పాడు.

అప్పుడు సందీపుడు మిమ్మల్ని ఈ దేశ సరిహద్దు దాటిస్తాను. పదండి. అన్నాడు. ఇద్దరూ కలసి వెళుతున్నారు. భూపతివర్మ సందీపునితో, "అయ్యా! మీకు సర్వదా కృతజ్ఞుణ్ణి. అడుగడుగునా మోసగాళ్ళుండే ఈ రాజ్యంలో మీరు చాలా నిజాయితీగా ఉన్నారు. ఇంతకూ మీ వృత్తాంతమేమిటి! అన్యథా భావించక తెలపండి," అని నమస్కరించాడు.

సందీపుడు ఒక్కక్షణం ఆగి ఇలా చెప్పుకొని వచ్చాడు.

"మిత్రమా! మానాన్న గుర్రాల వ్యాపారం చేసేవాడు. ఆయన వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండేది. ఇది నేను చిన్నవాడిగా ఉన్నప్పుడు జరిగిన కథ. ముక్కుపచ్చలారని వయస్సులో నేను మా నాన్నతోపాటు ఈ రాజ్యానికి వచ్చాను. రాత్రంతా సత్రంలో గడిపాము. అప్పటికే మేము మోసగాళ్ళరాజ్యంలో ఉన్నామని తెలిసింది. తెల్లవారక ముందే ఒకతను మా దగ్గరకు పరుగెత్తుకొని వచ్చాడు. తన భార్య చనిపోయిన శిశువును ప్రసవించిందట. దానికి మా నాన్నే కారణమట. నేనూ మానాన్న గట్టిగా శ్వాసవదిలామట. అందుకు భయపడిన ఒక ఈగ దారి తప్పిందట. ఆ ఈగవల్ల అతని భార్యకు తుమ్ము వచ్చిందట. దాంతో ఆమె కడుపులో ఉన్న శిశువు చనిపోయిందట. దానికి బదులుగా నన్ను ఇవ్వమని అడిగాడు. అక్కడ చేరినవారంతా దాన్నే సమర్థించారు. వాళ్ళ గొంతెమ్మ కోరిక చూసి మాకు ఆశ్చర్యం వేసింది. చేసేది లేక మానాన్న నన్ను వాళ్ళకిచ్చి వెళ్లిపోయాడు. అప్పటినుంచి వాళ్ళకి బానిసగా బతుకు వెళ్లదీస్తున్నాను," అన్నాడు సందీపుడు.

ఆ మాటలు విన్న భూపతివర్మకు తండ్రి మాటలు గుర్తుకు వచ్చాయి. సందీపుడు తన అన్నయ్యే అని గుర్తుపట్టాడు. ఇద్దరూ సంతోషంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకొన్నారు. ఇద్దరూ మోసగాళ్ళ దేశంనుంచి బయటపడి దక్షిణ దేశానికి వెళ్లారు. గుర్రాలను మంచి ధరలకు అమ్ముకున్నారు. సొంత ఇంటికి చేరుకున్నారు. వాళ్ళనుచూసి తండ్రి పొందిన ఆనందానికి అవధి లేకుండా పోయింది.

మూలం : **సరసవినోద కథలు,** నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా.

## ప్రశ్నలు:

1. ఈ కథను సొంతమాటల్లో సంక్షిప్తంగా రాయండి.
2. ఈ కథలోని సామెతలు, జాతీయాలు రాయండి.
3. ఈ కథ గురించి కింది అభిప్రాయాలలో మీరు దేనితో ఏకీభవిస్తారు? ఎందుకు? కారణాలు రాయండి.
   అ. కథ చాలా బాగుంది. ఆ. కథ బాగుంది
   ఇ. కథ మామూలుగా ఉంది. ఈ. కథ నాకు నచ్చలేదు.
4. కథలోని సందీపుణ్ణి గురించి పది వాక్యాలు రాయండి.
5. కథలోని పడమటి రాజ్యంలో ఉన్నట్లే చాలామంది మోసగాళ్ళు మన సమాజంలో, మనచుట్టూ కూడా ఉండవచ్చు. వీళ్ళు ఏ ఏ మోసాలు చేస్తారు? మనం ఏం జాగ్రత్తలు తీసుకోవాలి?
6. భూపతివర్మ గురించి కింది వాక్యాలు చదవండి. మీరు దేనితో ఏకీభవిస్తారు? ఎందుకు? వివరించండి.
   అ. భూపతివర్మ అమాయికుడు
   ఆ. ఎవరు ఏది చెప్పినా వినే స్వభావం కలవాడు.
   ఇ. భూపతివర్మకు కొత్త విషయాలంటే కుతూహలం ఎక్కువ.
   ఈ. భూపతివర్మ అదృష్టవంతుడు.

# పదాలు - అర్థాలు (అకారాది పట్టిక)

**అ**

అంకితమైపోవు (క్రి) - ఒక పనికి పూర్తిగా ప్రాధాన్యమిచ్చి దానిలో మునిగి పోవడం
అంగీకరించు (క్రి) - ఒప్పుకోడం
అంచనా - లెక్కకట్టడం
అంచె - దశ
అంతరంగం - మనస్సు
అంతఃపుర స్త్రీలు - రాణులూ వారి పరివారమూ
అంధ - గుడ్డి, చూపులేని
అంధమతులు - బుద్ధిలేనివాళ్లు, ఆలోచన చెయ్యలేనివాళ్లు
అక్కటా - అయ్యో
అక్షరం - నాశనం లేనిది; అ, ఆ, ఇ, వంటి లిపి సంకేతం
అక్షరాలా - పూర్తిగా, సంపూర్ణంగా, ఉన్నది ఉన్నట్లుగా
అగ్నిపరీక్ష - అతి కఠినమైన పరీక్ష,
అగ్రిమస్థానం - మొదటిస్థానం, పైచోటు
అచేతనులు - ఆశ్చర్యం, బాధ మొదలైనవాటివల్ల కదలిక లేనివారు.
అజేయుడు - ఎదురులేనివాడు
అడచు (క్రి) - నొక్కివేయడం, తొక్కివేయడం
అదలించు(క్రి) - వెళ్ళగొట్టడం, తోలడం
అధముడు - తక్కువవాడు, నీచుడు, చెడుబుద్ధి కలవాడు
అధిపతి - యజమానుడు
అనధికారంగా - అధికారం లేకుండా, అనుమతి లేకుండా
అనర్గళంగా - గుక్కతిప్పుకోకుండా
అన్యథా - ఇంకో రకంగా, ఇంకో విధంగా
అనామకమై - పేరులేనిదై
అనాలోచితం - ఆలోచించకుండా చేసినది
అనువు - ఉపాయం, వీలు
అపజయం - ఓటమి
అపరాధం - తప్పు, నేరం
అపహరించు (క్రి) - దొంగిలించడం
అపహసించు (క్రి) - వెక్కిరించడం, ఎగతాళిచేయడం
అపాయం - ప్రమాదం, ఆపద
అప్రియం - ఇష్టం కానిది
అభిరామ - అందమైన, మనోహరమైన
అమాంతంగా - అకస్మాత్తుగా, ఒక్కసారిగా
అమిత - ఎక్కువైన
అర్థమత్తుడు - ధనంచేత పొగరెక్కినవాడు
అర్పించు (క్రి) - ఇవ్వడం
అరుగు(క్రి) - వెళ్ళడం, పోవడం
అలుక - కోపం
అవధి - హద్దు
అశ్రువు - కన్నీరు
అసంఖ్యాక - లెక్కలేనన్ని
అహం - నేను అనే భావం, తానే గొప్ప అనుకోడం
అహంకృతుడు - గర్వం చూపేవాడు

**ఆ**

ఆకొని - ఆకలివేసి
ఆక్రందన - బాధ, ఆక్రోశంతో చేసే ధ్వని.
ఆగ్రహం - కోపం
ఆఘ్రాణించు (క్రి) - వాసనచూడటం
ఆది - మొదలు
ఆపద - పెద్ద కష్టం, అపాయం
ఆర్తరోదన - బాధలో వచ్చే ఏడుపు / అరుపు
ఆర్జించు (క్రి) - సంపాదించడం
ఆవిర్భవించు (క్రి) - పుట్టడం, జన్మించడం
ఆసేతుహిమాచలం - భారతదేశం ఆ చివరినుంచి ఈ చివరిదాకా; హిమాలయాలనుంచి సేతువు / సముద్రం వరకు, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు
ఆస్కారం - అవకాశం,వీలు
ఆస్వాదించు (క్రి) - అనుభవించడం

**ఇ**

ఇంచుక - కొంచెం

**ఈ**

ఈనాం (ఇనాం) - కానుకగా ఇచ్చిన భూమి మొదలయినవి

**ఉ**

ఉగ్రంగా - కోపంగా
ఉత్కంఠ - కుతూహలం
ఉత్తరం - జాబు, లేఖ
ఉద్ధతి - గర్వం, పొగరుబోతుతనం
ఉద్విగ్నభరిత - వ్యాకులమైన; ఆందోళన కలిగిన
ఉద్దేశం - అభిప్రాయం
ఉపదేశం - మంచిమాట, హితవు, సలహా
ఉపద్రవం - ఆపద, పెద్ద కష్టం
ఉరుకు (క్రి) - పరుగెత్తు, దూకు

**ఊ**

ఊచు (క్రి) - ఊపడం
ఊటాడు (క్రి) - చలించడం, కదలడం
ఊపిరి పీల్చుకొను(క్రి) - ఆందోళన, భయం తగ్గడం వల్ల మనస్సు తేలికపడటం

**ఎ**

ఎంచు (క్రి) - లెక్కపెట్టడం
ఎండగట్టు (క్రి) - దూషించడం, తిట్టడం
ఎడంద - హృదయం, గుండె, (ఎడదకు మారురూపం)
ఎద - హృదయం, గుండె
ఎరుగు (క్రి) - తెలుసుకోవడం

**ఏ**

ఏకాకి - ఒంటరి
ఏగు (క్రి) - వెళ్ళడం, పోవడం
ఏగుదెంచు (క్రి) - రావడం
ఏలుబడి - పాలన, పాలించిన కాలం

**ఒ**

ఒడలు - ఒళ్లు, శరీరం
ఒడయుడు - ప్రభువు, భర్త (మగడు)
ఒనరించు (క్రి) - చేయడం
ఒరులు - ఇతరులు

**ఓ**

ఓర్వక - ఓర్చుకోకుండా, సహించకుండా
ఓవర్ - క్రికెట్‌లో ఒక బౌలర్ ఆరు బంతులు విసిరే పరిమితి

**క**

కట్ పాట్లు - బంతిని నేరుగా కొట్టకుండా కుడి పక్కకు తరలించడం
కడ - చివర
కను (క్రి) - చూడడం
కనువిందు - కంటికింపైనది, చూసినందువల్ల ఆనందం కలిగించేది
కప్పం - పన్ను (రాజుకు సామంతులు చెల్లించేది)
కబళించు (క్రి) - మింగివేయు

© SCERT not to be republished

కర్తవ్యం (క్రి) - చేయాల్సిన పని
కరి - ఏనుగు
కరుణామయ - దయగల
కఱచు - కొరకడం, కాటువేయడం, నేర్చుకోడం
కలకలం - ఆందోళన
కలత - బాధ, ఆందోళన, కలవరం
కలుగు - కన్నం, బొరె / బొరియ
కల్ల - అబద్ధం
కల్లబొల్లి కబుర్లు - అబద్ధాలు; లేనిపోని విషయాలు
కళ్ల కాయలు కాచు(క్రి) - చాలాసేపు / కాలం ఎదురుచూడడం
కాంచు (క్రి) - చూడడం
కాకితం - కాగితం
కాడి - నాగలికి గాని, బండికి గాని కట్టే రెండు ఎద్దుల / దున్నపోతుల మెడలమీద పెట్టే పొడుగాటికొయ్య
కాయం - శరీరం
కార్యం - పని (చేయదగినది)
కాసిని - కొన్ని
కుంభం - కుండ
కుడుచు (క్రి) - తినడం, తాగడం
కుప్పించు (క్రి) - ఊపిరి బిగబట్టి దూకడం, ఎగరడం
కుములజేయు (క్రి) - మనస్సులో బాధపడేలాగ చేయడం
కుసుమం - పువ్వు
కూడలి - వీథులు కలిసే చోటు
కూయు (క్రి) - (పక్షులు) అరవడం
కూర్చు (క్రి) - అన్నీ ఒకచోటికి తేవడం, చేర్చడం
కూళ - చెడ్డవాడు
క్రుంగదీయు (క్రి) - దిగులుపడేలా చేయడం, నిరాశ పరచడం, బాధపెట్టడం
కృప - దయ, కరుణ
కేలు - చేయి
కొంపమునుగు (క్రి) - పెద్ద నష్టం కలగడం
కొరకరాని కొయ్య - చెప్పినమాట వినని మూర్ఖుడు; లొంగదీసుకోడానికి వీలులేని వ్యక్తి / విషయం
కొరడా - గుర్రం, ఎద్దు మొదలయిన వాటిని కొట్టడానికి ఉపయోగించే తోలు సాధనం
కొలువుకూటం - రాజ దర్బారు
కొల్లగొట్టు (క్రి) - దౌర్జన్యంతో మొత్తం ఎత్తుకొని పోవు
కోమలత్వం - సౌకుమార్యం, మెత్తన
కోమలి - స్త్రీ
క్రమ్ము (క్రి) - వ్యాపించు
క్రయ్య - కాలువ
క్రీడ - ఆట
క్రోధం - కోపం

### గ

గంధం - చందనం
గణాంకాలు - లెక్కలు
గబుక్కున - వెంటనే, ఉన్నట్టుండి
గళం - గొంతు, స్వరం
గాసం - ఆహారం, తిండి, గ్రాసం
గాసి - బాధ, శ్రమ
గింగిర్లెత్తించు (క్రి) - చెవులలో మారుమోగేట్లు చేయడం
గిరి - కొండ
గుణం - స్వభావం, లక్షణం, వింటినారి, అల్లె తాడు, అలవాటు

### ఘ

ఘనులు - గొప్పవాళ్లు
ఘోష - బిగ్గరగా చేసే ధ్వని, అరుపు

### చ

చతురంగ బలాలు - రాజులకు సేనలో ఉండే నాలుగు రకాల బలాలు (రథాలు, ఏనుగులు, గుఱ్ఱాలు, కాల్బలం / పదాతిదళం)
చను (క్రి) - వెళ్ళడం, పోవడం
చవి - రుచి, ఉప్పు
చాటు (క్రి) - ప్రకటించడం
చిత్రవర్ణాలు - రకరకాల రంగులు
చిరకాల స్వప్నం - ఎన్నాళ్లబట్టో ఉన్న కోరిక
చిరస్మరణీయ - చిరకాలం గుర్తుంచుకోదగిన
చిరాకు - ఓర్పులేకపోవడంవల్ల ముఖంలో కనబడే విసుగు
చీకుముల్లు - చీకిపోయిన ముల్లు
చులకన - తేలిక, తక్కువ
చెంగున - ఒక్కసారిగా (దూకేవిషయంలో)
చెండాడు (క్రి) - కొట్టడం, బాధించడం
చెరచు (క్రి) - పాడుచేయడం
చేకూరు (క్రి) - సమకూరడం, లభించడం, తనకు రావడం
చేకొను (క్రి) - తీసుకోవడం
చేజార్చుకొను (క్రి) - అవకాశాన్ని పోగొట్టుకోడం
చేయూత - సహాయం, చేతి ఊత
చైతన్యం - తెలివి, ప్రాణం
చోద్యం - వింత
చౌక - తక్కువధర

### ఛ

ఛేదించు (క్రి) - కనుక్కోడం

### జ

జగడం - పోట్లాట
జగం - లోకం, ప్రపంచం
జగతి - లోకం, ప్రపంచం
జయభేరి - విజయాన్ని సూచిస్తూ మోగించే ఢంకా
జలం - నీరు
జాబు - లేఖ, ఉత్తరం
జావ - ధాన్యపు నూకలతో చేసే పలచని గంజి
జుంటీగలు - తేనెటీగలు

### ట

టోర్నమెంట్ - విజయంకోసం క్రీడాకారులంతా వరుసగా జరిగే ఆటలపోటీల్లో పాల్గొనే క్రీడోత్సవం

### త

తండోపతండాలు - గుంపులుగుంపులుగా ఉన్న జనం
తంతి - టెలిగ్రాం
తడయక (క్రి) - ఆలస్యం చేయకుండా
తడవు - ఆలస్యం
తథ్యం - తప్పనిది. కచ్చితంగా జరిగేది.
తదేకంగా - ఏకాగ్రతతో, ఒకే దృష్టితో
తనర్చు (క్రి) - ఎక్కువ కావడం, ప్రకాశించడం
తనువు - శరీరం
తప్త - బాగా కాలిన
తరంగం - అల లేదా ధ్వని ప్రయాణం చేసే మార్గం

© SCERT not to be republished

తరుము (క్రి) - ఒక వ్యక్తి జంతువు మొదలయిన వాటి వెంట పడి వడివడిగా పోయేటట్లు చేయడం
తళుక్కున - ఒక్కసారిగా వెలుగు వచ్చేటట్లుగా
తహతహ - తపన, ఆసక్తి
తాపం, - బాధ, వేడి
త్యాగధనుడు - తనకున్నదాన్ని ఇతరులకు సంతోషంగా ఇచ్చేవాడు
తిలకించు (క్రి) - చూడడం
తీరం - ఒడ్డు
తీరుబడిగా - తీరికగా
తీర్థమాడు (క్రి) - కనడం, నీళ్లాడటం, ప్రసవించడం
తువ్వాయి - లేగదూడ, ఆవుదూడ
తెగడు (క్రి) - తిట్టడం, నిందించడం, ఒకరు చెప్పినదాన్ని తప్పు అని చెప్పడం
తేరగా - ఉచితంగా, కష్టం లేకుండా
తోకముడుచు (క్రి) - ఓడిపోవడం పారిపోవడం
త్రోయు (క్రి) - నెట్టడం

## ద

దండయాత్ర - దాడిచెయ్యడానికి సైన్యంతో పోవడం
దండించు (క్రి) - శిక్షించడం, పిల్లలను భయపెట్టడం
దక్కు (క్రి) - దొరకడం, లభించడం
దచ్చినంగా - దక్షిణంగా (పామర భాషలో వాడుక)
దడి - తాటాకులతో గాని, వెదురు బద్దలతో గాని హద్దుగా కట్టిన అడ్డు
దమ్ముచూపు (క్రి) - ధైర్యంగా ఉండటం, నేర్పును ప్రదర్శించడం
దరిమిలా - తరవాత
దర్శించు (క్రి) - చూడడం, గుళ్లో దేవుణ్ణి గాని, పెద్దలను గాని చూడటానికి గౌరవంతో వెళ్లడం
దహనం - కాల్చడం
దాతృత్వం - దానగుణం, ఇచ్చే స్వభావం
దావానలం - అడవిలో రేగిన అగ్ని
దిక్కు - దిశ, ఆధారం, శరణం
దిగజారిపోవు (క్రి) - కింది స్థాయికి పోవడం
దిగువ - కింద
దుమ్మురేపు (క్రి) - పరాక్రమం ప్రదర్శించడం
దుర్గము - కోట
దృఢ - గట్టి
దెస - దిక్కు, దిశ
దేదీప్యమానంగా - ప్రకాశవంతంగా
ధర - భూమి
ధ్యానం - ఒకేవిషయంమీద మనసును నిలిపి ఉంచడం
ధ్వానం - ధ్వని

## న

నకిలీ - అసలు కానిది
నగచరం - కొండల్లో తిరిగేది, కోతి
నగరి - నగరం
నరవరుడు - మనుషులలో ఉత్తముడు
నరుడు - మనిషి
నళినీదళం - తామరాకు
నాటు (క్రి) - స్థాపించు, నేలలో పాతు
నామం - పేరు
నాలుగాకు లెగజదవడం - ఎక్కువ జ్ఞానాన్ని లేదా నైపుణ్యాన్ని పొందడం, తెలివితో ఉండటం
నాలుగురాళ్లు - పనిచేసి సంపాదించే కొద్దిపాటి డబ్బు
నిఘంటువు - పదాల అర్థాలు మొ॥నవి ఉన్నపుస్తకం
నిక్షేపం - దాచిపెట్టినది (డబ్బు, బంగారం, మొ॥వి)
నిదర్శనం - సాక్ష్యం, రుజువు
నిర్భాగ్యుడు - దరిద్రుడు
నిరంతరం - ఎల్లప్పుడూ
నిరీక్షించు (క్రి) - ఎదురుచూడటం
నిరుపేద - చాలా పేదవాడు
నివేదన - ఎదుటివ్యక్తిమీది గౌరవంతో ఇవ్వడం, మనవి చేయడం, (భోజన పదార్థాలు) దేవునికి అర్పించడం
నిశ్చేష్టులగు (క్రి) - ఆశ్చర్యం, భయం మొదలైనవాటి మూలంగా కదలక మెదలక ఉండటం.
నిష్క్రమించు (క్రి) - వెళ్ళిపోడం
నిష్ఠూర్యం - కఠినమైన మాట, నిష్ఠురమైనది
నీరం - నీరు
నుడి - మాట, పలుకు
నొసలు - కనుబొమ్మలు
నైవేద్యం - దేవతలకు సమర్పించదగిన పదార్థం (సాధారణంగా ఆహారానికి సంబంధించినది)

## ప

పంపిణీ - పంచిపెట్టడం
పచ్చిక - పచ్చని లేత గడ్డి
పచ్చులు - పక్షులు
పట్టరాని - అణచుకోలేని, మితిలేని, చాలా ఎక్కువ
పదేలు - పది వేలు
పథం - దారి, మార్గం
పరతత్త్వం - పరమాత్మ
పరస్పరం - ఒకరికొకరు, ఒకరితో ఒకరు
పరాభవం - అవమానం
పరాయణం - ఉత్తమమార్గం
పరికించు (క్రి) - చూడటం
పరిణమించు (క్రి) - మారడం
పరిమళం - సువాసన
పరితృప్తులు - తృప్తి పొందినవారు
పరిహారం - నష్టాన్ని భర్తీ చేయడానికిచ్చినది
పరిహాసం - నవ్వులాటగా చెప్పే మాట, చేసే పని
పరులు - ఇతరులు
పరోపకారం - ఎదుటివారికి చేసే మేలు
పర్వతం - కొండ
పర్వం - పండుగదినం
పర్యాయం - మాటు, సారి, క్రమం (పర్యా:) తడవ, విడత (నానా:) చుట్టిరావడం, భేదం
పసులు - పశువులు, సాధు జంతువులు
పాటు - ఇబ్బంది, కష్టం
పాశ్చాత్యులు - పడమటి దేశాలవాళ్లు
పాఱద్రొబ్బు (క్రి) - పారవేయడం, తోసివేయడం
పుచ్చంగవచ్చు (క్రి) - బయటకు తీయవచ్చు, పంపవచ్చు
పురం - పట్టణం
పుష్పం - పువ్వు
పూర్ణం - నిండైనది, పూర్తిగా ఉన్నది
పెత్తనం - అధికారం, పెద్దతనం

© SCERT not to be republished

పెవిలియన్ - ఆటగాళ్లకోసం మైదానాన్ని లేదా పందిరి ఆనుకొని ఉండేలా ఏర్పాటు చేసిన విశ్రాంతి గది లేదా పందిరి
పేలవమైన - నైపుణ్యం / నేర్పు లేని; చప్పగా ఉన్న
పోషాకులు - దుస్తులు
ప్రతిభ - గొప్పతెలివి
ప్రత్యర్థి - శత్రువు
ప్రత్యుపకారం - మేలు చేసినవారికి తిరిగి చేసే మేలు
ప్రదక్షిణం - దేవాలయం చుట్టూ గాని, పెద్దల చుట్టూ గాని, తనచుట్టూ తాను గాని ఎడమనుంచి కుడివైపు తిరగడం
ప్రధాన - ముఖ్యమైన
ప్రబలు (క్రి) - ఎక్కువ కావడం, వ్యాపించడం
ప్రభ - వెలుగు, కాంతి
ప్రేరణ - ఒకరిని ఒక పని చేయడానికి పూనుకొనేటట్లు చేయడం
ఫలశ్రుతి - చివరగా దక్కే అనుకూల ఫలితాన్ని తెలిపేది
ప్రవేశించు (క్రి) - లోపలికి వెళ్ళడం

## బ

బకాయి - ఇంకా తీర్చవలసి ఉన్న అప్పు (చెల్లింపు జరగవలసి ఉన్నది)
బధిర - చెవిటి
బాధాకరం - బాధను కలిగించేది
బాలిశుడు - తెలివితక్కువవాడు, చిన్నపిల్ల చేష్టలు చేసేవాడు
బాల్చీ - చేద, బొక్కెన, బకెట్
బాల్చీ తన్ను (క్రి) - చనిపోవు
బాల్యం - చిన్నతనం
బాసట - సహాయం
బెదరు (క్రి) - భయపడడం, జంకడం
బొక్కు (క్రి) - నోటినిండా కుక్కుకొని తినడం
బోధపడు (క్రి) - అర్థంకావడం, తెలియడం

## భ

భక్షించు (క్రి) - తినడం (నమిలి)
భద్రం - జాగ్రత్త
భరతావని - భారతదేశ భూమి
భాగస్వామ్యం - వాటా; పాలుపంచుకోడం
భావం - అర్థం, ఆలోచన, అభిప్రాయం
భిక్షుకుడు - అడుక్కునేవాడు, బిచ్చగాడు
భీతి - బెదురు, భయం, జంకు
భూర్జపత్రం - ఒక రకం చెట్టు బెరడు పైపొర (రాసుకోడానికి కాగితంలాగ ఉపయోగపడేది)
భ్రమ - లేనిది ఉన్నట్లు అనుకోడం, ఒకదాన్ని మరొకదానిలాగ తలచడం, భ్రాంతి

## మ

మండిపడు (క్రి) - ఎక్కువగా కోపపడటం
మంత్రదండం - మాయలు, మంత్రాలు చేసేవారి దగ్గర ఉంటుందని చెప్పే కర్ర
మంథరం - పాఠంలోని కథలో తాబేలు పేరు. అమృతంకోసం పాల సముద్రాన్ని చిలకడానికి కవ్వంలాగ ఉపయోగపడిన ఒక పర్వతం,
మందలించు (క్రి) - బుద్ధిచెప్పు
మట్టికరిపించు (క్రి) - ఘోరంగా/దారుణంగా ఓడించడం
మడి - పొలంలో పంట పండించడానికి విత్తనాలు వేసిన భాగం లేదా నారు నాటిన భాగం
మడుగు - కొలను
మధుకరం - తుమ్మెద
మధురిమ - తీపి, తీయన, మాధుర్యం
మనమ్ము - మనసు
మనుజుడు - మనిషి
మర్కటం - కోతి
మలినమైన - మురికిగా ఉన్న
మహంతులు - గొప్పవారు
మహర్షి - గొప్ప ఋషి
మహి - భూమి
మాతృభూపూజ - మాతృభూమికి చేసే పూజ
మాత్తర్లు - మందుబిళ్లలు, మాత్రలు
మాధుకరం - తుమ్మెద పువ్వు పువ్వునుంచి తేనె సేకరించు కొన్నట్లుగా ఇంటింటికీ వెళ్లి అన్నం అడుక్కొని బతికే విధానం
మార్మోగు (క్రి) - ప్రతిధ్వనించడం
మిట్ట - ఎత్తుగా ఉన్న ప్రదేశం
మితిమీరి - అవసరానికి మించి, చాలా ఎక్కువగా
మిన్నంటు (క్రి) - ఆకాశాన్ని తాకడం, చాలా ఎత్తుకు చేరడం.
మిన్నక - ఊరక, మాట్లాడకుండా
మీటు (క్రి.) - వీణ మొ॥నవి వాయించడం, మోగించడం, వేలితో కొట్టడం
ముగ్ధుడగు - చాలా సంతోషించడం
మురియు (క్రి) - సంతోషించడం, ఆనందించడం
ముసురుకొను (క్రి) - కమ్ముకోడం, చుట్టూరా ఆవరించడం
మూలస్తంభం - ఆధారభూతమైనది, మిగతావాటికన్నా ప్రధానమైనది.
మూషికం - ఎలుక
మేదిని - భూమి
మేలిమి - మంచి, నాణ్యమైనది
మోహరించు (క్రి) - యుద్ధానికి సేనల్ని సిద్ధపరచడం
మ్రాకు - మాను, చెట్టు, వృక్షం
మ్రింగు (క్రి) - తినడం, గొంతులోకి దిగేట్లు వేసుకోడం
మృదుత్వం - మెత్తదనం, మెత్తన, సున్నితత్త్వం

## య

యిసయం - (పామరభాషలో వాడుక) విషయం
యుక్తి - ఉపాయం, నేర్పు, తెలివైన ఆలోచన

## ర

రక్తి - మనసుకు బాగా నచ్చడం
రక్షించు (క్రి) - కాపాడటం
రహి - అందం
రాగరంజిత - సంతోషంతో నిండిన, ఎరుపు రంగుచేరిన
రాజనాలు - ఒక మేలిరకం వరిధాన్యం
రాయబారి - దూత, రెండు దేశాల మధ్య గాని, ఇద్దరు వ్యక్తుల మధ్య గాని నేర్పుతో వ్యవహారం నడిపేవాడు.
రాసిపోయు (క్రి) - కుప్పగాపోయడం
రివ్వున - (పక్షి ఎగరటం మొ॥న వాటికి సంబంధించి) వేగంగా
రుద్రుడు - శివుడు
రేపు - ఈ రోజుకు తరవాతిది, మరుసటి రోజు
రొప్పు (క్రి) - ఆయాసపడటం

## ల

లంకేయులు - శ్రీలంకదేశంవారు
లంఘించు - దాటడం, పైనుంచి దూకడం
లక్ష్యం - సాధించడానికి ఎంచుకొన్న అంశం; చేరదలుచుకొన్న విషయం; గురి

© SCERT not to be republished

లఘుపతనకం - పాఠంలో వచ్చిన కథలో ఒక కాకి పేరు, సులువుగా వాలేది.
లవణం - ఉప్పు
లిఖితరూపం - అక్షరాల గుర్తుతో రాసి ఉన్నది.
లిపి - రాత
లీగ్ - వ్యక్తులు, దేశాలూ వాళ్ళ కోరికల, అభిరుచుల మేరకు ఎర్పాటుచేసుకొన్న సంస్థ
లెటర్ - అక్షరం; లేఖ
లెస్సగా - శ్రేష్ఠంగా, బాగా, ఎక్కువగా
లోభి - పిసినారి, పిసినిగొట్టు
లోహం - ఇనుము; ఏదైనా ఖనిజ పదార్థం
లౌడ్ స్పీకర్ - మైక్రోఫోన్ మొ॥న వాటినుంచి వచ్చిన ధ్వనిని దూరానికి వినవచ్చేటట్లు చేసే సాధనం

## వ

వంచన - మోసం, దగా
వడి - వేగం
వనచరులు - కోతులు, అడవిలో లేదా తోటలో తిరిగేవి
వనపాలకుడు - తోటమాలి, కాపలావాడు
వనం - అడవి, తోట; నీరు
వర్షీయసి - వయసు మీరిన వ్యక్తి, ముసలమ్మ
వలదు - వద్దు
వల్లభుడు - భర్త, రాజు
వసుధ - భూమి
వాక్కు - మాట
వాగ్రూపం - నోటి మాటల రూపంలో చెప్పి ఉన్నవి
వాజమ్మ - చవట, దద్దమ్మ, తన అభిప్రాయాన్ని నొక్కి చెప్ప లేనివాడు, ఎవరేది చెబితే దాన్ని ఒప్పుకొనేవాడు.
వానరం - కోతి
వాఱు - సన్నగా కోసిన తోలు, తోలుపట్టీ
వాసి - పేరు, కీర్తి
వాస్తవం - నిజం, సత్యం
వింటినారి - విల్లుకున్న అల్లెతాడు
వింధ్యపర్వతం - ఏడు కులపర్వతాలలో ఒకటి, (వి) వింజం
విక్రయం - అమ్మకం
విక్రాంతి - జరగవలసిన మేలు, విశేషమైన మార్పు
విత్తం - డబ్బు, ధనం
విధం - పద్ధతి
విధ్వంస కాండ - వస్తువులను పాడుచేయడం; శత్రువులను చీల్చి చెండాడటం
విప్పారిన - వికసించిన, విచ్చుకొన్న
విముఖత - ఇష్టంలేకపోవడం
విమోచనం - విముక్తి, స్వేచ్ఛ
విశ్రమించు (క్రి) - విశ్రాంతి తీసుకోడం
విశ్వద - విశ్వాన్ని ఇచ్చినవాడు లేదా సృష్టించినవాడు, భగవంతుడు,
విషణ్ణ - విషాదం పొందిన
విహరించు (క్రి) - ఆనందంగా తిరగడం
విహార స్థలం - ఆనందంగా తిరగడానికి ఏర్పాటై ఉన్న స్థలం
వీధి - రెండు ఇండ్లవరసల మధ్యనుంచి సాగే దారి
వీరనారి - ధైర్యసాహసాలున్న స్త్రీ
ఉత్తరాది - ఉత్తరదేశపు
వెక్కిరించు (క్రి) - ఎగతాళిచేయు
వెడలు (క్రి) - బయటకు రావడం
వేటు - దెబ్బ
వేసవి - ఎండలకాలం
వైజ్ఞానిక - శాస్త్ర (విజ్ఞాన) సంబంధమైన
వైభవం - గొప్పదనం
వృక్షం - చెట్టు
వృథా - పనికిరాకుండా పోయే
వ్యాప్తి - ప్రచారం, విస్తరించడం
వ్రచ్చు (క్రి) - చీల్చడం
వ్రయ్యు - చీలిక, ముక్క, ఖండం
వ్రేటు - దెబ్బ, వేటు

## శ

శయనం - పడక
శరణు - కాపాడమని కోరడం
శల్యం - ఎముక
శాసనం - ఆజ్ఞ
శుక్తి - ముత్యం
శిలాశాసనం - రాతిమీద చెక్కిన శాసనం
శూలం - పదునైన పలచని మొన ఉన్న ఇనుప కడ్డీ, కఱ్ఱు
శ్రాంతి - బడలిక, అలసట

## స

సంకులసమరం - సైనిక సమర్దంతో కూడి లేదా భయంకర యుద్ధం
సంకేతం - గుర్తు
సంచారం - తిరగడం
సంతతి - సంతానం
సందిగ్ధ - సందేహానికి అవకాశమున్న
సంద్రం - సముద్రం
సంభవం - సాధ్యం, జరిగేది, పుట్టడం
సత్తా - బలం, శక్తి, సత్తా
సత్రం - బాటసారులు మొ॥న వారికి ఉచితంగా భోజనాది సదుపాయాలు కూర్చే ఇల్లు
సత్ప్రవర్తన - మంచి నడవడిక
సమరాంగణం - యుద్ధభూమి, కదనరంగం, రణరంగం
సమాలోచన - కలిసి ఆలోచించడం, పరిశీలించడం
సాక్షి - ఏదైనా పనిని చూసి గాని, విని గాని తెలుసుకొన్నవాడు
సాహసవంతుడు - ధైర్యవంతుడు
సాహుకారు - ధనవంతుడు, వర్తకం చేసేవాడు
సిద్ధుడు - భక్తితో దైవధ్యానం, సాధన చేసి గొప్ప శక్తులు పొందినవాడు
సుమతి - మంచి బుద్ధి, మంచి బుద్ధి కలవాడు
సువర్ణాధ్యాయం - మంచిరోజులు
సూచిపాతా - (పామరభాషలో వాడుక) చూసిపోతూ
సోమరి - ఏ పనీ చేయకుండా బద్ధకంగా ఉండేవాడు
సౌందర్యం - అందం
స్వస్థత - ఆరోగ్యం
స్వార్థపరత - తనకు కావలసిన మేలుమీద మాత్రమే దృష్టిపెట్టడం

## హ

హరుడు - శివుడు
హసత్ - నవ్వుతున్న
హితం - మేలు, మంచి
హిరణ్యకం - పాఠంలోని కథలో ఉన్న ఎలుక పేరు, బంగారంకోసం ఆశ
హీనుడు - తక్కువవాడు, తక్కువయినవాడు

-000-

© SCERT not to be republished